ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

హైదరాబాద్ 19-10-2024 శనివారం సిటీ సంపుటి 51, సంచిక 69 | రూ. 6-50 పేజీలు 22 | www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



ఎంఆర్ఐలు ఏవీ?

క్యాథ్‌లాబ్‌లున్నా పనిచేయవు

- హైదరాబాద్, వరంగల్ మినహా ప్రధాన ప్రభుత్వాసుపత్రుల్లో ఈ సేవలు కరవు
- 31 బోధనాసుపత్రుల్లోనూ ఇదే పరిస్థితి..
- రూ.కోట్ల పరికరాలు నిరుపయోగం
- పేదలకు 'ప్రైవేటే' ఆధారం!

ఈనాడు – హైదరాబాద్

కీలక సమయాల్లో రోగ నిర్ధారణకు దోహదపడే ఎంఆర్ఐ పరీక్షలు పేదలకు భారంగా పరిణమించాయి. రాష్ట్రంలో ఏళ్లక్రితం నాటి బోధనాసుపత్రుల్లోనూ ఈ సేవలు అందుబాటులో లేవు. మరోవైపు పలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో రూ.కోట్లు వెచ్చించి ఏర్పాటుచేసిన క్యాథ్‌ల్యాబ్‌లు వంటి అత్యాధునిక వైద్య వసతులు నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో కీలక వైద్యపరీక్షల కోసం పేదలు ఆర్థికభారం మోయాల్సి వస్తోంది. హైదరాబాద్, వరంగల్ మినహా ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల్లో ఎక్కడా ఎంఆర్ఐ సదుపాయం లేదు. ఆదిలాబాద్ రిమ్స్‌లో అత్యాధునిక ఎంఆర్ఐ పరికరాలను సమకూర్చి నెలలు కావస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. ...మిగతా 6లో


నిజామాబాద్‌లో నిరుపయోగంగా క్యాథ్‌లాబ్

తగిన చర్యలేవీ..!

రాష్ట్రంలో అన్ని బోధనాసుపత్రుల్లో ఎంఆర్ఐ సేవలు అందించాల్సిఉన్నా ఆ దిశగా చర్యలు మాత్రం లేవు. నిజామాబాద్, మహబూబ్‌నగర్ వంటి ప్రధాన ఆసుపత్రులు, ఏళ్ల క్రితం ప్రారంభించిన వైద్య కళాశాలల్లోనూ ఇవి ఏర్పాటు చేయలేదు. పేదలకు అందుబాటులో ఉండి.. నిత్యం వెయ్యిమందికిపైగా వైద్యం కోసం వస్తున్న ఉస్మానియా ఆసుపత్రిలో ఎంఆర్ఐ కోసం భారీగా వెయిటింగ్‌లిస్ట్ ఉండటంతో తమవంతు ఎప్పుడు వస్తుందో అని రోగులు వారాలుగా ఎదురుచూడాల్సిన పరిస్థితి. లేదంటే 'ప్రైవేటు'గా తీయించుకోవాల్సి వస్తోంది. నిజామాబాద్ మెడికల్ కాలేజీ ఏర్పాటై 15 ఏళ్లు కావస్తున్నా ఎంఆర్ఐ ఇప్పటికీ లేదు.




ఓయూ వీసీగా కుమార్.. కేయూకు ప్రతాప్‌రెడ్డి

- 9 వర్సిటీలకు ఉపకులపతుల నియామకం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో తొమ్మిది విశ్వవిద్యాలయాలకు ఉపకులపతులు నియమితులయ్యారు. ప్రతిష్ఠాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) వీసీ పదవి.. ఇదే వర్సిటీలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆచార్యుడు ఎం.కుమార్‌ను వరించింది. వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ) వీసీ పదవి ఓయూ జువాలజీ విభాగం విశ్రాంత ఆచార్యుడు ప్రతాప్‌రెడ్డికి దక్కింది. పాలమూరు వర్సిటీకి జీఎన్ శ్రీనివాస్; మహాత్మాగాంధీ- అల్తాఫ్ హుస్సేన్; శాతవాహన- ఉమేష్‌కుమార్; తెలుగు వర్సిటీ- వెలుదండ నిత్యానందరావు; తెలంగాణ వర్సిటీ- టి.యాదగిరిరావు; ఆచార్య జయశంకర్ వ్యవసాయ వర్సిటీ- అల్దాస్ జానయ్య; కొండా లక్ష్మణ్ ఉద్యాన వర్సిటీకి రాజిరెడ్డి వీసీగా నియమితులయ్యారు. ...మిగతా 20లో

బంగారం 10 గ్రాములు @ రూ.80,000

6లో


సీఎం రేవంత్‌రెడ్డికి విరాళం చెక్కును అందజేస్తున్న గౌతమ్ అదానీ.. చిత్రంలో కరణ్ అదానీ

స్కిల్ వర్సిటీకి అదానీ భూరి విరాళం

- సీఎం రేవంత్‌కు రూ.100 కోట్ల చెక్కు అందజేత 6లో

మీరు రాజకీయ పదవులు పొందారా..?



- కులమేమిటి.. ఉపాధి ఎలా.. ఆదాయమెంత..
- కుటుంబ నేపథ్యం.. వ్యక్తిగత వివరాల సేకరణ
- సామాజిక, ఆర్థిక సర్వేకు 60 ప్రశ్నలతో ముసాయిదా

ఈనాడు, హైదరాబాద్: మీ కుటుంబ సభ్యుల్లో ఎవరైనా ప్రజాప్రతినిధిగా ఎన్నికయ్యారా.. రాజకీయ పదవులు పొందారా.. సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. ఉపాధి ఎలా పొందుతున్నారు.. భూమి ఉందా.. ఏడాదికి కుటుంబ ఆదాయం ఎంత.. రాష్ట్రంలో కులగణన, సామాజిక, ఆర్థిక సర్వేలో ప్రజలను అడిగేందుకు ఇలాంటి ప్రశ్నలతో రాష్ట్ర ప్రణాళిక శాఖ ముసాయిదాను రూపొందించింది. త్వరలో సర్వేను ప్రారంభించేందుకు కసరత్తు జరుగుతోంది. ఒక్కో కుటుంబంలోని సభ్యుల సమాచార సేకరణకు మొత్తం 60 ప్రశ్నలను రూపొందించారు. వీటిలో సగం కుటుంబ నేపథ్యంపై.. మిగిలినవి వ్యక్తిగత వివరాలకు సంబంధించినవి ఉన్నాయి. ఈ ప్రశ్నల్లో ఏవి అవసరమో ప్రభుత్వం నిర్ణయించాల్సి ఉంది. ...మిగతా 6లో


అశోక్‌నగర్‌లో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న విద్యార్థిని

నిరసనలు.. ర్యాలీలతో హోరెత్తిన అశోక్‌నగర్

- గ్రూప్ 1 వాయిదా వేయాలని వీధుల్లోకి అభ్యర్థులు 8లో

జోక్యం చేసుకోలేం: హైకోర్టు

జీవో 29పై సుప్రీంకు అభ్యర్థులు

మూసీ పేరిట ధనయజ్ఞం



- దిల్లీకి మూటలు పంపించేందుకే..
- రూ.25 వేల కోట్లతో పూర్తయ్యే పనికి రూ.1.50 లక్షల కోట్లెందుకు? 6లో
- భారాస హయాంలోనే డిజైన్లన్నీ పూర్తి
- మళ్లీ డీపీఆర్‌కు రూ.141 కోట్ల ఖర్చు ఎందుకు?
- సీఎం రేవంత్‌పై మండిపడిన కేటీఆర్






మంత్రి కొండా సురేఖపై కేటీఆర్ పరువు నష్టం కేసు విచారణ వాయిదా

ఈనాడు, హైదరాబాద్: మంత్రి కొండా సురేఖపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్ విచారణను నాంపల్లి కోర్టు బుధవారానికి వాయిదా వేసింది. శుక్రవారం న్యాయస్థానానికి కేటీఆర్ హాజరై వాంగ్మూలం ఇవ్వాల్సి ఉండగా వ్యక్తిగత కారణాలతో హాజరుకాలేదని ఆయన తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. వాంగ్మూలం నమోదు చేస్తామని చెప్పినా మళ్లీ సమయం కావాలని ఎలా అడుగుతారని కోర్టు ప్రశ్నించగా.. వారు సోమ, బుధవారాల్లో హాజరయ్యేందుకు అవకాశం ఇవ్వాలన్నారు. దీంతో విచారణను ఈ నెల 23కి వాయిదా వేసింది.

రాధాకిషన్‌రావు బెయిలు పిటిషన్‌పై వివరణ ఇవ్వండి

పోలీసులకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు రాధాకిషన్‌రావు బెయిలు పిటిషన్‌పై వివరణ ఇవ్వాలంటూ పోలీసులకు శుక్రవారం హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కింది కోర్టు బెయిలు తిరస్కరించడంతో రాధాకిషన్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ జువ్వాడి శ్రీదేవి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. నిందితుల్లో ఒకరు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా రాధాకిషన్‌రావును అరెస్టు చేశారన్నారు. అభియోగ పత్రంలో ఆయనకు వ్యతిరేకంగా ఉన్న సాక్షులందరూ పోలీసులు, ప్రభుత్వ అధికారులేనని, వారిని ప్రభావితం చేసే అవకాశం లేదని తెలిపారు. దీనిపై వివరణ ఇవ్వాలని న్యాయమూర్తి కోరగా.. కొంత గడువు కావాలని అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోరారు. అందుకు న్యాయమూర్తి అనుమతిస్తూ విచారణను ఈ నెల 23కు వాయిదా వేశారు.









ఈనాడు

సయోధ్య ఎలా సాధ్యం?

భారత్‌-పాక్‌లు చేదు గతాన్ని వదిలిపెట్టి సఖ్యతగా ఉండాలని దాయాది దేశ మాజీ ప్రధాని నవాజ్‌ షరీఫ్‌ తాజాగా సెలవిచ్చారు. ఇస్లామాబాద్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సులో మన విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్‌.జైశంకర్‌ పాల్గొనడాన్ని ఆయన ప్రశంసించారు. ఇరు దేశాల సంబంధాల పునరుద్ధరణకు ఇది తోడ్పడుతుందంటూ నవాజ్‌ ప్రవచించారు. ఇదంతా వినసొంపుగానే ఉంది కానీ, ఉగ్రవాదుల ఎగుమతి కేంద్రమై నిత్యం ఇండియాపై విషం కక్కుతున్న పాక్‌తో సయోధ్య ఎలా సాధ్యం? భారత్‌తో బంధం బలోపేతానికి నిరంతరం ప్రయత్నిస్తామన్న పాక్‌ తొలి ప్రధాని లియాఖత్‌ అలీ ఖాన్‌ మొదలు ఆపై దాయాది దేశ నేతలెందరో అదే పాట పాడారు. అయినా, ఒరిగింది శూన్యం. జమ్మూకశ్మీర్‌ మొత్తాన్ని తమలో కలిపేసుకోవాలన్నది పాక్‌ సైనికబలగాల కుటిల లక్ష్యం. అందుకోసం వెయ్యేళ్ల యుద్ధానికైనా సిద్ధమన్న సైన్యం పంతానికి పాక్‌ నాయకులు జీ హుజూర్‌ అంటూనే ఉంటారెప్పుడూ! ముష్కరులను ఉసిగొల్పడం నుంచి ఇండియాను అస్థిరపరచేందుకు పాకిస్థాన్‌ చేయని ప్రయత్నాలు లేవు. ఇటువంటి పరిస్థితుల్లో ఇరుపక్షాల నడుమ సత్సంబంధాలు సాధ్యపడవన్న జైశంకర్‌ తాజా వాదన సహేతుకమైనదే!

దేశ విభజన కాలం నాటి నుంచి ఇండియాను ప్రబల శత్రువుగానే పరిగణిస్తున్న పాక్‌- అకారణంగా యుద్ధాలకు దిగి చావుదెబ్బలు తింది. అయినప్పటికీ దాని పిదపబుద్ధుల్లో మార్పు రాలేదు. అందుకే సరిహద్దుల్లో ఉద్రిక్తతలు నిరంతరం కొనసాగుతున్నాయి. 2019 పుల్వామా ఉగ్రదాడి అనంతరం ఉభయ దేశాల సంబంధాలు మరింతగా దెబ్బతిన్నాయి. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370 అధికరణ రద్దు దరిమిలా పాక్‌ వాచాలత్వం అవధులు దాటింది. ఆ క్రమంలోనే ద్వైపాక్షిక వాణిజ్యబంధం అటకెక్కింది. కశ్మీర్‌లో మానవత్వం మంటగలుస్తోందంటూ అంతర్జాతీయ వేదికలపై ఇస్లామాబాద్‌ మొసలి కన్నీరు కారుస్తోంది. అదే సమయంలో పాక్‌ గూఢచార సంస్థ ఐఎస్‌ఐ, సైన్యం ప్రోద్బలంతో ఇండియాలోకి ఉగ్రవాదుల చొరబాట్లూ చోటుచేసుకుంటున్నాయి. గతంలో కశ్మీర్‌ లోయకు పరిమితమైన ముష్కర మూకల ఆగడాలు ఇటీవల జమ్మూకూ విస్తరించాయి. విస్తరణ వాదంతో పేట్రేగుతున్న చైనా అండతో ఇండియాకు వ్యతిరేకంగా పాక్‌ కుతంత్రాలు పన్నుతుండటమూ బహిరంగ రహస్యమే. ఇవేమీ ఎరగనట్లు, నవాజ్‌ షరీఫ్‌ నీతిసూక్తులు చెప్పడం అర్థరహితమే కాదు, హాస్యాస్పదం కూడా!

స్వాతంత్ర్యానంతరం పేదరికం, నిరక్షరాస్యత వంటి ఎన్నో సమస్యలను ఎదుర్కొంటూ ప్రయాణం ప్రారంభించిన ఇండియా- ప్రస్తుతం ప్రపంచంలో అయిదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. త్వరలోనే మూడో స్థానానికి చేరుకోబోతోంది. వ్యవస్థాగతమైన లోపాలు కొన్ని ఉన్నప్పటికీ ప్రజాస్వామ్య పంథాను ఇండియా నిలబెట్టుకొంటూ వస్తోంది. ఎవరి ఒత్తిళ్లకూ తలొగ్గకుండా స్వతంత్ర విదేశాంగ విధానాన్ని అనుసరిస్తోంది. మరోవైపు పాకిస్థాన్‌ ఏమో- భారతదేశంపై విపరీతమైన విద్వేషం, రాజకీయ అస్థిరత్వం, అంతర్గత కల్లోలాలతో టెర్రరిస్థాన్‌గా తీరని అపఖ్యాతిని మూటగట్టుకుంది. ప్రజాపాలన అక్కడ చెల్లని కాసుగా మారిన దరిమిలా అదో విఫల రాజ్యంగా మిగిలిపోయింది. పాకిస్థాన్‌ ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతోంది. ఎదుగూ బొదుగూ లేని జీవితాలపై అక్కడి ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. నవాజ్‌ షరీఫ్‌ వ్యాఖ్యలు వాస్తవాలు కావాలంటే- ముష్కర మిన్నాగులకు ఆశ్రయమివ్వడం మానేసి, సొంతింటిని పాక్‌ ముందు చక్కదిద్దుకోవాలి. అందుకు ఆ దేశ సైన్యం సహకరిస్తుందా అన్నదే ప్రశ్నార్థకం!

సైనిక శక్తో ఆర్థిక, సాంకేతిక ప్రగతో దేశాన్ని గొప్పదాన్ని చేయవు. ఆత్మగౌరవమూ నైతికనిష్ఠ కలిగిన పౌరులే దేశాన్ని గొప్పదాన్ని చేస్తారు.

– పాండురంగ శాస్త్రి అథావలే, స్వాధ్యాయ వ్యవస్థాపకులు




సాధన పరమార్థం

మనసు ప్రపంచాన్ని ఆశ్రయించినంత కాలం మనిషికి జీవితంలో హెచ్చుతగ్గులు, ఒడుదొడుకులు తప్పవు. మనిషికి మరణభీతి ఎక్కువ! లోకంలో ఎందరో శరీరాన్ని వీడుతున్న ఘట్టాలను చూస్తున్నప్పటికీ తాను సైతం అలా ఒకరోజు దేహత్యాగం చేయాల్సి ఉంటుందన్న నిజాన్ని స్వీకరించలేడు. చనిపోయేదాకా తాను శాశ్వతుణ్నే అన్న భ్రమతో జీవిస్తాడు. అందుకే ఆఖరి నిమిషం దాకా అతణ్ని భవసాగరం ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. ప్రాపంచిక ఆకర్షణల వలయం చుట్టుముట్టి వేధిస్తుంది.

ఆత్మ శాశ్వతమైంది కాబట్టి, దాని వాసన ప్రభావంతో శరీరం సైతం శాశ్వతమైనదేనని మనిషి చివరి వరకు భ్రమిస్తాడు. శ్మశాన వైరాగ్యం కలిగినా, అంతరాత్మ నిరంతరం వారిస్తున్నా దైనందిన జీవితంలో చెడ్డపనులు చేయడం మాత్రం మానడు.

దైవప్రేరితంగా మానవ జీవితం అనుక్షణం అంతర్గత సాధనలో మునిగి ఉంటుంది. తాను గ్రహించినా, గ్రహించకపోయినా మనిషి జీవితం ప్రతి క్షణం సాధనలో భాగంగానే సాగుతుందంటారు విజ్ఞులు.

మనిషి సాధనను పరిపూర్ణం చేసుకోవడంలో ప్రకృతి అనుసరించే విధానాన్ని పరిశీలించవచ్చు. సృష్టి ప్రారంభం నుంచి సూర్యుడు ప్రతిదినం ఉదయిస్తూనే ఉన్నాడు. ప్రతిసాయంత్రం అస్తమిస్తూనే ఉన్నాడు. గాలి వీస్తూనే ఉంది. అగ్ని దహిస్తూనే ఉంది. నీరు దాహార్తిని తీరుస్తూనే ఉంది. ఆకాశం విశాల దృక్పథాన్ని చాటుతూనే ఉంది. ధరిత్రి సహన గుణాన్ని ప్రదర్శిస్తూనే ఉంది. ప్రకృతిని అనుసరించి మనిషి నేర్చుకోవాల్సిన సద్గుణాల్లో ఇంతకన్నా గొప్పవి మరేముంటాయి?



అంతర్యామి

ఒక పని ప్రారంభించాల్సి ఉన్నప్పుడు- మొదట దానికి ఉపక్రమిస్తే సగం కార్యం పూర్తయినట్లే అంటారు. మిగతా సగం పూర్తి చేయడానికి శ్రద్ధ, సహనం, నైపుణ్యం ఇత్యాది సద్గుణాలు కావాలి. అవి కార్యసిద్ధికి తోడ్పడతాయి. ఒక పని కష్టమైందని భావించి ఉపక్రమించకపోవడం పెద్దతప్పు!

ఆత్మజ్ఞానం కలిగిన ప్రతి మనిషికి ఏది మంచో ఏది చెడో తెలుసు. చెడ్డ పనులు చేయకుండా మనసును నిగ్రహించుకోవాలి. అలా చేయకపోతే అలవాటుగా మారి ప్రమాదం కొని తెచ్చుకున్నట్లవుతుంది. మంచి పనుల విషయంలో మనిషి అందుకు భిన్నంగా వ్యవహరించాలి. చేయగా చేయగా మంచి పనులు అలవాటుగా మారి జీవితాన్ని నందనవనం చేస్తాయి.

చూసే ప్రతి ప్రాణిలో వేసే ప్రతి అడుగులో దైవాన్ని దర్శించే ప్రతిభ మనిషికి సాధనవల్ల లభిస్తుంది. మంచి ప్రవర్తన వల్ల లభించే ఆనందం జీవితాన్ని పరిపూర్ణం చేస్తుంది. ప్రతిక్షణం పెల్లుబికే మంచి భావనలు అతడి జీవితాన్ని ప్రకాశమానం చేస్తాయి. ఆధ్యాత్మికత కేవలం దైవారాధన చేసే ఒక మార్గం కాదు. మనిషి ఆనందంగా జీవించడానికి అవసరమైన మానసిక స్థైర్యాన్నిచ్చే గొప్ప కళ. మంచి మార్గంలో నడుస్తూ తనపట్ల తాను ప్రసన్నుడై జీవించే వ్యక్తి సదా ఆనందభరితుడై ఉంటాడు. అతడితో కలిసి జీవించేవారు సైతం సంతోషంగా ఉంటారు. ఎదుటివారు తన కారణంగా ఆనందంతో జీవించగలిగితే అందుకు బాధ్యుడైన వ్యక్తి సాధన పరమార్థాన్ని సాధించినట్లే!

– గోపాలుని రఘుపతిరావు

జాతి సంపదలు...

వారసత్వ స్థలాలు!

మన భౌగోళిక వారసత్వం గురించి అవగాహన అవసరం. అలాంటి అవగాహన లేక అరుదైన ప్రదేశాల్లోకి స్థిరాస్తి వ్యాపారులు చొరబడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో అనేక నిర్మాణాలు వెలుస్తున్నాయి. గనులు, క్వారీల తవ్వకాలూ సాగిపోతున్నాయి. తెలిసీ తెలియక భౌగోళిక వారసత్వాన్ని నాశనం చేసుకుంటున్నాం. చారిత్రక ప్రాధాన్యం కలిగిన ప్రదేశాలను సంరక్షించుకోవడం మన తక్షణ బాధ్యత.



భారత్‌లోని 10 భౌగోళిక వారసత్వ స్థలాల జాబితాను కేంద్ర ప్రభుత్వం ఇటీవల భారతీయ పురాతత్వ సర్వేక్షణ సంస్థ(ఏఎస్‌ఐ)కు పంపింది. యునెస్కో భౌగోళిక వారసత్వ క్షేత్రాల (జియో పార్కుల) జాబితాలో చేర్చడానికి ఇవి అర్హమైన స్థలాలని కేంద్రం పేర్కొంది. ప్రస్తుతం 48 దేశాల్లోని 213 స్థలాలను యునెస్కో అంతర్జాతీయ జియోపార్కులుగా గుర్తించింది. వాటిలో భారత్‌కు చెందిన ఒక్క స్థలమూ లేదు. దేశంలో 32 స్థలాలను జాతీయ భౌగోళిక వారసత్వ ప్రదేశాలుగా గుర్తించారు. వాటిలో ఆంధ్రప్రదేశ్‌లోని గండికోట, మహారాష్ట్రలోని లోనార్‌ బిలం కూడా ఉన్నాయి. వీటిని ప్రజలు ప్రధానంగా పర్యాటక క్షేత్రాలుగానే పరిగణిస్తున్నారు తప్ప వాటి భౌగోళిక ప్రాధాన్యం గురించి తెలియడం లేదు. ఇవి యునెస్కో జియోపార్కులుగా గుర్తింపు పొందడానికి అర్హమైన ప్రదేశాలు. వచ్చే రెండేళ్లలో కనీసం రెండు జియోపార్కులకు గుర్తింపు పొందడానికి కృషి చేస్తామని కేంద్ర గనుల శాఖ కార్యదర్శి వీఎల్‌ కాంతారావు పేర్కొన్నారు. ప్రపంచంలోనే ఎత్తయిన హిమాలయాలు మొదలుకొని థార్‌ ఎడారి ఇసుక తిన్నెలు, సువిశాల సాగరతీరం, పగడాల దిబ్బలు, పశ్చిమ కనుమల్లోని దట్టమైన అడవులు, శిలాజ నిక్షేపాల వంటి భౌగోళిక విశేషాలు భారత్‌లో దండిగా ఉన్నాయి. అవి వందల కోట్ల సంవత్సరాల క్రితం భూమి ఆవిర్భావ దశను తెలియజేస్తాయి. భారత ఉపఖండం ఏర్పడిన తీరునూ వెల్లడిస్తాయి.

రామసేతు రహస్యం

భూమికి సంబంధించిన విశేష అంశాలు, వాటి ప్రత్యేకతలపై అవగాహన కొరవడటం వల్ల మన భౌగోళిక వారసత్వానికి తీరని నష్టం వాటిల్లుతోంది. కర్ణాటక తీరంలో సెయింట్‌ మేరీ దీవిలోని అగ్నిశిలలు (బసాల్ట్‌) ధ్వంసమవుతున్నాయి. ఈ బసాల్ట్‌ శిలలు ఆరు కోట్ల సంవత్సరాలనాటివి. వాయవ్య గుజరాత్‌, కచ్‌లోని డైనోసార్ల శిలాజాల పట్ల కూడా ఇదే నిర్లక్ష్య వైఖరి కనిపిస్తోంది. తమిళనాడులోని తిరుచిరాపల్లి ప్రాంతం 20 కోట్ల సంవత్సరాల క్రితం సముద్ర గర్భంలో ఉండేది. మధ్యప్రదేశ్‌లోని శివపురిలో 15-25 లక్షల సంవత్సరాల క్రితం ఉల్కాపాతంతో పెద్ద బిలం ఏర్పడింది. ఆదిమానవుడు పురుడు పోసుకొంటున్న సమయంలో ఏర్పడిన ఈ బిలాన్ని ఢలా బిలం అంటున్నారు. మహారాష్ట్రలోని లోనార్‌ బిలం 50,000 ఏళ్ల క్రితం ఉల్కాపాతం వల్ల ఏర్పడినది. ఈ భౌగోళిక వారసత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపైన, ప్రభుత్వంపైన ఉంది. బంగాళాఖాతంలో భారత్‌, శ్రీలంకలను కలిపే రామసేతు (సేతు సముద్రం) గురించి వార్తల్లో ప్రముఖంగా వినిపిస్తుంటుంది. తమిళనాడు, ఉత్తర శ్రీలంక మధ్య పగడాల దిబ్బలతో ఈ సేతువు ఏర్పడింది. 22,000 సంవత్సరాల క్రితం శీతల యుగం అంతరించి వేడి వాతావరణం ఏర్పడుతుండగా సముద్రంలో రామసేతు ఏర్పడింది. 1200-700 ఏళ్ల క్రితం చిన్న హిమయుగం సంభవించి జలఘనీభవనం వల్ల సముద్ర మట్టం తగ్గింది. ఆ తరవాత మంచు కరుగుతూ వచ్చింది. అది పగడాల దిబ్బల విస్తరణకు, తద్వారా రామసేతుకూ కారణమైంది. ఈ భౌగోళిక చరిత్రను తెలుసుకుంటే మన చుట్టూ ఉన్న ప్రపంచం ఎలా రూపుదిద్దుకుందో తెలిసివస్తుంది.

ప్రత్యేక చట్టం అవసరం

ప్రపంచ ప్రజలు తమ భౌగోళిక వారసత్వాన్ని స్మృతిపథంలో నిలుపుకోవాల్సిన అవసరాన్ని 1991లో ఫ్రాన్స్‌లో జరిగిన యునెస్కో అంతర్జాతీయ సమావేశం గుర్తించింది. భౌగోళిక వారసత్వ సంరక్షణపై జరిగిన మొట్టమొదటి అంతర్జాతీయ మహాసభ అది. భూమికీ, మానవుడికీ ఉమ్మడి భౌగోళిక వారసత్వం ఉందనీ... ప్రజలూ ప్రభుత్వం ఆ వారసత్వానికి సమష్టి సంరక్షకులని ఆ సభ ఉద్ఘాటించింది. నాటి సభ తరవాత కెనడా, అమెరికా, బ్రిటన్‌, ఆస్ట్రేలియా, స్పెయిన్‌లలో కొన్ని అద్వితీయ భౌగోళిక క్షేత్రాలను జియో పార్కులుగా ప్రకటించారు. అవి భౌగోళిక పర్యాటక ప్రదేశాలుగా ప్రాచుర్యం పొంది ఆదాయం, ఉపాధి అవకాశాలను అందించాయి. తరవాత వియత్నాం, థాయిలాండ్‌లలో కూడా జియోపార్కులను గుర్తించారు. ఈ యంత్రాంగంలో భారత్‌ కూడా భాగస్వామి కావాల్సి ఉంది. దీనిపై పార్లమెంటులో ప్రశ్నలు లేవనెత్తినా ఆచరణలో పెద్దగా పురోగతి కనిపించలేదు. చట్టపరమైన గుర్తింపు లేకుండా భౌగోళిక వారసత్వ ప్రదేశాల ఎంపిక, సంరక్షణ సాధ్యం కాదు. అందుకే 2009లో ఇలాంటి చట్టం కోసం ప్రతిపాదనలు వచ్చాయి. తరవాత కారణాలు చెప్పకుండానే ప్రభుత్వం ఈ బిల్లుపై వెనకడుగు వేసింది. భౌగోళిక వారసత్వ స్థలాలు, జియోపార్కులను ఏర్పాటు చేసి సంరక్షించాలని 2019లో భూ వైజ్ఞానికవేత్తల సంఘం ప్రధానమంత్రికి సూచించింది. 2022లో భౌగోళిక వారసత్వ బిల్లును ప్రవేశపెట్టినా అదీ ముందుకు కదల్లేదు. భౌగోళిక విశేషాలకు భంగం కలగని రీతిలో భూవినియోగం జరగాలని నిర్దేశించే చట్టం చాలా అవసరం. అమెరికాలో ఇలాంటి చట్టం ఉంది. భారత్‌ కూడా చట్టపరమైన నియంత్రణలను సత్వరం అమలు చేయాలి. అరుదైన ప్రదేశాల్లో మానవ కార్యకలాపాలను నియంత్రించకపోతే మన భౌగోళిక వారసత్వం మట్టిలో కలిసిపోతుంది. దురదృష్టకరమైన విషయం ఏంటంటే- పురావస్తు సంరక్షణ గురించే ప్రజలకు తెలుసు కానీ భౌగోళిక వారసత్వాన్ని సైతం కాపాడుకోవాలనే గ్రహింపు వారికి ఉండటం లేదు. భౌగోళిక విశేషాల సంరక్షణ వల్ల ప్రస్తుత, భావి తరాలలో తమ నేలకు సంబంధించిన విశిష్ట వారసత్వాన్ని కాపాడుకోవాలన్న స్పృహ పెరుగుతుంది. ఎన్నో చారిత్రక అంశాలూ వెలుగులోకి వస్తాయి.



సీవీ రాజేంద్రన్
బెంగళూరులోని నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ అడ్వాన్స్‌డ్‌ స్టడీస్‌లో అనుబంధ ఆచార్యులు

‘స్వాట్‌’ మంత్ర

‘నీలో ఈ లోపముందోయ్‌... పద్ధతి మార్చుకో’ అన్నారనుకోండి ఎవరన్నా, మనసు టక్కున చిన్నబుచ్చుకుని మొహం కాలిపోయిన మతాబులా మాడిపోతుంది. అలా చెప్పినవాళ్లపై కోపం తన్నుకొస్తుంది. మూడ్‌ ఖరాబైపోయి ఇక ఆ రోజంతా విచారం అలల మాదిరిగా ఎగసి పడుతూనే ఉంటుంది లోలోన. అలా చెప్పినవాళ్లు ముక్కుసూటి మనుషులైతే ప్రాబ్లం మరీ ఎక్కువ! ఎందుకంటే వారి మాటలు మెత్తగా కాకుండా సుత్తితో కొట్టినట్టు సూటిగా ఉంటాయి కాబట్టి. ఉన్న లోపమే చెప్పినా అంగీకరించడానికి మనసు ఓ పట్టాన ఒప్పదు చాలామందికి.



నిజానికి ఎదుటివారు మన లోపాలను గుర్తించి, మన బాగు కోరి చెబుతున్నారంటే అదృష్టం అనుకోవాలి. మన బలహీనతలేంటో పసిగట్టడానికి వారు ఎంతో విలువైన సమయాన్ని వెచ్చించి ఉంటారు. దాన్ని మనకు చెప్పాలా, వద్దా అని నిర్ణయించుకోవడానికి తర్జనభర్జన పడి ఉంటారు. చెప్పాలని నిర్ణయించుకున్న తరవాత ఎలా చెప్పాలా అని ఆలోచిస్తారు. అంత కష్టపడి మన బలహీనతల గురించి చెప్పినప్పుడు వారి మీద కోప్పడటం అన్యాయం కాకపోతే మరేంటి? అసలు అలా చెప్పే సన్నిహితులు లేకపోవడంవల్లే చాలామందికి తమ లోపాలేంటో తెలిసిరాక గుడ్డెద్దు చేలో పడ్డట్టు ఇష్టారాజ్యంగా జీవితాన్ని గడిపేస్తున్నారు. టీచర్లు, డాక్టర్లు, కోచ్‌లు... ఇలాంటివారంతా మనల్ని బలహీనతల నుంచి గట్టెక్కించేవారే కదా?

మరో విషయం... ఏ మనిషి అయినా, సంస్థయినా అభివృద్ధి చెందడానికి మూలం లోపాలు, సమస్యలేనంటారు మేనేజ్‌మెంట్‌ గురువులు. వాటిని గుర్తించి, అధిగమించేవారికే వృద్ధీ విజయం సిద్ధిస్తాయంటారు. అసలు లోపమేంటో తెలుసుకోడానికే ఇష్టపడకపోతే ఇక బాగుపడేదెప్పుడు? ఏ మంచి మార్పు అయినాసరే లోపాల మీదా, అసౌకర్యాల మీదా పుట్టుకొస్తుందనేవారు ప్రఖ్యాత ఆంగ్ల రచయిత ఆర్నాల్డ్‌ బెన్నెట్‌. చెప్పాలంటే మానవ వికాసయాత్ర అంతా ఇలా లోపాలను, సమస్యలను అధిగమిస్తూ వెళ్తున్నదే.


అమెరికాకు చెందిన ప్రఖ్యాత మేనేజ్‌మెంట్‌ నిపుణుడు ఆల్బర్ట్‌ హమ్‌ఫ్రే 1960లో ‘స్వాట్‌ అనాలసిస్‌’ అనే వ్యాపారాభివృద్ధి సూత్రాన్ని రూపొందించారు. అది మొదలు ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా మేనేజ్‌మెంట్‌ విద్యార్థులకు పాఠమై కూర్చుందా సూత్రం. స్వాట్‌ (ఎస్‌డబ్ల్యూఓటీ) అంటే- బలాలు, బలహీనతలు, అవకాశాలు, సవాళ్లు. వీటిలో బలాలు, బలహీనతలే మన చేతిలో ఉండేవి. మన అదుపులో ఉండని బాహ్య ప్రపంచంలోని సవాళ్లను ఎదుర్కోవడానికి, అవకాశాలను ఒడిసిపట్టడానికి చేయాల్సిందల్లా మనలోని లోపాలను అధిగమించి సామర్థ్యాలను పెంచుకోవడమే. ఉద్యోగానికైనా, వ్యాపారానికైనా, పాలనకైనా... మరి దేనికైనా ఇదే సూత్రం వర్తిస్తుంది. సొమ్ములు ఎన్ని ఉన్నా, సోకులు ఎన్ని చేసినా... లోపమేంటో తెలుసుకున్ననాడే జీవితం మేలిమి మలుపు తిరుగుతుంది. లేదంటే, బతుకు పయనం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉండిపోతుంది. కాదంటారా?

– రఘు



ఫోన్‌లోనే టకటకా!

తేలిగ్గా, ఎలాంటి ఇబ్బందీ లేకుండా ఫోన్‌ సాయంతోనే లావాదేవీలు జరిపే అవకాశం ఉండటంతో చాలామంది ప్రస్తుతం యూపీఐ వైపు మొగ్గుతున్నారు. ఈ క్రమంలో యూపీఐ ట్రాన్సాక్షన్లు ఏటేటా పెరుగుతున్నాయి. 2023-24లో ఇండియాలో 13,100 కోట్ల యూపీఐ లావాదేవీలు జరిగాయి. 2028-29 నాటికి అవి 43,900 కోట్లకు చేరతాయని అంచనా. గత రెండేళ్లలో భారత్‌లో యూపీఐ లావాదేవీల విలువ, భవిష్యత్తులో అది ఎంతకు పెరిగే అవకాశం ఉందంటే... (లక్షల కోట్ల రూపాయల్లో)



(ఆధారం: పీడబ్ల్యూసీ– ది ఇండియన్‌ పేమెంట్స్‌ హ్యాండ్‌బుక్‌ 2024–29)

శుభ్రత... నాణ్యత... జంటగా!

తిరుమల లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా అయ్యిందన్న సమాచారం తీవ్ర కలకలం రేపింది. ఆ క్రమంలో వారణాశి, అయోధ్య, పూరి తదితర ప్రఖ్యాత ఆలయాల్లో ప్రసాదాల్లో వాడే పదార్థాలపై అందరి దృష్టిపడింది. భక్తులు అతి పవిత్రంగా భావించే దైవ ప్రసాదాల తయారీలో నిర్దిష్ట ప్రమాణాలను పాటించాలి.



దేశవ్యాప్తంగా కొన్ని దేవాలయాల్లో ప్రసాదాలు, ఆహార పదార్థాల తయారీలో తగిన పరిశుభ్రత చర్యలు, నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదనే ఆరోపణలున్నాయి. ఫలితంగా భక్తులు అనారోగ్యం బారినపడే ఉదంతాలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. 2014లో తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాలోని ఓ ఆలయంలో బెల్లంతో చేసిన పానకాన్ని భక్తులకు పంపిణీ చేశారు. అది తాగిన తర్వాత సుమారు 350 మంది అస్వస్థతకు గురయ్యారు. అలాగే 2013లో బెంగళూరులోని ఓ ఆలయంలో పంపిణీచేసిన మజ్జిగ విషాహారంగా మారింది. అది తాగిన భక్తుల్లో ఇద్దరు మృతిచెందగా 50 మంది అనారోగ్యం బారిన పడ్డారు. ఇటువంటి ఘటనలు మనదేశంలో ఎక్కడో ఒకచోట చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో భారతీయ ఆహార భద్రతా ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ) దేవాలయాల్లో ఆహార పదార్థాల తయారీకి ప్రత్యేక ధ్రువీకరణను కల్పించడం ద్వారా ఆహార భద్రత, పరిశుభ్రతను పరిరక్షించవచ్చని గతంలోనే నిర్ణయించింది. కాకపోతే, అది అంతంతమాత్రంగానే అమలవుతోంది. ప్రసాదాల్లో నాణ్యత కోసం ‘భోగ్‌(బ్లిస్‌ఫుల్‌ హైజీనిక్‌ ఆఫరింగ్‌ టు గాడ్‌)’ పేరిట ధ్రువీకరణకు ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ నాంది పలికింది. ఆహార భద్రతా చట్టం కింద ఆరాధన స్థలాల్లో పరిశుభ్రమైన పద్ధతుల ద్వారా ప్రసాదాల తయారీ, పంపిణీని తప్పనిసరి చేసింది. ఈ మేరకు ప్రసాదాల తయారీ, పంపిణీ, అన్నదానాలను నిర్వహించే వారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్‌ చేసుకోవడంతో పాటు లైసెన్స్‌ పొందాలి.

ప్రమాణాలు పాటిస్తేనే...

సాధారణంగా భక్తులకు ప్రసాదంగా పులిహోర, పొంగలి, లడ్డూ, పానకం వంటివి పంపిణీ చేస్తారు. చాలా దేవాలయాల్లో నిత్యాన్నదాన పథకం కొనసాగుతోంది. అయితే వీటి తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి. వినియోగించే ఆహార పదార్థాలు మొదలుకొని వంటశాల, సామగ్రి వరకు శుభ్రత అవసరం. సరకులను గడువు ముగిసేలోపే వాడేలా జాగ్రత్తపడాలి. ఆహారం తయారు చేసేవారు ఆరోగ్యకర విధానాలు అనుసరించాలి. చేతులకు తొడుగులు వంటివి ధరించాలి. వ్యర్థాల నిర్వహణ సక్రమంగా చేపట్టడం వంటి జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. ఇలాంటివన్నీ నిర్దిష్ట ప్రమాణాలతో అమలు చేస్తేనే ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ‘భోగ్‌’ ధ్రువీకరణను ఇస్తుంది. ఒక వస్తువు నాణ్యతను నిర్ధారించేందుకు ఐఎస్‌ఐ గుర్తింపు తరహాలోనే ఆలయాల్లో ప్రసాదాలకు ‘భోగ్‌’ ధ్రువీకరణ తోడ్పడుతుంది. దీనికోసం ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ వెబ్‌సైట్‌ ద్వారా లైసెన్స్‌ రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చు. అనేక రకాల తనిఖీలు, వడపోత అనంతరం సంబంధిత అధికార బృందం సంతృప్తి చెందితేనే గుర్తింపు లభిస్తుంది. కొన్ని ప్రైవేటు ఏజెన్సీలు ఇందు కోసం ప్రత్యేకంగా పనిచేస్తున్నాయి.

అమలు అంతంతమాత్రమే

కొన్నిచోట్ల ‘భోగ్‌’ను విజయవంతంగా నిర్వహిస్తూ ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో ఇది చక్కగా అమలవుతోంది. మధ్యప్రదేశ్‌, హిమాచల్‌ప్రదేశ్‌, గుజరాత్‌, దిల్లీ, బిహార్‌, ఉత్తర్‌ప్రదేశ్‌, మేఘాలయ వంటి రాష్ట్రాల్లో పలుచోట్ల అమలు చేస్తున్నారు. తెలంగాణలో యాదాద్రి, ఏపీలో శ్రీశైలం, విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయాలు ‘భోగ్‌’ ధ్రువీకరణను పొందాయి. ఇందుకోసం ఆయా ఆలయాల్లో గణనీయమైన మార్పులు చేపట్టారు. అదనపు వసతులు కల్పించారు. ప్రసాదాల తయారీకి గ్రేడింగ్‌ ఉన్న పదార్థాలనే వినియోగించాల్సి ఉంటుంది. ఆహారం తయారయ్యాక సురక్షితమో కాదో నిర్ధారించుకోవాలి. ప్లాస్టిక్‌, ఇతర అనవసర పదార్థాల వినియోగాన్ని పరిహరించాలి. నీటి పరీక్షలు, ఇతర ఆహార పదార్థాల నాణ్యత పరీక్షలు, తయారీ సిబ్బందికి వృత్తిపరమైన శిక్షణ, ఆరోగ్య ధ్రువీకరణ, బ్యాక్టీరియా నివారణ తదితర జాగ్రత్తలనూ తీసుకోవాల్సి ఉంటుంది. దక్షిణ భారతంలో చాలా పుణ్యక్షేత్రాలు ఈ గుర్తింపు పొందాల్సి ఉంది. అన్నిచోట్లా నిర్దేశిత ప్రమాణాల్ని నిర్దిష్టంగా పాటించే దిశగా అడుగులు పడాలి.

– రావివలస సురేశ్‌

హాయ్‌! బుజ్జీ!!

ఎక్కడి జీవులు అక్కడే గప్‌చుప్‌!

చూస్తే చిన్న కుక్కపిల్లంత ఉంటాను. అమాయకంగానూ కనిపిస్తాను. కానీ... నా పేరు చెబితే చాలా ప్రాణులకు హడల్‌. నేను వస్తున్నా అంటే చాలు అవన్నీ ష్‌.. గప్‌చుప్‌! అయిపోతాయి. ఎందుకంటే నేను వాటిని వేటాడేస్తా కాబట్టి.

నా పేరు టాస్మేనియన్‌ డెవిల్‌. నిజానికి ఆస్ట్రేలియా నా స్వస్థలం. కానీ 3,500 సంవత్సరాల క్రితమే అక్కడ నేను అంతరించిపోయాను. ప్రస్తుతం టాస్మేనియా ద్వీపానికి మాత్రమే పరిమితమయ్యాను. మా సంఖ్య కూడా చాలా తక్కువగా ఉంది. 2013 నుంచి ఆస్ట్రేలియా, పలు దేశాల జూలల్లో ఆశ్రయం పొందుతున్నాను. ఆస్ట్రేలియన్‌ ప్రభుత్వం కూడా మా సంరక్షణ కోసం ప్రస్తుతం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది.



నేను చిన్నగా ఉన్నా, చాలా వేగంగా పరిగెత్తగలను. నాకు ఈత కూడా వచ్చు. చెట్లనూ ఎక్కగలను, కానీ వయసు పెరిగే కొద్దీ కాస్త కష్టమవుతుంది. మాలో ఆడవాటికి కంగారూలకు ఉన్నట్లే పొట్టకు సంచి ఉంటుంది. అందులోనే అవి పిల్లలను సంరక్షిస్తాయి.

నాకు బలమైన దవడలు, గట్టి దంతాలుంటాయి. వీటితో చిన్న చిన్న కంగారూలనూ కరకరలాడించేయగలను. ఇంకా కంగారూల్లా ఉండే వల్లబీలు, కుందేళ్లు, గొర్రెలు, మేకలు, పక్షులు, చేపలు, కప్పలు, కీటకాలను ఆహారంగా తీసుకుంటాను. పండ్లు, కూరగాయలనూ తింటాను. దాదాపు ఎనిమిది సంవత్సరాల వరకు జీవించగలను. నేస్తాలూ.. మొత్తానికి ఇవీ నా సంగతులు.

రాయగలరా?

ఇక్కడ కొన్ని పదాలు గజిబిజిగా ఉన్నాయి. వాటిని సరైన పదాలతో కలిపి అర్థవంతంగా చేయండి చూద్దాం.

అంకిత	మంచి	కరణ	ముందు	రాత
దూర	ఆకలి	పరీక్ష	ధనం	పరి
ముగ్గు	మాట	ప్రజా	భావం	అను
ముత్యాల	కరం	దృష్టి	నీరు	దప్పులు

టీజీటీఎస్ వ్యాపార పరిధిని పెంచుకోవాలి

● ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



ప్రదర్శనలో ఆభరణాలను పరిశీలిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ విభాగాలకు కంప్యూటర్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌లను సరఫరా చేసే నోడల్ ఏజెన్సీ తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్(టీజీటీఎస్) తన వ్యాపార పరిధిని విస్తృతపర్చుకోవాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశించారు. గత ఏడాది రూ.5 కోట్ల లాభం ఆర్జించిన ఈ సంస్థ తన కార్యకలాపాలను పెంచుకోవడం ద్వారా మరింత టర్నోవర్ సాధించాలని సూచించారు. శుక్రవారం టీజీటీఎస్ పనితీరుపై సైఫాబాద్ హాకా భవన్‌లోని కార్యాలయంలో ఆయన సమీక్షించారు. సంస్థ ప్రస్తుతం పోలీసు, పలు ప్రభుత్వ విభాగాలకు కంప్యూటర్ పరికరాలతోపాటు సీసీ కెమెరాలు, ఫోరెన్సిక్ సైన్స్ విభాగానికి నేర నిర్ధారణ పరీక్షలకు సంబంధించిన పరికరాలు కొనుగోలు చేసి అందజేస్తోంది. దీనిపై ఐటీ, పరిశ్రమల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్‌తో చర్చించాలి. కొద్ది మొత్తంలో కొనుగోళ్ల కంటే భారీ ఆర్డర్ల ద్వారా తక్కువ ధరకే ఎలక్ట్రానిక్ పరికరాలు సేకరించవచ్చనే విషయాన్ని ఆయా శాఖాధిపతులకు వివరించాలి' అని మంత్రి సూచించారు.

జ్యూయలరీ పార్క్ ఏర్పాటుకు చర్యలు

మాదాపూర్, న్యూస్‌టుడే: ఐటీ, ఫార్మా రంగాలకే కాదు జ్యుయలరీ, డైమండ్ ఆభరణాలకూ హైదరాబాద్ రాజధానిగా మారనుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో 'హైదరాబాద్ ఇంటర్నేషనల్ జ్యుయలరీ షో (హెచ్‌ఐజేఎస్)' పేరిట ఏర్పాటు చేసిన బంగారు, వజ్రాభరణాల ప్రదర్శనను శ్రీధర్‌బాబు శుక్రవారం ప్రారంభించారు. స్టాల్స్‌లో ప్రదర్శనకు ఉంచిన బంగారు, వజ్రాభరణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జ్యుయలరీ పరిశ్రమను ప్రోత్సహించేందుకు నగరంలో కొత్తగా జ్యుయలరీ పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బంగారు, వెండి, వజ్రాభరణాల రంగానికి సంబంధించిన అన్ని విభాగాలను, భాగస్వాములను ఒకే వేదిక మీదకు తీసుకొచ్చేలా ఈ పార్క్ ఉంటుందని వివరించారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, యునైటెడ్ ఎగ్జిబిషన్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.కె.మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల్లోని ఆలయ భూములను
స్వాధీనం చేసుకుంటాం

● ఆలయాల్లో అపరిశుభ్రత, అసౌకర్యాలపై ఫిర్యాదుల స్వీకరణకు యాప్

● దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ



ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ఆలయాల భూములు రక్షిస్తామని, ఆక్రమణల్లో ఉన్న వాటిని స్వాధీనం చేసుకోవడానికి నాలుగు జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టు ద్వారా సర్వే చేస్తున్నామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. తెలంగాణలోని ఆలయాల ప్రసాదాలను నాణ్యత పరీక్షలకు పంపించామని, ఇప్పటికే యాదగిరిగుట్ట లడ్డూ అత్యుత్తమంగా ఉన్నట్లు నివేదిక వచ్చిందని చెప్పారు. శుక్రవారం సచివాలయంలో దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి శైలజారామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, అటవీశాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీం, ప్రధాన సంరక్షకులు డోబ్రియాల్‌తో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. 'యాదగిరిగుట్టలో రూ.15 కోట్ల విరాళాలతో నిర్మించిన నిత్యాన్నదాన సత్రం ఈ కార్తీకమాసంలో దాతల సమక్షంలో ప్రారంభిస్తాం. విమాన గోపురం బంగారు తాపడం పనులు వచ్చే ఏడాది ఫిబ్రవరి 20 నాటికి పూర్తవుతాయి. భద్రాచలం ఆలయాభివృద్ధి కోసం సిద్ధం చేసిన మాస్టర్‌ప్లాన్‌కు త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆమోదం తెలుపుతాం. వేములవాడ రాజరాజేశ్వర స్వామికి భక్తులు సమర్పించే కోడెలను ప్రతి 2-3 నెలలకోసారి అర్హులైన రైతులకు ఇస్తాం. ఆలయాల ఆదాయం ఆధారంగా వాటిని ఏ, బీ, సీ, డీగా వర్గీకరణ చేయనున్నాం. ఆలయాల్లో అసౌకర్యాలు, అపరిశుభ్రతపై భక్తుల నుంచి ఫిర్యాదులు తీసుకుంటాం. ఇందు కోసం ఆలయాల వివరాలతో ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొస్తాం. దేవాదాయశాఖ భూముల ఆక్రమణదారులకు నోటీసులు పంపి వాటిని స్వాధీనం చేసుకుంటాం. వీరిలో పేదలు ఉంటే వారికి ప్రత్యామ్నాయ భూమి లేదా ఇంటి స్థలం ఇస్తాం. కేంద్ర పురావస్తుశాఖ(ఏఎస్ఐ) ఆధ్వర్యంలోని వరంగల్ కోటలో 12 ఆలయాలున్నా విగ్రహాలు లేవు. చారిత్రక ఆధారాల ఆధారంగా అక్కడ విగ్రహాల ఏర్పాటుకు ఏఎస్ఐకి నివేదిక అందిస్తాం' అని సురేఖ వివరించారు.

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
ఖమ్మం	35.4	25.0
నిజామాబాద్	35.4	24.8
ఆదిలాబాద్	34.5	24.5
హనుమకొండ	34.0	24.0
మెదక్	33.2	21.3
తిరుపతి	32.8	25.2
రామగుండం	32.5	24.9
తాడేపల్లిగూడెం	31.8	26.4
విజయవాడ	31.8	26.0
హైదరాబాద్	31.3	24.0
గుంటూరు	31.0	26.0
కడప	31.0	25.0
విజయనగరం	31.0	25.0
నల్గొండ	30.0	23.2
కరీంనగర్	30.0	22.0
మహబూబ్‌నగర్	29.5	23.9
సూర్యాపేట	27.0	26.0

గ్రహం అనుగ్రహం

19–10–2024 శనివారం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయణం; శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం

విదియ: మ. 12-46 తదుపరి తదియ

భరణి: మ. 2-32 తదుపరి కృత్తిక

వర్జ్యం: రా. 1-53 నుంచి 3-23 వరకు


అమృత ఘడియలు: ఉ. 10-02 నుంచి 11-32 వరకు

దుర్ముహూర్తం: ఉ. 5-55 నుంచి 7-29 వరకు

రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు

సూర్యోదయం: ఉ. 5.56; సూర్యాస్తమయం: సా.5.34

అట్లతద్దె





మీ పిల్లల నోట ఆ మాట వస్తుంటే జాగ్రత్త



'నాతో అస్సలు ఆడుకోవు. ఎప్పుడూ ఫోన్ చూస్తుంటావు..' - ఈ మాట మీ పిల్లల నోటి నుంచి వస్తోందంటే మీ వ్యవహార శైలిని సమీక్షించుకోవాల్సిందే. తమకన్నా ఫోన్‌కే ఎక్కువ విలువిస్తున్నట్లు పిల్లల్లో అభిప్రాయం ఏర్పడిందంటే, అది వారిలో కుంగుబాటుకు, ఒంటరితనానికి దారితీయొచ్చు. లేదా వారు కూడా మీలాగే ఫోన్‌కు బానిసగా మారొచ్చు. పిల్లల మాటల్లో మీ ప్రవర్తన గురించి హెచ్చరిక సంకేతాలు ఉంటాయి. వాటిని పసిగట్టి మిమ్మల్ని మార్చుకోండి.

– జాన్ కన్‌స్టాస్, వైద్య రంగ నిపుణులు

ఎంఆర్‌ఐలు ఏవీ?

(మొదటి పేజీ తరువాయి)

దశాబ్దాల క్రితం ఏర్పాటైన ప్రధానాసుపత్రుల్లోనూ అత్యంత కీలకమైన ఎంఆర్‌ఐలను ఏర్పాటుచేయకపోవడం గమనార్హం. దీంతో పేదప్రజలు కీలక పరిస్థితుల్లో రూ.వేలల్లో వెచ్చించి ప్రైవేటు ఆసుపత్రులు లేదా ప్రైవేటు డయాగ్నస్టిక్స్ కేంద్రాలను ఆశ్రయించాల్సి వస్తోంది. రాష్ట్రంలో ఏళ్ల తరబడి ఈ సమస్య పరిష్కారం దిశగా ఎలాంటి చర్యలు లేకపోవడం గమనార్హం. ప్రభుత్వసేవలకు సంబంధించి ప్రస్తుతం హైదరాబాద్ గాంధీ, ఉస్మానియా, నిమ్స్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రులతో పాటు, వరంగల్ ఎంజీఎంలలో మాత్రమే ఎంఆర్‌ఐ ఉంది. ప్రభుత్వ వైద్యకళాశాలలకు అనుబంధంగా ఉన్న 31 బోధనాసుపత్రుల్లోనూ ఎక్కడా ఈ సదుపాయం లేదు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం కోసం వస్తున్నవారిలో చాలామంది నిత్యం ఎంఆర్‌ఐ కోసం ప్రైవేటు బాట పడుతున్నారు. మరోవైపు రాష్ట్రంలో ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం వైద్య కళాశాలల్లో ఏర్పాటుచేసిన అత్యాధునిక క్యాథ్‌ల్యాబ్‌లు నిరుపయోగంగా పడిఉన్నాయి.



ఆదిలాబాద్‌లో నిరుపయోగంగా క్యాథ్ ఐసీయూ ★ ఖమ్మంలో ఇలా...

వైద్యంలో కీలకం..

ప్రమాదాలు జరిగినప్పుడు.. వివిధ అనారోగ్య పరిస్థితుల్లో కీలక వైద్యం అందించేటప్పుడు ఎంఆర్‌ఐ పరీక్ష ముఖ్యం. ప్రధానంగా అవయవాల అంతర్‌నిర్మాణంలో మార్పులను గుర్తించి దీనికి తగినవిధంగా వైద్యం చేయడానికి ఎంఆర్‌ఐ చేయించాల్సి వస్తుంది. శరీరంలో వివిధ అవయవాలు, ఎముకలు, రక్తనాళాలు, మెదడు, మృదుకణాలు, కణుతులు, మెదడులో సమస్యల వంటి వాటిని గుర్తించి సరైన వైద్యం అందించడానికి ఇది అత్యంత ప్రధానమైంది.

■ ప్రైవేటులో ఎంఆర్‌ఐ ఛార్జీలు ల్యాబ్‌ల ఆధారంగా వేర్వేరుగా ఉంటాయి. ఒక్కో ఎంఆర్‌ఐకి రూ.3,700 నుంచి రూ.11,000 దాకా వసూలు చేస్తారు. సగటున రూ.10 వేలు దాకా ఛార్జి చేస్తారు. అత్యవసరంగా తీసే ఎంఆర్‌ఐలకు ఇంకా ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తారు.

విధిలేక సీటీ స్కాన్‌తోనే..!

పలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎంఆర్‌ఐ లేకపోవడంతో సీటీ స్కాన్ ద్వారా సమస్యలను గుర్తించి వైద్యం అందిస్తున్నారు. ఫలితంగా సమస్య తీవ్రతను పూర్తిగా గుర్తించకుండానే వైద్యం అందిస్తున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు. సీటీ స్కాన్ ఆధారంగా వైద్యం చేయడం.. లేదంటే రోగులను ప్రైవేటులో ఎంఆర్‌ఐ తీయించుకురమ్మని చెప్పడం తప్ప తామేమీ చేయలేకపోతున్నామని పేర్కొంటున్నారు. ఎముకలు వంటివాటికి సీటీ స్కాన్‌లో నిర్ధారణ చేయవచ్చు గానీ శరీరంలో ఇతర అంతర్భాగాలు, అవయవాల నిర్మాణంలో లోపాలను, మార్పులను, సమస్యలను గుర్తించడం సాధ్యం కాదని చెబుతున్నారు. ఎంఆర్‌ఐను అన్ని జిల్లాల్లో.. కనీసం బోధనాసుపత్రుల్లో ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.

నిరుపయోగంగా క్యాథ్‌ల్యాబ్‌లు!

రాష్ట్రంలో పలుచోట్ల రూ.కోట్లతో క్యాథ్‌ల్యాబ్‌లు ఏర్పాటుచేసినా.. అవి నిరుపయోగంగా పడిఉన్నాయి. గుండెకు సంబంధించిన అత్యాధునిక వైద్యం అందించేందుకు వీలుగా కీలక ప్రాంతాల్లోని వైద్య కళాశాలలకు అనుబంధంగా ఉండే బోధనాసుపత్రుల్లో ఏర్పాటుచేసిన క్యాథ్‌ల్యాబ్‌లను వినియోగంలోకి తీసుకురావడంపై వైద్య, ఆరోగ్య శాఖ ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. ఆయా మెడికల్ కాలేజీల్లో కార్డియాలజీకి సంబంధించిన స్పెషలిస్ట్ పోస్టులే లేకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. గతంలో డిప్యూటేషన్‌పై ఇతరచోట్ల ఉన్న స్పెషలిస్ట్‌లను నియమించి క్యాథ్‌ల్యాబ్‌లను ఉపయోగించినా డిప్యుటేషన్లు రద్దయినప్పటి నుంచి అవికూడా మూతపడ్డాయి. నిజామాబాద్, ఖమ్మం మెడికల్ కాలేజీల్లో క్యాథ్‌లాబ్ ఉన్నా వినియోగంలో లేదు. ఇక్కడ కార్డియాలజిస్ట్ పోస్టు లేదు. ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట, భద్రాద్రి-కొత్తగూడెం వంటి జిల్లాలకు హబ్‌గా ఉండే ఖమ్మంలో పేదల గుండె చికిత్సలో కీలకంగా ఉండే క్యాథ్‌లాబ్ నిరుపయోగంగా పడి ఉంది. ఆదిలాబాద్ రిమ్స్‌లోనూ క్యాథ్‌లాబ్ ఏడాదిగా వినియోగంలో లేదు. ఇక్కడ కార్డియాలజిస్ట్‌తో పాటు టెక్నీషియన్లు లేకపోవడంతో నిరుపయోగంగా మారింది.

గుండె వైద్యంలో కీలకం..

గుండె సంబంధిత సమస్యలను గుర్తించడంలో, చికిత్సలో అత్యంత కీలకం క్యాథ్‌ల్యాబ్. యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్ట్, పేస్‌మేకర్ ఏర్పాటు వంటి సందర్భాల్లోనూ.. గుండె రక్తనాళాల్లో సమస్యల నేపథ్యంలో స్టెంట్లు వేయడానికి అవసరమైన యూనిట్. ఒక్కో క్యాథ్‌ల్యాబ్ ఏర్పాటుకు రూ.6-7 కోట్ల వ్యయమవుతుంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్యాథ్‌ల్యాబ్‌లు ఉంటే ఉచితంగా గుండె చికిత్సకు అవకాశం ఉంటుంది. ప్రైవేటులో అయితే గుండె సంబంధిత చికిత్సలకు రూ.లక్షలు వెచ్చించాల్సి వస్తుంది. ఆదిలాబాద్, ఖమ్మంలోని క్యాథ్‌ల్యాబ్‌లలో గతంలో గుండెచికిత్సలు ఉచితంగా చేయడంతో పాటు పలువురికి స్టెంట్లు వేశారు. వీటిని వినియోగంలోకి తెస్తే ఎంతో మంది పేదలకు మెరుగైన సేవలందుతాయి.

స్కిల్ యూనివర్సిటీకి అదానీ భూరి విరాళం

ఈనాడు హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అదానీ ఫౌండేషన్ భూరి విరాళాన్ని ప్రకటించింది. ఈ మేరకు అదానీ గ్రూపు సంస్థల ఛైర్మన్ గౌతమ్ అదానీ శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి రూ.100 కోట్ల విలువైన చెక్కును అందజేశారు. అదానీ పోర్ట్స్ అండ్ ఎస్.ఈ.జడ్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కరణ్ అదానీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యం: కిషన్‌రెడ్డి

- 23, 24 తేదీల్లో మూసీ పరీవాహకానికి ఎంపీలు, ఎమ్మెల్యేలు
- భాజపా ఆధ్వర్యంలో 25న భారీ ధర్నా: మహేశ్వర్‌రెడ్డి



ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాజపా విజయమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలకు సూచించారు. గతంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాన్ని గెలిపించుకున్న స్ఫూర్తితోనే రానున్న మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. శుక్రవారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ రాష్ట్ర సంస్థాగత వ్యవహారాల ఇన్‌ఛార్జి సునీల్‌బన్సల్, ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావు, భాజపా శాసనసభాపక్షనేత మహేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యేలు పాల్వాయి హరీశ్, పైడి రాకేశ్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, పాయల్‌శంకర్, రామారావు పటేల్, కె.వెంకటరమణారెడ్డి ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి ఇతర ముఖ్యనేతలు పాల్గొన్నారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, మూసీ పరీవాహక ప్రాంతంలో జరుగుతున్న పరిణామాల్లో పేదలకు అండగా నిలవాలన్నారు. హైడ్రా అంశంలో కూడా పార్టీ నిర్ణయం మేరకు పకడ్బందీ కార్యాచరణతో పేదల పక్షాన ముందుకు వెళ్లాలని సూచించారు. సమావేశం అనంతరం మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, ఈ నెల 23, 24 తేదీల్లో క్షేత్రస్థాయిలో మూసీ పరీవాహక ప్రాంతంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు పర్యటించనున్నట్లు తెలిపారు. 25న హైడ్రా, మూసీ ప్రక్షాళనకు వ్యతిరేకంగా ధర్నా చేయనున్నట్లు వెల్లడించారు.

గురుకులాలకు నిధులు విడుదల చేయండి

మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి డిమాండ్

ఈనాడు, హైదరాబాద్: మూసీ పునరుజ్జీవం పేరిట స్థిరాస్తి వ్యాపారం చేయడం అటుంచి ముందుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రుణమాఫీ కాకపోవడంతో రైతులు అల్లాడుతున్నారని ఆక్షేపించారు. పింఛన్లు పెంచి ఇవ్వాలని సర్కారుకు సూచించారు. భారాస హయాంలో చేపట్టిన ఉద్యోగాల భర్తీపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అబద్ధాలు మాట్లాడుతున్నారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఒక ప్రకటనలో విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లలో భాగంగానే కాంగ్రెస్ ప్రభుత్వం నియామకాలిచ్చిందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు.

మూసీ పేరిట ధనయజ్ఞం

- పేదల కడుపు కొడతామంటే ఊరుకోం
- సీఎం రేవంత్‌పై మండిపడిన కేటీఆర్



తమ హయాంలో చేపట్టిన మూసీ ప్రాజెక్టు గురించి వివరిస్తున్న కేటీఆర్

ఈనాడు- హైదరాబాద్: "భారాస ప్రభుత్వం 2017లో రాడార్ కేంద్రానికి అనుమతులిచ్చింది నిజమే. కానీ పర్యావరణవేత్తలు, ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవడంతో భూమిని స్వాధీనం చేయలేదు. దామగుండంలో చెట్లు నరికేందుకు అంగీకరించలేదు. రేవంత్ ప్రభుత్వం రాగానే.. మోదీకి దాసోహమయ్యారు. మూసీ ప్రారంభమయ్యే వికారాబాద్ అడవుల్లో 12 లక్షల చెట్లు నరికి వనమేధం చేస్తున్నారు. మూసీ పరీవాహకంలో హైదరాబాద్ నడిబొడ్డున గృహమేధం చేస్తున్నారు. మొత్తంగా మూసీ పేరిట ధనయజ్ఞం చేస్తున్నారు. రూ.25 వేల కోట్లతో పూర్తి చేయగల ప్రాజెక్టుకు రూ.1.50 లక్షల కోట్లెందుకు?" అంటూ భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. మూసీ పునరుజ్జీవానికి భారాస హయాంలో చేపట్టిన పనులపై కేటీఆర్ శుక్రవారం తెలంగాణ భవన్‌లో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎంగా మారిపోయింది. ముఖ్యమంత్రి మూసీపై చూపే ప్రేమంతా.. దిల్లీకి మూటలు పంపించేందుకే. మూసీ డిజైన్ వద్దంటే.. తన ఆస్తులమ్మి కన్సల్టెంట్ సంస్థలకు ఇచ్చిన రూ.141 కోట్లను చెల్లిస్తానని ముఖ్యమంత్రి అన్నారు. మరి ఆయన అఫిడవిట్‌లో రూ.30 కోట్లే పేర్కొన్నారు. మిగతావి ఎక్కడి నుంచి తెచ్చి ఇస్తారు? మేం చేసిన పనులను ముందుకు తీసుకెళ్లండి. కానీ పేదవారి కడుపు కొడతామంటే చూస్తూ ఊరుకోం. ప్రజలను చైతన్యవంతులను చేసి ప్రజా పోరాటాలు చేస్తాం" అని హెచ్చరించారు.

భారాస హయాంలో మూసీ బాగు కోసం..


"భారాస ప్రభుత్వ హయాంలో.. కాలుష్య నియంత్రణ మండలి నివేదిక తెప్పించుకొని.. మూసీ ప్రక్షాళనకు కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. 2017లో మూసీ రివర్ ఫ్రంట్ పేరుతో కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. మేం మూసీని సుందరీకరణతో పాటు.. పునరుజ్జీవం చేయాలనుకున్నాం. నల్గొండకు మంచినీళ్లివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ముఖ్యంగా పేదవాళ్లను నిరాశ్రయులను చేయొద్దన్నది మా ఆలోచన. నాగోల్, ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో వాకింగ్ ట్రాక్స్, పార్కులు ఏర్పాటు చేశాం. కాళేశ్వరం నీళ్లను రూ.1100 కోట్లతో గండిపేటలోకి కలపాలనుకున్నాం. దక్షిణాసియాలోనే ఎక్కడా లేని విధంగా ఎస్టీపీలతో 100 శాతం మురుగునీటి శుద్ధి చేసే పని మొదలుపెట్టాం. 31 ఎస్టీపీలను ప్రభుత్వం మంజూరు చేసింది. నాగోల్‌లో మూసీ శుద్ధి కోసం 5 కి.మీ. 'ల్యాండ్ స్కేప్' చేసినా.. ఎక్కడా పేదవారి కడుపు కొట్టలేదు. మొత్తం 31 ఎస్టీపీలు పూర్తి చేస్తే, నల్గొండకు పూర్తిగా స్వచ్ఛమైన నీరు వెళ్తుంది. మూసీ మీద మేం దాదాపు 15 వంతెనలు.. చెక్ డ్యామ్‌లు ప్లాన్ చేశాం. అక్కడ టూరిజం కూడా అభివృద్ధి చేయాలనుకున్నాం. మూసీ ప్రక్షాళనకు ప్రపంచస్థాయి 9 కంపెనీలతో డిజైన్లు కూడా రూపొందించాం. మళ్లీ ఇప్పుడు డీపీఆర్ కోసం రూ.141 కోట్ల ఖర్చు ఎందుకు?

లక్ష మందిని నిరాశ్రయులను చేయొద్దనే..

మూసీ నదీగర్భంలో 900 నివాసాలున్నాయి. బఫర్ జోన్‌లో ఇళ్లకు అన్ని అనుమతులూ ఉన్నాయి. ఇక్కడ ఉన్న మొత్తం 11 వేల నిర్మాణాలను తొలగిస్తే.. సుమారు లక్ష మంది నిరాశ్రయులవుతారు. పేదవాళ్లను ఇబ్బంది పెట్టొద్దనే బఫర్ జోన్ జోలికి పోకుండా.. మూసీ ప్రాజెక్టులో మిగతా పనులు చేయమని కేసీఆర్ చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు డీపీఆర్ తయారీకి అప్పగించిన ఒక కంపెనీపై పాకిస్థాన్‌లో రెడ్ కార్నర్ నోటీసు జారీ అయ్యింది. మన ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఝార్ఖండ్ ప్రభుత్వం కూడా ఈ కంపెనీని నిషేధించాయి. బ్లాక్‌లిస్టులో పెట్టిన అలాంటి కంపెనీపై ముఖ్యమంత్రికి అంత ప్రేమ ఎందుకో? మూసీ పక్కన అన్ని బహుళ అంతస్తుల భవనాలొస్తే.. మళ్లీ ఫోర్త్ సిటీ ఎందుకు? హైదరాబాద్‌లో వరద సాయంలో అవినీతి జరిగితే.. విచారణ జరుపుకోవచ్చు. కోకాపేట భూములు, ఓఆర్‌ఆర్ కుంభకోణం అని.. నాపై రేవంత్ గతంలో ఆరోపణలు చేశారు. మరి పది నెలలైనా ఎందుకు విచారణ చేయటం లేదు?" అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో భారాసకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

రూ.80,000కు చేరిన 10 గ్రాముల మేలిమి బంగారం


కిలో వెండి రూ.97,500 పైకి



ఈనాడు వాణిజ్య విభాగం: అంతర్జాతీయ విపణుల్లో పెట్టుబడులు తరలి వస్తుండటంతో బంగారం, వెండి ధరలు పైపైకి చేరుతున్నాయి. అంతర్జాతీయంగా యుద్ధభయాల వల్ల ఆర్థిక అనిశ్చితులు ఏర్పడటంతో, సురక్షితమని భావించే పసిడి, వెండిలోకి పెట్టుబడులు ప్రవహిస్తున్నాయి. ఫలితంగా ఔన్సు (31.10 గ్రాముల) మేలిమి (24 క్యారెట్ల) బంగారం ధర శుక్రవారం 2719 డాలర్లకు, వెండి ధర 33.20 డాలర్లకు చేరింది. హైదరాబాద్ బులియన్ విపణిలో శుక్రవారం రాత్రి 11 గంటల సమయానికి 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.80,000కు చేరింది. కిలో వెండి ధర రూ.97,500కి పైగా ట్రేడ్ అవుతోంది. దీపావళికి ముందు వచ్చే ధన త్రయోదశి సమయానికి ఈ ధరలుంటాయని వ్యాపారులు భావించగా, అంతకన్నా ముందే వచ్చాయి. శుభకార్యాల నిమిత్తం కొనుగోలు చేద్దామనుకునే వారు ఈ ధరలతో ఆచితూచి వ్యవహరిస్తున్నారని సమాచారం.

మూసీ పేరిట స్థిరాస్తి వ్యాపారం

- మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపణ
- మల్లన్నసాగర్‌పై చర్చకు సిద్ధమా అని సవాల్



ఫిల్మ్‌నగర్, న్యూస్‌టుడే: మూసీ సుందరీకరణ పేరుతో, ఫార్మాసిటీకి భారాస హయాంలో సేకరించిన భూమితో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ముఖ్యమంత్రి రూ.1.50 లక్షల కోట్లతో మూసీ సుందరీకరణ చేస్తామని ప్రకటించడంపై ప్రజలు ఆశ్చర్యపోతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం మాజీ మంత్రులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డిలతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. 'రివర్‌ఫ్రంట్ అంటే ఏంటో సీఎం చెప్పాలి. నదిని శుభ్రం చేయడం నుంచే పనులు ప్రారంభం కావాలి. ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజల్ని మోసగిస్తున్నారు. సీఎం తన పదవి స్థాయిని దిగజార్చేలా మాట్లాడుతున్నారు. మల్లన్నసాగర్ నిర్వాసితులకు మేం నాలుగు వేల ఇళ్లు కట్టించి ఇచ్చాం. రూ.2 వేల కోట్ల పరిహారం చెల్లించాం. నదుల పునరుజ్జీవ ప్రయత్నం భారాస ఎప్పుడో చేసింది. కేసీఆర్ రూ.3800 కోట్లతో 31 ఎస్టీపీలను మంజూరు చేసి మూసీ పునరుజ్జీవానికి కృషి చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా రూ.1100 కోట్లతో ముత్తంగి జంక్షన్ వద్ద గోదావరి నీళ్లను ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ ద్వారా తరలించి మూసీని శుద్ధి చేయాలని ప్రణాళిక రూపొందించాం. ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో మల్లన్నసాగర్ నుంచి మూసీకి నీళ్లు తెచ్చేందుకు రూ.4000 కోట్లు ఖర్చు పెట్టి, కాంట్రాక్టర్లకు లాభం చేకూర్చేందుకు ప్రయత్నిస్తున్నారు. మూసీ చుట్టూ 50 మీటర్ల మేర పేదల ఇళ్లను కూలగొడతామంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

నిర్వాసితుల వద్దకు తీసుకెళ్తా.. సీఎం వస్తారా?

మల్లన్నసాగర్ గురించి చర్చకు రావాలని ముఖ్యమంత్రిని సవాల్ చేస్తున్నా. తేదీ ఆయన నిర్ణయిస్తారా? నన్ను నిర్ణయించమంటారా? శనివారం ఉదయం 9 గంటలకు సీఎం ఇంటికి వస్తా. లేదా మీరు ఎప్పుడు టైం ఇస్తే అప్పుడు వస్తా. నేనే కారు నడుపుతూ మల్లన్నసాగర్ నిర్వాసితుల వద్దకు తీసుకెళ్తా. అక్కడ మా హయాంలో నిర్మించిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీ చింతచెట్టు కింద, లేదా రంగనాయక సాగర్ కట్టమీద కూర్చొని మాట్లాడదాం. నాతో రావడానికి సీఎం సిద్ధంగా ఉన్నారా? అలాగే మూసీ బాధితుల దగ్గరికి కూడా తీసుకెళ్తా, వారితో మాట్లాడదాం. వేలమంది ప్రజలకు మేలు జరుగుతుందంటే నేను మూసీ గర్భంలో నివసించేందుకు సిద్ధమే. ఈ ప్రాజెక్టుపై 15 రోజుల కిందట అఖిలపక్ష సమావేశం పెట్టాలని ముఖ్యమంత్రికి సూచించినా, ఇప్పటివరకు పిలవలేదు. ప్రజల్ని గుర్రాలతో తొక్కించే సంస్కృతి కాంగ్రెస్, తెదేపాలదే. ప్రధాన ప్రతిపక్షానికి ఒక్కసీటు కూడా రాలేదంటూ భారాసను ఎద్దేవా చేస్తున్నారు.. కానీ గుజరాత్, మహారాష్ట్రల్లో కాంగ్రెస్ పార్టీకి కూడా ఒక్క సీటూ రాలేదు' అంటూ హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

ప్రేమించి దూరం పెడుతోందని..

యువతిపై బ్లేడ్‌తో దాడి

- ప్రేమోన్మాది ఘాతుకం

అమీర్‌పేట, న్యూస్‌టుడే: తనను ప్రేమించి దూరం పెడుతుందనే కోపంతో ఓ యువతిపై ప్రేమోన్మాది బ్లేడ్‌తో దాడి చేసి గాయపరిచిన ఘటన ఎస్సార్‌నగర్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఏపీలోని శ్రీకాళహస్తి సమీపంలోని చోడవరానికి చెందిన మధుసూదన్‌రెడ్డి (22), అదే ప్రాంతానికి చెందిన యువతి (21) నెల్లూరు జిల్లాలోని ఓ కళాశాలలో ఇటీవల ఇంజినీరింగ్ పూర్తి చేశారు. ఒకే కళాశాల అయినా.. వేర్వేరు విభాగాల్లో చదువుకున్న వీరు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమై ప్రేమలో పడ్డారు. తర్వాత ఐటీ కోర్సుల్లో శిక్షణ పొందడానికి హైదరాబాద్ వచ్చారు. అమీర్‌పేట సత్యం థియేటర్ సమీపంలోని ఓ సంస్థలో ఇద్దరూ శిక్షణ పొందుతున్నారు. ఇటీవల మద్యం, ఇతర వ్యసనాలకు బానిసైన మధుసూదన్‌రెడ్డిని యువతి దూరం పెడుతుండడంతో అతడు కోపం పెంచుకున్నాడు. మధుసూదన్‌రెడ్డి గురువారం సాయంత్రం ఎస్సార్‌నగర్ పోలీసు స్టేషన్‌కు సమీపంలో నిలబడి ఉన్న ఆ యువతిపై బ్లేడ్‌తో దాడి చేశాడు. ఈ ఘటనలో ఆమె మెడకు గాయమైంది. అప్పుడే అటుగా వెళ్తున్న పోలీసు పెట్రోలింగ్ సిబ్బంది నిందితుడిని పట్టుకున్నారు. బాధితురాలిని ఆసుపత్రికి తరలించారు. ఎస్సార్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హీరాగోల్డ్ ఎండీ నౌహీరా బెయిల్ రద్దు

- సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు
- రెండు వారాల్లో లొంగిపోవాలని ఆదేశం
- ఎఫ్ఐఆర్‌లపై దర్యాప్తు కొనసాగించేందుకు వివిధ రాష్ట్రాల పోలీసులకు స్వేచ్ఛ



ఈనాడు, దిల్లీ: ఇచ్చిన గడువు లోపు రూ.580 కోట్లు సేకరించడంలో విఫలమైన హీరాగోల్డ్ ఎండీ నౌహీరా షేక్ బెయిల్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. తమపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల విచారణ బాధ్యతలను ఆయా రాష్ట్ర పోలీసులకు కాకుండా ఎస్ఎఫ్ఐఓ (సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్)కు అప్పగించాలన్న ఆమె విజ్ఞప్తిని కొట్టేసింది. హీరాగోల్డ్ సంస్థపై వివిధ రాష్ట్రాల్లో నమోదైన కేసులపై ఆయా రాష్ట్రాల పోలీసులు దర్యాప్తు కొనసాగించడానికి అనుమతి ఇచ్చింది. రెండు వారాల లోపు ట్రయల్ కోర్టు ఎదుట లొంగిపోవాలని ఆమెకు ఆదేశాలిచ్చింది. ఈ మేరకు శుక్రవారం జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్‌మిశ్రలతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. హీరాగోల్డ్ సంస్థలో పెట్టుబడులు పెట్టిన వారికి 36% డివిడెండ్ ఇస్తామని నమ్మించి డిపాజిట్లు చేయించుకున్న నౌహీరా షేక్ సకాలంలో వాటిని చెల్లించలేదన్న కారణంతో ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లోని డిపాజిట్‌దారులు ఆమెపై కేసులు పెట్టారు. తెలంగాణలో నమోదైన ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా 2018లో రాష్ట్ర పోలీసులు ఆమెను అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణతోపాటు, వివిధ రాష్ట్రాల్లో తనతోపాటు తన సంస్థపై నమోదైన కేసులను దర్యాప్తు చేసే అధికారం స్థానిక పోలీసులకు లేదని, అన్నింటినీ ఎస్ఎఫ్ఐఓకి బదిలీ చేయాలని కోరుతూ గతంలో తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా ఆమెకు అనుకూలంగా తీర్పు వచ్చింది. రూ.50 లక్షల పూచీకత్తు సహా వివిధ షరతులతో ఆమెను బెయిల్‌పై విడుదల చేయడానికి అనుమతి ఇచ్చింది.

సవాల్ చేసిన తెలంగాణ ప్రభుత్వం

హైకోర్టు ఇచ్చిన ఆ ఉత్తర్వులను తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆమెకు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలని కోరింది. సుప్రీంకోర్టు ఆ విజ్ఞప్తిని తోసిపుచ్చుతూ పెట్టుబడిదారులకు చేయాల్సిన చెల్లింపులకు ప్రాధాన్యమివ్వాలని 2022 మే నెల 12న ఆదేశించింది. ఆ తర్వాత పలుమార్లు వాయిదా పడిన ఈ పిటిషన్‌పై జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్‌మిశ్రలతో కూడిన ధర్మాసనం ఈ ఏడాది ఆగస్టు 23న విచారణ జరిపింది. వచ్చే విచారణ తేదీ నాటికి రూ.580 కోట్లు సమీకరించుకోవాలని నౌహీరా షేక్‌ను ఆదేశించింది. ఆ ప్రకారం ఆర్థిక వనరులను సమీకరించుకోలేని పక్షంలో బెయిల్ రద్దు చేస్తామని, ఏ రాష్ట్రంలో నమోదైన ఎఫ్ఐఆర్‌లపై ఆ రాష్ట్ర పోలీసులు దర్యాప్తు కొనసాగించేలా ఆదేశిస్తామని, ఈ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చర్యలు తీసుకోవడానికి వీలు కల్పిస్తామని పేర్కొంటూ తదుపరి విచారణను అక్టోబరు 18కి వాయిదా వేసింది. ఆ ప్రకారం శుక్రవారం విచారణ చేపట్టిన ధర్మాసనం ఇదివరకు తాము ఆదేశించినట్లుగా నౌహీరా షేక్ రూ.580 కోట్లు సమీకరించడంలో విఫలమైన కారణంగా ఆమెకు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేసింది. ఎఫ్ఐఆర్‌లపై ఆయా రాష్ట్రాల పోలీసులు, కంపెనీ చట్టం ఉల్లంఘనలపై ఎస్ఎఫ్ఐఓ దర్యాప్తు కొనసాగించడానికి వీలు కల్పించింది.

మీరు రాజకీయ పదవులు పొందారా?

(మొదటి పేజీ తరువాయి)

బీసీ కులాల వారు ఎందరనే లెక్కల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ సర్వేను చేపట్టింది. వారితోపాటు.. రాష్ట్ర ప్రజల్లో ప్రతి ఒక్కరి కులం, ఉపకులం ఏమిటి? స్థానికంగా కులాల పేర్లలో ఏమైనా మార్పులున్నాయా వంటి వివరాలన్నీ సేకరిస్తారు. ఎవరైనా కులం పేరు తప్పుగా నమోదు చేయిస్తే భవిష్యత్తులో అనేక రకాలుగా నష్టం వాటిల్లుతుందని అధికారులు చెబుతున్నారు. తప్పుడు వివరాలు నమోదు కాకుండా.. స్థానిక అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ వివరాల ఆధారంగా భవిష్యత్తులో సంక్షేమ పథకాలతో పాటు అనేక కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుంది. ప్రతి ఒక్కరి ఆధార్, పాన్, సెల్ నంబర్లతో పాటు, వయసు తదితర వివరాలు నమోదు చేస్తారు. విద్యార్హత, ఉద్యోగం, సొంత ఇల్లు, కారు, బైకు వంటివి ఉన్నాయా.. ఇలా సమగ్ర సమాచారం సేకరించనున్నారు. జనాభా లెక్కలకన్నా ఎక్కువ సమాచారాన్ని ఈ సర్వే ద్వారా ప్రభుత్వం సేకరించనుంది.

150 కుటుంబాలకో గణకుడు..

రాష్ట్రంలో ప్రస్తుతం 3.80 కోట్లకు పైగా జనాభా ఉన్నట్లు.. మొత్తం కుటుంబాల సంఖ్య 1.10 కోట్లు దాటిందని అంచనా. దీనికి అనుగుణంగా సిబ్బంది నియామకానికి ప్రణాళికశాఖ ప్రతిపాదనలు రూపొందించింది. ప్రతి 150 కుటుంబాలకు ఒక సర్వే గణకుడిని నియమిస్తారు. ఈ లెక్కన మొత్తం 75 వేల మంది కావాలి. వీరిపై పర్యవేక్షకులుగా మరో 15 వేల మంది అవసరం. వీరందరినీ నియమించడానికి అన్ని శాఖల సిబ్బంది వివరాలను సేకరిస్తున్నారు.

■ ఉపాధ్యాయులను సర్వేలకు వాడుకోవద్దని గతంలో కోర్టు తీర్పులున్నందున.. విద్యాశాఖలో 15 వేల మంది ఇతర ఉద్యోగులను సర్వేకు నియమించనున్నారు. ప్రతి ప్రభుత్వ శాఖలో ఎంతమందిని తీసుకోవచ్చనేది జిల్లాలవారీగా వివరాలు పంపాలని కలెక్టర్లకు సూచించారు.

■ గ్రేటర్ హైదరాబాద్‌లో కోటికిపైగా జనాభా ఉన్నందున ఇక్కడే 30 వేల మందికి పైగా గణకులు అవసరమని భావిస్తున్నారు. జిల్లాల్లో కుటుంబాల సంఖ్య ఆధారంగా కనీసం 2,500 నుంచి 3,000 మంది ఉద్యోగులను అన్నిశాఖల నుంచి సర్వేకు నియమిస్తారు. వీరంతా 15 రోజుల పాటు ఇంటింటికీ తిరిగి సర్వే చేయాలని నిర్ణయించారు. ఒకసారి సర్వే చేసిన తర్వాత వివరాలు పక్కాగా సేకరించారా.. లేదా.. అని తర్వాత నమూనాగా తనిఖీ సర్వే కూడా చేయాలని యోచిస్తున్నారు. ఈ నెలాఖరులోగా సర్వేను ప్రారంభించేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. 60 రోజుల్లోగా సర్వే నివేదికను ప్రభుత్వానికి అందజేయాలనేది ప్రణాళికశాఖ లక్ష్యం.

తొలిసారి రౌడీషీటర్ ఆస్తులు జప్తు చేసిన ఈడీ

● నేరాల ద్వారా పెద్దమొత్తంలో ఆర్జన

ఈనాడు, హైదరాబాద్: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) హైదరాబాద్ విభాగం మొదటిసారి ఒక రౌడీషీటర్ ఆస్తులు జప్తు చేసింది. ఎలాంటి ఆదాయ వనరులూ లేకపోయినప్పటికీ కేవలం నేర కార్యకలాపాలు, బెదిరింపులతో డబ్బులు వసూలు చేసి వీటిని సమకూర్చుకున్నట్లు గుర్తించింది. ఈ మేరకు ఈడీ అధికారులు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని హబీబ్‌నగర్ పోలీసుస్టేషన్లో రౌడీషీటర్‌గా నమోదైన మహ్మద్ కైసర్‌పై రాష్ట్రంలోని అనేక ఠాణాల పరిధిలో కేసులు ఉన్నాయి. హత్యలు, హత్యాయత్నాలు, జూదం, భూ కబ్జాలకు పాల్పడినట్లు అభియోగాలున్నాయి. పీడీ చట్టం కింద అరెస్టయి జైలుకు కూడా వెళ్లి వచ్చాడు. నేర కార్యకలాపాల ద్వారా ఆర్జించిన సొమ్ముతో భార్య షాహెదా బేగం పేరు మీద 2007 నుంచి 2020 మధ్యలో పెద్దఎత్తున స్థిరాస్తులు కూడబెట్టాడు. వీటన్నింటికీ నగదు రూపంలోనే చెల్లింపులు చేశాడు. ఇలా నిధుల మళ్లింపునకు సంబంధించి ఈడీ మరో కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలుపెట్టింది. పెద్దఎత్తున స్థిరాస్తులు కూడబెట్టాడని గుర్తించి జప్తు చేసింది. వీటి విలువ అధికారికంగా రూ.1.01 కోట్లు కాగా అనధికారికంగా దీనికి ఎన్నో రెట్లు ఎక్కువగా ఉంటుందని తెలుస్తోంది.

కృష్ణానదీ యాజమాన్య మండలిపై కేసు

విచారణ నుంచి వైదొలగిన జస్టిస్ సంజయ్‌కుమార్

ఈనాడు, దిల్లీ: కృష్ణా నదీ యాజమాన్య మండలి న్యాయ పరిధిపై కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన కేసు విచారణ నుంచి జస్టిస్ సంజయ్‌కుమార్ వైదొలగారు. కేంద్ర ప్రభుత్వం, కృష్ణా నదీ యాజమాన్య మండలి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలను ప్రతివాదులుగా చేరుస్తూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన ఈ కేసు విచారణ శుక్రవారం జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్‌ల ధర్మాసనం ముందుకు వచ్చింది. జస్టిస్ సంజయ్‌కుమార్ తప్పుకోవడంతో ఆయన సభ్యుడిగాలేని మరో ధర్మాసనానికి పిటిషన్‌ను బదిలీ చేసి, నవంబరు 4వ తేదీతో మొదలయ్యే వారంలో చేర్చాలని జస్టిస్ సంజీవ్‌ఖన్నా ఆదేశించారు. జస్టిస్ సంజయ్‌కుమార్ గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, తెలంగాణ హైకోర్టుల్లో న్యాయమూర్తిగా సేవలందించారు.

ఈ మలుపులో తలుపు తట్టేదెవరు?

ఇకనైనా యుద్ధం ఆగేనా?



యాహ్యా సిన్వర్ మరణంతో... గాజా యుద్ధం ఆగిపోతుందా? ఇజ్రాయెల్ శాంతిస్తుందా? హమాస్ తెల్లజెండా ఊపుతుందా? ఏడాదిదాటిన మారణహోమం ఇకనైనా చల్లారుతుందా...? ప్రపంచవ్యాప్తంగా అందరిలోనూ తలెత్తుతున్న ఆసక్తికర ప్రశ్నలు! వీటికి సమాధానం మూడింటిపై ఆధారపడి ఉంది.

1 హమాస్, ఇరాన్

ఈ యుద్ధంలో అత్యంత కీలకమైనవి హమాస్, ఇరాన్!

- ప్రస్తుతానికి గాజాలో హమాస్ భారీగా దెబ్బతింది. బలమైన నాయకత్వాన్ని కోల్పోయింది. పాలస్తీనీయులకూ భారీగా ఆస్తి, ప్రాణ నష్టం జరిగింది.
- పేరుకు హమాస్, హెజ్‌బొల్లాలు ముందున్నా... వెనకనుంచి వారికి అన్ని విధాలా సాయం చేసి నడుపుతున్నది ఇరానే!
- ఇజ్రాయెల్‌పై ఇటీవలే క్షిపణులతో దాడి చేసిన ఇరాన్... ప్రతిదాడులెలా ఉంటాయోనని రోజూ ఎదురుచూస్తూ ఉంది. మిగిలిన అరబ్‌దేశాల నుంచి ఇరాన్‌కు ఆశించిన మద్దతేమీ పెద్దగా లభించటం లేదు. పైగా హమాస్‌కు ఆయువుపట్టులాంటి సిన్వర్ కూడా మరణించటం ఊహించని దెబ్బ!
- ఈ నేపథ్యంలో హమాస్ కోలుకోవటానికి వీలుగా... తెల్లజెండా ఊపమంటుందా? లేక మొండితనంతో యుద్ధాన్ని కొనసాగించటానికే సై అంటుందా అనేది ఆసక్తికరం.
- హమాస్ కొత్త అధినేత ఎవరవుతారనేదీ కీలకమే. కొత్త నేత చర్చలకు మొగ్గు చూపుతారా? రావణకాష్ఠాన్ని ఇలాగే కొనసాగించదలచుకుంటారా అనేది... తదుపరి పరిణామాలను ప్రభావితం చేస్తుంది.
- హమాస్‌లోనే కాల్పుల విరమణ, బందీల విడుదలపై భిన్నాభిప్రాయాలున్నాయనే వాదనా ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో వెనక్కితగ్గటమే మేలని కొంతమంది... పోరాటం కొనసాగించాల్సిందేనని మరికొందరు భావిస్తున్నారంటున్నారు.



హమాస్ వద్ద 101 మంది ఇజ్రాయెలీలు ఇంకా బందీలుగా ఉన్నారు. వారి పరిస్థితి ఎలా ఉందో తెలియదు. యుద్ధం ముందుకు సాగుతుందా... ఆగిపోతుందా అనేది బందీల విషయంలో హమాస్ ఏం నిర్ణయం తీసుకుంటుందనే దానిపై ఆధారపడి ఉంది.

హమాస్ స్వాధీనంలో ఉన్న ఇజ్రాయెల్ బందీలకు ఏమైనా జరగరానిది జరిగితే... పశ్చిమాసియాలో పరిస్థితులు మరింత విషమించే ప్రమాదం ఉంది.

2 నెతన్యాహు...

- హమాస్ దాడికి ముందు స్వదేశంలో రాజకీయంగా ఇబ్బందుల్లో ఉన్న ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు... ఇప్పుడు యుద్ధం కారణంగా రోజురోజుకూ తన పరిస్థితిని బలపర్చుకుంటున్నారు.
- నిరుడు అక్టోబరు 7న హమాస్ అనూహ్య దాడితో ఆయనపై ఇజ్రాయిల్ ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమైంది. అనంతరం గాజాపై, లెబనాన్‌పై ఇజ్రాయెల్ సైన్యం విరుచుకుపడటం ద్వారా నాటి భద్రతా వైఫల్య ఆగ్రహాన్ని ప్రజల మనసుల నుంచి చెరిపేయటానికి నెతన్యాహు ప్రయత్నిస్తున్నారు.
- హమాస్, హెజ్‌బొల్లా కీలక నేతల్ని ఒకరితర్వాత ఒకరిని విజయవంతంగా హతమార్చటంతో మళ్లీ ఆయన ప్రాభవం దేశంలో పుంజుకుంటోంది.
- పైగా... రెండు అతివాద యూదు పార్టీల మద్దతుతో ఆయన పదవిలో కొనసాగుతున్నారు. హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందం చేసుకుంటే ఆ రెండు పార్టీలు మద్దతు ఉపసంహరించే అవకాశముంది.
- హమాస్‌ను పూర్తిగా రూపుమాపటమే తమ లక్ష్యమని ప్రతినపూని మరీ సాగుతున్నారు. అయితే అది అంత సులభం కాదని ఆయనకూ తెలుసు.
- సిన్వర్ మరణం నేపథ్యంలో ఇకనైనా యుద్ధం విరమించి... బందీలను విడిపించాలని వారి బంధువుల నుంచి డిమాండ్లు పెరుగుతున్నా... వాటిని ఇజ్రాయెల్ ప్రభుత్వం అంతగా పట్టించుకునే పరిస్థితి లేదు.

తనంతట తానుగా నెతన్యాహు యుద్ధాన్ని విరమించేందుకు ముందుకు వచ్చే అవకాశాలు తక్కువ. సిన్వర్ మరణించినా యుద్ధం కొనసాగుతుందని ఆయన తేల్చేశారు.



అమెరికా నుంచి ఒత్తిడి పెరిగి, ఇతర అరబ్ దేశాలూ మధ్యవర్తిత్వానికి ముందుకు వస్తే ఇజ్రాయెల్ వైఖరిలో ఏమైనా మార్పు రావొచ్చు!

3 అమెరికా...

తమ అధ్యక్ష ఎన్నికల లోపు యుద్ధం ఆగిపోతే బాగుండని... అమెరికా ప్రభుత్వం కోరుకుంటోంది.

- గాజాలో పరిస్థితుల కారణంగా... ఎన్నికల్లో తమకు దెబ్బ తగిలే అవకాశం ఉందనే ఆందోళన డెమొక్రాట్లలో వ్యక్తమవుతోంది. ఇజ్రాయెల్‌కు బైడెన్ ప్రభుత్వం ఆయుధసాయం చేయటంపై అక్కడి ముస్లిం, లిబరల్ ఓటర్లలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కొన్ని స్వింగ్ రాష్ట్రాల్లో వారి ఓట్లు కీలకం కాబోతున్నాయి.

కాల్పుల విరమణకు అంగీకరించినా... హమాస్, ఇజ్రాయెల్ శాంతిమంత్రం పఠిస్తాయని ఎవరూ భావించటం లేదు. సమస్య పూర్తిగా సమసిపోతుందనీ అనుకోవటం లేదు. కానీ, సిన్వర్ మరణం రూపంలో పశ్చిమాసియా సమస్య ఓ కీలక మలుపులో నిల్చుంది. మరి ఈ అవకాశాన్ని ఎవరెలా ఉపయోగించుకుంటారేది చూడాలి.

- యుద్ధం ఆగితే వారు మనసు మార్చుకునే అవకాశం ఉంటుందనేది డెమొక్రాట్ల అంచనా.
- అందుకే... సిన్వర్ మరణించగానే... అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్ యుద్ధం ముగిసేందుకు ఇది మంచి తరుణం అని వ్యాఖ్యానించటం గమనార్హం. బైడెన్ సైతం కాల్పుల విరమణకు అంగీకరించేలా నెతన్యాహుపై ఒత్తిడి పెంచుతున్నట్లు సమాచారం.
- ఇతర అరబ్‌దేశాల సాయంతో అటు హమాస్‌ను చర్చలకు రప్పించి... నెతన్యాహును ఒప్పించి యుద్ధానికి బ్రేక్ వేయాలన్నది బైడెన్ సర్కారు ఆలోచన.



\- ఈనాడు ప్రత్యేక విభాగం

ఇందిరమ్మ గృహాలకు కేంద్రం సహాయం చేయాలి: పొంగులేటి

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ గృహాల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ పథకంలో ఇళ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహాయాన్ని అందించాలని కోరారు. శుక్రవారం కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధిశాఖ సంయుక్త కార్యదర్శి కులదీప్ నారాయణ్‌తో సచివాలయంలో మంత్రి సమావేశమయ్యారు. గత ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణాలను పట్టించుకోలేదన్నారు. వారందరికీ ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యాన్ని గుర్తించి అవసరం మేరకు గృహాలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గృహనిర్మాణశాఖ కార్యదర్శి జ్యోతిబుద్ధ ప్రకాశ్, ప్రత్యేక కార్యదర్శి గౌతమ్ పాల్గొన్నారు.



ఆరు గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టు (అమ్రాబాద్), న్యూస్‌టుడే: శ్రీశైలం నుంచి 89,678 క్యూసెక్కుల వరదనీరు సాగర్ జలాశయానికి వస్తుండడంతో ఎన్నెస్పీ అధికారులు శుక్రవారం ఆరు గేట్లను ఐదు అడుగుల మేరకు ఎత్తి 48,540 క్యూసెక్కులను దిగువకు విడుదల చేశారు. ఇది కాకుండా కుడికాల్వ ద్వారా 3,371 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 6,173, ప్రధాన విద్యుత్కేంద్రం ద్వారా 29,394, ఎస్ఎల్బీసీ ద్వారా 1,800, వరదకాల్వ ద్వారా 400 క్యూసెక్కులు కలిపి 89,678 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుత జలాశయ నీటిమట్టం 589.90 అడుగుల మేర నీరు ఉంది.

శ్రీశైలం నుంచి ఒక గేటు ద్వారా నీటి విడుదల

ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో శ్రీశైలం జలాశయానికి వరద ప్రారంభమైంది. శుక్రవారం ప్రాజెక్టులో నీటి మట్టం పూర్తి స్థాయికి చేరడం. . ఎగువన ఉన్న జూరాల, సుంకేశుల, హంద్రీ జలాశయాల నుంచి వరద కొనసాగుతుండటంతో ప్రాజెక్టు ఒక క్రస్ట్ గేటును 10 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 83,547 క్యూసెక్కులు, సుంకేశుల నుంచి 42,420 క్యూసెక్కులు, హంద్రీ నుంచి 250 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. జలాశయంలో నీటి నిల్వ 213.4011 టీఎంసీలుగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

మంత్రి ఉత్తమ్ ఫేస్‌బుక్ పేజీని అనుసరించేవారు 10 లక్షల మంది

ఈనాడు, హైదరాబాద్: నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారిక ఫేస్‌బుక్ పేజీని అనుసరించే వారి (ఫాలోవర్స్) సంఖ్య పది లక్షలకు (మిలియన్) చేరింది. ఈ విషయాన్ని మంత్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా, పీసీసీ అధ్యక్షుడిగా, మిగ్ 21, 23 యుద్ధ విమానాల పైలట్‌గా, రాష్ట్రపతికి కంప్ట్రోలర్‌గా పనిచేసిన తనను పెద్ద ఎత్తున అభిమానిస్తున్న స్నేహితులు, కార్యకర్తలకు ఈ సందర్భంగా మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

పత్తి కొనుగోళ్లు చేపట్టాలి

తెలంగాణ రైతు సంఘం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో పత్తి పంట కొనుగోలుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కొనుగోలు కేంద్రాలను వెంటనే తెరవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్, సాగర్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ వానాకాలంలో రైతులు పండించిన పత్తి పంట చేతికొచ్చినా.. అమ్మకానికి ఇంకా సీసీఐ కొనుగోలు కేంద్రాలు తెరవలేదని, దాంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు తక్కువ రేటుకు అమ్ముతూ నష్టపోతున్నారని తెలిపారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం క్వింటాలుకు రూ.12,000 చెల్లించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం పత్తికి క్వింటాలుకు రూ. 475 బోనస్ కలిపి ఇవ్వాలన్నారు. పత్తికి 8 నుంచి 12 శాతం వరకు తేమవున్నా కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

మల్లన్నసాగర్‌పై హరీశ్‌రావుతో చర్చకు సిద్ధం

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

హైదరాబాద్, న్యూస్‌టుడే: మల్లన్నసాగర్, కాళేశ్వరం లింక్-2 భూనిర్వాసితుల సమస్యలపై హరీశ్‌రావుతో బహిరంగ చర్చకు తాను సిద్ధమని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చెప్పారు. చర్చకు కేసీఆర్‌ను హరీశ్‌రావు తీసుకువస్తే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తారన్నారు. గురువారం సీఎం చేసిన సవాల్‌పై హరీశ్‌రావు స్పందించిన తీరును లక్ష్మణ్‌కుమార్ ఖండించారు. ఆయన శుక్రవారం అసెంబ్లీలోని సీఎల్పీ మీడియా హాలులో మాట్లాడారు. భూనిర్వాసితులకు అన్యాయం జరగలేదని హరీశ్‌రావు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. మల్లన్నసాగర్ ముంపు గ్రామాల్లో కేసీఆర్, హరీశ్‌రావు చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావన్నారు. పరిహారం అడిగిన రైతులపైన, నాయకులపైన అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేశారని మండిపడ్డారు.

నవంబరు మొత్తం కాచిగూడ-నడికుడి రైళ్ల రద్దు

కాచిగూడ, న్యూస్‌టుడే: దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని గుంటూరు డివిజన్‌లో.. పట్టాల నిర్వహణ పనుల కారణంగా కాచిగూడ-నడికుడి(07791), నడికుడి-కాచిగూడ(07792) రైళ్లను నవంబరు 1 నుంచి 30 వరకు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ముఖ్య పౌర సంబంధాల అధికారి ఎ.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



చదువు పూర్తయినా.. నేర్చుకోవడం ఆపొద్దు

శరవేగంగా మారుతున్న ప్రస్తుత ప్రపంచంలో ఉన్నత చదువులు చదివినంత మాత్రాన సరిపోదు. నిరంతర విద్యార్థిగా ఉండటం అత్యంత కీలకం. కళాశాల చదువు పూర్తి చేసుకొని ఉద్యోగంలో చేరిన రోజు నుంచి ఎవరైతే నేర్చుకోవడం ఆపేస్తారో, వారు ఆ క్షణం నుంచే విద్య నేర్వని వారితో సమానంగా మారిపోతారు. జీవితంలో ఏ దశలోనూ నేర్చుకోవాలన్న కుతూహలాన్ని చంపుకోవద్దు.

\- అభ్యుదయ్ దాస్, ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్

నిరసనలు.. ర్యాలీలతో హోరెత్తిన అశోక్‌నగర్

అడ్డుకుని లాఠీలు ఝుళిపించిన పోలీసులు

గాంధీనగర్, ముషీరాబాద్, న్యూస్‌టుడే: గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల వాయిదా, జీవో 29ని రద్దు చేయాలని కోరుతూ.. ప్రిలిమ్స్ ఉత్తీర్ణులు సహా వారికి మద్దతుగా నిరుద్యోగ అభ్యర్థులు హైదరాబాద్‌లో మూడు రోజులుగా కొనసాగిస్తున్న నిరసనలు శుక్రవారం తారస్థాయికి చేరాయి. ఈ క్రమంలో అశోక్‌నగర్, గాంధీనగర్‌లోని వీధులన్నీ విద్యార్థులు, పోలీసులతో కిక్కిరిసిపోయాయి. తొలుత శుక్రవారం మధ్యాహ్నం ఇందిరాపార్కు వద్ద మెరుపు ధర్నా చేసేందుకు వెళ్తున్న అభ్యర్థులను గాంధీనగర్, అశోక్‌నగర్‌లలో భారీగా మోహరించిన పోలీసులు అడ్డుకున్నారు. వారి రాకను పసిగట్టిన విద్యార్థులు పలువీధుల గుండా ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు సైతం పరుగెత్తుకుంటూ అభ్యర్థులను చెదరగొట్టారు. ఈ క్రమంలో కొందరిపై లాఠీలనూ ఝుళిపించారు. దీంతో ఆందోళనకారులు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం అభ్యర్థులంతా ఎక్కడికక్కడ నిరసనలతో హోరెత్తించడంతో.. వారిని అదుపుచేయడం పోలీసులకు కష్టతరంగా మారింది. మధ్య మండలం డీసీపీ అక్షాన్ష్ యాదవ్, చిక్కడపల్లి ఏసీపీ రమేశ్‌కుమార్ సిబ్బందితో కలిసి లాఠీలు పట్టుకొని విద్యార్థులను చెదరగొట్టారు. కొందరు అభ్యర్థులు సమీపంలోని దుకాణాలు, బేకరీల్లోకి, చాయ్ దుకాణాలలోకి వెళ్లగా.. పోలీసులు కూడా వాటిల్లోకి ప్రవేశించి వారందరినీ బయటకులాక్కొచ్చి అదుపులోకి తీసుకుని నగరంలోని వివిధ ఠాణాలకు తరలించారు. అదేసమయంలో అశోక్‌నగర్ క్రాస్‌రోడ్డులో ధర్నాకు యత్నించిన అభ్యర్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

- శాంతియుతంగా నిరసన తెలుపుతున్న అభ్యర్థులపై లాఠీఛార్జికి వ్యతిరేకంగా గాంధీనగర్‌లోని ఎస్బీఐ, ఆంధ్రాకేఫ్ సమీపంలో, ఆర్టీసీ క్రాస్‌రోడ్డు ఇందిరాపార్కు రోడ్డులో నిరుద్యోగులు చేపట్టిన నిరసనకు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, నేతలు మద్దతు పలికారు. పోలీసులు వారిని కూడా అదుపులోకి తీసుకున్నారు.



ఆందోళనకారులపై లాఠీ ఝుళిపిస్తున్న పోలీసులు

కిషన్‌రెడ్డిని కలిసిన అభ్యర్థులు


ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి శుక్రవారం ఉదయం గాంధీనగర్‌కు వచ్చిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని గ్రూప్స్ అభ్యర్థులు కలిశారు. ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను వాయిదావేయడం, జీవో నం.29ను రద్దు చేసేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని అభ్యర్థించారు. వారి విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన ఆయన.. సంబంధిత డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అభ్యర్థులకు న్యాయం జరిగేలా తనవంతు కృషిచేస్తానని చెప్పారు.

గ్రూప్-1 పరీక్షల్లో జోక్యం చేసుకోలేం

- పరీక్ష రాశాక పిటిషన్‌లా?
- ఇప్పటికే రెండుసార్లు రద్దయ్యాయి ఇలా ఎన్నేళ్లు?
- సింగిల్ జడ్జి తీర్పు సబబే
- అప్పీలును కొట్టివేసిన హైకోర్టు

'2022 నాటి గ్రూప్-1 నోటిఫికేషన్ రద్దు చేస్తున్నట్లు ఫిబ్రవరిలో వెబ్‌నోట్ పెట్టినపుడు కోర్టును ఆశ్రయించకుండా ఆరు నెలలకు అదీ ప్రిలిమ్స్ పరీక్ష రాశాక కోర్టును ఎలా ఆశ్రయిస్తారు. నోటిఫికేషన్ జారీ చట్టవిరుద్ధమన్నప్పుడు పరీక్ష రాయక ముందు ఎందుకు కోర్టును ఆశ్రయించలేదు. ఇప్పటికే రెండుసార్లు రద్దయ్యాయి. ఎన్నేళ్లు ఇలా వివాదాలు కొనసాగించాలి. వీటిని అనుమతిస్తే కొత్త అభ్యంతరాలతో మరోసారి మరికొందరు కోర్టును ఆశ్రయిస్తారు. అభ్యర్థుల్లో నైరాశ్యం పెరిగిపోతోంది. ఆత్మహత్యా యత్నాలు జరుగుతున్నాయి. మొదటిసారి 5 లక్షల మంది హాజరైతే రెండుసార్లు రద్దయ్యాక ఆ సంఖ్య 3 లక్షలకు పడిపోయింది. ఇప్పుడు మళ్లీ వాయిదా అంటే కుదరదు. ప్రశ్నలకు సరైన సమాధానాలు నిపుణులు చెప్పాలిగానీ కోర్టులు కాదు."

\- హైకోర్టు



ఈనాడు, హైదరాబాద్: గ్రూప్-1 పరీక్షల నోటిఫికేషన్ జారీని, కీలో తప్పులున్నాయని, పరీక్షలను రద్దు చేయాలన్న అభ్యర్థనను తిరస్కరిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోవడానికి హైకోర్టు నిరాకరించింది. సింగిల్ జడ్జి తీర్పులో జోక్యం చేసుకోవడానికి తగిన కారణాలు లేవని తేల్చి చెప్పింది. ప్రిలిమినరీ పరీక్ష కీలో తప్పులున్నందున పరీక్షను రద్దు చేసి తాజాగా నిర్వహించేలా ఆదేశించాలన్న అభ్యర్థనను తిరస్కరిస్తూ సింగిల్ జడ్జి ఈనెల 15న ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ జి.దామోదర్‌రెడ్డి, మరికొందరు హైకోర్టులో అప్పీళ్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణలతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఫిబ్రవరిలో పాత నోటిఫికేషన్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించిందని, అప్పుడు కొత్త నోటిఫికేషన్‌పై అభ్యంతరం చెప్పని పిటిషనర్లు పరీక్షలు రాసిన తరువాత కోర్టును ఆశ్రయించడాన్ని తప్పుబట్టింది. అదీ ఫలితాలు విడుదల చేసిన తరువాత కోర్టుకు వచ్చారని, 8 మంది పిటిషనర్లలో ఇద్దరు మెయిన్స్‌కు అర్హత సాధించారని, కేవలం ఆరుగురు అభ్యంతరాలపై లక్షల మంది హాజరయ్యే పరీక్షలను నిలిపివేయలేమంది. 6,147 అభ్యంతరాలను నిపుణుల కమిటీ పరిశీలించిందని, కమిటీ ఆమోదించిన తరువాతే కమిషన్ తుది కీ విడుదల చేసిందని పేర్కొంది. మెయిన్స్‌కు అర్హత సాధించిన వారిలో 31,383 మంది అంటే దాదాపు 90 శాతం మంది హాల్‌టికెట్‌లు డౌన్‌లోడ్ చేసుకున్నారంది. మరో రెండు రోజుల్లో జరగనున్న పరీక్షకు అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారని, ఈ దశలో వాయిదా వేయలేమని తేల్చి చెప్పింది.

స్వతంత్ర కమిటీతో కీ రూపొందించేలా ఆదేశాలివ్వండి..

అంతకుముందు అభ్యర్థుల తరఫు సీనియర్ న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ హైకోర్టు తీర్పు ప్రకారం గత నోటిఫికేషన్ ఆధారంగానే పరీక్ష నిర్వహించాల్సి ఉండగా తాజా నోటిఫికేషన్ జారీ చేయడం సరికాదన్నారు. దీనివల్ల గతంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు అన్యాయం జరిగిందని, కొత్తగా ఏర్పడిన అదనపు ఖాళీలకు ప్రత్యేక నోటిఫికేషన్ జారీ చేసి ఉండాల్సిందని పేర్కొన్నారు. తాజా నోటిఫికేషన్‌తో అభ్యర్థుల సంఖ్య పెరిగిందన్నారు. కీలో తప్పులున్నాయని, వీటిపై స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేసి కీ రూపొందించేలా ఆదేశాలివ్వాలని కోరారు. ఎస్టీ రిజర్వేషన్లు 6 నుంచి 10 శాతానికి పెంచడంతో రిజర్వేషన్లు 62 శాతానికి చేరుకున్నాయన్నారు. పరీక్షను రద్దు చేసి తాజాగా నిర్వహించేలా ఆదేశించాలని కోరారు.

ప్రభుత్వం, కమిషన్ తరఫు న్యాయవాదులు వాదన వినిపిస్తూ అభ్యర్థులు లేవనెత్తిన అన్ని అభ్యంతరాలను నిపుణుల కమిటీ పరిశీలించిన తర్వాత రెండు ప్రశ్నలను తొలగించి తుది కీ విడుదల చేశామన్నారు. ఇరుపక్షాల వాదనలను విన్న ధర్మాసనం సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోవడానికి సరైన కారణాలను చూపడంలో అప్పీలుదారులు విఫలమయ్యారని పేర్కొంది. మెయిన్స్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కమిషన్‌కు సూచిస్తూ అప్పీళ్లను కొట్టివేసింది.

సుప్రీంకోర్టును ఆశ్రయించిన గ్రూప్-1 అభ్యర్థులు

ఈనాడు, దిల్లీ: దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించి 2022లో జారీ చేసిన జీవో 55కు సవరణ తీసుకొస్తూ ఫిబ్రవరిలో ప్రభుత్వం జారీచేసిన జీవో 29ని రద్దు చేయాలని కోరుతూ గ్రూప్-1 అభ్యర్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. శుక్రవారం ఈ కేసును వారి తరఫు న్యాయవాది ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ధర్మాసనం ముందు మెన్షన్ చేశారు. విషయానికున్న అత్యవసరత దృష్ట్యా వెంటనే విచారణ చేపట్టాలని కోరారు. ఇందుకు న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ స్పందిస్తూ సోమవారం విచారణ చేపడతామని చెప్పారు. ఆ తర్వాత అభ్యర్థులు విలేకర్లతో మాట్లాడుతూ హైడ్రా గురించి మాట్లాడుతున్న ముఖ్యమంత్రి జీవో 29వల్ల నష్టపోయే విద్యార్థులవైపు నిలబడాలని కోరారు.

చెదిరిన స్వప్నాలు చేయందిస్తున్న వదాన్యులు!

విద్యార్థి, యువత, చిరు వ్యాపారి, ఔత్సాహిక పారిశ్రామికవేత్త.. అందరి కలలను ఒక్క వరద కకావికలం చేసింది. కాలనీల్లో నీరు నిలిచిపోవడంతో అక్కడున్న పరిశ్రమలు, దుకాణాలు, ఇళ్లు అన్నీ నానిపోయాయి. జీవిత కాల కష్టం ఒక్క రోజులో తుడిచిపెట్టుకుపోవడంతో బాధితులంతా కట్టుబట్టలతో మిగిలారు. వీరిని ఆదుకునేందుకు ఎంతో మంది మనసున్న మారాజులు చేయందిస్తున్నారు. చేతనైన సాయంతో బాధితులకు భరోసా ఇస్తున్నారు.

తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితులకు అండగా నిలిచేందుకు రామోజీ గ్రూపు తరఫున రూ.5 కోట్లతో ఏర్పాటు చేసిన 'ఈనాడు సహాయనిధి'కి ఉదారంగా విరాళాలు ఇస్తున్న దాతలకు కృతజ్ఞతలు. ఈనాడు పిలుపు అందుకొని స్పందిస్తున్న సహృదయుల వివరాలు..

ఈనాడు సహాయనిధికి విరాళాలిచ్చిన దాతలు

వ్యక్తులు / సంస్థలు	సాయం (రూ.లలో)
విజయా బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సంఘం, హైదరాబాద్	50,000
గంజి హనుమంతు, హైదరాబాద్	50,000
గాయత్రీ షుగర్ లిమిటెడ్ అధికారులు, కామారెడ్డి	30,000
అడుసుమిల్లి రాజ్యలక్ష్మి (అడుసుమిల్లి జానకిరామ్ గారి సతీమణి), విశాఖపట్నం	25,000
డా.ఎస్.బలరామరాజు (ప్రమీల ఆసుపత్రి), తిరుపతి	20,000
కొల్లూరు శ్రీరామమూర్తి (కీ.శే.ఎన్.వీరభద్రరావు, కీ.శే.ఎన్.వి.ఎల్.కుమారి గార్ల జ్ఞాపకార్థం), రాజమహేంద్రవరం	10,000
టి.వేణుగోపాల్, రాజంపేట, అన్నమయ్య జిల్లా	9,000
కొల్లోజు కాళిదాస్ చారి, సికింద్రాబాద్	5,121
మంచుకొండ శివప్రసాద్, హైదరాబాద్	5,116
షేక్ సలీమ్, విజయవాడ	5,116
ఎ.జి.ఇందుమతి శ్రీధర్, కర్నూలు	5,011
కాజ వెంకటేశ్వరరావు, కాజ కృష్ణకుమారి, సికింద్రాబాద్	5,004
గొడవర్తి శ్రీనిజ, కపిలేశ్వరపురం, తూర్పుగోదావరి జిల్లా	5,000
గొడవర్తి నాగ సింధూజ, కపిలేశ్వరపురం, తూర్పుగోదావరి జిల్లా	5,000
డా.ఆకురాతి కోదండరామయ్య, విజయవాడ	5,000
కనగర్ల సత్యనారాయణ, సికింద్రాబాద్	5,000
కొత్తపల్లి నందిని, హైదరాబాద్	5,000
జి.ఎస్.డిజిటల్స్, విజయవాడ	5,000
మీసాల హెన్రీ పురుషోత్తం, గూడూరు, తిరుపతి జిల్లా	5,000

అండగా నిలుద్దాం.. ఆవేదన తీరుద్దాం!!

RAMOJI GROUP

దాతలకు ముఖ్య సూచన: మీరిచ్చే విరాళాలకు రసీదులు పొందేందుకు ఈ వివరాలు పంపవలసిందిగా మనవి. 1. దాత పేరు 2. పూర్తి చిరునామా 3. పాన్‌కార్డు నంబరు.
- ఈ వివరాలను 9154990933 నంబరుకు లేదా relieffund@eenadu.in ఈ మెయిల్ ఐడీకి పంపగలరు.

విరాళాలు పంపవలసిన ఎకౌంట్ వివరాలు


ఈనాడు రిలీఫ్ ఫండ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సైఫాబాద్ బ్రాంచి,
SB A/C No: 37060201006658
IFSC: UBIN0537063

ఈనాడు స్థిరాస్తి

నగర వ్యాప్తంగా ఇన్నర్ రింగ్‌రోడ్డు చుట్టూ కిలోమీటర్ల మేర చాలాకాలం కిందటే నివాసాలు వచ్చేశాయి. ఒక ప్రాంతంలో మాత్రం ఇప్పటికీ చాలా భూములు ఖాళీగా ఉన్నాయి. చుట్టూ నిర్మానుష్యంగా ఉంటుంది. ఇప్పుడు అదే ఆ ప్రాంతానికి సానుకూలంగా మారింది. ఇప్పుడిప్పుడే పెద్ద ఎత్తున గృహనిర్మాణ ప్రాజెక్టులు వస్తున్నాయి. పలు సంస్థల నిర్మాణాలు వేర్వేరు దశల్లో ఉన్నాయి. కొత్తగా విమానాశ్రయ మెట్రో మార్గాన్ని ప్రభుత్వం ఈ ప్రాంతం మీదుగా ఖరారు చేయడంతో అందరి దృష్టి ఆ మార్గంపై పడింది. గృహాలకు సరికొత్త మైక్రో మార్కెట్‌గా ఆరాంఘర్ నుంచి శంషాబాద్ మార్గం విస్తరిస్తోందని రియాల్టీ వర్గాలు అంటున్నాయి.

మెట్రోతో దక్షిణ రియాల్టీలో హుషారు!

బెంగళూరు జాతీయ రహదారి మార్గం.. చేరువలో అంతర్జాతీయ విమానాశ్రయం, ఓఆర్ఆర్ మీదుగా ఐటీ కారిడార్‌కు చేరుకునే వెసులుబాటు.. పీవీ ఎక్స్‌ప్రెస్‌వేతో నగరంలోకి వేగంగా చేరుకునే సౌలభ్యంతో పాటు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకునేందుకు వీలుగా శివరాంపల్లి, బుద్వేల్‌లో ఎంఎంటీఎస్ స్టేషన్.. సమీపంలోనే ఇన్నర్ రింగ్‌రోడ్డుతో రవాణాపరంగా చాలా సానుకూలతలు ఉన్నాయని నిర్మాణదారులు చెబుతున్నారు.



విస్తరిస్తున్న మౌలిక వసతులు

ఆరాంఘర్ నుంచి నగరానికి చేరుకోవాలంటే గతంలో ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఉండేవి. ఇప్పుడు ఆ మార్గంలో ఫ్లైఓవర్లు వచ్చాయి. జూపార్కు వద్ద ఫ్లైఓవర్ పురోగతిలో ఉంది. ఆరాంఘర్ నుంచి శంషాబాద్ వరకు ఫ్లైఓవర్లు పూర్తవడంతో రాకపోకలు సులభం అయ్యాయి. రాజేంద్రనగర్ వద్ద హైకోర్టు నూతన భవనాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పుడు మెట్రో రైలును కూడా ఆరాంఘర్, గగన్‌పహాడ్, సిద్ధాంతి, శంషాబాద్ మీదుగా విమానాశ్రయానికి ప్రతిపాదించారు. నగరంలో అతిపెద్ద మాల్ ఇక్కడ రాబోతుంది. అందులోనే మల్టీప్లెక్స్ ఉంటుంది. ఈ రకంగా మౌలిక వసతులతోపాటు సోషల్ ఇన్‌ఫ్రా ఒకదాని వెంట ఒకటి వస్తున్నాయి.

విద్యాపరంగా..: నివాసం ఉండాలంటే పిల్లల చదువు కోసం విద్యా సంస్థలు అందుబాటులో ఉండాలి. ఈ ప్రాంతానికి సమీపంలోనే పలు పేరున్న పాఠశాలలు, ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. వైద్యపరంగా కొంత లోటు ఉంది. పెద్దాసుపత్రుల కోసం నగరం వరకు రావాల్సి ఉంటుంది. నగరం విస్తరిస్తే ఆ చుట్టుపక్కల భవిష్యత్తులో ఆసుపత్రులు వచ్చే అవకాశాలు ఉంటాయి. కాటేదాన్ పరిశ్రమలతో కొంత ఘాటు వాసన వస్తున్నా. .జనావాసాలు విస్తరిస్తే అవి నగరం బయటకు తరలిపోతాయని రియల్టర్లు చెబుతున్నారు.

ఊపు వస్తుందని ఆశాభావం..

మెట్రోతో దక్షిణానికి ఊపు రావడం ఖాయం అని రియల్టర్లు చెబుతున్నారు. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో ఐటీ కారిడార్ ఉన్న పశ్చిమం ఆధిపత్యం అధికం. తర్వాత తూర్పులో ఇటీవల కార్యకలాపాలు పెరిగాయి. ఉత్తరం వైపు నిలకడగా సాగుతోంది. శంషాబాద్ ఉన్న దక్షిణం వైపే ఇప్పటివరకు గృహ నిర్మాణం పెద్దగా లేదు. పారిశ్రామిక ప్రాంతం, జీవో 111 ఆంక్షల వంటి కారణాలు ఉన్నాయి. మెట్రో రాకతో దక్షిణ ప్రాంతం రూపురేఖలు మారుతాయని. . ప్రజారవాణా అందుబాటులో వస్తే జనావాసాలు విస్తరిస్తాయని చెబుతున్నారు.

ప్రస్తుతమిలా..

జాతీయ రహదారికి చుట్టుపక్కల పెద్ద ఎత్తున కన్వెన్షన్ సెంటర్లు ఉన్నాయి. నగరవాసులు వేడుకలు చేసుకునేందుకు ఇక్కడి వరకు వస్తున్నారు. మరికొన్ని ఖాళీ భూములు, షెడ్లు ఉన్నాయి. వీటిలో ఒక్కొక్కటిగా బహుళ అంతస్తుల భవనాలు వస్తున్నాయి. కొన్ని ప్రాజెక్టులు పూర్తయి నివాసానికి ఇళ్లు సిద్ధంగా ఉన్నాయి. విమానాశ్రయంలో పనిచేసే ఉద్యోగులు, బేగంబజార్ వంటి ప్రాంతాల్లోని వ్యాపారులు, ఐటీ ఉద్యోగులు, మహబూబ్‌నగర్, రాయలసీమ వాసులు ఇళ్ల కొనుగోలుకు మొగ్గుచూపుతున్నారు.

మెట్రో పూర్తయ్యేనాటికి..

మెట్రో ప్రస్తుతం డీపీఆర్ మాత్రమే సిద్ధమైంది. పనుల పూర్తికి సమయం పడుతుంది. కేంద్ర సహకారం ఉంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి పూర్తిచేసే అవకాశాలు ఉన్నాయి. ఈ ప్రక్రియ ఒక్కోదశకు చేరుకున్న కొద్దీ ఆ ప్రాంతాల్లో స్థిరాస్తి కార్యకలాపాలు పెరిగే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ధరలు అందుబాటులో ఉన్నాయని చెబుతున్నారు. బడ్జెట్‌ను బట్టి నిర్ణయం తీసుకోవచ్చు.



ఈనాడు, హైదరాబాద్

కొత్త ప్రాజెక్టులపై మిశ్రమ స్పందన

ఈనాడు, హైదరాబాద్

నగర రియాల్టీలో మిశ్రమ స్పందన కనిపిస్తోంది. జులై నుంచి సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ఇళ్ల విక్రయాలు పెరగ్గా..కొత్త ప్రాజెక్టుల ప్రారంభాలు తగ్గాయి. రెండింటిలోనూ హెచ్చుతగ్గులు స్వల్పంగా ఉన్నాయి. కార్యాలయాల నిర్మాణాల పూర్తి, లీజింగ్‌లో ప్రతికూల వృద్ధి కనిపించింది.



మూడు నెలల్లో ఇలా..

నగరంలో మూడు నెలల వ్యవధిలో 10,902 యూనిట్లకు సంబంధించిన కొత్త ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయి. గత ఏడాది ఇదే సమయంలో 11,034 యూనిట్లు మొదలుపెట్టారు. అప్పటితో పోలిస్తే కిందటి త్రైమాసికంలో ఒక శాతం తగ్గుదల ఉందని నైట్ ఫ్రాంక్ ఇండియా తాజా నివేదికలో వెల్లడించింది.

- పుణె, ముంబయి, చెన్నై, బెంగళూరు నగరాల్లో సానుకూల వృద్ధి నమోదు కాగా. .దిల్లీ, కోల్‌కతా, అహ్మదాబాద్, హైదరాబాద్‌లో ప్రతికూల వృద్ధి నమోదైంది.

విక్రయాలు పెరిగాయి..

గత ఏడాది మూడో త్రైమాసికంలో హైదరాబాద్‌లో 8,325 ఇళ్ల విక్రయాలు జరగ్గా.. ఈసారి 9,114 యూనిట్లను విక్రయించారు. పెరుగుదల 9 శాతం నమోదైంది.

- రూ.50 లక్షలలోపు ధరల శ్రేణిలోని ఇళ్లు 482 మాత్రమే ఉన్నాయి. అంతకు క్రితం ఏడాదితో పోలిస్తే 36 శాతం తగ్గాయి.
- రూ.50 లక్షల నుంచి రూ.కోటి ధరలు పలికే ఇళ్లు 2,857 విక్రయించారు. ఇందులోనూ 12 శాతం తగ్గింది.
- రూ.కోటిపైన ధరల ఇళ్లలో 33 శాతం పెరుగుదల నమోదైంది. 5,775 ఇళ్ల విక్రయాలు జరిగాయి.
- దిల్లీ మినహా మిగిలిన అన్ని నగరాల్లోనూ విక్రయాల్లో సానుకూల వృద్ధి నమోదైంది. కోల్‌కతాలో 14 శాతం, బెంగళూరు, అహ్మదాబాద్‌లో 11 శాతం వృద్ధి కనిపించింది.

కార్యాలయాల్లో..

- హైదరాబాద్ కార్యాలయాల్లో 2.2 మిలియన్ చదరపు అడుగుల మేర లీజింగ్‌లు కుదిరాయి. గత ఏడాదితో పోలిస్తే 26 శాతం తగ్గింది. 2023లో ఇదే సమయంలో 2.9 మి.చ.అ.లీజింగ్ ఒప్పందాలు జరిగాయి.
- గ్లోబల్ క్యాపబుల్ సెంటర్స్(జీసీసీ) ఒక్క త్రైమాసికంలోనే 10లక్షల చదరపు అడుగుల విస్తీర్ణాన్ని లీజింగ్‌కు తీసుకున్నాయి. మొత్తం విస్తీర్ణంలో ఇది 46శాతం కావడం విశేషం.
- పూర్తయిన కార్యాలయాల నిర్మాణాల విస్తీర్ణం 4.2 మి.చ.అ.గా ఉంది. కిందటి ఏడాది 5.3 మి.చ.అ.గా నమోదైంది. ఇక్కడ 21 శాతం తగ్గింది.
- ఇక్కడ చ.అ. సగటు అద్దె నెలకు రూ.69గా కిందటి త్రైమాసికంలో నమోదుకాగా.. ఏడాది క్రితంతో పోలిస్తే 6శాతం పెరుగుదల నమోదైంది.

ఈనాడు స్థిరాస్తి CLASSIFIEDS

REAL ESTATE

రియల్ ఎస్టేట్ చరిత్రలో మొదటిసారి శ్రీశైలం హైవే కడ్తాల్ దగ్గర DTCP వెంచర్ నందు ప్లాటు కొన్న వారికి హోండా యాక్టివా, 1 కేజీ వెండి, ఐ ఫోన్ 16, 25 గ్రా. బంగారం, డైరెక్ట్ కంపెని. నో ఏజెంట్స్. రెడ్డిస్ రియాల్టీ ✆ 9866481112.

FLAT FOR SALE

BHEL

Nallagandla- New 3BHK Luxurious Flats for Sale. E/W Facing. Ready to move. GHMC Approved, on 100 Ft Rd. Opp Ramky One Galaxia, Navodaya Clny. ✆ 9848960444, 9848944044.

Ameenpur- New 2&3 BHK Luxurious Flats for Sale. Ready to move. HMDA Approved Nr. Saibaba Temple. ✆ 9848944044, 9848960444.

CHIKKADPALLY

DD Colony, Nallakunta, Shivam Road New 3BHK 1640 sft North East Facing Flat For Sale @ Prime Location. Ph: 9393339594

DILSUKHNAGAR

1800 Sft Nagole Gated E/F 3BHK Club House Swimming Pool Metro 2KM Lifts Ready to move. 1 Cr. ✆ 6281647418, 8309667507.

Luxurious 3BHK Flat for Sale. 2200 Sft, Ready to move. Each Floor One Flat near Astalaxmi Temple, Telephone Colony, Road No.2, RK Puram. Phone: 9246733551, 9063829533.

Malakpet near metro & Yashoda hospital New 3BHK delux flats W/F 1500 & W/F 1570 sft sale. Ph: 9849497306/ 7780325546

ECIL

Rampally 2BHK Flat 1042 Sft, 40L, 3BHK Flat 1434 Sft, 55L & G+1 @ 1.25 Cr. House in HMDA Approved Layout for Sale. Ph: 9989143747.

Ready to Occupy New 3BHK 1575 Sq.Ft Super Deluxe Flats for sale at Mallapur, Nacharam. Rathi Constructions Mahesh: 9848577552, 6302946914

Fantastic Festive Offer. Drive Home Maruthi Fronx with Purchase of Dream Home. 3 & 4BHK Flats Gated Community, Mallapur. Ph: 8897323735.

GACHIBOWLI

Gachibowli New 2BHK Luxurious Flats for Sale. E/W Facing GHMC Approved, BHEL to Gachibowli 100 Ft Rd. Gulmohar Park Clny. ✆ 9848944044, 9848960444.

Narsingi 5 Mins to ORR 3BHK Luxury Apts E/W/F GHMC Approved 100% Vaastu 1425 Sft, 60 Sq.Yds UDS, Loan Avl. ✆ 9441231450, 9618578269.

Nallagandla, Aparna Cyber Commune, 3BHK, 1660 Sft, Flat for Sale. D Block # 102, with all modern Amenities. Contact: 9849297148.

HAYATHNAGAR

Very Nr. to Bus Stop & MRO Office, Hayathnagar Nr. Vijayawada Highway. Ready to move. Sup. Luxurious 3BHK Flats, 2 Side 30' Rd, E&W. Ph: 9849801477, 9247326 642.

GHMC Approved, 2BHK, E/W Face, 1150 Sft, Beside Zee School, Shirdi Nagar, Hayat nagar, Ready to move. Ph: 9100884493, 9100884492.

Bumper Festival Offer. 2/3 BHK HMDA, RERA Flats in Kuntloor. Possession in 6 Months. Ph: 9440632043.

HITECH CITY

Gated Community Auro Realty @ Hitech City Ready to move. 3BHK Flat 1456 Sft, W/F 10th Floor 2 Car Parkings. 9989582361.

Kondapur 3BHK Flat, E/F @ SMR Vinay Iconia Stanley A. 2440 Sft, 9th Flr, Gated Comm, 2Car Parking @2.55 Crore. Ph: 9246349123

JEEDIMETLA

Jeedimetla, TSIIC Clny, Shapur Rd, New 2&3 BHK, 1000- 1550 Sft @ 5500 Per Sft. Gym, Party Area, 100% Vasthu. Ph: 9989225665, 8790738313.

KHAIRATABAD

Khairatabad Anand Nagar Colony 2BHK 3rd Flr, 1000 Sft, 45 Sq.Yds Land Share, Prime Area. 100% Vastu, Car Prkg ✆ 8790439564, 9701255022.

Somajiguda, Eenadu backside, Hilltop Cly, 3B/R Flat, 2800 Sft, West Pent House, Reliance Estate, 6B @ Reasonable Price. Ph: 9848444556.

KUKATPALLY

KPHB Main Road Facing, Comm. 2BHK Flat, 620 Sft, W/F, Beside South India & Nexa Show room @ 55 Lakhs. Genuine Buyers. Ph: 9849075032.

Individual Floor 3-BHK Apartment (1900, 2200 & 2275 Sft E/W/N Facing) Flats for Sale in KPHB. Raja- 9966744544.

FLAT FOR SALE
- 2BHK, 936 Sq.ft,
- 43.5 sq.yards UDS,
- Car Parking, North Face
- Flat No: 302,
- Simhadri Tower's At Madhavi Nagar, KPHB
- Two sides 30' Roads

Ph: 90141 35437
Timings: 10Am to 7:00p.m.

MALKAJGIRI

Flats for Sale at Dheen Dayal Nagar near D-Mart, Malkajgiri. 2BHK 1015 Sft & 3BHK 1400 Sft. Ready to occupy. Ph: 9394758785, 9246205115.

MEDCHAL

Fantastic Festive Offer. Drive Home Maruthi Alto with Purchase of Dream Home. 2BHK Flats Sale. Genome Valley Nr. Shamirpet. Semi Gated Community. ✆ 8247528242.

MEHDIPATNAM

Attapur: Auckland Residency Apartment, PVNR Pillar No-172, East Facing, Semi Furnished 2 BHK (1161 S.Ft.) Flat. 100% as per Vastu, Ready to Occupy, 24 Hours Water, DG Power Backup: ✆ 72078 99854/ 98855 88304.

MIYAPUR

Miyapur- 2&3 BHK Luxurious Flats Ready to move. HMDA Approved, Pride Park, Sai Anurag Colony ✆ 9848944044, 9848960444.

NIZAMPET

Pragathi Nagar- New 2BHK & 3BHK Luxurious Flats HMDA Approved, Semi Gated Community, Ready to move. NRI Cly ✆ 9848944044, 9848960444.

PATANCHERU

Best deal on 2BHK and 3BHK at Patancheru 70 Flats semi gated community. Handover by Aug 2025. Loan facility available. 50 Lacs onwards. Contact: 9985333366, 9704206860

Patancheru, Muttangi: Ready to Occupy, DLX 2 BHK Flats, Gated Comm, HMDA, RERA. Walkable to High-way, Resi Area, 80% Loan ✆ 94937 87007.

SHAMSHABAD

2 & 3 BHK Flats, 1250 Sft (40 Lac to 45 Laks) only ORR Exit No: 15, Peddagolkonda to Nagaram Main road 2 Min. ✆ 6309760959.

UPPAL

2BHK, 1150 Sft, HMDA/ RERA Approved. 100% Vastu, Brick work in progress @ Pillar # 93, KLM Mall lane, Shankar Nagar ✆ 9866999942, 9866308389.

Phone: 8247593929, Chilakamarthy Homes, near Stadium Metro Stn, 3 BHK, New, 1350 sft, East, 60' road, Gated, HMDA, 85 L.

Uppal 1 BHK at Sri Nivas Heights, a gated community at Rs 29 Lacs. Interested Pl contact Ravi 9849889988

New 2BHK Deluxe Flats 1157 Sft, East Face @ 59 Lakhs only. Ready to occupy at Uppal Chilkanagar, Opp: HP Petrol Pump line. ✆ 9642630888.

BANJARAHILLS

Spacious 3BHK, Newly Renovated 2000 Sq.Ft Flat, Rd 12 Banjara Hills. Wood work, Marble Flooring, Parking. Rs. 1.3 Cr (Neg). Call: 9908136075

3BHK 6 Flats G+2 Vijay Villa, Road No.12, Banjara Hills, Plot No.67, 600 Sq.Yards North Facing 6 Servant Quarters, 12 Car Parking's for Sale. Ph: 9902916432.

Masabtank 3BHK 1500 Sft UDS 61 Sq.Yds, 4th Floor Fully Furnished for NRI/ Corp. People for Sale. ✆ 9515328425, WA: +14378821771.

KOMPALLY

Suchitra Godavari Home 1810 Sft 3 BHK 10th Flr East corner flat BEAMS & Columns @ 95L, Inc. of All Amenities ✆ 9854251234, 7095122233.

GENERAL

2 & 3 BHK Super Luxury Flats @ LB Nagar near Janson School Backside of Skoda Show Room C+S+5 Flrs 6309887667/ 9948031713.

HOUSE FOR SALE

DILSUKHNAGAR

Indp. House, G+1, Duplex, 2nd Floor, 2BHK, 144 Sq.Yds, 2700 Sft, Near to Metro Chaitanyapuri, Dilsukh Nagar. Ph: 9010110888.

2 Adjacent Indp. Houses Separately Each 250 Sq.Yds Road No.5 Sharadanagar, P&T Colony, Dilshuknagar. ✆ 9849154427/ 9848457459.

Indp House (old) G+1 218 Sq.Yds S/F Sarada Nagar near Ravi Residency, V.V. Nagar, Dilsukhnagar ₹ 2.20 Cr. (Neg) Cont: 9989990523.

ECIL

West Face Indp. House 158 S/Y, 1100 Sft, Gated Comm. Eden Gardens, Ahmedguda (Bandlaguda) 6 Yrs old @ 66 Lacs ✆ 9000777159, 8688801198.

GACHIBOWLI

Villa for sale Narsingi Manchirevula 259 sqyd 3800 sft w/F 5 bed rooms. Contact: 9966619036

GHATKESAR

Affordable 2BHK Villas. Ready to move! Rampally, near Ghatkesar. Swimming Pool. Club House, Modern Amenities. Last few Villas. Contact Ph: 9502429292.

HAYATHNAGAR

Spacious, Indep Duplex House, G+2 Floors 244 Sq.Yds. W/F, in a Prime Locality of Phase IV, Vanasthalipuram (No Agents Pls) 9100997834.

KUKATPALLY

100 Sq.Yds. 4 Floors Building for Sale. Nr. BJP Office, Ramalayam. Good Rental Value. No Loan facility. Only cash parties ✆ 9849356645.

బాలానగర్ వినాయక నగర్ రోడ్ నెం. 9 నందు 210 చ|| గజముల G+2 Indp ఇళ్ల అమ్మకమునకు కలదు. సంప్రదించండి. ✆ 9849562616.

MALKAJGIRI

Yapral 2BHK Indp. House N/F 143 Sq.Yds. 1000 Sq.Yd. Kapra Duplex Villa 100 Sq.Yds, E/F, 1750 Sq.Ft. for Sale. Ph: 9160622266.

NIZAMPET

Nizampet, Indp. House, 167 Sq.Yds, 4800 Sft, W/F, G+3, Furnished, Getting Rent: 72 K PM, Brand New & Commercial Plot Dundigal 755 Sq.Yds. E/F, 100 Ft Road near ORR Exit:5 ✆ 9866567335.

SECUNDERABAD

Military Dairy Farm Road, Near St.Andrew's School, Duplex House 4 B/R , 133 Sq.Yds. E/F, 2300 Sft, House for Sale. Ph: 9848475723.

UPPAL

Uppal Balaji Temple Near 140 yds G+2 Brand new Duplex Villa Furnished 2 Car Parkings. @ 1.40 Cr. ✆ 9246368475, 9885456650.

Uppal Sai baba Cly 200 Sq.yds, 3000 Sft Built up G+1 (36x50) fully Furnished 4 BHK 5 Bath rooms 24 hrs water. Price 2.7 Cr (nego) ✆ 9959153318

New G+2 House 6000 Sft, 1st Floor 3BHK Fully Furnished with Modular Kitchen, 2nd Floor 2BHK, 2 Portions & Ground Floor 1BHK, 2 Portions at P.S. Colony, Ramanthapur. Rent: 80,000/-. ✆ 9848125630.

Uppal Depot Nr Warangal H/W, Bandi Garden, Indp House, 110 sq.yd, E/F, G+2, 3000 sft. Rent 30k, Rate: 1.05 Cr. Ph: 8639141684

SHANKARPALLI

Fully furnished 400 Sqyards, with 4600 sft. Villa for sale in La Paloma Villa community at Mokila. Ph: 7207241777.

GENERAL

Dassara offer- HMDA Gated Community Villas @ Gourelly, Near Nagole- (Oct, 2026) Contact- 9110807341

పెద్ద అంబర్‌పేట హైవే దగ్గరలో మైత్రి గ్రూప్ వారి కమ్యూనిటీలో MIVAN టెక్నాలజీ కన్‌స్ట్రక్షన్, 4 BHK ప్రీమియం లగ్జరీ డూప్లెక్స్ 516 విల్లాస్ ఫర్ సేల్, 4.5 ఎకరాలు లగ్జరీ పార్క్, లక్ష SFT లగ్జరీ ప్రీమియం క్లబ్ హౌస్. HMDA & RERA అప్రూవ్డ్. Ph: 96666 85222.

మహేశ్వరం ఎలక్ట్రానిక్ సెజ్ పక్కనే HMDA & RERA అప్రూవ్డ్ మైత్రి గ్రూప్ వారి కమ్యూనిటీలో 2BHK & డూప్లెక్స్ విల్లాస్ ఫర్ సేల్, రెడీ టు మూవ్. Ph: 96666 85222.

GOLDEN COUNTY ANNEXE
276 LUXURY VILLAS
at Rampally, near Infosys Pocharam, Hyd



with Clubhouse & Amenities
Price ₹ 50,000* per sq.yd.
Price ₹ 2,800* per sft
3 BHK Price ₹ 1.63 crore* onwards
*Amenities, Registration & GST extra
Modi Builders
www.modibuilders.com
7677 120 120
9154 324 517
sales@modibuilders.com

LAND FOR SALE

BHEL

4000 Sq.Yrds Residential/ Commercial Land @ Beeramguda, near Praneeth Pranav Knightwoods Villas, Hyderabad. ✆ 6304700399.

MAHESHWARAM

Rs. 7600 గజం (రేటు తగ్గించబడును) 100 అడుగుల మెయిన్ రోడ్‌కి 3వ ప్లాటు. 240 గజాల ప్లాటు అమ్మబడును @ మహేశ్వరం. DTCP అప్రూవల్. ఫోన్: 9966521191.

MEDCHAL

LAND FOR SALE
3 Acres Land
adjoining to Project Saket Bhu Satva, Kandlakoya(V), Medchal
4500 sq.yards Land for sale
Suitable for Plotting / Villas & Apartments.
Contact 9701549945

SHAMSHABAD

పెద్దగోల్కొండ (శంషాబాద్) నుండి 27 KMs లో కేశంపేట్ (M) కొత్తపేట గ్రామంలో 6.3 ఎకరాల వ్యవసాయ భూమి అమ్మబడును. ✆ 9175919029, 9581941896.

బెంగళూరు హైవే షాబాద్ మండలం రంగారెడ్డి జిల్లా రుద్రారం గ్రామంలో 6 ఎకరాల భూమి అమ్మకానికి కలదు. Residential zone. Ph: 8121025389.

CHEVELLA

600, 800, 900 yards farm-lands for sale at chevella-vikarabad highway. Contact: 7893218886, 8125590714

GENERAL

12 Ac. Agri. Land Malkapur (V), Chilpur (M), Jangaon (Dist) 2 Side Rd. 2nd Bit from 100' Rd. 3 Bores with 3 Ph T/F. Red Soil, Clear Title Rs. 50L. P/Ac. Cont: Owner: 9440817603, 9440551106.

భూమి అమ్మకం
నల్గొండ,
కట్టంగూర్ - అమ్మిటీవారు దగ్గర
5 ఎకరాల భూమి అమ్మకానికి కలదు.
సిటీకి 100 కి.మీ.
హైవే నుంచి 2 కి.మీ.
భూమి పక్కనే ఉదయ సముద్రం కాలువ
ఎకరానికి 60 లక్షలు (బేరానికి అవకాశం)
సంప్రదించండి
9849259895

PLOT FOR SALE

ADIBATLA

Sagar H/W Yacharam Pharmacity DTCP Plots Mega Gated Venture Lowest Price ORR- RRR TCS Foxcon Bdl. Ph: 86861 44566.

Adibatla, Turkayamjal Sagar highway, Srisailam H/W facing HMDA & DTCP approved open Plots loans Avil. Ph: 9603444402

BALAPUR

Balapur 400 Feet RCI Road near Edify School HMDA Approved Plots for Sale. Bank Loan Available. Ph: 9849040000, 9849558822.

CHARMINAR

Prime Land for sale. 460 Sq.yd. Plot with Complete Tin Shed at Shamsheer gunj, Hyd. Ph: 9848912749, 11.00 AM to 7.00 PM only.

ECIL

కీసర బొమ్మలరామారం, HMDA లిమిట్స్ లో గే.క. ఫుల్ డెవలప్‌మెంట్స్, 4 లైన్స్ రోడ్ కు దగ్గరలో ప్లాట్స్ కలవు. Rs. 6000/-, sq.yd: Ph: 9951685471. 6281244462

GACHIBOWLI

Prime Property
2000 Yards for Sale
at Gopanpally beside Financial District & Gachibowli
LRS final approved
79813 92465
82973 24569

GHATKESAR

Pinewoods: Open Plots @ Aushapur near Ghatkesar! Last 8 Plots Left! Gated community with Excellent Amenities & Club house. Rates @ Rs. 13,000/- Sqyd. HMDA Approved. Call: 7677120120.

ఘట్‌కేసర్, బీబీనగర్ వద్ద గేటెడ్ టౌన్‌షిప్‌లో ఇళ్ల దగ్గర అన్ని పర్మిషన్స్‌తో చక్కని ప్లాట్స్ కలవు. గజం 8000/- నుండి (Own Plots) వివరాలకు ✆ 9030121310.

HAYATHNAGAR

Vijayawada Highway Facing Projects HMDA & DTCP RERA Villa Projects Highway Commercial Plots Avlble. Cont: 9989754992.

హయత్‌నగర్, పసుమాముల, పెద్దఅంబర్‌పేట, కోహెడ జనచైతన్య బాటసింగారం, శ్రీమిత్ర, గ్రీన్‌సిటీలో ప్లాట్లు అమ్మ/కొనబడును. Ph: 9553973999, 9666912111

గజము 2500/- విజయవాడ హైవే, నార్కట్‌పల్లి దగ్గర గేటెడ్ కమ్యూనిటీ వెంచర్ స్విమ్మింగ్ పూల్, కాటేజ్ 30 పండ్ల మొక్కలు, 30 ఎర్రచందనం మొక్కలు 1210 గ. (10 గుంటలు) ప్లాట్ అమ్మకం. Ph:9390261598.

రామోజీ ఫిలిం సిటీ దగ్గర L.B నగర్ METRO కి 27 km దూరంలో 80AC ఫామ్‌ల్యాండ్ శ్రీగంధం మొక్కలతో కాటేజ్ కట్టి ఇవ్వబడును. స్పాట్ reg. Ph: 9959415416

HITECH CITY

Madhapur- Kakatiyahills: 500, 1000 yds @ 2L, Kondapur: 600 yds, Gachibowli: 200, 400yds, Hotel: 400, 500Y @ 14 Cr, Rent: 9L. Ph: 9100587259

KUKATPALLY

342 Sq.Yds 1.8 Lakhs per Sq.Yd. Behind Traffic Police Station & Metro Cash 'n' Carry, Kukatpally. Brokers excuse. ✆ 9985427122, 9845333298.

MEDCHAL

200 Sq.Yds. North East Corner Plot in Prime Location, Tumkunta Village, Bank Colony, 200 M away from Highway @ 45K per Sq.Yd. ✆ 6309601850.

MOINABAD

APPA Junction @ Moinabad 20 minutes drive from Gachibowli Farm Lands 418, 565, 1000, 1210 Sq.Yds with 6 Years old Mango Trees. Ph: 9000053259

NIZAMPET

177 Sq.Yds. S+2 Floors Permission+ Bore. Ready to Construction. East Face, Srinivas Nagar, Pragathi Nagar, Bank Loan. ✆ 9666241688.

PATANCHERU

HMDA Villa Plot for Sale @ Patancheru admeasuring 200 Sq.yds.Ready for Construction. 2 Mins From ORR. Ph: 8897301021

SAGAR ROAD

స్పెషల్ ఆఫర్: రూ. 8999/- మాత్రమే. సాగర్ హైవే ఆనుకొని చింతపల్లిటౌన్ ఇండ్ల మధ్యలో DTCP అప్రూవ్డ్ లే-అవుట్ & 30 ఎక|| ఫామ్ ల్యాండ్- మల్లేపల్లి టౌన్‌కి 3 K.M. దూరంలో చ.గ. 4599/- మాత్రమే. శ్రీ సింధుప్రియ డెవలపర్స్. Ph: 9963141319

సాగర్ హైవే- యాచారం(మం) తక్కళ్ళపల్లి (గ్రా) ARC Puram వెంచర్లో 140 చ.గ. (28X45) S/F, ప్లాట్ అమ్మకం. ఫోన్: 9505927201, 8688403946.

SANGAREDDY

Diwali Offer: Greenville's Lorven County, Highway facing @ Mumbai highway DTCP & RERA Gated Project. @ Sadashivpet. 6304702495.

Sadasivapet. Mumbai Highway DTCP & RERA. full. Dev. Gated community. Bank Loan. Rs 9499/-, Spot Reg. Ph: 9014418373

SHADNAGAR

Plot 500 Sq.Yds Nandhigama Village & GP Kothur Mandal beside Anthireddyguda near Main Road, Shadnagar ✆ 9248883840.

Resale Plots Sales and Purchase, HMDA, DTCP @ Srisailam Hiway & Shadnager, 1/2 acre 30L. Ph: 7842449019 (MR infra)

Shadnagar Town Diwali Offer. Rs. 16,500/- Offer Rs. 14,500 Sq.yd. DTCP/ RERA, Bank Loan, 2km Bustand, Well Devp, G.Comty. Ph: 9177385251

దీపావళి ఆఫర్: షాద్‌నగర్ దగ్గర DTCP & RERA వెంచర్లో 150- చ:గ|| ప్లాట్ కొన్నవారికి 30 గ్రాముల బంగారం-ఫ్రీ, స్పాట్-రిజి, డైరెక్ట్-కం. Ph: 9949695027 నో-ఏజెంట్స్.

SRISAILAM HIGHWAY

Invest 22 Lakhs & Take 30 Lakhs worth 200 Yds. Villa Plot (developed LL Share) @ Kadthal- Srisailam H/W. Raja- 9966744544.

Kandukur 'X' Road, 1.5 KM Srisailam Highway Facing 1150 Sq.Yds West Facing Opp: Sub Station, Survey No. 580. ✆ 8331026248.

కందుకూరు టౌన్ (Fourth సిటీ)లో హైవే ప్రక్కన, ఇళ్ల మధ్య HMDA వెంచర్‌లో ప్రీమియం ప్లాట్లు, బ్యాంక్ లోన్‌తో కలవు. మరియు దగ్గరలో 65 ఎకరాల హై సెక్యూరిటీ ఫాం ల్యాండ్ ప్రాజెక్ట్‌లో 1, 1/2, 1/4 ఎకరా & 5 Guntas బిట్స్ రిసార్ట్ సౌ||తో గజం 8000/-. ✆ 9885552209.

TUKKUGUDA

334 sq.yds North East Plot for sale in HMDA approved Layout at Tukkuguda Junction. Rate 65k per Sq.Yd. Contact: 9059525336, 9652899143

YADAGIRIGUTTA

యాదగిరిగుట్ట, వంగపల్లిలో గేటెడ్ కమ్యూనిటీ యందు బ్యాంకు లోన్ సౌకర్యంతో ఓపెన్ ప్లాట్లు కలవు. రిసార్ట్స్, స్విమ్మింగ్‌పూల్, పార్క్ అన్ని వసతులతో. Ph: 8106340199

3.6 లక్షలకే 121 గజాల ప్లాట్ Fixed Price Near యాదగిరిగుట్ట, నెమలి విలేజ్, 24 నెలల EMI. మీ పెట్టుబడికి మంచి ఆదాయం. Ph: 9440515404

SHANKARPALLI

JB's Infra వారి అతితక్కువ ధరలో @ మోమిన్‌పేట. DTCP Appvd. ప్రీమియం లేఅవుట్ VKB Dt. Spl ఆఫర్- 7500/- P. Sq.Yd. 9010277299, 9032645065.

GENERAL

550 (NE), 416+ 416 (SE) Syd Corner Plots @ Kondapur near My Home Mangala. Less than Market Price. Ph: 8801000880.

RERA approved. Near Jedcherla 200 Sq.yds (2), 165 Sq.Yds (1). Bangalore Highway. Ph: 8885891334

Farm Plots @ 2250/- Per Yd. @ Near Balanagar, Bangalore highway, DTCP Norms, Fruit Plantation, Red Soil, Gtd Community. ✆ 9652860980.

VJA, రాజధాని అమరావతి, మంగళగిరి, గన్నవరం, బందరు రోడ్డు, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ., నున్న నూజివీడు రోడ్డు, కంచికచర్లలో DTCP & AP CRDA ప్లాట్స్ చ||గ|| 1,900/- నుండి 12,900/- సంప్ర: ✆ 93985 76997.

COMMERCIAL SPACE FOR SALE

Narsing to Kokapet 200 Feet Road Facing Commercial Space for Sale Please Contact: 7207897528.

Madhapur- Hitech City Prime Location, G+4 School Building, N/E Corner 6 Crores, Neg. Present Monthly Rent Rs. 3L. ✆ 9618496333, 9676797111.

Kokapet Grade-A Commercial Office Space for Sale. Rs. 85 Lakhs. High Rental Value. Contact: 7330730038.

1800 sft Real Estate office for sale with furniture @ B.N Reddy nagar, Sagar High way facing, Ready to occupy. 9848475375, 9989391957.

LEASE/ RENT

Pent House, 6BHK, 4BHK+ Home Theatre+ Terrace Garden at Madhapur. Suitable for Guest House, PG Hostels, Any Commercial Offices ✆ 9618496333, 9676797111.

LB.Nagar 'X' Roads towards Sagar Ring Road 200' Main Road & 30' Backside Road, G+4 Floors, 14000 Sft With Cellar, new Complete building, OC received & Ready to occupy suitable for Corporate Office, Hospitals, Institutions Restaurants & Hotel, etc,. Phone: 9391428899, 9059415299, 9849822085

Sagar Highway, Brahmanpally Main Road, 3000 Sft Shed with 25KV Transformer, Borewell For Lease/Rent. Ph: 9347014814

WANTED

గుంటూరు, కాజా, మంగళగిరి, నంబూరు, కొప్పురావూరు, వెనిగండ్ల, కంతేరు, ఆగతారపాడు, పెద్దకాకాని, గోరంట్ల, రాజధాని ప్రాంతాల్లో ప్లాట్లు అమ్మాలన్నా, కొనాలన్నా సంప్రః 9381457579.

PROPERTY FOR SALE

Kapil Properties Invest 48 Lakhs Earn Monthly Returns 48000/- up to 25 Months After that 27000/- ROI for 20 years Kapil Business Park (WTC) Krishna: 6300883718.

Gachibowli Hostel Buildings: 100Y @ 3.50 cr, 170Y @ 8cr, Rent: 5L, 200Y @ 8.2cr, Rent: 6L, 400Y @ 14cr, R:9L & 600Y @ 25cr, R:12L. Ph: 9100587259

BUILT TO SUIT
In Prime Location at Greater Hyderabad Municipal Corporation Region
SANATHNAGAR
HYDERABAD-500018
Free Hold ,Title Clear
Plot 3259 Sq Yard ;
Floor Plate:18084 Sq Ft Approx.
Construction Potential 90473 to 108460 Sq Ft Approx.
Depending upon Floor Rise.

OUTRIGHT SALE
Land Use:work Centre Use zone and affected by proposed 60 Ft wide road As per Master Plan

IDEAL FOR CORPORATE OFFICE BUILDING, IT, ITeS, DATA Centres, GCC, Co-working, Studios, Hotels,
School , College, Polytechnic College, Retail Shopping Centre, Universities and Specialized Education Institutions, Research and Developement Centre, Warehouses and Storage Godown, Hospital, Dispensary, Exhibition Centre etc.

Contact
For English - 9821020345
For Telugu-9989930921

FARM HOUSES

Farm House 1394 Sq.yards, East facing, G+1, Fully furnished, Ready to live, Surrounded by farm houses and villas, 4360 sft built up area with Mango, Guava, Coconut & Banana trees, Prime Location is for sale at Gangaram Village, Maheshwaram Mandal. ✆ 7330989555.

TO LET

Ashok Nagar near RTC 'X' Roads 2BHK Flat for Rent. 1st Flr 24 Hrs Water, Car Parking, Lift. Brahmins only. PM Rent 20K ✆ 8297714826.

COMMERCIAL

Kazipally Nr Mallampet (ORR EXIT) Cmrcl Space for Rent 24,000 Sft (G+3) Full/ Part suitable for Office, Shops, Schools Etc. ✆ 8143731350.

Vanastalipuram Opp: ICICI Bank, 1800 Sft Comm. Space for Shops, Banks, Offices & Any Comm. use. ✆ 9848046215, 7845152011.

Peddamberpet near Bharath Petrol Bunk. 2000 Sq.yards Comm. Space Hospitals, Restaurants, Malls ✆ 9848046215, 7845152011.

Office Space for Rent. Plug & Play 1400 Sft. 2nd Floor Sai Enclave Road No.12, Banjara Hills ✆ 9246156324, 9246156326.

వనస్థలిపురంలో రన్నింగ్ బాంక్వెట్ హాల్ (Banquet Hall) లీజుకు ఉంది. 7780112053/ 9390809594 కు కాల్ చేయండి

WANTED

SITE Urgent Requirement on Lease for MNC Company in RTC X Roads for 2000 to 4000 Sq. Yards Open Plot or Shed: Contact: 99890 10444.

దీపావళికి రంగులు వేయిస్తున్నారా?



ఇంట్లో ఉండేవారి ఆరోగ్యానికి గ్రీన్ పెయింట్స్ ఎంపిక మేలంటున్న నిపుణులు

ఈనాడు, హైదరాబాద్

పండగల వేళ ఇంటికి కొత్త రంగులతో హంగులు అద్దుతుంటారు. దీపావళి పండక్కి ఇది మరీ ఎక్కువ. ఇంటి బయట, లోపల, గదికో



రంగు చొప్పున ఇంద్రధనుస్సుగా మారుస్తుంటారు. ఈ రంగుల ఎంపికలో అస్థిర కర్బన సమ్మేళన(వీవోసీ) కాలుష్య ఉద్గారాలు తక్కువగా ఉన్నవి, అసలులేని గ్రీన్ పెయింట్స్ ఎంపికతో ఇంట్లో ఉండేవారికి మేలని ఐజీబీసీ నిపుణులు చెబుతున్నారు.

ఇల్లు కొత్తగా మెరవడం ముఖ్యమే అయినా ఇంట్లోని వాతావరణం ఆహ్లాదకరంగా, ఉత్సాహకరంగా ఉండటం అంతకంటే ముఖ్యం. ఘాటైన రంగుల వాసనలతో ఇంట్లోవారు అస్వస్థతకు గురయ్యే



అవకాశం ఉంటుంది. ఈ వాసనలు రోజుల తరబడి వారిని ఇబ్బందులు పెడుతుంటాయి. దీనికి కారణం వీవోసీనే. పెయింట్లు, వార్నిష్‌లు, స్నానపు గదులను శుభ్రపర్చే, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులు, బొద్దింకలు, పురుగుల నివారణకు ఉపయోగించే క్రిమి సంహారక మందులు, నిర్మాణ వస్తువులు, గృహోపకరణాలు, క్రాఫ్ట్ ఉత్పత్తులు, ప్రింటర్లు వీవోసీ ఉద్గారాలను విడుదల చేస్తుంటాయి. కొన్ని నేరుగా విడుదలైతే.. మరికొన్ని రసాయన ప్రతిచర్యల ద్వారా ఏర్పడతాయి. వీటి కారణంగా ఇంట్లో గాలి నాణ్యత తగ్గుతుంది. అవుట్‌డోర్ కంటే ఇండోర్ గాలిలో వీవోసీ పదిరెట్లు ఎక్కువగా ఉంటుందని అధ్యయనాలు చెబుతున్నాయి.



కొత్త ఇంట్లో అధికం..

నూతన భవనాల్లో వీవోసీ ఉద్గారాలు అధికంగా విడుదలవుతుంటాయి. నిర్మాణ సామగ్రి, ఫిట్టింగ్‌లు, గ్లూలు, పెయింట్ వంటివి ఇండోర్ గాలిలో బహిర్గతమవుతాయి. బహుళ వీవోసీ వాయువులను విడుదల చేస్తాయి. కాబట్టి మొదట కొన్నినెలలు ఎక్కువ వెంటిలేషన్ ఉండేలా ఇంట్లో తాజా గాలి వచ్చేలా చూస్తుంటారు.

- వీవోసీ ప్రభావం కాలాన్ని బట్టి మారుతుంది. వేసవిలో గది ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు ఎక్కువ వీవోసీ వాయువులు విడుదల అవుతాయి. కాబట్టి రంగుల ఎంపికలో జాగ్రత్త తీసుకోవాలని సూచిస్తున్నారు.

రంగులు వేసేటప్పుడు...

ఇంటికి వేసే రంగుల్లో ఉండే వీవోసీలు సూర్యరశ్మి, వాతావరణంలోని నైట్రోజన్ ఆక్సైడ్‌తో చర్య జరపడం వల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. రంగుల వాసన పడనివారు, చిన్నపిల్లలు, ఉబ్బసం ఉన్నవారు, రోగనిరోధకశక్తి తక్కువ ఉన్నవారు తరచూ జబ్బుల బారిన పడే ప్రమాదం ఉంది. వీవోసీ లేని, తక్కువ వెదజల్లే రంగులను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

ఎంపిక ఎలా..

- ఏ మేరకు వీవోసీ విడుదల చేస్తాయి అనే వివరాలు రంగుల డబ్బాలపై రాసి ఉంటాయి. కొనేటప్పుడు వీటిని పరిశీలించాలి.
- సులభంగా ఎంపికకు మరో మార్గం ఉంది. తక్కువ వీవోసీ విడుదల చేసే బ్రాండ్లను ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్(ఐజీబీసీ) గ్రీన్ పెయింట్స్‌ను ధ్రువీకరిస్తుంది. గ్రీన్ ప్రొ ముద్ర ఉంటే పర్యావరణ హితమైనవిగా గుర్తించవచ్చు.
- ఈ తరహా రంగుల ఎంపిక ద్వారా ఇంట్లోవారు తరచూ అనారోగ్యం బారినపడకుండా చూసుకోవచ్చు. గాలి నాణ్యత మెరుగ్గా ఉంటుంది.
- ఉత్పాదకత పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.

రంగులు వేయడానికి ముందు...

- రంగులు వేయించేటప్పుడు ముందస్తు సన్నద్ధత తప్పనిసరి. అప్పుడు ఎక్కువ కాలం మన్నికనిస్తుంది. దుమ్ము శుభ్రం చేసిన తర్వాతనే, పగుళ్లు పూడ్చిన తర్వాతనే రంగులు వేయించాలి.
- దీర్ఘకాలం మన్నే రంగుల ఎంపిక మేలు. ఖర్చు కొంత పెరిగినా ఎక్కువ రోజులు వస్తాయి కాబట్టి ఆర్థికంగా కలిసి వస్తుంది.
- కొన్నిసార్లు గోడలను శుభ్రంగా కడిగితే కొత్తగా రంగులు వేయాల్సిన అవసరం ఉండకపోవచ్చు. దీన్ని పరిశీలించాలి.
- రంగులు అవసరమైతేనే వేయించాలి. తక్కువ, అసలు వీవోసీ లేని రంగులను ఎంపిక చేసుకోవాలి.

ఖరీదైన ఇళ్ల క్రయవిక్రయాల్లో వృద్ధి

ఈనాడు, హైదరాబాద్

దేశంలో విలాసవంతమైన ఇళ్ల క్రయవిక్రయాల్లో వృద్ధి కొనసాగుతోంది. రూ.4 కోట్లు అంతకంటే ఎక్కువ విలువైన గృహాల కొనుగోళ్లు పెరిగాయి. గత ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు నెల వరకు విక్రయాలతో పోలిస్తే ఈ ఏడాది ఇదే సమయంలో దాదాపు 37.8 శాతం పెరుగుదల నమోదైంది. ఇళ్ల విక్రయాల సంఖ్య 9160 నుంచి 12,625 కు పెరిగిందని సీబీఆర్ఈ నివేదిక వెల్లడించింది.



మూడు నగరాల్లోనే అధికం..

విలాసవంతమైన ఇళ్ల కొనుగోళ్లలో దిల్లీ, ముంబయి, హైదరాబాద్ మూడు నగరాల వాటానే 90 శాతం ఉంది. అయితే గత ఏడాదితో పోలిస్తే హైదరాబాద్‌లో విక్రయాలు స్వల్పంగా తగ్గాయి. గత ఏడాది మూడు త్రైమాసికాల్లో కలిపి 1560 విలాసవంతమైన ఇళ్లను విక్రయిస్తే ఈ ఏడాది ఈ సంఖ్య 1540కి తగ్గింది. ● దిల్లీ రాజధాని పరిధిలో అత్యధికంగా 72 శాతం, ముంబయిలో 18 శాతం వృద్ధి నమోదైంది.

త్రైమాసికంలోనూ...

ఇదే పోకడ గడిచిన త్రైమాసికంలోనూ కన్పించింది. జులై నుంచి సెప్టెంబరు వరకు దేశవ్యాప్తంగా 4360 విలాసవంతమైన ఇళ్లు విక్రయించారు. ముంబయి, దిల్లీ రెండు నగరాల వాటానే 90 శాతం ఉంది.

- హైదరాబాద్‌లో గడిచిన త్రైమాసికంలో రూ.4 కోట్లు అంతకంటే ఎక్కువ విలువైన నివాసాలు 200 ఇళ్లు మాత్రమే విక్రయించగా.. గత ఏడాది ఇదే సమయంలో 630 యూనిట్లను విక్రయించారు.

అమ్ముడైన గృహాలు

నగరం	2024	2023
దిల్లీ-ఎన్‌సీఆర్	5855	3410
ముంబయి	3820	3250
హైదరాబాద్	1540	1560
పుణె	810	330
చెన్నై	185	130
కోల్‌కతా	380	240
బెంగళూరు	35	240


(జనవరి నుంచి సెప్టెంబరు వరకు)

ఇసుకపై సీనరేజి రద్దు

● అధిక లోడ్‌కు జరిమానాలు ఉండవు
● తెదేపా ప్రజా ప్రతినిధుల సమావేశంలో ఏపీ సీఎం చంద్రబాబు

"ఇసుక విషయంలో ఎవరూ తప్పు చేయొద్దు. ఎవరినీ ఉపేక్షించొద్దని అధికారులకు స్పష్టంగా చెప్పాను. తప్పు చేసి, ఆ తర్వాత చర్య తీసుకుంటే ఎవరూ బాధపడవద్దు. ఇసుకపై ప్రజలకు ఇచ్చిన హామీని అమలు చేయాల్సిందే. ఉచిత విధానం సక్రమంగా అమలు కాకపోతే అధికారుల్ని బాధ్యుల్ని చేస్తా. ఎవరో ఒకరిద్దరి వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తే సహించను".

- పార్టీ నేతలతో చంద్రబాబు



ఈనాడు, అమరావతి: ఉచిత ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేసేందుకు, లభ్యత పెంచేందుకు సీనరేజి రద్దు చేస్తున్నట్టు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ట్రాక్టర్లు, ఎడ్లబళ్లలో నదులు, వాగులు, వంకల నుంచి ఎవరైనా ఎంత ఇసుక కావాలంటే అంత తీసుకుని వెళ్లవచ్చని స్పష్టంచేశారు. సీనరేజి రద్దు వల్ల ప్రభుత్వానికి రూ. 200 కోట్ల నష్టం వస్తుందని.. కానీ ప్రజలకు ఉచితంగా ఇవ్వాలనే లక్ష్యం ముందు.. ఆ భారం చిన్నదేనని ఆయన పేర్కొన్నారు. పైగా ఇసుక లభ్యత పెరిగితే నిర్మాణరంగం వేగం పుంజుకుంటుందన్నారు. సీనరేజి వల్ల ప్రభుత్వానికి ఏర్పడే నష్టం నిర్మాణరంగ కార్యకలాపాలు పెరగడం వల్ల వచ్చే జీఎస్టీ రూపంలో భర్తీ అవుతుందని తెలిపారు. లారీల్లో 40 టన్నులకు మించి ఇసుక తీసుకెళుతున్నా అధిక లోడ్ పేరుతో జరిమానాలు విధించబోమని తెలిపారు. శుక్రవారం తెదేపా కేంద్ర కార్యాలయంలో జరిగిన పార్టీ ప్రజాప్రతినిధుల సమావేశంలో ఆయన పలు అంశాలపై స్పష్టత ఇచ్చారు. ఇసుక, మద్యం వ్యవహారాల్లో ఎవరూ తలదూర్చొద్దని ఆయన మరోసారి స్పష్టంచేశారు.

ఆరు నెలల్లోగా సహకార ఎన్నికలు

సహకార సంఘాలకు ఆరు నెలల్లోగా ఎన్నికలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. అప్పటి వరకు రాష్ట్ర స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు సహకార సంఘాలకు ముగ్గురు సభ్యులతో కమిటీలను నియమిస్తామన్నారు. సాగునీటి సంఘాల ఎన్నికల్నీ కూడా త్వరలోనే నిర్వహిస్తామని తెలిపారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అభ్యర్థుల్ని శనివారం ప్రకటిస్తామన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసే ప్రైవేటు పారిశ్రామిక పార్కులకు స్థానిక ఎమ్మెల్యే ఛైర్మన్‌గా ఉంటారని, పరిశ్రమల్ని తీసుకొచ్చే బాధ్యత వారు తీసుకోవాలని సీఎం సూచించారు.

రెండోసారి తప్పు చేస్తే చర్యలు తప్పవు

ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకుల పనితీరుపై ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహిస్తానని, వివిధ మార్గాల్లో సమాచారం రప్పించుకుంటానని చంద్రబాబు తెలిపారు. దీనిపై ఐదుగురు సభ్యులతో కమిటీ వేశానన్నారు. కమిటీ నుంచి ఎవరికైనా పిలుపు వస్తే.. వారి దగ్గర ఏదో తప్పు జరుగుతోందని గ్రహించాలన్నారు. అలాంటి వారిని మొదట కమిటీ పిలిచి మాట్లాడుతుందని చెప్పారు. అప్పటికీ అవసరమైతే తానే స్వయంగా మాట్లాడతానన్నారు. రెండోసారి తప్పు చేస్తే ఇక మాట్లాడటం ఉండదని, చర్యలు తప్పవని స్పష్టంచేశారు. 'క్రమశిక్షణ విషయంలో కఠినంగా ఉంటాను. 1995 నాటి చంద్రబాబుని చూస్తారు. చర్యలు తీసుకున్నాక నన్ను ఎవరూ తప్పుగా అనుకోవద్దు' అని ఆయన హెచ్చరించారు. ప్రజల నుంచి వచ్చే వినతులు, ఫిర్యాదుల పరిష్కారం, పర్యవేక్షణకు మంత్రులతో కమిటీ వేయనున్నట్టు చంద్రబాబు వెల్లడించారు. 'ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని పరిష్కరించే విధానం తీసుకొద్దాం. మంత్రులు జిల్లాలకు వెళ్లినప్పుడు ఎమ్మెల్యేలకు, పార్టీ జిల్లా అధ్యక్షులకు తప్పకుండా సమాచారం ఇవ్వాలి. మిత్రపక్షాల నాయకులతోను సమన్వయం చేసుకోవాలి' అని సూచించారు. 'పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల నమోదుకు ఇంకా 19 రోజుల సమయం మాత్రమే ఉంది. ఎమ్మెల్యేలు, మంత్రులు దీనిపై దృష్టి పెట్టాలి' అని తెలిపారు.

తిరుమల సిఫారసు లేఖలు పెంపు

తిరుమల శ్రీవారి దర్శనానికి ప్రస్తుతం వారంలో నాలుగు రోజులపాటు ఎమ్మెల్యేల సిఫారసు లేఖల్ని అనుమతిస్తుండగా, ఇకపై వాటిని ఆరు రోజులకు పెంచేందుకు సీఎం అంగీకరించారు. అలాగే వారికి వారంలో ఆరు రోజులపాటు, రోజుకి ఆరు చొప్పున సుపథం (రూ. 300 టికెట్లు) ఇచ్చేందుకూ ఆయన అంగీకరించారు.

700 కిలోల కుళ్లిన కోడి మాంసం పట్టివేత

హైదరాబాద్‌లో బార్లు, హోటళ్లకు విక్రయించే కేంద్రంపై పోలీసుల దాడి

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: హైదరాబాద్ నగరంలో శుక్రవారం విక్రయానికి ఉంచిన 700 కిలోల కుళ్లిన కోడి మాంసం పట్టుబడింది. నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు బేగంపేట ప్రకాశ్‌నగర్‌లోని విక్రయ కేంద్రంపై దాడి చేశారు. అక్కడి దృశ్యాలను చూసి



నిందితుడు బాలయ్య

అధికారులు అవాక్కయ్యారు. కుళ్లిపోయి, నీరు కారుతున్న దశలో ఉన్న 700 కిలోల కోడి మాంసాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. విక్రయదారుడు బాలయ్యతోపాటు మరో 15 మందిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలయ్య అనే వ్యక్తి ఇదే తరహా కేంద్రాన్ని గతంలో కంటోన్మెంట్ ప్రాంతంలోని రసూల్‌పురలో నిర్వహించాడు. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేసి దానిని మూయించారు. అనంతరం తన వ్యాపారాన్ని ప్రకాశ్‌నగర్‌కు మార్చి ముంబయి, చెన్నై వంటి నగరాల నుంచి కుళ్లిన కోడి మాంసాన్ని నామమాత్రపు ధరకు దిగుమతి చేసుకుంటున్నాడు. దాన్ని సంచుల్లో నింపి నగరంలోని పలు బార్లు, కల్లు కాంపౌండ్లు, హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు విక్రయిస్తున్నాడు. కిలో మాంసాన్ని రూ.30 నుంచి రూ.50కే అమ్ముతున్నాడు. ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న మాంసం పది నుంచి నెల రోజుల నాటిదిగా తెలుస్తోంది.

పోస్టాఫీసుల్లో రూ.21.17 కోట్ల డ్రగ్స్ స్వాధీనం



మాదకద్రవ్యాలు ఉన్న కవర్‌ను చూపిస్తున్న సీపీ దయానంద్

బెంగళూరు (శివాజీ నగర), న్యూస్‌టుడే: బెంగళూరు నేర నియంత్రణ దళం అధికారులు శుక్రవారం ఇక్కడి పోస్టాఫీసుల్లో రూ.21.17 కోట్ల విలువైన మాదకద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ పార్సిళ్లు తెప్పించుకున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. సరకు అంతా అమెరికా, బ్రిటన్, బెల్జియం, థాయిలాండ్, నెదర్లాండ్ దేశాలకు చెందినదిగా నగర పోలీసు కమిషనర్ బి.దయానంద్ వెల్లడించారు. తొలుత అనుమానిత పోస్టాఫీసుల్లో డాగ్ స్క్వాడ్ సాయంతో తనిఖీలు చేపట్టి 3,500 పార్సిళ్లను స్వాధీనం చేసుకోగా.. వాటిలో 606కు పైగా మాదకద్రవ్యాల ప్యాకెట్లు గుర్తించామన్నారు. నిషేధిత పదార్థాలు ఇ-సిగరెట్లు, క్రిస్టల్స్, నూనె రూపాల్లోనూ ఉన్నట్లు వివరించారు. విదేశాల నుంచి అక్రమ మార్గంలో దేశంలోకి వచ్చిన మాదక ద్రవ్యాలను.. తపాలా శాఖ పార్సిల్ సేవల ద్వారా బెంగళూరుకు తీసుకొచ్చారన్న సమాచారంతో దాడులు చేసి పట్టుకున్నారు. పార్సిళ్లపై ఉన్న చిరునామాల ఆధారంగా మరికొంత మంది నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

పీవీ సింధుకు మరో ఏడాది ఆన్ డ్యూటీ

ఈనాడు, అమరావతి: డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధుకు ఆన్ డ్యూటీ సదుపాయాన్ని ఏపీ ప్రభుత్వం మరో ఏడాది పొడిగించింది. ఆసియా, కామన్వెల్త్ క్రీడలతోపాటు 2025-26లో వివిధ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు శిక్షణ నిమిత్తం ఆమెకు ఓడీ సదుపాయాన్ని వచ్చే ఏడాది సెప్టెంబరు 30 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులిచ్చింది. సింధు ప్రస్తుతం హైదరాబాద్‌లో ఏపీ ప్రభుత్వ అధీనంలో ఉన్న లేక్‌వ్యూ అతిథి గృహం ఓఎస్డీగా విధులు నిర్వహిస్తున్నారు.

21లోపు పెండింగ్ సమస్యలను పరిష్కరించండి

తెలంగాణ ఉద్యోగుల ఐకాస డిమాండ్



శేషాద్రికి వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ ఉద్యోగుల ఐకాస నేతలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, ఈ నెల 21వ తేదీలోపు ఆయా సమస్యలపై చర్చించి పరిష్కరించాలని తెలంగాణ ఉద్యోగుల ఐకాస డిమాండ్ చేసింది. ఆలోపు పరిష్కరించకుంటే 22న భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం ప్రకటిస్తామని తెలిపింది. ఈ మేరకు ఐకాస ఛైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు నేతృత్వంలో శుక్రవారం సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రిని కలిసి 50 సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. అనంతరం టీఎన్‌జీవో కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. అయిదు పెండింగ్ డీఏల మంజూరు, కొత్త పీఆర్సీ అమలు, సీపీఎస్ రద్దు, 317 జీవో సమస్యల పరిష్కారం, పెండింగ్ బిల్లులు, కొన్ని శాఖల్లో పదోన్నతుల కల్పన తదితర సమస్యలను పరిష్కరించాలని ఎన్నో మార్లు సీఎం, సీఎస్, మంత్రులు, ఇతర ఉన్నతాధికారులకు విన్నవించినా ఒక్కసారి కూడా ఉద్యోగ సంఘాలతో చర్చించలేదన్నారు. తమకు ఇచ్చిన హామీలను, డిమాండ్లను పరిష్కరించకపోవడంతో ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నారని, వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.



జాలితో సమస్యలు తొలగుతాయా?

ఏదైనా సమస్య ఎదురైనప్పుడు కుంగిపోవడం, దాని మీద ఫిర్యాదులు చేస్తూ గడపడం, ఇతరులతో మీ బాధలు చెప్పుకొని ఏడుస్తూ కూర్చున్నంత మాత్రాన ఫలితం ఉంటుందా? మీ మీద జాలితో సమస్యలు తొలగిపోవు కదా. పైపెచ్చు బాధపడినప్పుడు మీ శక్తి కూడా ఖర్చవుతుంది. అదే శక్తిని పరిష్కారం కనుగొనే దిశగా వెచ్చిస్తే, తప్పకుండా మీకు ఏదో మార్గం కనపడుతుంది.

– గౌర్ గోపాల్ దాస్, ఆధ్యాత్మికవేత్త

ఈనాడు స్థిరాస్తి

ఏల్లా అయినా, గెస్ట్ హౌస్‌లైనా, రెండు, మూడు పడక గదులున్న ఇంటి నిర్మాణమైనా ప్రత్యేక అభిరుచి, ఆధునిక సౌకర్యాలు, చారిత్రక శైలితో ఉండేలా శ్రద్ధతో కలల లోగిలిని నిర్మించుకొనే వారి సంఖ్య అంతకంతకు పెరుగుతోంది. ముఖ్యంగా ప్రత్యేక శ్రద్ధతో అలనాటి మండువా శైలిలో పైకప్పు పెంకులతో, పెంకులను పోలిన రూఫ్ సెటప్‌తో, ఇంట్లో దూలాలు, వాసాలు, ఇంటి ముందుభాగంలో వరండా ఉండేలా చూసుకుంటున్నారు. నివాస ప్రాంగణంలోకి అడుగు పెట్టగానే అలనాటి నిర్మాణాన్ని తలపించేలా, ఆధునిక ఏర్పాట్లతో ప్రతీ విషయంలో చారిత్రక నిర్మాణ శైలిని అందిపుచ్చుకొని తమదైన గృహాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తుండటంతో హైదరాబాద్ నగరంతో పాటు వివిధ జిల్లాల్లో ఇలాంటి భవనాలు ప్రత్యేక ఆకర్షణగా మారుతున్నాయి. నిర్మాణ రంగంలో అతిథి గృహాలను, విల్లాలను చూడముచ్చటగా నిర్మించి ఇచ్చే నిర్మాణ సంస్థలు, స్థిరాస్తి వ్యాపారులకు ఎంతో ఆదరణ లభిస్తోంది.

అలనాటి శైలిలో ఆధునిక నిర్మాణాలు

ప్రత్యేక అభిరుచితో దూలాలు, వాసాలతో భవనాలు





అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: నగరీకరణ పుణ్యమా అని ఇంటి నుంచి మొదలై.. రహదారుల వరకు అంతటా కాంక్రీట్ వనాల్లా మారిపోయిన పరిసరాలతో ఒకింత విసిగిన కొందరు.. తమ



నివాసాలకు కాంక్రీట్ గూడును తలపించేలా ఉండవద్దనే ఉద్దేశంలో భవనమే అయినా.. నిర్మాణ శైలి మాత్రం చారిత్రక మండువా లోగిలిని తలపించేలా, ఇంట్లో వీలుంటే కలప దూలాలు, వాసాలను, వీలు కాకపోతే స్టీల్, ఐరెన్ కడ్డీలతో వాసాలను పోలిన ఏర్పాట్లతో



ప్రత్యేకంగా పైకప్పును డిజైన్ చేయించుకుంటున్నారు. పైన కాంక్రీట్‌తో కప్పు ఏర్పాటు చేసిన సాధారణ భవనాలలా కాకుండా మండువా లోగిలి మాదిరి ఉండేలా ప్రత్యేకంగా నిర్మాణం చేపట్టి పైన పెంకులతో అందంగా తీర్చిదిద్ది.. తాము ఆధునిక భవనంలోనే నివసిస్తున్నా.. వందల ఏళ్ల నాటి ఇంట్లో ఉంటున్న అనుభూతిని సొంతం చేసుకుంటున్నారు. ఇందుకోసం కొందరైతే రూ.లక్షల నుంచి రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారు.

ఇంటితో పాటు ఆవరణ సైతం..

భవనాలపై పెంకులను పోలిన షీట్లను ఏర్పాటు చేసుకోవడమే కాకుండా ఇంటి వరండా, గార్డెన్ ఇలా ప్రతి విషయంతో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. ఉషోదయం వేళ, సాయంసంధ్యా కాలంలో గార్డెన్‌లో కూర్చుని సేద తీరేందుకు, తేనీరు సేవించేందుకు, విందు వినోదాల కోసం పెంకులతో పాతకాలం నాటి కుటీరాలను తలపించేలా నిర్మించుకుంటున్నారు. ఆధునిక పోకడలెన్ని వచ్చినా.. ఇప్పటికీ ఇంట్లోకి రాగానే ఆహ్లాదం, నానమ్మ, తాతయ్య కాలం కళ్ల ముందు మెదిలేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఏసీ భవనాలే అయినా ఇంట్లో అడుగిడితే మాత్రం పల్లె వాతావరణం కనిపించేలా శ్రద్ధ చూపిస్తున్నారు. అలనాటి నిర్మాణ శైలి కనిపించేలా ఇళ్లను నిర్మించి ఇచ్చేందుకు ప్రాధాన్యం ఇస్తున్నామని నగరంలోని ఓ స్థిరాస్తి వ్యాపార సంస్థ యజమాని తెలిపారు.

చాంపియన్



గురువారం భారత క్రికెట్లో ఓ మరిచిపోదగ్గ రోజు. సొంతగడ్డపై ఎన్నడూ చూడని పతనంతో కేవలం 46 పరుగులకే కుప్పకూలి అవమాన భారం మూటగట్టుకోవడమే కాదు.. ప్రత్యర్థితో అదే రోజు అంతకు నాలుగింతల స్కోరు చేయనిచ్చింది టీమ్‌ఇండియా.

అయితే తర్వాతి రోజు భారత జట్టు ఆటతీరు మారింది. బౌలర్లు కష్టపడి ప్రత్యర్థిని ఆలౌట్ చేస్తే.. బ్యాటర్లు తొలి ఇన్నింగ్స్ వైఫల్యాన్ని మరిపించేలా ఆడారు. మ్యాచ్ పరిస్థితులతో సంబంధం లేకుండా సానుకూల దృక్పథంతో బ్యాటింగ్ చేసి భారీ పరుగుల లోటును కరిగించే ప్రయత్నం చేస్తున్నారు.

కానీ గురువారం నాటి పేలవ ప్రదర్శన పుణ్యమా అని ఓటమి ముప్పు ఇంకా తొలగిపోలేదు. బ్యాటర్లు శనివారం పూర్తిగా పోరాటాన్ని కొనసాగిస్తే తప్ప రోహిత్ సేన ఉచ్చులోంచి బయటికి రాదు. సర్ఫరాజ్‌తో కలిసి కీలక ఇన్నింగ్స్ ఆడిన కోహ్లి మూడో రోజు ఆట చివరి బంతికి ఔటవడం భారత్‌కు గట్టి ఎదురు దెబ్బ. మరి సర్ఫరాజ్, మిగతా బ్యాటర్లు భారత్‌కు ఎక్కడిదాకా తీసుకెళ్తారో?



కోహ్లి @ 9000

న్యూజిలాండ్‌తో తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో అర్ధశతకంతో ఆకట్టుకున్న స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి.. ఈ క్రమంలో టెస్టుల్లో 9 వేల పరుగుల మైలురాయిని అందుకున్నాడు. అతడికిది 197వ ఇన్నింగ్స్. భారత క్రికెటర్లలో సచిన్ తెందుల్కర్ (15,921), రాహుల్ ద్రవిడ్ (13,265), సునీల్ గావస్కర్ (10,122) తర్వాత ఈ ఘనత సాధించిన బ్యాటర్ కోహ్లినే.

ఈ రోజు నిలిస్తేనే..

• పుంజుకున్నా.. ఓటమి ఉచ్చులోనే టీమ్‌ఇండియా
• రెండో ఇన్నింగ్స్‌లో 231/3 • రచిన్ సెంచరీ.. న్యూజిలాండ్ 402

బెంగళూరు

న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో భారత జట్టు ఎదురీదుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటర్ల ఘోర వైఫల్యం, బౌలర్ల సాధారణ ప్రదర్శనతో ప్రత్యర్థికి 356 పరుగుల భారీ ఆధిక్యాన్ని సమర్పించుకున్న రోహిత్ సేన.. రెండో ఇన్నింగ్స్‌లో 231/3తో మెరుగైన స్థితిలో నిలిచింది. విరాట్ కోహ్లి (70; 102 బంతుల్లో 8×4, 1×6), సర్ఫరాజ్ ఖాన్ (70 బ్యాటింగ్; 78 బంతుల్లో 7×4, 3×6), రోహిత్ శర్మ (52; 63 బంతుల్లో 8×4, 1×6) చక్కటి ఇన్నింగ్స్‌లు ఆడారు. భారత్ ఇంకా 125 పరుగులు వెనుకబడి ఉంది. అంతకుముందు 180/3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన కివీస్ 402 పరుగులకు ఆలౌటైంది. భారత సంతతికి చెందిన రచిన్ రవీంద్ర (134; 157 బంతుల్లో 13×4, 4×6) తన తండ్రి సొంతగడ్డయిన బెంగళూరులో అద్భుత శతకం సాధించాడు. సౌథీ (65; 73 బంతుల్లో 5×4, 4×6) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా (3/72), కుల్‌దీప్ యాదవ్ (3/99) రాణించారు.

ఎదురుదాడే మంత్రం: తొలి ఇన్నింగ్స్‌లో 46కే ఆలౌటై, ప్రత్యర్థికి భారీ ఆధిక్యం కోల్పోయాక జట్టు ఆత్మవిశ్వాసం సన్నగిల్లడం, ఆత్మరక్షణలో పడడం సాధారణం. కానీ పరిస్థితులు, ఫలితాలు ఎలా ఉన్నా దూకుడుగానే ఆడతామంటూ ఈ మ్యాచ్‌కు ముందు కోచ్ గంభీర్ చెప్పిన మాటకు అనుగుణంగానే రెండో ఇన్నింగ్స్‌లో భారత బ్యాటింగ్ సాగింది. బ్యాటర్లందరూ సానుకూల ధోరణితో కనిపించారు. దూకుడుగానే ఆడారు. ఓపెనర్లు రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్ (35; 52 బంతుల్లో 6×4) పోటీ పడి బౌండరీలు బాదారు. రోహిత్ అయితే వన్డే తరహాలోనే బ్యాటింగ్ చేశాడు. టీ విరామానికి భారత్ 57/0తో నిలిచింది. విరామం తర్వాత మూడో ఓవర్లోనే జైస్వాల్ ఔటైపోయాడు. స్పిన్నర్ అజాజ్ పటేల్ బౌలింగ్‌లో క్రీజు వదిలి భారీ షాట్ ఆడబోయిన అతను స్టంపౌటైపోయాడు. అయినా రోహిత్ జోరు తగ్గించలేదు. బౌండరీల మోత మోగిస్తూ అర్ధశతకం పూర్తి చేశాడు. కానీ నిలకడగా ఆడుతున్న అతడిని దురదృష్టం వెంటాడింది. అజాజ్ బౌలింగ్‌లో డిఫెన్స్ ఆడిన తర్వాత బంతి నెమ్మదిగా దొర్లుకుంటూ వెళ్లి స్టంప్‌ను తాకి, బెయిల్స్ కిందపడడంతో రోహిత్ తీవ్ర నిరాశతో పెవిలియన్ చేరాడు. తక్కువ వ్యవధిలో రెండు వికెట్లు పడ్డా భారత్ ఆటతీరు మారలేదు. సర్ఫరాజ్ వచ్చీ రాగానే షాట్లకు దిగాడు. తొలి 16 బంతుల్లో అతను 23 పరుగులు చేశాడు. మరో ఎండ్‌లో అప్పటికే కుదురుకున్న కోహ్లి.. చాన్నాళ్ల తర్వాత ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ చేశాడు. వీలుచిక్కినపుడు షాట్లు ఆడుతూ, మంచి బంతులు పడ్డప్పుడు డిఫెన్స్ ఆడుతూ కోహ్లి ఇన్నింగ్స్ సమతూకంతో సాగింది. సర్ఫరాజ్ మాత్రం దూకుడు కొనసాగించాడు. దీంతో వీరి భాగస్వామ్యం 100, జట్టు స్కోరు 200 దాటేశాయి. మరో వికెట్ కోల్పోకుండా పటిష్ఠ స్థితిలో భారత్ రోజును ముగించేలా కనిపించింది. కానీ అంతకుముందు అజాజ్ బౌలింగ్‌లో ఓ జీవనదానం పొందిన కోహ్లి.. ఆటలో చివరి బంతికి ఫిలిప్స్ బౌలింగ్‌లో వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చి ఔటవడం భారత అభిమానులను తీవ్ర నిరాశకు గురి చేసింది.





రచిన్ అదరహో..: మూడో రోజు ఉదయం 180/3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన కివీస్.. తొలి సెషన్లో తడబడింది. మొదట పేసర్లు సిరాజ్, బుమ్రా.. తర్వాత స్పిన్నర్ జడేజా కట్టుదిట్టంగా బంతులేస్తూ ప్రత్యర్థికి కళ్లెం వేశారు. 14 పరుగులతో బ్యాటింగ్ కొనసాగించిన మిచెల్ (18)ను కాసేపటికే సిరాజ్ పెవిలియన్ చేరిస్తే.. బ్లండెల్ (5)ను బుమ్రా బుట్టలో వేశారు. తర్వాత జడేజా.. ఫిలిప్స్ (14), హెన్రీ (8)లను బౌల్డ్ చేసి కివీస్‌ను మరింత ఇబ్బందుల్లోకి నెట్టాడు. కివీస్ 233/7కు చేరుకోవడంతో భారత్ మరీ ఎక్కువ ఆధిక్యం కోల్పోదులే అనిపించింది. ఇక కివీస్‌ను చుట్టేయడమే తరువాయి అనుకుంటే.. రచిన్ రవీంద్ర (ఓవర్‌నైట్ స్కోరు 22), సౌథీ మొత్తం కథ మార్చేశారు. వీళ్లిద్దరూ ఎదురుదాడికి దిగి భారత బౌలర్లు పూర్తిగా లయ కోల్పోయేలా చేశారు. ఆట సాగుతున్న కొద్దీ పిచ్ కూడా బ్యాటింగ్‌కు పూర్తి అనుకూలంగా మారిపోయింది. పేసర్లు, స్పిన్నర్లు ఇద్దరూ ప్రభావం చూపలేకపోయారు. సౌథీ ఆరంభం నుంచే భారీ షాట్లు ఆడగా.. రచిన్ కూడా అర్ధశతకం తర్వాత దూకుడు పెంచాడు. దీంతో పరుగులు ధారాళంగా వచ్చాయి. స్కోరు చూస్తుండగానే 300, తర్వాత 350 దాటేసింది. జట్టు స్కోరు 370 వద్ద సౌథీని సిరాజ్ ఔట్ చేయడంతో భారత్ కాస్త ఊపిరి పీల్చుకుంది. అప్పటికే సెంచరీ పూర్తి చేసిన రచిన్ ధాటిని కొనసాగిస్తూ మరిన్ని పరుగులు జోడించాడు. జట్టును 400 దాటించాడు. చివరికి అతను కుల్‌దీప్ బౌలింగ్‌లో పదో వికెట్ రూపంలో వెనుదిరిగాడు.

భారత్ తొలి ఇన్నింగ్స్: 46

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: లేథమ్ ఎల్బీ (బి) కుల్‌దీప్ 15; కాన్వే (బి) అశ్విన్ 91; యంగ్ (సి) కుల్‌దీప్ (బి) జడేజా 33; రచిన్ (సి) జురెల్ (బి) కుల్‌దీప్ 134; మిచెల్ (సి) జైస్వాల్ (బి) సిరాజ్ 18; బ్లండెల్ (సి) రాహుల్ (బి) బుమ్రా 5; ఫిలిప్స్ (బి) జడేజా 14; హెన్రీ (బి) జడేజా 8; సౌథీ (సి) జడేజా (బి) సిరాజ్ 65; అజాజ్ ఎల్బీ (బి) కుల్‌దీప్ 4; ఒరోర్క్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 15 **మొత్తం:** (91.3 ఓవర్లలో ఆలౌట్) **402; వికెట్ల పతనం:** 1-67, 2-142, 3-154, 4-193, 5-204, 6-223, 7-233, 8-370, 9-384; **బౌలింగ్:** బుమ్రా 19-7-41-1; సిరాజ్ 18-2-84-2; అశ్విన్ 16-1-94-1; కుల్‌దీప్ 18.3-1-99-3; జడేజా 20-1-72-3

భారత్ రెండో ఇన్నింగ్స్: యశస్వి (స్టంప్డ్) బ్లండెల్ (బి) అజాజ్ 35; రోహిత్ (బి) అజాజ్ 52; కోహ్లి (సి) బ్లండెల్ (బి) ఫిలిప్స్ 70; సర్ఫరాజ్ బ్యాటింగ్ 70; ఎక్స్‌ట్రాలు 4 **మొత్తం:** (49 ఓవర్లలో 3 వికెట్లకు) **231; వికెట్ల పతనం:** 1-72, 2-95, 3-231; **బౌలింగ్:** సౌథీ 7-1-22-0; హెన్రీ 11-1-52-0; ఒరోర్క్ 11-1-48-0; అజాజ్ పటేల్ 12-2-70-2; ఫిలిప్స్ 8-1-36-1

పంత్ ఈ రోజు ఆడతాడు!

భారత వికెట్ కీపర్ రిషబ్ పంత్ మూడో రోజు ఆటలో వికెట్ల వెనుక బాధ్యతలు నిర్వర్తించలేదు. రెండో రోజు ఆటలో పంత్ కుడి మోకాలికి గాయం కావడంతో శుక్రవారం అతను వికెట్ కీపింగ్ చేయలేదు. తన స్థానంలో సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన జురెల్ ఈ బాధ్యతలు నిర్వర్తించాడు. 2022 చివర్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో పంత్ మోకాలికి తీవ్ర గాయం కావడం, శస్త్రచికిత్స జరగడం తెలిసిందే. ఇప్పుడు ఆ మోకాలికే గాయమైంది. మోకాలి చిప్పపై వాపు రావడంతో అతను శుక్రవారం వికెట్ కీపింగ్‌కు దూరంగా ఉన్నాడు. మూడో రోజు చివరి బంతికి కోహ్లి ఔటైన నేపథ్యంలో శుక్రవారం ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు రావాల్సింది రిషబే. గురువారం పంత్ బ్యాటింగ్ సాధన చేశాడు. అతను నాలుగో రోజు బ్యాటింగ్ చేస్తాడని జట్టు వర్గాలు తెలిపాయి.

అంత ఆధిక్యం సాధిస్తే..

తొలి ఇన్నింగ్స్ పేలవ ప్రదర్శన తర్వాత భారత బ్యాటర్లు రెండో ఇన్నింగ్స్‌లో గొప్పగానే పుంజుకున్నారు. అలాంటి వైఫల్యం తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో ఇంత సానుకూలంగా ఆడడం ఆశ్చర్యం కలిగించే విషయం. అయితే ఈ సానుకూల ధోరణి, ఉత్తమ ప్రదర్శన ఇంకో రోజు పూర్తిగా సాగడం చాలా అవసరం. సర్ఫరాజ్ మంచి ఊపులో ఉన్నాడు. ఇంకా పంత్, రాహుల్, జడేజా, అశ్విన్ ఆడాల్సి ఉంది. వీళ్లంతా కలిసి పూర్తి రోజు ఇన్నింగ్స్‌ను కొనసాగించగలిగితే భారత్.. 125 పరుగుల లోటును పూడ్చుకోవడంతో పాటు 150-200 మధ్య ఆధిక్యం సంపాదించగలదు. నాలుగో ఇన్నింగ్స్‌లో లక్ష్యం 150 దాటినా ఛేదన తేలిక కాకపోవచ్చు. నాలుగో రోజు భారత్ ఆలౌట్ కాకపోతే మ్యాచ్ గెలవొచ్చు లేదా డ్రా చేసుకోవచ్చు. ఆధిక్యం వంద లోపు ఉంటే మాత్రం ఓటమి తప్పదు. మరి శనివారం భారత బ్యాటర్ల పోరాటం ఎంత వరకు వెళ్తుందో?

ఫైనల్లో కివీస్

ఉత్కంఠ పోరులో విండీస్‌పై విజయం



హేలీను ఔట్ చేసిన ఆనందంలో న్యూజిలాండ్ క్రికెటర్లు

దుబాయ్: మహిళల టీ20 ప్రపంచకప్ లీగ్ దశ చివరి మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌కు షాకిచ్చి అనూహ్యంగా సెమీస్ చేరిన వెస్టిండీస్‌కు.. న్యూజిలాండ్ చెక్ పెట్టింది. శుక్రవారం హోరాహోరీగా సాగిన సెమీఫైనల్లో కివీస్ 8 పరుగుల తేడాతో విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన కివీస్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 128 పరుగులు చేసింది. ఓపెనర్లు జార్జియా ప్లిమర్ (33), సుజీ బేట్స్ (26) జట్టుకు మంచి ఆరంభాన్నిచ్చినా.. డాటిన్ (4/22), అఫీ ఫ్లెచర్ (2/23) కివీస్‌కు కళ్లెం వేసి ఓ మోస్తరు స్కోరుకు పరిమితం చేశారు. అనంతరం ఛేదనలో స్పిన్నర్లు ఈడెన్ కార్సన్ (3/29), అమేలియా కెర్ (2/14)ల ధాటికి విండీస్ తడబడింది. 14 ఓవర్లకు 65/5తో నిలిచింది. కెప్టెన్ హేలీ మాథ్యూస్ (15) సహా టాప్ ఆర్డర్ విఫలమైంది. విండీస్‌కు ఆశల్లేని స్థితిలో డాటిన్ (33; 22 బంతుల్లో 3×6) మెరుపు ఇన్నింగ్స్‌తో జట్టును పోటీలోకి తెచ్చింది. తహుహు వేసిన 16వ ఓవర్లో ఆమె మూడు సిక్సర్లు బాదేసింది. 24 బంతుల్లో 34 పరుగులు చేయాల్సి రావడంతో అదే ఊపులో డాటిన్ జట్టును గెలిపించేస్తుందనిపించింది. కానీ తర్వాతి ఓవర్లో అమేలియా.. డాటిన్‌ను ఔట్ చేసి మ్యాచ్‌ను కివీస్ వైపు తిప్పింది. మిగతా విండీస్ బ్యాటర్లు కొంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఆదివారం ఫైనల్లో దక్షిణాఫ్రికాను కివీస్ ఢీకొంటుంది.

న్యూజిలాండ్: 128/9 (ప్లిమర్ 33, సుజీ బేట్స్ 26, ఇసబెలా 20, బ్రూక్ 18; డాటిన్ 4/22, అఫీ ఫ్లెచర్ 2/23) **వెస్టిండీస్:** 120/8 (డాటిన్ 33, హేలీమాథ్యూస్ 15, అఫీ ఫ్లెచర్ 17 నాటౌట్; ఈడెన్ కార్సన్ 3/29, అమేలియా కెర్ 2/14, సుజీ బేట్స్ 1/6)



టైటాన్స్ అదుర్స్

పీకేఎల్-11లో శుభారంభం

ఈనాడు, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో తెలుగు టైటాన్స్‌కు అదిరే ఆరంభం. శుక్రవారం గచ్చిబౌలి స్టేడియంలో సీజన్ ఆరంభ మ్యాచ్‌లో టైటాన్స్ 37-29 తేడాతో బెంగళూరు బుల్స్‌ను చిత్తుచేసింది. కెప్టెన్ పవన్ సెహ్రావత్ (13 పాయింట్లు) రైడింగ్‌లో, క్రిషన్ (6) ట్యాక్లింగ్‌లో సత్తాచాటారు. కొత్త కోచ్ క్రిషన్ కుమార్ సూచనలతో పక్కా వ్యూహం ప్రకారం స్టార్ రైడర్, ప్రత్యర్థి కెప్టెన్ పర్దీప్ నర్వాల్ (3)ను తొడ పట్టేసి.. మడమ తిప్పేసి ఎక్కువ సేపు బెంచ్‌కే పరిమితం చేసిన టైటాన్స్ ఫలితం సాధించింది. సొంతగడ్డపై ఆరంభం నుంచి టైటాన్స్‌దే దూకుడు. ప్రత్యర్థి రక్షణ వలయాన్ని ఛేదిస్తూ పవన్ పాయింట్ల వేటలో సాగడంతో జట్టు 5-1తో దూసుకెళ్లింది. 14వ నిమిషంలో బుల్స్‌ను ఆలౌట్ చేసి 16-8తో ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది. తొలి అర్ధభాగం ముగిసే సరికి టైటాన్స్ 20-11తో నిలిచింది. విరామం తర్వాత టైటాన్స్ కాస్త తడబడింది. ట్యాక్లింగ్‌లో సురిందర్ (5), సౌరభ్ (3) మెరవడంతో 29వ నిమిషంలో టైటాన్స్‌ను ఆలౌట్ చేసిన బుల్స్ 22-24తో పోరును రసవత్తరంగా మార్చింది. ఆ దశలో పర్దీప్‌ను సాగర్ (3) పట్టేయడం కీలక మలుపు. అక్కడి నుంచి టైటాన్స్ మళ్లీ వేగాన్ని అందుకుంది. బుల్స్‌ను మరోసారి ఆలౌట్ చేసి 35-26తో విజయం దిశగా సాగింది. బాలీవుడ్ నటీనటులు విద్యా బాలన్, కార్తీక్ ఆర్యన్ ఈ మ్యాచ్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ప్రొ కబడ్డీలో ఈనాడు

తెలుగు టైటాన్స్ × తమిళ్ తలైవాస్ (రాత్రి 8 నుంచి)
పుణెరి పల్టాన్ × హరియాణా స్టీలర్స్ (రాత్రి 9 నుంచి)

పాక్ తిప్పేసింది

• 20 వికెట్లు పంచుకున్న సాజిద్, నోమన్ • ఇంగ్లాండ్ చిత్తు



సాజిద్, నోమన్

ముల్తాన్: తొలి టెస్టులో పరుగుల పండగ చేసుకున్న ఇంగ్లాండ్.. ముల్తాన్‌లో జరిగిన రెండో టెస్టులో స్పిన్ పిచ్‌పై బొక్కబోర్లా పడింది. స్పిన్నర్లు నోమన్ అలీ (8/46), సాజిద్ ఖాన్ (2/93) గింగిరాలు తిరిగే బంతులతో ఉక్కిరిబిక్కిరి చేయడంతో ఇంగ్లాండ్ 152 పరుగుల తేడాతో చిత్తుగా ఓడింది. 297 పరుగుల లక్ష్యం ముందుండగా.. ఓవర్‌నైట్ స్కోరు 36/2తో నాలుగో రోజు ఉదయం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లాండ్ 33.3 ఓవర్లలో 144 పరుగులకే కుప్పకూలింది. శుక్రవారం 22.3 ఓవర్లు ఆడిన ఇంగ్లాండ్ మరో 108 పరుగులు జోడించి.. 8 వికెట్లు కోల్పోయింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' సాజిద్, నోమన్‌ల దెబ్బకు ఇంగ్లాండ్ బ్యాటర్లు పెవిలియన్‌కు వరుస కట్టారు. కెప్టెన్ బెన్ స్టోక్స్ (37; 36 బంతుల్లో 4×4), బ్రైడన్ కార్స్ (27; 32 బంతుల్లో 3×6) కొద్దిసేపు పోరాడకపోతే ఇంగ్లాండ్‌కు మరింత ఘోర పరాభవం ఎదురయ్యేది. ఈ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ 20 వికెట్లను సాజిద్ (7/111, 2/93), నోమన్ (3/101, 8/46)లే పడగొట్టడం విశేషం. ఒక మ్యాచ్‌లో ఇద్దరు బౌలర్లే మొత్తం వికెట్లు తీయడం టెస్టు క్రికెట్ చరిత్రలో ఇది ఏడోసారి మాత్రమే. సుదీర్ఘ విరామం తర్వాత పాక్ సొంతగడ్డపై ఓ టెస్టులో విజయం సాధించింది. 2021 తర్వాత.. వరుసగా 11 మ్యాచ్‌ల అనంతరం పాక్‌కు ఇదే మొదటి గెలుపు.

కుర్రాళ్ల సమరం

• పాక్-ఎతో భారత్-ఎ ఢీ నేడు

రా.7 గంటల నుంచి

అల్ అమెరాట్: వర్ధమాన ఆసియాకప్ టీ20 క్రికెట్ టోర్నీలో ఆసక్తికర సమరానికి వేళైంది. శనివారం భారత-ఎ జట్టు పాకిస్థాన్-ఎను ఢీకొంటుంది. తెలుగు కుర్రాడు తిలక్‌వర్మ భారత్‌కు సారథ్యం వహిస్తున్నాడు. టీమ్‌ఇండియా తరఫున ఇప్పటికే 4 వన్డేలు, 16 టీ20లు ఆడిన తిలక్.. ఒత్తిడి ఉండే ఈ మ్యాచ్‌లో జట్టును ఎలా నడిపిస్తాడో చూడాలి. ఈ ఏడాది ఐపీఎల్‌తో పాటు జింబాబ్వే సిరీస్‌లో సత్తా చాటిన అభిషేక్‌శర్మ జట్టులో కీలక ఆటగాడు. ఆయూష్ బదోని, ప్రభ్‌సిమ్రన్‌సింగ్, సాయికిశోర్, రాహుల్ చాహల్ లాంటి స్టార్లతో యువ భారత్ పటిష్ఠంగా కనిపిస్తోంది. మరోవైపు మహ్మద్ హారిస్ కెప్టెన్సీలోని పాకిస్థాన్‌ను కూడా తక్కువ అంచనా వేయలేం. సీనియర్ జట్టుకు 15 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన హారిస్‌తో పాటు హైదర్ అలీ ఆ జట్టులో ప్రధాన ఆటగాళ్లు.

విజేత అర్జున్



అర్జున్ ఇరిగేశి

లండన్: తెలంగాణ కుర్రాడు అర్జున్ ఇరిగేశి అదరగొట్టాడు. అంతర్జాతీయ స్థాయిలో ఇటీవల జోరును కొనసాగిస్తూ డబ్ల్యూఆర్ చెస్ మాస్టర్స్ కప్‌లో టైటిల్ కైవసం చేసుకున్నాడు. ఫైనల్లో లాగ్రేవ్‌పై అర్జున్ పైచేయి సాధించాడు. క్లాసికల్ పద్ధతిలో జరిగిన తొలి రెండు గేములు డ్రాగా ముగియడంతో ఫలితాన్ని టైబ్రేక్‌లో తేల్చారు. తొలి గేమ్‌లో నల్ల పావులతో ఆడిన అర్జున్ పెద్దగా కష్టపడకుండానే ప్రత్యర్థిని నిలువరించాడు. రెండో గేమ్‌లో తెల్లపావులతో బరిలో దిగిన అతడికి లాగ్రేవ్ నుంచి గట్టిపోటీ ఎదురైంది. కానీ ఈ గేమ్‌ను కూడా అతడు డ్రా చేసుకున్నాడు. ఆపై టైబ్రేక్‌లో జోరు ప్రదర్శించిన ఈ భారత గ్రాండ్‌మాస్టర్.. 69 ఎత్తుల్లో విజయం సాధించి టైటిల్ కైవసం చేసుకున్నాడు. దీంతో ప్రత్యక్ష ఎలో రేటింగ్‌లో అర్జున్ (2796.1).. 2800 మైలురాయికి మరింత చేరువయ్యాడు. ఈనెల 20న ఆరంభమయ్యే యూరోపియన్ కప్‌లో అతడు 2800 రేటింగ్‌ను అందుకునే అవకాశాలున్నాయి. దశాబ్దాల సుదీర్ఘ చరిత్ర ఉన్న భారత చెస్‌లో ఆనంద్ మాత్రమే 2800 రేటింగ్ సాధించాడు. 2011లో విషీ (2817) ఈ ఘనత సాధించాడు.

సింధు ఔట్



ఒడెన్స్: డెన్మార్క్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 750 టోర్నీలో భారత స్టార్ షట్లర్ పి.వి.సింధు పోరాటం ముగిసింది. శుక్రవారం మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో సింధు 13-21, 21-16, 9-21తో అయిదో సీడ్ గ్రెగోరియా మరిస్కా టున్‌జుంగ్ (ఇండోనేసియా) చేతిలో పరాజయం చవిచూసింది. మరిస్కాపై 10-2తో మెరుగైన గెలుపోటముల రికార్డున్న సింధు.. ఈ మ్యాచ్‌లో పూర్తిగా తేలిపోయింది. 57 నిమిషాల పాటు సాగిన పోరులో సింధుపై అన్ని రంగాల్లో ప్రత్యర్థి పైచేయి సాధించింది. రెండో గేమ్‌లో మాత్రమే ప్రభావం చూపిన సింధు.. మొదటి, మూడో గేమ్‌ల్లో విఫలమైంది.

నాయకత్వ లక్షణమంటే అదే



లక్ష్మణ్

ముంబయి: తొలి టెస్టులో న్యూజిలాండ్‌పై టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకోవాలన్న నిర్ణయానికి తనదే బాధ్యత అని రోహిత్‌శర్మ చెప్పడం నిజమైన నాయకత్వ లక్షణమని భారత క్రికెట్ మాజీ ఆటగాడు వీవీఎస్ లక్ష్మణ్ అన్నాడు. "నాయకులు కూడా తప్పులు చేయడం సహజం. భారత్ టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగి 46 పరుగులకే ఆలౌటైంది. దీని వల్ల పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఈ పరిస్థితుల్లో కెప్టెన్ రోహిత్ ఇంకెవరినో విలేకరుల సమావేశానికి పంపలేదు. తానే వచ్చాడు. తప్పు తనపై వేసుకున్నాడు. పిచ్‌ను సరిగా అర్థం చేసుకోలేదని ఒప్పుకున్నాడు. నిజమైన నాయకులే ఇలా తప్పులకు బాధ్యత వహిస్తారు. సారథి తీసుకున్న ప్రతి నిర్ణయం సత్ఫలితం ఇవ్వదు. కానీ జట్టు చెత్త ప్రదర్శనకు ఇలాంటి నిర్ణయాలే కారణమైతే కచ్చితంగా కెప్టెన్ బాధ్యత వహించాలి. రోహిత్ చేసింది ఇదే. జట్టుకు భరోసా ఇచ్చాడు" అని లక్ష్మణ్ పేర్కొన్నాడు. భారత్ 150 పరుగుల ఆధిక్యాన్ని సాధించగలిగితే బౌలర్లు పోరాడే అవకాశం ఉంటుందని లక్ష్మణ్ అభిప్రాయపడ్డాడు.

నాదల్ ఓటమి

రియాద్: డేవిస్ కప్‌తో ఆటకు వీడ్కోలు పలుకుతానని ప్రకటించిన స్పెయిన్ టెన్నిస్ దిగ్గజం రఫెల్ నాదల్.. దానికన్నా ముందు ఆడిన టోర్నీలో తొలి మ్యాచ్‌లోనే ఓటమిపాలయ్యాడు. సిక్స్ కింగ్స్ స్లామ్ ఎగ్జిబిషన్ టోర్నీ సింగిల్స్ సెమీఫైనల్లో అతడు 3-6, 3-6తో సహచర ఆటగాడు కార్లోస్ అల్కరాస్ చేతిలో పరాజయంపాలయ్యాడు. నాదల్‌కు నిర్వాహకులు నేరుగా సెమీస్ ఆడే అవకాశం కల్పించగా.. అతడు తన స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయాడు. శనివారం మూడో స్థానం కోసం జరిగే పోరులో నొవాక్ జకోవిచ్ (సెర్బియా)తో నాదల్ తలపడతాడు. జులైలో పారిస్ ఒలింపిక్స్‌లో ఆడిన తర్వాత రఫా మళ్లీ కోర్టులోకి రావడమిదే తొలిసారి.

గుజరాత్ 289/8

ఆంధ్రతో రంజీ మ్యాచ్

అహ్మదాబాద్: ఆంధ్రతో జరుగుతున్న రంజీ ట్రోఫీ గ్రూపు-బి మ్యాచ్‌లో గుజరాత్ మెరుగైన స్థితికి చేరుకుంది. శుక్రవారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ తొలి రోజు ఆట ముగిసేసరికి మొదటి ఇన్నింగ్స్‌లో 8 వికెట్లకు 289 పరుగులు సాధించింది. గుజరాత్ బ్యాటర్లలో మనన్ హింగ్రాజియా (48; 116 బంతుల్లో 5×4, 1×6), ఉర్విల్ పటేల్ (48; 53 బంతుల్లో 4×4, 3×6) రాణించారు. ఆంధ్ర బౌలర్లు లలిత్ మోహన్ (3/90), త్రిపురణ విజయ్ (2/84), శశికాంత్ (1/37), నితీశ్ (1/33), సత్యనారాయణ రాజు (1/42) సమష్టిగా సత్తాచాటడంతో ఒకదశలో గుజరాత్ 203 పరుగులకు 8 వికెట్లు (67.1 ఓవర్లలో) కోల్పోయింది. అయితే కెప్టెన్ చింతన్ గజ (38 బ్యాటింగ్; 88 బంతుల్లో 1×4), టెయిలెండర్ అర్జాన్ నగ్వాస్‌వాలా (59 బ్యాటింగ్; 72 బంతుల్లో 8×4, 1×6) తొమ్మిదో వికెట్‌కు అజేయంగా 86 పరుగులు (19.5 ఓవర్లలో) జోడించి ఆంధ్ర ఆధిపత్యాన్ని అడ్డుకున్నారు.

ఉత్తరాఖండ్ 313/8.. హైదరాబాద్‌తో రంజీ మ్యాచ్

డెహ్రాడూన్: అవనీష్ సుధా (89; 131 బంతుల్లో 9×4, 1×6), ఆదిత్య తారె (69; 73 బంతుల్లో 11×4) రాణించడంతో హైదరాబాద్‌తో ప్రారంభమైన రంజీ ట్రోఫీ గ్రూపు-బి మ్యాచ్‌లో ఉత్తరాఖండ్ గౌరవప్రదమైన స్కోరు సాధించింది. శుక్రవారం ఆట ముగిసే సమయానికి ఉత్తరాఖండ్ 76 ఓవర్లలో 8 వికెట్లకు 313 పరుగులు రాబట్టింది. అవనీష్, ఆదిత్య అర్ధ సెంచరీలు సాధించగా.. యువరాజ్ చౌదరి (49; 66 బంతుల్లో 9×4) రాణించాడు. హైదరాబాద్ బౌలర్లు తనయ్ త్యాగరాజన్ (3/83), రోహిత్ రాయుడు (2/16), సి.వి.మిలింద్ (1/54), కార్తికేయ (1/48), రక్షణ్ రెడ్డి (1/47) సత్తాచాటి ఉత్తరాఖండ్‌ను కట్టడి చేశారు.

సాయి సుదర్శన్ డబుల్ సెంచరీ

దిల్లీ: ఓపెనర్ సాయి సుదర్శన్ (202 బ్యాటింగ్; 259 బంతుల్లో 23×4, 1×6) అజేయ డబుల్ సెంచరీతో సత్తాచాటడంతో తమిళనాడు భారీస్కోరు దిశగా దూసుకెళ్తోంది. శుక్రవారం దిల్లీతో ప్రారంభమైన రంజీ ట్రోఫీ గ్రూపు-డి మ్యాచ్‌లో తమిళనాడు తొలి ఇన్నింగ్స్‌లో 88 ఓవర్లలో ఒక వికెట్‌కు 379 పరుగులు సాధించింది. వాషింగ్టన్ సుందర్ (96 బ్యాటింగ్; 170 బంతుల్లో 12×4, 1×6) రాణించాడు. మరోవైపు ఇషాన్ కిషన్ (101; 158; 13×4, 2×6) సెంచరీతో చెలరేగాడు. రైల్వేస్‌తో రంజీ గ్రూపు-డి మ్యాచ్‌లో ఇషాన్ సెంచరీ చేయడంతో తొలి రోజు జార్ఖండ్ 325 పరుగులు (5 వికెట్లకు) సాధించింది.





దత్తత తీసుకొని.. అక్కున చేర్చుకొని

జూబ్లీహిల్స్‌లోని బ్లూక్రాస్ కార్యాలయంలో శుక్రవారం పెంపుడు జంతువుల దత్తత కార్యక్రమం నిర్వహించారు. జంతు ప్రేమికులు తమకు కావాల్సిన వాటిని ఎంపిక చేసుకొని తమతోపాటు తీసుకెళ్లారు. గాయపడిన శునకాలకు సిబ్బంది చికిత్స అందించారు. - న్యూస్‌టుడే, జూబ్లీహిల్స్

మియాపూర్‌లో చిరుత కలకలం

మెట్రో స్టేషన్ సమీపంలో కనిపించినట్లు వీడియోలు



మియాపూర్: మియాపూర్‌లో చిరుత సంచారం కలకలం రేపింది. మియాపూర్ మెట్రో స్టేషన్ సమీపంలోని నిర్మాణంలో ఉన్న ఓ సంస్థకు సంబంధించిన కూలీలు తమకు చిరుత పులి కనిపించిందంటూ వీడియోలు తీసి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు రంగంలోకి దిగి ప్రజలను అప్రమత్తం చేశారు. ఆ వీడియో తీసినట్లు చెబుతున్న కూలీలను మియాపూర్ సీఐ క్రాంతికుమార్ విచారించారు. తాము చూశామని వారు సీఐకి వివరించడంతో ఆయన అటవీ శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. మెట్రోకు సమీపంలో నడిగడ్డ, సుభాష్ చంద్రబోస్ నగర్ తండాలతోపాటు పలు నిర్మాణ సంస్థల కార్మికుల క్యాంపులు ఉండడంతో మియాపూర్ పోలీసులు కార్మికులతోపాటు వారి యాజమాన్యాలను సైతం అప్రమత్తం చేశారు. అటవీ శాఖ అధికారులు పాదముద్రలను పరిశీలిస్తేనే పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

అదిరే రుచి.. నాణ్యత ఛీ..ఛీ



- చెట్నీస్ హోటల్‌లో బొద్దింకలు, కుళ్లిన కూరగాయలు
- ప్రకాశ్‌నగర్‌లో గుట్టలుగా కుళ్లిన కోడి మాంసం ప్యాకెట్లు
- తనిఖీలయ్యాక చేతులు కలుపుతోన్న కొందరు అధికారులు

ఈనాడు, హైదరాబాద్: నగరంలో ఆహార కల్తీ తీవ్రమైంది. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలోని టాస్క్ ఫోర్స్ బృందం, టాస్క్ ఫోర్స్ పోలీసులు కల్తీ కేంద్రాలపై వరుసగా దాడులు చేస్తున్నప్పటికీ.. కొందరు యజమానులు వైఖరి మార్చుకోవట్లేదు. కుళ్లిన మాంసం, కూరగాయలను వంటలకు ఉపయోగిస్తున్నారు. వంట గదులను మరుగుదొడ్డిలా నిర్వహిస్తున్నారు. తుప్పు పట్టిన పాత్రల్లో ఆహారం తయారు చేసి ప్రజారోగ్యాన్ని పణంగా పెడుతున్నారు. జీహెచ్ఎంసీ ఆరోగ్య విభాగంలోని కొందరు అధికారుల తీరు అందుకు ప్రధాన కారణం. యాజమాన్యాలతో కుమ్మక్కై ప్రయోగశాల నివేదికలను తొక్కి పెడుతున్నారనే విమర్శలొస్తున్నాయి.

కందిపప్పులో బొద్దింకలు..



కొండాపూర్ శరత్ సిటీ మాల్‌లోని చెట్నీస్ హోటల్‌లో శుక్రవారం రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు చేపట్టింది. "కంది పప్పు డ్రమ్ములో బొద్దింకలున్నాయి. గోధుమపిండి, రవ్వకు పురుగులు పట్టి నల్లగా మారాయి. ఫినాయిల్ డబ్బాలను కిరాణ సరకులను ఒకే చోట నిల్వ చేశారు. ఉల్లిపాయలు, క్యాబేజీ గడ్డలు పూర్తిగా కుళ్లాయి"అని టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపారు. అదే మాల్‌లోని అల్పాహార్ టిఫిన్స్ కేంద్రంలో.. మూతల్లేని చెత్త డబ్బాలు, ఇతర లోపాలు గుర్తించారు.

బయట తినాలంటేనే..

తీరిక లేని నగర జీవనంలో.. మెజార్టీ నగరవాసులు సమయానికి ఇంట్లో తినలేని పరిస్థితులు ఉన్నాయి. దగ్గర్లోని హోటల్‌లో లేదా రెస్టారెంట్లలో తిని రోజు గడుపుతుంటారు. అవసరాన్ని ఆసరాగా తీసుకుంటున్న యాజమాన్యాలు.. నాసిరకం సరకులతో, అపరిశుభ్రత, అనారోగ్యకర వాతావరణంలో వంటలను తయారు చేస్తున్నారు. **టాస్క్‌ఫోర్స్ బృందాలు ఇటీవల దాదాపు 500ల చోట్ల తనిఖీలు చేయగా, 90శాతం కేంద్రాల్లో లోపాలు బయటపడటమే అందుకు నిదర్శనం.** దాంతో.. నగరవాసులు బయట తినాలంటే వణికిపోతున్నారు.

జీహెచ్ఎంసీ చేతివాటం..

రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృందం రోజూ హోటళ్లలో తనిఖీ చేస్తోంది. ఓ రోజు తర్వాత లోపాలను 'ఎక్స్' వేదికగా వెల్లడిస్తోంది. 20 మంది ఆహార భద్రతాధికారులు ఉన్న జీహెచ్ఎంసీ మాత్రం.. ఏడాదికో, ఆర్నెల్లకో తనిఖీ నివేదికలను ప్రకటిస్తోంది. ఏ రోజు ఏ హోటల్‌ను తనిఖీ చేశారనే విషయాన్ని కనీసం నెలకోసారి కూడా చెప్పట్లేదు. పైగా.. రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీ చేసిన హోటళ్ల యజమానులతో కొందరు బల్దియా ఫుడ్‌ఇన్‌స్పెక్టర్లు చేతులు కలుపుతున్నారని, అందుకే ల్యాబ్ పరీక్షల నివేదికలను బయటపెట్టడం లేదని వాపోతున్నారు.



కూడళ్లు మెరవాలి.. నగరం మురవాలి



చౌరస్తాల్లో సుందరీకరణ పనులకు బల్దియా కార్యాచరణ

ఈనాడు, హైదరాబాద్: నగర వాతావరణం ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంటోంది. ఇప్పటికే పైవంతెనలు, విభాగినులకు రంగులద్దే కార్యక్రమం మొదలైంది. పైవంతెనల కింద ఖాళీస్థలాన్ని పార్కులుగా తీర్చిదిద్దుతున్నారు. పలు కూడళ్లలో రంగురంగుల విద్యుద్దీప కాంతులతో ఆకట్టుకునేలా ఫౌంటెయిన్లను అభివృద్ధి చేయనున్నారు.

కొత్త ఆకృతులతో.. గచ్చిబౌలి ఓఆర్ఆర్ వద్ద బస్టాప్, శేరిలింగంపల్లి జోన్‌లో అన్నపూర్ణ భోజన కేంద్రాలు, కొత్తగూడ పైవంతెన కింద మహిళా శక్తి క్యాంటీన్, ఐకియా కూడలిలో పబ్లిక్ ప్లాజా నిర్మాణానికి శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం డిజైన్లు రూపొందిస్తోంది.

పాత వాటిపైనా దృష్టిపెట్టాలి

- అబిడ్స్‌లోని ప్రధాన తపాలా కార్యాలయం ముందున్న నెహ్రూ కూడలిలో పొడవైన ఫౌంటెయిన్‌ను నిర్మించనున్నారు. నెహ్రూ విగ్రహాన్ని మరింత ప్రకాశింపజేసేలా విద్యుద్దీపాలను ఏర్పాటుచేసి.. కూడలిని విస్తరించి తొమ్మిది ఫౌంటెయిన్లు ఏర్పాటు చేయాలన్నది ప్రణాళిక. తపాలాశాఖ కార్యాలయాన్ని ప్రతిబింబించే పోస్టు బాక్సు నమూనాఏర్పాటు చేయనున్నట్టు అధికారులు చెబుతున్నారు.
- నారాయణగూడ కూడలిలో మార్కెట్ వైపున్న విభాగినిపై, ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ కూడలి, సచివాలయం ఎదురుగా, లక్డీకాపూల్ కూడలిలోనూ ఈ తరహా నిర్మాణాలు చేపట్టనున్నట్టు జీహెచ్ఎంసీ చెబుతోంది. చార్మినార్ గుల్జార్ హౌజ్ కూడలి, ఇతరత్రా ప్రాంతాల్లోని ఫౌంటెయిన్లను పునరుద్ధరించాలని, చారిత్రక కట్టడాలు, రద్దీ ప్రాంతాల్లో మరిన్ని నిర్మించాలని నగరవాసులు కోరుతున్నారు.

పరిమితికి మించి.. ముప్పు పొంచి



సరిగ్గా ఇద్దరు కూర్చోలేని ఆటోలో బండెడు సామగ్రిని వేసి తీసుకెళ్తున్న దృశ్యం హయత్‌నగర్‌లో కనిపించింది. ఏ ఒక్క సామాను కిందపడినా వెనక వచ్చే వాహనదారుల ప్రాణాలకు ముప్పే. నగరంలో పట్టపగలు పరిమితికి మించిన లోడ్‌తో దర్జాగా వెళ్తున్న వాహనాలు.. ఇతరుల పాలిట మృత్యు శకటాలుగా మారుతున్నాయి.

ఇద్దరూ ఓయూ పూర్వ విద్యార్థులే

ఉస్మానియా, తెలుగు విశ్వవిద్యాలయాలకు కొత్త ఉప కులపతులు



ఈనాడు, హైదరాబాద్: ఉస్మానియా వీసీగా ప్రొఫెసర్ కుమార్ మొలుగరం, తెలుగు వర్సిటీ ఉప కులపతిగా వెలుదండ నిత్యానందరావు బాధ్యతలు స్వీకరించనున్నారు. వీరిద్దరూ ఓయూ పూర్వ విద్యార్థులే. ప్రొ.కుమార్ ఓయూ ఇంజినీరింగ్ కళాశాలలో బీఈ(సివిల్) పూర్తిచేశారు. నిత్యానందరావు ఆర్ట్స్ కళాశాలలో ఎంఏ తెలుగు చదువుకున్నారు. ఇద్దరూ ఓయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా వృత్తి జీవితంలో ప్రవేశించారు. ప్రొఫెసర్ కుమార్ ప్రస్తుతం ఓయూలోని పట్టణ, పర్యావరణ ప్రాంతీయ అధ్యయన కేంద్రం సంచాలకులుగా ఉన్నారు. నిత్యానందరావు తెలుగు విభాగం అధ్యక్షుడిగా వ్యవహరించి 2022లో పదవీ విరమణ చేశారు.

ఇక్కడే చదువు.. ఉపకులపతి



ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉప కులపతి **ప్రొఫెసర్ కుమార్** ఉస్మానియా క్యాంపస్‌లో ఇంజినీరింగ్ పూర్తిచేశాక జేఎన్‌టీయూలో ఎంటెక్, ఐఐటీ బాంబేలో పీహెచ్‌డీ పూర్తిచేశారు. వివిధ ఉద్యోగ అవకాశాలు లభించినా.. తాను చదువుకున్న చోటే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరాలన్న లక్ష్యంతో ఓయూకే ప్రాధాన్యం ఇచ్చారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో విధుల్లో చేరినా, పరిశోధనలవైపు దృష్టి కేంద్రీకరించారు. ఇంజినీరింగ్ కళాశాలలో ఎంటెక్ ట్రాన్స్‌పోర్టేషన్ విభాగం ఏర్పాటుకు కృషిచేశారు. ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయంలో చదువుకుని ఉప కులపతిగా బాధ్యతలు చేపట్టడం ఎంతో సంతోషంగా ఉందని ప్రొఫెసర్ కుమార్ తెలిపారు. వర్సిటీ ప్రతిష్ఠను మరింత పెంచేందుకు అందరి సహకారం తీసుకుంటానని వివరించారు.

తెలుగు భాషతో మమేకం



పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉప కులపతి, విశ్రాంత ఆచార్యులు **వెలుదండ నిత్యానందరావు** తెలుగు భాషతో మమేకమయ్యారు. ఆయన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులంతా తెలుగు పండితులే. డిగ్రీ చదువుతున్నప్పుడు అన్ని ప్రముఖ పత్రికల్లో నిత్యానందరావు రచనలు ప్రచురితమయ్యాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సహాయ ఆచార్యులుగా విధులు చేపట్టాక తెలుగు భాషపై మరిన్ని పరిశోధనలు చేశారు. విశ్వవిద్యాలయం పాఠ్య ప్రణాళిక సంఘం అధ్యక్షుడిగా వ్యవహరించారు. 'విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన' పేరుతో ఆయన రాసిన గ్రంథం అన్ని విశ్వవిద్యాలయల తెలుగు శాఖల్లో పరిశోధకులకు, పర్యవేక్షకులకు ప్రామాణిక గ్రంథంగా ఉపయోగపడుతోంది. దేశ పౌరుల్లో భారతీయతను జ్వలింపజేసేలా వందేమాతరం గీతం రాసిన బంకించంద్ర చటర్జీ జీవితంపై రాసిన బంకించంద్ర పుస్తకం లక్షల మందిలో స్ఫూర్తి నింపుతోంది. తెలుగు విశ్వవిద్యాలయం ఉప కులపతిగా బాధ్యతలు చేపట్టడం చాలా సంతోషంగా ఉందని నిత్యానందరావు తెలిపారు.

ప్రైవేటు బస్సులతో ట్రాఫిక్ ఇక్కట్లు!

- నగరంలోకి రాత్రి 10 గంటలకు ముందే ప్రవేశం
- స్పెషల్ డ్రైవ్‌కు సిద్ధమైన ట్రాఫిక్ పోలీసులు

ఈనాడు, హైదరాబాద్ : నగరంలోకి నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశిస్తున్న ప్రైవేటు బస్సులు ట్రాఫిక్ సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి. దీంతో వాటి రాకపోకలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టి కేసులు నమోదు చేసేందుకు ట్రాఫిక్ పోలీసులు సిద్ధమయ్యారు. ప్రైవేటు బస్సులు, భారీవాహనాలు రాత్రి 10 గంటల వరకూ నగరంలోకి ప్రవేశించకూడదనే నిబంధన ఉంది. ఈ ఏడాది మొదట్లో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టి 320కు పైగా కేసులు నమోదు చేశారు. ఆ తరువాత కొద్దిరోజులు నిబంధనలు పాటించిన ట్రావెల్స్ నిర్వాహకులు ప్రస్తుతం యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రి 8-9 గంటల మధ్య నగరంలోకి చేరుతున్నారు. నిబంధనలు పాటించని వాహనాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్ ఆదేశించారు. రెండ్రోజులు ప్రత్యేక తనిఖీలు చేపట్టనున్నట్టు తెలిపారు.

ఐటీ కారిడార్‌లో అత్యాధునిక వేదిక




ఈఎస్‌సీఐ కన్వెన్షన్ సెంటర్‌లోని ఆడిటోరియం

ఈనాడు, హైదరాబాద్: ఐటీ కారిడార్‌లో సభలు, సమావేశాలకు మరో అధునాతన కన్వెన్షన్ సెంటర్ అందుబాటులోకి వచ్చింది. విశాలమైన ఆడిటోరియం, లెక్చర్, సెమినార్ హాల్స్, కోవర్కింగ్ స్పేస్ వంటి సదుపాయాలతో గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఈఎస్‌సీఐ) ప్రాంగణంలో కొలువుదీరింది. 72వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునికంగా తీర్చిదిద్దారు. 800 సీట్ల సామర్థ్యం కలిగిన ఆడిటోరియం నిర్మించారు. అవుట్‌డోర్, ఇండోర్లలో ఎగ్జిబిషన్ ఏర్పాటుకు తగ్గ సౌకర్యాలు ఉన్నాయి. ఇందులో కోవర్కింగ్ స్పేస్ కల్పించారు. ఇది కొత్తదనే చెప్పవచ్చు.

నిర్వాసితులకు అన్నివిధాల న్యాయం చేస్తాం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్, న్యూస్‌టుడే, ఖైరతాబాద్: మూసీ పరీవాహక ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి పునరావాసం కల్పించి, వారి ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి న్యాయం చేస్తుందని మంత్రి సీతక్క అన్నారు. ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మూసీ పరీవాహక ప్రాంతాల స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక సహాయం అందించారు. 172 మంది మహిళలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున రూ.3.44 కోట్ల ఆర్థిక సాయాన్ని మలక్‌పేట, కార్వాన్ ఎమ్మెల్యేలు అహ్మద్ బిన్ బలాల, కౌసర్ మొహియుద్దీన్, డిప్యూటీ మేయర్ శ్రీలతరెడ్డిలతో కలిసి మంత్రి పంపిణీ చేశారు. అందులో రూ.1.40లక్షలు సబ్సిడీగా ఉంటాయని, మిగిలిన రూ.60వేలు మూడేళ్లలో వాయిదాలుగా చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. సీతక్క మాట్లాడుతూ.. మూసీ నీటి కారణంగా అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆ నీటిని తాగదగిన స్థాయికి తీసుకురావడానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. పునరావాస కుటుంబాలకు ఉచిత విద్య, అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రవేశం, రెండు పడక గదుల ఇళ్లు అందించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ బలాల మాట్లాడుతూ.. మూసీ పరీవాహకంలో వరదలొస్తే పునరావస కేంద్రాలకు తరలించేవారమని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజ్, మూసీ జేడీఎం గౌతమి, ఈడీ శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఎండీ మల్లయ్యభట్టు తదితరులు పాల్గొన్నారు.



మూసీ పరివాహక ప్రాంతాల స్వయం సహాయక సంఘాల మహిళలకు చెక్కు అందజేస్తున్న మంత్రి సీతక్క. చిత్రంలో ఎమ్మెల్యేలు కౌసర్ మొహియుద్దీన్, అహ్మద్ బలాల, డిప్యూటీ మేయర్ శ్రీలత తదితరులు

మూసీ ప్రక్షాళనలో ముందడుగు

- గోదావరి ఫేజ్-2కు ఈ నెలలోనే టెండర్లు!
- రెండు ప్యాకేజీల కింద చేపట్టే యోచన

ఈనాడు, హైదరాబాద్: విస్తరిస్తున్న మహానగరానికి పుష్కలంగా తాగునీటిని అందించడంతోపాటు మూసీ ప్రక్షాళనకు చేపడుతున్న గోదావరి ఫేజ్-2 ప్రాజెక్టుకు ఈ నెలలోనే టెండర్లు ఆహ్వానించేందుకు జలమండలి సమాయత్తమవుతోంది. టెండర్ల విధి విధానాల రూపకల్పనలో అధికారులు కసరత్తు చేస్తున్నారు. వారం పది రోజుల్లో ప్రకటన వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టుకు రూ.5,560 కోట్లు కేటాయిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ గతంలో ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ పథకం కింద 15 టీఎంసీల గోదావరి జలాలను మల్లన్నసాగర్ నుంచి తరలించనున్నారు. ఇందులో 10 టీఎంసీలు నగర తాగునీటి అవసరాలకు పోను... మిగతా 5 టీఎంసీలు మూసీ ప్రక్షాళనకు వినియోగించనున్నారు.

భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని... ప్రస్తుతం హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం వివిధ జలాశయాల నుంచి 560 ఎంజీడీల వరకు సరఫరా చేస్తున్నారు. నగర విస్తరణ నేపథ్యంలో భవిష్యత్తులో తాగునీటికి మరింత డిమాండ్ పెరగనుంది. గోదావరి ఫేజ్-1 ద్వారా ఇప్పటికే ఏటా 10 టీఎంసీలు(రోజుకు 172 ఎంజీడీలు) ఎల్లంపల్లి రిజర్వాయర్ నుంచి తరలిస్తున్న సంగతి తెలిసిందే. గోదావరి ఫేజ్-2లో మల్లన్నసాగర్ నుంచి గోదావరి జలాలను మరో 170 ఎంజీడీలు తరలించనున్నారు.



ఉస్మాన్‌సాగర్‌లోకి ఇలా...

మల్లన్నసాగర్ నుంచి శామీర్‌పేట్ వద్దనున్న ఘన్‌పూర్ వరకు భారీ పైపులు నిర్మిస్తారు. ఇక్కడ నీటిని శుద్ధి చేశాక అక్కడే చేపట్టే బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి తరలిస్తారు. అక్కడ నుంచి నగరానికి పంపింగ్ చేస్తారు. ముత్తంగి వద్ద ఇప్పటికే ఉన్న గోదావరి ఫేజ్-1 రింగ్‌మెయిన్లకు అనుసంధానిస్తారు. ఘన్‌పూర్ నుంచి అవుటర్ రింగ్ అవతలి భాగం నుంచి ముత్తంగి, కొల్లూరు, జన్వాడ మీదుగా ఉస్మాన్‌సాగర్ వరకు 58 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ నిర్మిస్తారు. శుద్ధి చేయని గోదావరి జలాలతో ఉస్మాన్‌సాగర్‌ను నింపి.. అక్కడి నుంచి హిమాయత్‌సాగర్‌కు మరో పైపులైన్ ద్వారా తరలించి...తర్వాత మూసీలోకి విడిచి పెడతారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కరెంట్ కట్

నిలిచిన రిజిస్ట్రేషన్లు


రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: నగరంలోని రెడ్‌హిల్స్‌లో ఉన్న హైదరాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో భవన యజమాని శుక్రవారం కరెంట్ కట్ చేశారు. ఫ్యూజులు తీసుకొని వెళ్లిపోయారు. కార్యాలయంలో అంధకారం నెలకొంది. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోయింది. ఆరు నెలలుగా అద్దె చెల్లించడం లేదని.. కరెంట్ బిల్లు కట్టడం లేదని.. భవనం ఖాళీ చేయాలంటూ యజమాని అధికారులకు సూచించారు. కొంతసేపు కార్యాలయంలో గందరగోళ వాతావరణం నెలకొంది. రిజిస్ట్రేషన్లకు వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చీకట్లోనే చాలా సేపు వేచి ఉన్నారు. సబ్-రిజిస్ట్రార్ శ్రీనివాస్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే బిల్లులు చెల్లిస్తామని చెప్పడంతో యజమాని విద్యుత్‌ను పునరుద్ధరించారు.



చీకట్లో కార్యాలయం

పకడ్బందీగా గ్రూప్-I మెయిన్స్ పరీక్షలు

కలెక్టర్ ఆదేశాలు



కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పరీక్ష నిర్వహణ, ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించి.. దిశానిర్దేశం చేశారు. ఈ నెల 21 నుంచి 27 వరకు హైదరాబాద్ జిల్లాలో నిర్వహించనున్న టీజీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష కోసం ఏర్పాటు చేసిన 8కేంద్రాల్లో సమస్యలు ఉత్పన్నం కాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పోలీసు బందోబస్తు, పర్యవేక్షణ మధ్య ప్రశ్నాపత్రాలు కేంద్రాలకు చేరుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, కనీస మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. 261 మంది పీడబ్ల్యూడీ అభ్యర్థులకు బేగంపేట ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల 'ఏ'లో కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. కేంద్రాల్లో సీసీ కెమెరాలతో పర్యవేక్షించాలని చీఫ్ సూపరింటెండెంట్‌లను ఆదేశించారు. రవాణా ఇబ్బందులు కలగకుండా సకాలంలో ఆర్టీసీ బస్సులు నడపాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ ఈ. వెంకటాచారి, డీసీపీ ఎన్.భాస్కర్, ఏసీపీ అశోక్‌కుమార్, సీహెచ్ అశోక్ కుమార్, భాస్కర్, ఆర్డీవోలు మహిపాల్‌రెడ్డి, దశరథ్ సింగ్, పరీక్షా నిర్వహణ అధికారులు పాల్గొన్నారు.

కేంద్రాల వద్ద ఆంక్షలు

ఈనాడు, హైదరాబాద్: ఈ నెల 21 నుంచి 27 వరకు జరిగే గ్రూప్ 1 మెయిన్స్ పరీక్ష కేంద్రాల వద్ద ఆంక్షలు అమల్లో ఉంటాయని సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి తెలిపారు. కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఐదుగురు అంతకు మించి గుమికూడటం నిషేధమన్నారు.

ప్రజాసేవే భాజపా లక్ష్యం: చింతల



సభ్యత్వ నమోదులో చింతల రామచంద్రారెడ్డి తదితరులు

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: ప్రజా సేవ, దేశ సమగ్రత భాజపా లక్ష్యమని అందువల్లే వరుసగా మూడోసారి కేంద్రంలో అధికారం చేపట్టిందని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని ఉదయన గర్, రోడ్డు నం.3 జర్నలిస్టు కాలనీ ప్రాంతాల్లో పార్టీ సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొన్నారు. భాజపా విధానాలను ప్రజలు విశ్వసించడం వల్ల 10 కోట్ల మంది పార్టీ సభ్యత్వం స్వీకరించారని, తెలంగాణలో 20 లక్షలు దాటిందని అన్నారు. భాజపా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి మేచినేని శ్రీనివాసరావు, బీజేవైఎం జాతీయ కార్యదర్శి బద్దం మహిపాల్‌రెడ్డి, నేతలు శ్రావణ్ యాదవ్, చంద్రశేఖర్, ఫణికుమార్, వినయ్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్

• ఖైరతాబాద్ • జూబ్లీహిల్స్

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: ఉ.10-11: బంజారాహిల్స్ రోడ్డు నం.10, కార్వీ బిల్డింగ్, స్టార్ ఆస్పత్రి, శ్రీ కంచి ప్రాంతాలు. ఉ.10.30-11: జూబ్లీహిల్స్ రోడ్డు నం.36, 39, 40, 41, 42, 43, 44, పాత మాటీవీ కార్యాలయం, న్యూయార్క్ స్కూల్ ప్రాంతాలు. ఉ.11.30-మ.12: జూబ్లీహిల్స్ రోడ్డు నం. 10బీ, 10సీ, 25, 33, 34, 35, 36, స్విమ్మింగ్ పూల్, బీఎన్ మల్లిక్ లేన్ ప్రాంతాలు. ఉ.11.30-మ.1: నామ్‌ధారి టెంట్‌హౌస్, అజారుద్దీన్ నివాస ప్రాంతం, శ్రీ కంచి శారీస్ ప్రాంతాలు. మ.12-12.30: ఆడి వర్క్‌షాప్ లేన్, రవీంద్ర సొసైటీ నం. 8, 9, 10, 11, కేకే హిల్స్, బీఎం నాయుడు నివాస ప్రాంతం, ఎన్ఎండీసీ, హనుమాన్ దేవాలయం, పార్క్ హయత్ వెనుక ప్రాంతం. మ.12-1: లుంబినీ మాల్, సాగర్ సొసైటీ సిగ్నల్స్, బీబీ పాటిల్ కార్యాలయం, మ్యాంగో టీవీ ప్రాంతాలు. మ.3-సా.4.30: బంజారాహిల్స్ రోడ్డు నం.7, ఈ-సేవ, మెరిడియన్ స్కూల్, ఒక్రిడ్జ్ బ్యాంక్ ప్రాంతాలు.

స్వర నీరాజనం 24న

నారాయణగూడ, న్యూస్‌టుడే: వంశీ ఇంటర్నేషనల్ (ఇండియా), శారద ఆకునూరి (అమెరికా) ఆధ్వర్యంలో 'మనసా కవ్వించకే నన్నిలా' శీర్షికన సినీ గేయ రచయిత మైలవరపు గోపికి ఈనెల 24న స్వరనీరాజనం సమర్పించనున్నట్లు నిర్వాహకుడు వంశీ రామరాజు ఓ ప్రకటనలో తెలిపారు. రవీంద్రభారతిలో జరిగే ఈ కార్యక్రమానికి అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.

ఉప ప్రణాళిక నిధుల దుర్వినియోగంపై కమిషన్ వేయండి

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు రూ.2 లక్షల కోట్ల దుర్వినియోగంపై హైకోర్టు న్యాయమూర్తి చేత విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలని దళిత బహుజన పార్టీ (డీబీపీ) జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు. హిమాయత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ.. గత పదేళ్లలో దళిత జాతుల అభివృద్ధికి కేటాయించిన సబ్‌ప్లాన్ నిధులు మళ్లించారని, బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలన్నారు. దుర్వినియోగం అయిన నిధులు రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. 2014 నుంచి 2024 అక్టోబరు వరకు నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ కార్యవర్గ సభ్యుడు హనుమంతు, గ్రేటర్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.

నగరాన్ని చెత్తరహితంగా మారుద్దాం

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రత పాటించి నగరాన్ని చెత్తరహితంగా మార్చేందుకు ప్రజలు భాగస్వాములు కావాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. బంజారాహిల్స్ రోడ్డు నం.12లోని ఆమె నివాసం వెనుక ప్రాంతంలో రూ. 17లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చెత్తను రోడ్లపై వేయద్దని సూచించారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నేతలు, స్థానికులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డును ప్రారంభించిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

ఎలా ఎక్కాలి.. దిగాలి..!



స్తంభాలు, బస్‌స్టాప్‌లు అక్కడే..


☛ ఎత్తైన కాలిబాటలతో అవస్థలు ☛ ఇబ్బందులు పడుతున్న వృద్ధులు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: రహదారుల పక్కన పాదచారులు వెళ్లేందుకు నిర్మించిన కాలిబాటలు ప్రజలకు ఉపయోగం మాట అటుంచితే... వృద్ధులు, చిన్నారులు, మహిళలు వాటిని ఎక్కేందుకు అవస్థలు పడాల్సి వస్తోంది. అసలు కాలిబాట రోడ్డుకు ఎంత ఎత్తులో ఉండాలి అనే విషయాన్ని పరిగణలోకి తీసుకోకుండా బేగంపేట, పంజాగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో పలుచోట్ల మూడు, నాలుగు అడుగుల ఎత్తులో, ఒక్కోచోట రోడ్డుకు సమాంతరంగా నిర్మిస్తుండటంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల అసలు కాలిబాటే ఉండని పరిస్థితి ఉంటోంది. దీనిపై బల్దియా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అభివృద్ధి పనుల పేరిట..

అభివృద్ధి పనుల పేరిట పాత కాలిబాటలను ధ్వంసం చేసి అలాగే వదలేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. బంజారాహిల్స్‌లోని కేబీఆర్ ఉద్యానవనం చుట్టూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇటీవల జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఉద్యానవనం చుట్టూ చేపట్టిన అభివృద్ధి పనుల్లో కాలిబాటను తవ్వేసి మట్టిని అక్కడే వదిలేశారు. వరుస ఫిర్యాదులతో అరకొర పనులు చేసి చేతులు దులిపేసుకున్నారు.

కాలిబాటల్లోనే విద్యుత్తు స్తంభాలు, బస్టాపులు ఉంటున్నాయి. ఫలితంగా నడిచి వెళ్లేవారు ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోంది. గతంలో జూబ్లీహిల్స్ ఠాణా పరిధిలోని జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వద్ద, కృష్ణానగర్‌లో ఈ విద్యుత్తు స్తంభాల కారణంగా ఇద్దరు మృతి చెందారు. కొందరు పాదచారులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వీడియో తీసి 'ఎక్స్'లో పోస్టు చేసిన సందర్భాలు ఉన్నాయి.



నడిచేందుకు చోటు లేదు: తుమ్మల సత్య, సినీ, టీవీ ఆర్టిస్ట్

నగర రహదారులపై పాదచారులకు భద్రత లేదు. వారు నడిచేందుకు చోటు లేదు. వృద్ధులు ఎత్తైన కాలిబాటలు ఎక్కలేకపోతున్నారు. కొన్నిచోట్ల వాహనదారులు కాలిబాటలపై వెళ్తుండంతో ధ్వంసమవుతున్నాయి. కాలిబాటలను అందరి అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలి. ఎలాంటి అడ్డంకులు లేకుండా నడిచి వెళ్లేలా ఉండాలి.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ.1 గంట మధ్య

ఖైరతాబాద్	80085 73345
జూబ్లీహిల్స్	80085 73352
బంజారాహిల్స్	80085 73348

న్యూస్‌టుడే, ఖైరతాబాద్,

? నెల రోజులుగా జర్నలిస్టు కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. ఐదారు నెలలుగా ఎన్ని ఫోన్లు చేసినా స్పందన లేదు. -ఎలమంచిలి సురేష్‌కుమార్, జర్నలిస్టు కాలనీ

? ఆనంద్‌నగర్ కాలనీలోని మసీదు రోడ్డులో రోడ్డు పొడవునా నెల రోజులుగా వెలగడంలేదు. జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే మూడు రోజుల్లో చేస్తామని చెప్పినా చేయలేదు. – శ్యామ్, ఆనంద్‌నగర్, బాలాజీ అపార్టుమెంట్

✓ లైట్లు అందుబాటులో లేక ఆలస్యమైంది. రెండు చోట్ల శనివారమే దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. – కిరణ్మయి, డీఈ, జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్, సుష్మ, ఏఈ, జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్

వాలెట్ పార్కింగ్‌కు ఇస్తే.. ఆభరణాలు మాయం

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: వాలెట్ పార్కింగ్‌లో కారు ఇస్తే కారులో అందులో ఉంచిన రూ. 7లక్షలకు పైగా విలువైన ఆభరణాలు మాయమైన ఘటన ఇది. జూబ్లీహిల్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పంజాగుట్టకు చెందిన వై.వి.మూర్తి దంపతులు జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 10లోని జామూన్ హోటల్ కారులో వచ్చారు. వాహనంలో దాదాపు 100 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక జత వజ్రపు చెవిపోగులు ఉన్నాయి. కారును వాలెట్ పార్కింగ్‌కు ఇచ్చి భోజనం చేసిన తర్వాత కారు తీసుకొని హిమాయత్‌నగర్ వెళ్లారు. అనంతరం కారులో ఆభరణాలను పరిశీలించగా కనిపించలేదు. తిరిగి హోటల్‌కు వెళ్లి అక్కడున్న వాలెట్ సిబ్బంది రామ్‌కరణ్ యాదవ్, తేజ్‌నారాయణ్ ముఖియా, కుమార్ రాకేష్‌లను ప్రశ్నించారు. తమకు తెలియదని చెప్పడంతో జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాయిబాబా ఆలయంలో చోరీ

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: సాయిబాబా ఆలయంలో హుండీ చోరీకి గురైన ఘటన ఇది. బంజారాహిల్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నంబరు 14లోని క్యాన్సర్ ఆసుపత్రి ముందు సాయిబాబా ఆలయం ఉంది. నాలుగేళ్లుగా మీర్‌పేట ప్రాంతానికి చెందిన అజయ్‌కృష్ణ అర్చకుడిగా వ్యవహరిస్తున్నారు. ఈనెల 16న పూజల అనంతరం సాయంత్రం వెళ్లిపోయారు. 17న ఉదయం వచ్చి చూడగా ఆలయంలో హుండీ కనిపించలేదు. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దుకాణం ముందు కారు నిలిపారని టైర్లు పంక్చర్

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: కారు దుకాణం ముందు నిలిపి, మరోచోటికి షాపింగ్‌కు వెళ్లిన మహిళ కారు టైర్లను పంక్చర్ చేసి, బెదిరింపులకు పాల్పడిన ఘటన ఇది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నంబరు 12లో నివసించే దర్శకుడు సంకల్ప్ రెడ్డి సతీమణి కీర్తిరెడ్డి ఫ్యాషన్ డిజైనర్. బంజారాహిల్స్ రోడ్ నంబరు 10లో ఉన్న ఫ్యాన్సీ స్టోర్‌లలో దుస్తులు కొనుగోలు చేయడానికి వెళ్లారు. ఈ క్రమంలో వాహనాన్ని రంగ్రేజ్ ఫ్యాబ్రిక్ స్టోర్ ముందు నిలిపారు. షాపింగ్ పూర్తి చేసుకొని తిరిగి వచ్చేసరికి రంగ్రేజ్ దుకాణానికి చెందిన సిబ్బంది కారు రెండు టైర్లను పంక్చర్ చేయడమే కాకుండా, టైర్లను ధ్వంసం చేసేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఈ విషయాన్ని యజమాని దృష్టికి తీసుకెళ్లగా దురుసుగా వ్యవహరించాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇళ్ల మధ్య వ్యభిచారం.. కేసు

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: ఇళ్ల మధ్య గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న వ్యభిచార కేంద్రంపై మధురానగర్ పోలీసులు దాడి చేశారు. పోలీసుల కథనం ప్రకారం...జవహర్ నగర్ ప్రాంతంలో ఏపీలోని కృష్ణాజిల్లా నందిగామకు చెందిన ముప్పల జ్యోతి వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారంతో గురువారం రాత్రి పోలీసులు దాడిచేశారు. నిర్వాహకురాలు జ్యోతితో పాటు రాజమండ్రికి చెందిన ఓ యువతిని కూకట్‌పల్లికి చెందిన విటుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: విధులకు వెళ్తున్నానని చెప్పిన యువతి అదృశ్యమైన ఘటన ఖైరతాబాద్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రేమ్‌నగర్‌కు చెందిన యువతి బంజారాహిల్స్‌లోని ఓ ఆసుపత్రిలో ఆరునెలలుగా హౌస్‌కీపింగ్ పనులు చేస్తోంది. ఈనెల 15న విధులకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. అన్నిచోట్లా ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో కుటుంబీకులు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు ఏఎస్ఐ శ్రీరాములు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



జూబ్లీహిల్స్ కూడలి.. వెలుగుల లోగిలి

నగర సుందరీకరణలో భాగంగా జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ కూడలిలో జీహెచ్ఎంసీ వీధి దీపాల విభాగం ఏర్పాటు చేసిన వీధి దీపాలు ప్రజలను ఆకర్షిస్తున్నాయి. 'సంగీతంతో ఆనందించు' అనే థీమ్‌తో సంగీత వాయిద్య పరికరాల నమూనాలపై ఈ దీపాలు ఏర్పాటు చేశారు. జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు సర్కిల్ 18 వీధి దీపాల విభాగం వీటిని ఏర్పాటు చేసినట్లు ఏఈ సుష్మ తెలిపారు. – న్యూస్‌టుడే, బంజారాహిల్స్

హెచ్ఎండీఏ సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

ఈనాడు, హైదరాబాద్: బుద్ధపూర్ణిమ ప్రాజెక్ట్ సీనియర్ అసిస్టెంట్ జి.రవీందర్‌రెడ్డిని హెచ్ఎండీఏ కమిషనర్ సస్పెండ్ చేశారు. నకిలీ జీవో సృష్టించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసినందుకు ఆయనపై వేటు వేశారు. అతనిపై గత నెలలోనే సైఫాబాద్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. తాజాగా సస్పెండ్ చేస్తూ హెచ్ఎండీఏ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

ఉపకార వేతనాలు, బోధన రుసుం విడుదల చేయాలి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

హిమాయత్‌నగర్: పెండింగ్‌లో ఉన్న ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. విద్యారంగ సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే సమీక్ష నిర్వహించి, పరిష్కరించాలని కోరింది. శుక్రవారం సమితి ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్ వై.జంక్షన్‌లో ప్లకార్డులతో నిరసన తెలిపిన రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. విద్యాశాఖ ముఖ్యమంత్రి వద్దే ఉన్నా దృష్టిని సారించకపోవడం బాధాకరమన్నారు. మూడు సంవత్సరాలుగా బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు తమ కోర్సులు పూర్తి అయినా ధ్రువపత్రాలు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పీఆర్ఎస్ఐ జాతీయ ఉత్తమ కార్యదర్శిగా యాదగిరి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్ సెక్రటరీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దూర విద్యా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కంభంపాటి యాదగిరిని పీఆర్ఎస్ఐ జాతీయ నాయకత్వం జాతీయ ఉత్తమ కార్యదర్శి అవార్డుకి ఎంపిక చేసింది. న్యూదిల్లీలో జరిగిన జాతీయ స్థాయి సదస్సులో దీనిని శుక్రవారం ప్రకటించినట్లు యాదగిరి తెలిపారు.



యాదగిరిని అభినందిస్తున్న శ్రీనివాసరావు, ఎస్.రాము

ప్రజావాణితో పట్టాదారు పాస్ పుస్తకం వచ్చింది



పట్టాదారు పాస్ పుస్తకాన్ని చూపుతున్న రుక్మిణి, చిత్రంలో దివ్య దేవరాజన్, డా.చిన్నారెడ్డి తదితరులు

సోమాజిగూడ, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టిన ప్రజావాణి కార్యక్రమంతో అనేక సమస్యలు పరిష్కారం అవుతున్నాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా.జి.చిన్నారెడ్డి పేర్కొన్నారు. అనేక పర్యాయాలు అధికారుల చుట్టూ తిరిగి, చివరకు ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే సమస్య పరిష్కారమైందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, ఘట్‌కేసర్ మండలం. ఏదులాబాద్ గ్రామానికి చెందిన రుక్మిణి శుక్రవారం ప్రజాభవన్‌కు వచ్చి సంతోషం వ్యక్తం చేశారు. ధరణి తప్పిదాల వల్ల తన 16 గుంటల భూమికి పట్టా ఇవ్వలేదని, మూడేళ్లుగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయిందన్నారు. ప్రజావాణిలో దరఖాస్తు చేయగా, మూడునెలల్లోనే పట్టాదారు పాసు పుస్తకం వచ్చిందని తెలిపారు.

627 అర్జీలు: ప్రజా భవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి శుక్రవారం 627 అర్జీలు అందాయి. అధికంగా ఇళ్ల కోసం 185 రాగా, సాంఘిక సంక్షేమ శాఖ-108, రెవెన్యూ-60, విద్యుత్-57, ఎన్ఆర్ఐ విభాగం-4, ఇతర శాఖలకు 213 వచ్చినట్లు అధికారులు తెలిపారు. వాటిని పరిష్కరించాలని చిన్నారెడ్డితో పాటు నోడల్ అధికారి దివ్య అధికారులకు సూచించారు.

మూసీకంటే ముందు పీసీబీ ప్రక్షాళన అవసరం



మాట్లాడుతున్న పీఎల్ఎన్ రావు, చిత్రంలో రాజారాం సింగ్, రాజేష్ కుమార్, లింగారెడ్డి, మల్లేష్ యాదవ్

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: నగరంలో ముంపు సమస్యలు పునరావృతం కాకుండా మూసీ పునరుజ్జీవం అవసరమని పర్యావరణ సామాజిక కార్యకర్త పీఎల్ఎన్ రావు అన్నారు. అంతకంటే ముందు కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ)ని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. పీసీబీ పనితీరుపై సీఎం దృష్టి సారించాలన్నారు. పటాన్‌చెరు, జీడిమెట్ల తదితర పారిశ్రామిక వాడల్లోని పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలను పూర్తి స్థాయిలో శుద్ధి చేయకుండా నాలాల ద్వారా మూసీలోకి వదులుతున్నారన్నారు. ఫలితంగా భూగర్భ జలాలు కలుషితమై 20 ఏళ్లుగా రంగారెడ్డి, నల్గొండ జిల్లాల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మల్లాపూర్‌లోని ఎస్టీపీలో నీటిని శుద్ధి చేయకుండా నాలా నుంచి ఉప్పల్ చెరువులోకి విడుదల చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పీసీబీ అధికారులు పరిశ్రమల యాజమాన్యాలతో కుమ్మక్కై ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. అందుకే హైడ్రాను స్వాగతించాల్సిందేనని, చెరువులు, కుంటలు ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను తొలగించడంలో తప్పు లేదన్నారు. పేదలకు ప్రత్యామ్నాయం చూపాకే ఇళ్లను తొలగించాలని కోరారు. సమావేశంలో న్యాయవాది కరణం రాజేష్ కుమార్, బి.రాజారాం సింగ్, జె.మల్లేష్ యాదవ్, సీహెచ్ లింగారెడ్డి ఉన్నారు.

సాఫ్ట్‌వేర్ సంస్థల్లో ఉద్యోగాల పేరిట మోసం

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగాల పేరుతో రూ. 26లక్షల మేర మోసానికి పాల్పడిన వ్యక్తులపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ ప్రవంతినగర్‌లో నివసించే ఎ.వాసు టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఆయనకు అదే సంస్థలో పనిచేసే చల్ల శ్రీరాంకిరణ్ పరిచయమయడు. తనకు వివిధ సాఫ్ట్‌వేర్ సంస్థలతో పరిచయాలున్నాయని, ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ వాసుకు చెప్పాడు. ఇది నమ్మిన వాసు తనకు తెలిసిన 17 మందికి ఐబీఎం సంస్థలో ఉద్యోగాల కోసం, శ్రీరాంకిరణ్, అతని భార్య సంధ్యారాణి ఖాతాల్లోకి ఫిబ్రవరిలో రూ. 26లక్షలు పంపించారు. అనంతరం 17 మందికి ఉద్యోగాలు వచ్చినట్లు ఆఫర్ లెటర్లు ఇచ్చారు. దీంతో ఉద్యోగంలో చేరడానికి అభ్యర్థులు వెళ్లగా అవి నకిలీ పత్రాలని తేలింది. దీనిపై వాసు ప్రశ్నించగా వారికి మరో సంస్థలో ఉద్యోగాలిప్పిస్తానని నమ్మించాడు. అనంతరం భార్యభర్తలు చరవాణుల్లో అందుబాటులో లేకుండాపోయారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దంపతులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు చెస్ టోర్నీ

హైదరాబాద్, ఈనాడు: వారాస్ చెస్ అకాడమీ ఆదివారం హైదరాబాద్‌లో అంతర్జాతీయ ర్యాపిడ్ ఫిడె రేటింగ్ చెస్ టోర్నీ నిర్వహించనుంది. ఆదర్శ్ నగర్‌లోని జీపీ బిర్లా సెంటర్‌లో పోటీలు జరుగుతాయి. టోర్నీ ప్రైజ్‌మనీ రూ.3 లక్షలు. మరిన్ని వివరాలకు 8187093036 నంబర్లో సంప్రదించవచ్చు.

కరాటే విద్యార్థులకు బెల్ట్‌గ్రేడింగ్

బోరబండ: రహ్మత్‌నగర్‌లోని షావొలిన్ కుంగ్-ఫు మార్షల్‌ఆర్ట్స్ అకాడమీ ఎస్పీఆర్ హిల్స్ క్రీడాప్రాంగణంలో నిర్వహించిన బెల్ట్‌గ్రేడింగ్ కార్యక్రమంలో విద్యార్థులకు బెల్ట్‌లు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో అసౌకర్యాలపై ఫిర్యాదు చేస్తాం



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కవితారెడ్డి

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: వెంకటేశ్వరకాలనీ డివిజన్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అసౌకర్యాలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని స్థానిక కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి అన్నారు. బంజారాహిల్స్ ఇబ్రహీంనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో అందించే ఆహారంలో నాణ్యత లేదని స్థానికులు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. రెండురోజుల క్రితం పాడైన కోడిగుడ్లను చిన్నారులకు అందించడంపై ఆరా తీశారు. అక్కడి సౌకర్యాల గురించి టీచర్ కుమారిని అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీల ఉన్నతాధికారిణి జ్యోతితో చరవాణిలో మాట్లాడి సమస్యలు వివరించారు. ఎక్కువ రోజులు నిల్వ ఉన్న గుడ్లను చిన్నారులకు పంపిణీ చేయకూడదని, ఇందుకు సంబంధించిన టెండర్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చిన్నారులకు రెండు నెలల నుంచి టెట్రా ప్యాక్ పాలు అందడం లేదని, పుస్తకాలు సైతం రాలేదన్నారు.

అలరించిన 'ప్రణామ్'



'గురుపరంపర' ప్రాముఖ్యతను తెలియజేస్తూ రవీంద్రభారతిలో శుక్రవారం 'ప్రణామ్' శీర్షికన సమర్పించిన నృత్యనీరాజనం వీక్షకులను అలరించింది. అభినేత్రి ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో, భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఎస్‌బీఆర్ ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల (సికింద్రాబాద్) నృత్యగురువు మంజుల శ్రీనివాస్ వద్ద భరతనాట్యంలో శిక్షణ పొందిన విద్యార్థులు తమ అభినయంతో ఆకట్టుకున్నారు. – న్యూస్‌టుడే, రవీంద్రభారతి

అతిథి ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులకు ఆహ్వానం

బోరబండ, న్యూస్‌టుడే: బోరబండలోని తెలంగాణ బాలుర గురుకుల పాఠశాల/కళాశాలలో అతిథి ఉపాధ్యాయ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ గోపిశెట్టి రమణమ్మ తెలిపారు. తెలుగు, సంస్కృతం, ఆంగ్లం ఉపాధ్యాయ పోస్టులకు పోస్ట్‌గ్రాడ్యుయేషన్, బీఈడీ తప్పనిసరని చెప్పారు. వివరాలకు 7330908473, 9618249353 చరవాణి సంఖ్యల్ని సంప్రదించాలని సూచించారు.


కొత్త వ్యక్తుల కదలికలపై కన్నేయండి: సీపీ ఆనంద్

ఈనాడు, హైదరాబాద్: పోలీసుశాఖలో నిఘావిభాగం కీలకపాత్ర పోషిస్తుందని నగర సీపీ సీవీ ఆనంద్ అన్నారు. క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ముందస్తుగా అప్రమత్తం చేయటంలో నిఘా అధికారులు మరింత సమర్థవంతంగా పనిచేయాలని స్పష్టంచేశారు. బంజారాహిల్స్ పోలీస్ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో శుక్రవారం స్పెషల్ బ్రాంచ్ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ.. నగరానికి వివిధ రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చే కొత్త వ్యక్తుల కదలికలపై మరింత నిఘా ఉంచాలని ఆదేశించారు. హోటళ్లు, కాలనీలు, బస్తీల్లోకి చేరే కొత్త వ్యక్తుల సమాచారం ఎప్పటికప్పుడు అందేలా స్థానికంగా వ్యవస్థను బలోపేతం చేసుకోవాలన్నారు. నిఘావిభాగం అనేది ప్రత్యేక వ్యవస్థగా పనిచేయాలన్నారు. సమావేశంలో ఎస్బీ డీసీపీ ఎస్.చైతన్యకుమార్, అధికారులు పాల్గొన్నారు.

హోంగార్డు మృతితో విషాదం

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న సింహగిరి(40) నీటి కుంటలో పడి మృతిచెందటంతో ఠాణాలో విషాదం నెలకొంది. ఖైరతాబాద్ ఠాణా ఏర్పాటైనప్పటి నుంచి ఇక్కడే పనిచేస్తున్న ఆయన స్టేషన్‌లో సెక్షన్ విధులు అప్పగించారు. అందరితోనూ కలివిడిగా ఉండేవారని పోలీసు సిబ్బంది గుర్తుచేసుకున్నారు. గణేశ్ ఉత్సవాల సమయంలో హెడ్ క్వార్టర్ నుంచి అనుమతి తీసుకుని స్వగ్రామానికి వెళ్లాడని, అకస్మాత్తుగా నీటిలో పడి మృతిచెందడం బాధాకరమన్నారు.

ప్రమాదాల లెక్క.. తగ్గించాలి పక్కా



- నిర్వహణ లోపాలు.. లేని సూచికలు
- ఓయూ పరిశోధక బృందం అధ్యయనం

మెట్రో నగరాలు, జాతీయ రహదారులపై పెరుగుతున్న ప్రమాదాలను తగ్గించాలంటే రహదారి భద్రత గణన (రోడ్‌సేఫ్టీ ఆడిట్) నిర్వహించాలని ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని పట్టణ పర్యావరణ అధ్యయన ప్రాంతీయ కేంద్రం పరిశోధక బృంద సభ్యులు నిర్ధారించారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబయిల్లో ఈ 9 నెలల్లో ప్రమాదాల సంఖ్య పెరిగిందని, వీటిని నియంత్రించపోతే పెరిగే అవకాశాలున్నాయని హెచ్చరించారు. రెండేళ్లలో మెట్రో నగరాలలోని రహదారులు, వాటికి సమీపంలోని జాతీయ రహదారులపై నమోదైన ప్రమాదాలను విశ్లేషించారు. నిర్వహణ లోపాల కారణంగా 40 శాతం జరుగుతున్నాయని గుర్తించారు. రోడ్ సేఫ్టీ ఆడిట్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించి చర్యలు చేపడితే రోడ్డు ప్రమాదాలను 10 నుంచి 20 శాతానికి తగ్గించవచ్చని పట్టణ పర్యావరణ అధ్యయన ప్రాంతీయకేంద్రం సంచాలకులు ప్రొఫెసర్ కుమార్ తెలిపారు.

రహదారుల నిర్మాణం... వాహనాల రాకపోకలు: ప్రమాదాలు తగ్గించేందుకు రహదారుల నిర్మాణం, వాహనాల రాకపోకలపై సమగ్ర సమాచారం ఉండాలి. ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) మార్గదర్శకాలకు అనుగుణంగా వాహనాల రాకపోకల పెరుగుదలను అంచనా వేసి అత్యాధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని జాతీయ, రాష్ట్ర రహదారుల నిర్మాణంలో వినియోగించాలి. హైదరాబాద్-విజయవాడ, హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారుల నిర్మాణ సమయంలో, అందుబాటులోకి వచ్చాక లెక్కలన్నీ మారిపోయాయి. పండగ సెలవులొస్తే చాలు అన్ని టోల్‌గేట్ల వద్ద విపరీతమైన రద్దీ ఉంటోంది. దీంతో రహదారులపై ఒత్తిడి పెరిగి తరచూ ప్రమాదాలు నమోదవుతున్నాయి.

లెక్కల గణనలో అన్ని వివరాలు..

జాతీయ, రాష్ట్ర రహదారులపై చోటుచేసుకుంటున్న ప్రమాదాలపై ఉస్మానియా విశ్వవిద్యాలయం పట్టణ, పర్యావరణ అధ్యయన ప్రాంతీయ కేంద్రం పరిశోధక బృంద సభ్యులు అధ్యయనం చేశారు. నగరంలోని రహదారులు, బాహ్యవలయ రహదారి, హైదరాబాద్-విజయవాడ, హైదరాబాద్-బెంగళూరు రహదారులపై సైన్‌బోర్డులు, రేడియం బోర్డులు కొన్ని ప్రాంతాల్లో లేవని గుర్తించారు. హైదరాబాద్-విజయవాడ రహదారిపై రాత్రివేళల్లో ట్రక్కులు, లారీలను నిలపడంతో వాహనదారులు వాటిని గమనించక ఢీకొడుతున్నారన్నారు.

ప్రయోజనాలు... నియంత్రణ

- రహదారి భద్రతను సమీక్షించే ఆడిట్ వ్యవస్థ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద లేదు. జాతీయ రహదారి నిర్వహణ సంస్థ అధికారులు కొన్ని మార్గాల్లో వీటిని ఏర్పాటు చేయాలి.
- ఈ ఆడిట్‌ను పర్యవేక్షించే అధికారులు జాతీయ, రాష్ట్ర రహదారుల మరమ్మతులపై ఎప్పటికప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదికలను సమర్పించేందుకు వీలుంటుంది. నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే సంబంధిత ఏజెన్సీలపై చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది.
- ఆడిట్ ద్వారా ఒక రహదారిపై ఎన్ని ప్రమాదాలు జరిగాయి? ఎందుకు జరిగాయి? తెలిస్తే ప్రమాదాలు తగ్గించే వీలుంటుంది.

- ఈనాడు, హైదరాబాద్

అభివృద్ధిలో కంపెనీ సెక్రటరీలు కీలకం


మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

అమీర్‌పేట, న్యూస్‌టుడే: తెలివితేటలు, నైపుణ్యంతో ప్రగతిని పరుగులెత్తించడం, సామాజిక బాధ్యతలు నిర్వర్తించడంలో కంపెనీ సెక్రటరీల బాధ్యతలు కీలకమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. కంపెనీల పురోగభివృద్ధి, మేనేజ్‌మెంట్ రంగాల్లో ముఖ్య భూమిక పోషిస్తున్నారని కొనియాడారు. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్‌ఐ) 16వ ప్రాంతీయ సదస్సును అమీర్‌పేటలోని సెస్ ఆడిటోరియంలో శుక్రవారం ప్రారంభించారు. 'ఇండెల్జెన్స్ ఆఫ్ ఇంటలిజెన్స్' అంశంతో ప్రారంభించిన సదస్సులో గవర్నర్ ప్రసంగించారు. కంపెనీల మధ్యవర్తిత్వం, దివాలా, వాల్యుయేషన్, ఫోరెన్సిక్ ఆడిట్, రిస్క్ మేనేజ్‌మెంట్ వంటి అంశాల్లో కంపెనీల సెక్రటరీలు అందిస్తున్న సేవలు అమోఘమన్నారు. మారిటైమ్‌లా, క్యాపిటల్ మార్కెట్ వంటి రంగాల్లో ఐసీఎస్‌ఐ కంపెనీ సెక్రటరీలను తయారు చేస్తుండటం అభినందించాల్సిన విషయమన్నారు. కంపెనీ సెక్రటరీల కోర్సులు అభ్యసించే ఈశాన్య రాష్ట్రాల విద్యార్థులకు ఫీజుల్లో మినహాయింపు ఇవ్వడం సంతోషించదగిన విషయమని ఐసీఎస్‌ఐ ప్రతినిధులను ప్రశంసించారు. కంపెనీ సెక్రటరీ 2023 పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరచి హైదరాబాద్ చాప్టర్ టాపర్‌గా నిలిచిన కృష్ణ అగర్వాల్‌కు ప్రశంసాపత్రం అందజేశారు.

2047 నాటికి 2 లక్షల మంది అవసరం: ఐసీఎస్‌ఐ జాతీయ అధ్యక్షుడు బి.నరసింహన్ మాట్లాడుతూ.. 2047 నాటికి 30 ట్రిలియన్లుగా జీడీపీ వృద్ధి చెందినప్పుడు దేశానికి 2 లక్షల మంది కంపెనీ సెక్రటరీలు అవసరమవుతారన్నారు. మార్కులతో సంబంధం లేకుండా 10+2 తత్సమాన ఉత్తీర్ణత, బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమాన ఉత్తీర్ణత కలిగిన ఈశాన్య, జమ్మూకశ్మీర్ రాష్ట్రాల విద్యార్థులకు ఫీజు మినహాయింపు ఇస్తామన్నారు. మారిటైమ్‌లాలో ఎంబీఏ కలిగిన కంపెనీ సెక్రటరీల కోసం గుజరాత్ న్యాయ వర్సిటీతో ఐసీఎస్‌ఐ ఒప్పందం చేసుకుందన్నారు. ఐసీఎస్‌ఐ హైదరాబాద్ చాప్టర్ భవన నిర్మాణానికి వచ్చేనెలలో భూమిపూజ నిర్వహించనున్నట్లు ఐసీఎస్‌ఐ సభ్యులు ఆర్.వెంకటరమణ తెలిపారు. ఐసీఎస్‌ఐ ఉపాధ్యక్షుడు ధనుంజయ్ శుక్లా, ప్రదీప్ బి.కులకర్ణి, మహదేవ్ తిరునగరి, జి.ఎస్.ఎల్.ఎన్.గుప్తా పాల్గొన్నారు.

మున్నూరుకాపు వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ నేడు, రేపు



ఖైరతాబాద్, న్యూస్‌టుడే: తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక 'ఈనాడు పెళ్లిపందిరి' మున్నూరుకాపు అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ అవకాశం కల్పిస్తోంది. ఈనెల 19, 20 తేదీల్లో (శని, ఆదివారాల్లో) సోమాజిగూడలోని 'ఈనాడు' కార్యాలయంలో వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు, వారి కుటుంబీకులు ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 వరకు ప్రొఫైల్ రిజిస్టర్ చేసుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు. వివరాలకు 8008001686, 9154992572లో సంప్రదించవచ్చు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ వాట్సాప్ ద్వారానూ చేసుకోవచ్చని అందుకు వధూవరుల బయోడేటా, ఫొటోలు పైన తెలిపిన ఫోన్ నంబర్లకు పంపవచ్చన్నారు.

తల్లిదండ్రుల గొడవ
మనస్తాపంతో కుమారుడి ఆత్మహత్య

జవహర్‌నగర్: తల్లిదండ్రులు తరచూ గొడవ పడుతుండటంతో మనస్తాపానికి గురై కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడు. జవహర్ నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బాలాజీ నగర్ శ్రీరామ్‌నగర్ కాలనీలో రేపని స్వామి (22) కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. కొన్నిరోజులుగా అతడి తల్లిదండ్రులు తరచూ గొడవ పడుతున్నారు. స్వామి తల్లిదండ్రులకు గొడవలు పడొద్దని నచ్చజెప్పాడు. అయినా ఈనెల 17న మరోసారి తీవ్రస్థాయిలో గొడవపడుతున్నారు. దీంతో మనస్తాపం చెంది స్వామి తన గదిలోకి వెళ్లి తలుపేసుకున్నాడు. శుక్రవారం తల్లిదండ్రులు గమనించగా అప్పటికే స్వామి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహానికి పోస్టుమార్టం చేసేందుకు గాంధీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు.



జాలీగా పెడితే.. నిర్లక్ష్యంతో ఊడితే

బీహెచ్‌ఈఎల్ చౌరస్తాలో ఇందిరాగాంధీ విగ్రహం చుట్టూ పచ్చ గడ్డికి బదులు పిచ్చి మొక్కలు పెరిగాయి. ఐల్యాండ్ చుట్టూ ఉన్న గ్రిల్స్ ఊడిపోయి కళావిహీనంగా మారింది

విశ్వబ్రాహ్మణ అన్నదాన సత్ర నిర్మాణానికి పన్ను మినహాయించండి


సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానించిన కుందారం గణేష్‌చారి

అంబర్‌పేట, న్యూస్‌టుడే: యాదాద్రిలో విశ్వబ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రం భవన నిర్మాణానికి పన్నులు, అనుమతి రుసుముల నుంచి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ బీసీ కుల సంఘాల ఐకాస రాష్ట్ర ఛైర్మన్ కుందారం గణేష్‌చారి కోరారు. శుక్రవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తదితరులతో.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఆయన విజ్ఞప్తి చేశారు. యాదాద్రిలో గతంలో వెయ్యి చదరపు గజాలలో ఉన్న విశ్వబ్రాహ్మణ సత్రం భవనాన్ని, స్థలాన్ని.. నూతన ఆలయ నిర్మాణం సందర్భంగా వాహనాల పార్కింగ్ నిమిత్తం స్వాధీనం చేసుకున్నారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో కొత్తగా నిర్మించనున్న నిత్యాన్నదాన సత్రం భవనానికి పన్నుల నుంచి తమకు మినహాంపునివ్వాలని విజ్ఞప్తి చేశారు.

కుల గణనకు పార్టీలు సహకరించాలి


కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రమిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

అంబర్‌పేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కుల గణన ప్రక్రియకు అన్ని పార్టీలు సహకరించాలని బీసీ సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. శుక్రవారం బీసీ ప్రతినిధి బృందంతో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, తెజస వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాంను వేర్వేరుగా కలిసి వినతిపత్రాలిచ్చారు. ఈనెల 20న సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అఖిలపక్ష సమావేశం ఉంటుందన్నారు.

మూసీ సుందరీకరణ చేపట్టాలి: కిషన్‌రెడ్డి

గాంధీనగర్, న్యూస్‌టుడే: మూసీకి ఇరువైపులా ప్రహరీ నిర్మించి సుందరీకరణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి కోరారు. శుక్రవారం గాంధీనగర్ డివిజన్ హరిత అపార్ట్‌మెంట్ వీధిలో రూ.54.45 లక్షలతో చేపట్టనున్న సీవరేజి పైపులైన్ పనులను ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ పావనితో కలిసి ప్రారంభించారు. ముషీరాబాద్ తహశీల్దారు ప్రతాప్‌సింగ్, జీహెచ్‌ఎంసీ ఉపకమిషనర్ ఖాదర్ మొహియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

హోంవర్క్ చేయలేదని చొక్కా విప్పించి..
మోకాళ్లపై కూర్చోబెట్టిన ఉపాధ్యాయులు



మేడ్చల్ రూరల్ న్యూస్‌టుడే: దసరా సెలవుల్లో ఇచ్చిన హోంవర్క్‌ను పూర్తి చేయలేదని విద్యార్థుల చొక్కాలు విప్పించి మోకాళ్లపై కూర్చోబెట్టి కొంతమంది ఉపాధ్యాయులు రాయించారు. ఈ విషయం విద్యార్థి సంఘాలకు తెలియడంతో వివాదమయ్యింది. మేడ్చల్ మున్సిపల్ పరిధి పూడూరు సెయింట్ మేరీస్ పాఠశాలలో శుక్రవారం 12 మంది విద్యార్థులు ఇచ్చిన పనిని చేయకుండా పాఠశాలకు వచ్చారు. విద్యార్థులను తరగతి గది బయటకు రప్పించి చొక్కాలు విప్పించారు. ఉపాధ్యాయులు దాంతో సరిపెట్టుకోకుండా గంటకు పైగా మోకాళ్లపై కూర్చోబెట్టి వారిని హోంవర్క్ చేయించారు. చొక్కా విప్పించిన ఘటనపై పాఠశాల యాజమాన్యాన్ని వివరణ కోరగా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు.

నైపుణ్య మానవ వనరులకు కేంద్రంగా నగరం


మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

రాయదుర్గం, న్యూస్‌టుడే: ప్రతిభ, నైపుణ్యమున్న మానవ వనరులకు నగరం కేంద్రమని ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. రాయదుర్గం టీహబ్‌లో శుక్రవారం జీసీసీ(గ్లోబల్ కేపెబిలిటీ సెంటర్స్) ఇన్నోవేషన్ సమ్మిట్ (ప్రపంచ సామర్థ్య కేంద్రాల ఆవిష్కరణ సదస్సు)లో ఆయన ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ.. 'నగరంలోని జీసీసీలు ప్రపంచానికి సరికొత్త ఉత్పత్తులను అందిస్తున్నాయి.. రాష్ట్రం ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించేందుకు ఆవిష్కరణలు, పారిశ్రామికాభివృద్ధికి మరిన్ని చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఏటా రాష్ట్రంలో 2.5 లక్షల వరకు గ్రాడ్యుయేట్లు శ్రామిక శక్తిలో వచ్చి చేరుతున్నారు.

ఏఐకు ప్రాధాన్యం..: కృత్రిమ మేధ(ఏఐ)కు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. ప్రపంచ ఏఐ సదస్సు నగరంలో నిర్వహించాం. 200 ఎకరాల్లో ఏఐ సిటీని ఏర్పాటుచేస్తున్నాం. నగరంలో యూనికార్న్ సంస్థలు పెరిగేలా చూడాల్సిన అవసరం ఉంది. జయేశ్ రంజన్ మాట్లాడుతూ.. టీహబ్‌తోపాటు నగరంలో మరో 64 ఇంక్యుబేటర్లున్నాయని తెలిపారు. పలు జీసీసీ సంస్థల ప్రతినిధులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో టీహబ్ సీఈఓ సుజిత్ జాగిర్దార్, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ శ్రీకాంత్‌లంక, ఏఎస్‌ఎస్‌ఆర్ సహ వ్యవస్థాపకుడు విక్రమ్ అహూజా తదితరులు పాల్గొన్నారు.

ప్రభావ శీలురు.. తప్పుడు ప్రకటనలు
అసాంఘిక కార్యకలాపాలకు సామాజిక మాధ్యమాల్లో వత్తాసు



ఈనాడు, హైదరాబాద్: సామాజిక మాధ్యమాల్లో ప్రభావశీల (ఇన్‌ఫ్లూయెన్సర్) వ్యక్తుల పేరుతో కొందరు అసాంఘిక కార్యకలాపాలకు వత్తాసు పలుకుతున్నారు. కాసులకు కక్కుర్తిపడి బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్, ట్రేడింగ్ తదితర యాప్‌లకు ప్రచారం చేస్తూ ప్రజల్ని తప్పుదోవపట్టిస్తున్నారు. రాష్ట్రంలో వీటిపై నిషేధమున్నా అవేవీ పట్టనట్లు ప్రచారం చేస్తున్నారు. గ్యాంబ్లింగ్‌కు అలవాటుపడి వేలాది మంది యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. వందల సంఖ్యలో ఆత్మహత్యలు నమోదవుతున్నాయి. వీటి కట్టడికి ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటుంటే కొందరు ఇన్‌ఫ్లుయెన్సర్ల మాటున బెట్టింగ్‌ను ప్రోత్సహిస్తున్నారు. గ్యాంబ్లింగ్‌ను ప్రోత్సహిస్తే చట్టప్రకారం చర్యలుంటాయని కేంద్ర వినియోగదారుల పరిరక్షణ సంస్థ(సీసీపీఏ) హెచ్చరించినా అదే ధోరణి కొనసాగుతోంది. కొన్ని నెలలుగా గేమింగ్, డేటింగ్ యాప్‌లపై సామాజిక మాధ్యమాల్లో ప్రచార వీడియోలు భారీగా పెరుగుతున్నాయి. ఈ తరహా వీడియోల్ని తమ దృష్టికి తీసుకొస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

ఒక్క రీల్‌కు రూ.లక్షలు

ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో వీడియోలు, రీల్స్ చేస్తూ వేలు, లక్షల సంఖ్యలో ఫాలోవర్లను పెంచుకుంటున్నారు. ఈ వీడియోలు వేర్వేరు ఖాతాల ద్వారా కొన్ని లక్షల మందికి చేరుతుంటాయి. ఇలా ఎక్కువ మంది ఫాలోవర్లు, ప్రజలపై ఎంతోకొంత ప్రభావం చూపే సామాజిక మాధ్యమ ఇన్‌ఫ్లూయెన్సర్లతో తమ ఉత్పత్తులకు ప్రచారం చేయించేందుకు అనేక సంస్థలు పోటీపడుతుంటాయి. దీన్ని బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. వివిధ రాష్ట్రాల్లో ఉండే సైబర్ ముఠాలు కొన్ని నకిలీ ట్రేడింగ్ వెబ్‌సైట్లు సృష్టించి వీరితో ప్రచారం చేయించుకుంటున్నాయి.

- ఓ యువకుడు తరచూ కొత్త ప్రాంతాలకు వెళ్తూ అక్కడి విశేషాలు, వింతలపై వీడియోలు చేస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తుంటాడు. కొత్త ప్రాంతాలకు వెళ్లడానికి డబ్బు ఎలావస్తుందని కామెంట్ చేయగా. బెట్టింగ్ యాప్‌తో డబ్బు సంపాదిస్తున్నానని ఏకంగా వీడియో పోస్టు చేశాడు.
- ఇన్‌స్టాగ్రామ్‌లో వేలల్లో ఫాలోవర్లున్న అతడి వీడియోలంటే తెలుగు రాష్ట్రాల్లో భలే క్రేజ్. అలాంటి వ్యక్తి బెట్టింగ్ యాప్ వాడి డబ్బు సంపాదించాలంటూ తన ఖాతాలో వీడియో పోస్టు చేశాడు.

నమ్మి, మోసపోతున్నారిలా..!

బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్ ప్రభావంపై అవగాహన లేని యువత ఇన్‌ఫ్లూయెన్సర్ల మాటల్ని గుడ్డిగా నమ్ముతూ మూల్యం చెల్లించుకుంటున్నారు. వేల సంఖ్యలో ఫాలోవర్లుండే ఖాతాదారులు తాము రూ.లక్షల్లో సంపాదిస్తున్నామంటూ దర్పం ప్రదర్శిస్తుంటారు. తాము కొన్ని బెట్టింగ్, ఆన్‌లైన్ ట్రేడింగ్ యాప్‌లు వినియోగిస్తూ ఆదాయం పొందామని కొన్ని నకిలీ వీడియోలు చేసి పోస్టు చేయడం చూసి నిజమేనని భావిస్తున్నారు. ఇదంతా నిజమేనని భావించే కొందరు బెట్టింగ్, ట్రేడింగ్ చేసి చేస్తూ మోసపోతున్నారు.

గుర్తిస్తే కేసులే

- రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్‌పై గతంలోనే నిషేధం విధించింది. ఆన్‌లైన్ గేమింగ్‌ను ప్రోత్సహించినా శిక్షార్హులు అవుతారు. ఆన్‌లైన్, సామాజిక మాధ్యమాల్లో బెట్టింగ్‌కు ప్రచారం కల్పించడం, వాటిని ప్రోత్సహించడం నిషేధం.
- నకిలీ వెబ్‌సైట్లపై ప్రచారంతో ప్రజల్ని తప్పుదోవ పట్టించినందుకు క్రిమినల్ చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది.



బరువు బాధ్యత

దసరా సెలవుల అనంతరం విద్యార్థులు వసతిగృహాలకు చేరుతున్నారు. వారికి దుస్తులు, తినుబండాలు పెట్టెలనిండా నింపి వాటిని మోస్తూ వెళ్తున్న పెద్దలు చేవెళ్ల కూడలిలో కనిపించారిలా..

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి


అధికారులకు సూచనలు ఇస్తున్న ఇలంబర్తి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: జీహెచ్‌ఎంసీలోని అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి నగర ప్రజలకు మెరుగైన సేవలందించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ కె.ఇలంబర్తి హెచ్‌ఓడీలకు సూచించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు.

మేయర్‌ను కలిసిన కమిషనర్: జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.ఇలంబర్తి జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

హైడ్రా కమిషనర్ భేటీ: ఈనాడు డిజిటల్, హైదరాబాద్: జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సమస్యలపై ఇరు శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు.

నగరంలో ఈనాడు

- సాలార్‌జంగ్ మ్యూజియం ఈస్ట్ బ్లాక్ గ్యాలరీలో ఉదయం 11 గంటలకు 'హద్దులు లేని కళ: వైవిధ్యం' ఎగ్జిబిషన్ ప్రారంభం
- మెహిదీపట్నం గారిసన్‌లోని వీర్ కున్వర్ సింగ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బైసన్ డివిజన్ ఆధ్వర్యంలో సాయంత్రం 4 గంటలకు రహదారి భద్రత సదస్సు
- గచ్చిబౌలి బ్రహ్మకుమారీస్ గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో సాయంత్రం 5 గంటలకు భరత నాట్య ప్రదర్శన
- రవీంద్రభారతిలో సాయంత్రం 6 గంటలకు 'పోటెత్తిన కెరటాన్ని', 'నియంత అంతం' పుస్తకాల ఆవిష్కరణ
- బంజారాహిల్స్ తాజ్ దెక్కన్‌లో సాయంత్రం 6 గంటలకు గ్లోబల్ పర్యాటక అవార్డుల ప్రదానం
- మాదాపూర్ హెచ్‌ఐసీసీలో సాయంత్రం 6 గంటలకు హైబిజ్ హెల్త్‌కేర్ అవార్డుల ప్రదానం.

మాజీ సీఎం అంజయ్యకు నివాళి


అంజయ్య విగ్రహం వద్ద స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి టి.అంజయ్య 38వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం లుంబినీ పార్కులోని ఆయన విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలు వేసి నివాళి అర్పించారు. శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, షబ్బీర్‌అలీ, ఎంపీ గడ్డం వంశీ, ఎంఐఎం ఎమ్మెల్సీ రహమత్ అలీ బేగ్, తెలంగాణ బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్, మీడియా అకాడమి ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, అంజన్‌కుమార్ యాదవ్, జితేందర్‌రెడ్డి, కేవీపీ రామచందర్‌రావు తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

క్షణికావేశం.. జీవితాలు బలి



ఈనాడు. హైదరాబాద్

ప్రేమ, కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యలు... కారణమేదైనా కొందరు ఆత్మహత్యే శరణ్యంగా భావిస్తున్నారు. నగరంలో కొన్ని రోజులుగా వరుస ఆత్మహత్యలు కలకలం రేపుతున్నాయి. బలవన్మరణాలకు ఎక్కువగా ఆర్థిక సమస్యలు, ఒత్తిడి భరించలేకపోవడం కారణంగా ఉన్నాయి. తాజాగా హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో నష్టపోయిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీన్ని భరించలేక అతని తల్లి ఆత్మహత్యకు యత్నించారు. నార్సింగి ఠాణా పరిధిలో ఓ మహిళ మూడేళ్ల కూతురితో 18వఅంతస్తు నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడ్డారు.

సమస్య చిన్నదైనా..: యుక్త వయసులో పలువురు ఒత్తిడి తట్టుకోలేకపోవడం, ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారు. సమస్య చిన్నదే అయినా కొందరు తీవ్రంగా ఆలోచిస్తుంటారు. ఆత్మహత్యలకు ప్రధానంగా మూడు కారణాలుంటాయని వైద్యులు చెబుతున్నారు. వ్యక్తిగత నేపథ్యంతో పాటు మానసిక, సామాజిక పరిస్థితులు విపరీత ప్రభావం చూపిస్తాయి. వృత్తిపరమైన ఒత్తిడి, ఆర్థిక పరిస్థితులు, జీవితంలో జరిగే కొన్ని ఘటనలు, సొంతమని భావించే వ్యక్తుల అకాల మరణంతో ఒక్కసారిగా మనోవేదన ప్రారంభమవుతుంది. మరణం తప్ప మరోదారి లేదనే భావనతో ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారు.

- నగరంలో 10 రోజుల్లో ఏకంగా 20 మంది ఆత్మహత్యకు పాల్పడ్డారు.
- రోడ్డు ప్రమాదాల్లో 15-29 ఏళ్ల మధ్య వయసున్న యువత ఎక్కువగా మరణిస్తుండగా.. రెండో స్థానంలో ఆత్మహత్యలుండడం కలవరపెడుతోంది.

90 శాతం నివారించొచ్చు...

- బాధితుల ప్రవర్తన గుర్తిస్తే ఆత్యహత్యల్లో 90 శాతం నివారించొచ్చని మానసిక వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ మేరకు వారు పలు సూచనలు చేస్తున్నారు.
- ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నప్పుడు కుటుంబసభ్యులు, సహచరులతో ప్రవర్తన కొత్తగా ఉంటుంది.
- ఒంటరిగా ఉంటారు. ఇతర ప్రాంతాలు, వేడుకలు, కార్యక్రమాలకు వెళ్లేందుకు ఇష్టపడరు.
- కొందరు తాము జీవించి లాభం లేదంటూ తరచూ బాధపడుతుంటారు.
- కుటుంబ సభ్యులకు భారంగా మారామని ఆవేదన చెందుతారు. ఇష్టమైన పనులు చేయలేరు.
- కుటుంబం, స్నేహితులకు దూరంగా ఉంటారు. ఖరీదైన వస్తువులను దానం చేస్తుంటారు.
- పని అప్పజెబితే నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తారు. దేన్నీ తీవ్రంగా పరిగణించరు. డ్రగ్స్, మద్యం విపరీతంగా తీసుకోవడం ఒక లక్షణం.
- నిరాశలో ఉంటూ చిరాకు పడుతుంటారు. సందేహం అనిపిస్తే వెంటనే వైద్యులకు చూపించాలి.

బాధితులను ఓదార్చాలి..

'కొందరు సమస్యను ధైర్యంగా ఎదుర్కోకుండా మానసిక ఒత్తిడితో ఆత్మహత్యకు పాల్పడుతుంటారు. సమస్యల్లో ఉన్నవారిని ఓదారుస్తూ వారితో ఎక్కువ మాట్లాడేందుకు ప్రయత్నించాలి. ధైర్యం చెప్పి ఆలోచనలు మళ్లించాలి. సకాలంలో స్పందించడం అవసరం.

-డాక్టర్ నాగభైరవి, మానసిక వైద్య నిపుణులు

పూలు.. నేలపాలు


గుడిమల్కాపూర్ మార్కెట్‌లో శుక్రవారం వ్యాపారం సరిగా సాగక రైతులు సాయంత్రానికి పూలను ఇలా కుప్పలుగా పారేసి వెళ్లిపోయారు. మార్కెట్ నిర్వాహకులు వాటిని క్రేన్ సాయంతో తొలగించారు.

ఉన్మాదులకు శిక్షణ ఇచ్చే అడ్డాగా హైదరాబాద్: ఈటల



సంఘీభావం తెలుపుతున్న ఈటల రాజేందర్

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: హైదరాబాద్ ఉన్మాదులకు శిక్షణ ఇచ్చే అడ్డాగా మారిందని, దీన్ని అణిచివేయకపోతే ప్రపంచానికే ముప్పు తప్పదని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద చేపట్టిన శాంతి దీక్షలో ఆయన పాల్గొని ప్రసంగించారు. హిందూమతంపై ద్వేషం పెంచేలా సికింద్రాబాద్‌లోని మెట్రో పోలీస్ హోటల్‌లో 15 రోజులుగా సమావేశాలు నడుస్తున్నాయని, వాటికి ప్రభావితమైన ఓ వ్యక్తి ప్రార్థనా మందిరంపై దాడి చేశాడని తెలిపారు.

ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌కు పురస్కారం


అవార్డు అందుకుంటున్న విద్యార్థులు

ఈనాడు, హైదరాబాద్: విద్యా సంస్థలు.. అంకుర సంస్థల పరిశోధనలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏటా నిర్వహిస్తున్న మొబైల్ కాంగ్రెస్-2024లో ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ స్మార్ట్‌సిటీ లివింగ్ ల్యాబ్ రూపొందించిన నమూనాకు పురస్కారం లభించింది. దిల్లీలోని భారత్ మండపంలో శుక్రవారం జరిగిన సదస్సులో నమూనాను రూపొందించిన పరిశోధక విద్యార్థులు వైభవ్ నవారే, చీఫ్ టెక్నాలజీ ఆర్కిటెక్ట్ అనురాధ వట్టెం పురస్కారాన్ని అందుకున్నారని ట్రిపుల్‌ఐటీ అధికారులు ప్రకటనలో తెలిపారు. వైర్‌లెస్ ఆధారిత మౌలిక సదుపాయాలు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్. నీటి సరఫరాకు అత్యాధునిక విధానాలను వీరు రూపొందించారు.

సదర్ సమ్మేళనాలు 31 నుంచి

గోల్నాక: జంటనగరాలలో యాదవుల సదర్ సమ్మేళనాలను ఈనెల 31, నవంబరు 1, 2న నిర్వహించనున్నట్లు గ్రేటర్ యాదవ సంఘం ఛైర్మన్ చిట్టబోయిన నందకిశోర్‌యాదవ్ ప్రకటించారు. ఏటా దీపావళి పురస్కరించుకుని దున్నరాజాల విన్యాసాలతో సదర్ సమ్మేళనాలను నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం యాదవ సంఘ మాజీ అధ్యక్షుడు పాండుయాదవ్, ట్రస్ట్ సభ్యులు, సదర్ నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించి తేదీలను ప్రకటించారు. 31న సాయంత్రం నింబోలిఅడ్డా, కొత్తపేట, నార్సింగి, రామంతాపూర్ ప్రాంతాల్లో, నవంబరు 1న ఖైరతాబాద్, సైదాబాద్, కార్వాన్, ఆసిఫ్‌నగర్, అమీర్‌పేట, బోయిన్‌పల్లి, నల్లగుట్ట, బొల్లారం, మచ్చబొల్లారం, బజార్‌ఘాట్, గుడిమల్కాపూర్‌లలో, 2న వైఎంసీఏ నారాయణగూడ చౌరస్తాలో జరుగుతాయని వివరించారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	120–00	డ్రెస్డ్	206–00
రిటైల్	142–00	స్కిన్‌లెస్	234–00

ఇకపై ప్రతి ఏడాది రెండు సార్లు ఎన్డీయే నేతల సదస్సులు నిర్వహించాలని ప్రధాని మోదీ ప్రతిపాదించారని శుక్రవారం భాజపా ఒక ప్రకటనలో తెలిపింది.

గ్రూప్-4లో బ్యాక్‌లాగ్ తీసేయాలని గాంధీభవన్‌లో అభ్యర్థుల ఆందోళన



గాంధీభవన్ మెట్లపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన చేస్తున్న అభ్యర్థులు

హైదరాబాద్, న్యూస్‌టుడే: గ్రూప్-4 ఉద్యోగ నియామకాల్లో బ్యాక్‌లాగ్ తీసేయాలని అభ్యర్థులు డిమాండ్ చేశారు. శుక్రవారం గాంధీభవన్ మెట్లపై ఆందోళనకు దిగారు. గ్రూప్-4 ఫలితాలు విడుదల చేయడానికి ముందే 'అన్‌విల్లింగ్' ఆప్షన్ పెట్టాలని డిమాండ్ చేశారు. అభ్యర్థి ఒకటికి మించి ఉద్యోగాలు సాధించడంతో బ్యాక్‌లాగ్ ఖాళీలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయకుండా తదుపరి జాబ్ క్యాలెండర్‌లో చూపించే కుట్ర చేస్తోందని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆ తపన కోల్పోతే మరణించినట్లే



క్రికెట్, హాకీ జట్టు ప్రపంచ కప్పులు గెలిచినప్పుడు వారికి అందే నగదు బహుమతి ఒకే స్థాయిలో ఉండదు. క్రీడాకారుల దక్షత, ప్రతిభాపరంలో తేడా ఉండొచ్చు కానీ, ప్రత్యర్థులపై గెలిచినప్పుడు వారికి కలిగే అనుభూతిలో ఏ మాత్రం వ్యత్యాసం ఉండదు. మానవుడిని పుట్టినప్పటి నుంచి నడిపిస్తున్నది ఆ మజానే. ఫలితాలు, ప్రతిఫలాలతో సంబంధం లేకుండా అడ్డంకులను అధిగమిస్తూ ముందుకు సాగాలన్న తపనే మన మనుగడకు కారణం. దాన్ని కోల్పోయిన రోజు మరణించినట్లే లెక్క.

– అంకుర్ వారికూ, కంటెంట్ క్రియేటర్

నారాయణ్‌పుర్-దంతెవాడ ఎదురుకాల్పుల్లో

చనిపోయిన మావోయిస్టులు 38 మంది

- పోలీసు ఉన్నతాధికారుల వెల్లడి

చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ-నారాయణ్‌పుర్ జిల్లాల సరిహద్దు తుల్‌తులి-నెందూర్ అడవుల్లో ఈ నెల 4న జరిగిన ఎదురుకాల్పుల్లో మరణించిన వారి లెక్కను ఆ రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు తేల్చారు. ఈ ఘటనలో మొత్తం 38 మంది మావోయిస్టులు చనిపోయినట్లు శుక్రవారం వెల్లడించారు. భద్రతాబలగాలు, మావోయిస్టుల మధ్య జరిగిన భీకరపోరులో 31 మంది మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు అక్కడి పోలీసు అధికారులు అప్పట్లో ప్రకటించారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండించిన మావోయిస్టు పార్టీ తూర్పు బస్తర్ డివిజన్ కమిటీ.. ఈ నెల 13న ఓ లేఖను విడుదల చేసింది. తమ సహచరులు 35 మంది ఈ ఎన్‌కౌంటర్లో చనిపోయారని, ఈ ఘటనలో గాయపడిన మరో 17 మందిని వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చి దారుణంగా హత్య చేశారని ఆ పార్టీ ఆరోపించింది. ఈ నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్ పోలీసు ఉన్నతాధికారులు తాజాగా 38 మంది మృతుల పేర్లతో కూడిన జాబితాను విడుదల చేశారు. వారందరినీ గుర్తించామని, ఇప్పటికే 29 మంది మావోయిస్టుల మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించామని దంతెవాడ డీఐజీ కమలోచన్ కశ్యప్ తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర చరిత్రలోనే ఇదో పెద్ద సంఘటన అని దంతెవాడ, నారాయణ్‌పుర్ ఎస్పీలు గౌరవ్ రాయ్, ప్రభాత్‌కుమార్ పేర్కొన్నారు.

రూ.2.62 కోట్ల రివార్డు..

ఈ ఘటనలో మరణించిన మావోయిస్టు దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు నీతి అలియాస్ ఊర్మిళపై రూ.25 లక్షలు, పశ్చిమ బస్తర్ డివిజన్ కమిటీ కమాండర్ నందుపై రూ.10 లక్షల రివార్డు ఉందని పోలీసు అధికారులు తెలిపారు. వీరితోపాటు మృతిచెందిన మిగిలిన వారందరిపై కలిపి మొత్తం రూ. 2.62 కోట్ల రివార్డు ఉన్నట్లు వివరించారు. వీరందరూ దంతెవాడ, నారాయణ్‌పూర్, కొండగావ్, బస్తర్ జిల్లాల్లో 250 ఘటనల్లో పాల్గొన్నారని వివరించారు. మావోయిస్టులు హింసాత్మక కార్యక్రమాలను వీడి లొంగిపోవాలని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ కోరారు.

సుజాతను నిర్బంధిస్తే కోర్టులో హాజరుపరచాలి

- తెలంగాణ పౌరహక్కుల సంఘం డిమాండ్

ఈనాడు, హైదరాబాద్: మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యురాలు మైన్‌భాయి అలియాస్ సుజాతను తెలంగాణ పోలీసులు నిర్బంధిస్తే ఆమెను వెంటనే న్యాయస్థానంలో హాజరుపరచాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కిషన్‌జీ సహచరిణి అయిన ఆమెను పోలీసులు అదుపులో తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోందని, అదే నిజమైతే ఆమెకు ఎలాంటి ప్రాణహాని తలపెట్టకుండా కోర్టులో ప్రవేశపెట్టాలన్నారు. సుజాతక్క పోలీసులు అరెస్ట్ చేస్తే వెంటనే ఆమెను కోర్టులో హాజరు పరచాలని అఖిల భారత ప్రజాన్యాయవాదుల సంఘం(ఐఏపీఎల్) ఉపాధ్యక్షుడు మల్లి కంటి వెంకన్న మరో ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఐటీఐ ప్రవేశాలకు 30 వరకు గడువు పొడిగింపు

కార్వాన్, న్యూస్‌టుడే: పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)ల్లో వివిధ కోర్సులలో మిగిలిపోయిన సీట్ల భర్తీకి ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉపాధి శిక్షణ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎన్వీకే నగేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ట్రేడుల్లో చేరేందుకు ఎనిమిది, పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. గడువును ఈ నెల 30 వరకు పొడిగించామన్నారు. మరిన్ని వివరాలను మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలోని జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో లేదా వెబ్‌సైట్ https://iti.telangana.gov.inలో పొందవచ్చు.

ఝార్ఖండ్ చేరుకున్న భట్టి



భట్టికి స్వాగతం పలుకుతున్న ఝార్ఖండ్ కాంగ్రెస్ నేతలు

ఈనాడు, హైదరాబాద్: ఝార్ఖండ్ రాష్ట్రంలో వచ్చే నెల 13, 20 తేదీల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు ఏఐసీసీ సీనియర్ పరిశీలకుడిగా నియమితులైన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుక్రవారం రాంచీకి చేరుకున్నారు. స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకులు, గోసేవ ఆయోగ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ రంజన్ ప్రసాద్, ఆ రాష్ట్ర కాంగ్రెస్ పూర్వాధ్యక్షుడు సుల్తాన్ అహ్మద్, యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ అభిజిత్ రాజ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గుంజన్ సింగ్, ఇతర నేతలు రాంచీ విమానాశ్రయం వద్ద భట్టికి స్వాగతం పలికారు.

దండకారణ్యంలో మావోయిస్టుల వ్యవస్థాపక మాసోత్సవాలు



ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్ జిల్లాలో వ్యవస్థాపక మాసోత్సవాలకు హాజరైన ఆదివాసీలు

చర్ల, న్యూస్‌టుడే: మావోయిస్టు పార్టీ వ్యవస్థాపక మాసోత్సవాలు దండకారణ్యంలో జరిగాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్ జిల్లాలోని ఓ అజ్ఞాత ప్రదేశంలో ఏర్పాటు చేసిన ఈ ఉత్సవాల్లో పెద్దసంఖ్యలో సాయుధ మావోయిస్టులు పాల్గొన్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన వీడియో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. నాయకులు అమరులను స్మరించుకుని, భవిష్యత్ కార్యాచరణపై ఉద్బోధించారు. సీఎన్ఎం(చైతన్య నాట్య మండలి) విప్లవ గీతాలతో హోరెత్తించింది. 2026 నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న నేపథ్యంలో.. వ్యవస్థాపక ఉత్సవంలో పెద్దసంఖ్యలో మావోయిస్టులు సాయుధులై ర్యాలీలో పాల్గొని తమ బలాన్ని ప్రదర్శించినట్లు తెలుస్తోంది. సెప్టెంబరు21 నుంచి అక్టోబరు 20 వరకు మావోయిస్టు పార్టీ ఆవిర్భావ ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఇప్పటికే పార్టీ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.

అప్పీలు జాప్యానికి కారణం ఎన్నికలా?

- అధికారులు ప్రచారానికి వెళతారా?
- కలెక్టర్ ఎక్కడి నుంచి పోటీ చేశారు?
- పని ఎగవేతకు ఎన్నికలు లైసెన్సా?
- సూటిగా ప్రశ్నించిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: ప్రైవేటు వ్యక్తులకు, ప్రభుత్వానికి మధ్య ఓ భూవివాదంలో సింగిల్ జడ్జి తీర్పుపై ప్రభుత్వం అప్పీలు దాఖలు చేయడంలో జాప్యానికి ఎన్నికలు కారణమని చెప్పడాన్ని హైకోర్టు శుక్రవారం తప్పుబట్టింది. ఎన్నికలను కారణంగా చెప్పడానికి అధికారులేమైనా రాజకీయ నాయకులా అని ప్రశ్నించింది. అప్పీలు దాఖలు చేసిన హైదరాబాద్ కలెక్టర్ ఏ రాజకీయ పార్టీ తరఫున పోటీ చేశారు? గెలుపొందారా? అని ప్రశ్నించింది. ఎన్నికలొచ్చినా కార్యనిర్వాహకవర్గం తన పనిచేయాల్సి ఉంటుందని, పని వదిలేసి ప్రచారానికి వెళ్లరని వ్యాఖ్యానించింది. రాజధానిలోని గుడిమల్కాపూర్‌లో 2302 చదరపు గజాల స్థలానికి సంబంధించిన వ్యాజ్యంలో 2016 సెప్టెంబరు 13న సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ.. ప్రభుత్వం తరఫున హైదరాబాద్ కలెక్టర్ ఈ ఏడాది జులైలో అప్పీలు చేశారు. ఎన్నికల కారణంగా అప్పీలు దాఖలులో జాప్యానికి మన్నించాలంటూ మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. ఈ అప్పీలుపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున ప్రత్యేక న్యాయవాది ఎ.దివ్య వాదనలు వినిపించగా.. జాప్యానికి పేర్కొన్న కారణంపై ధర్మాసనం నిలదీసింది. 2023లో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినందున అప్పీలు దాఖలు చేయలేకపోయామంటూ ఎలా చెబుతారని ప్రశ్నించింది. పని చేయకుండా ఉండటానికి ఎన్నికలు లైసెన్సా అని నిలదీసింది. ఎన్నికలు మంత్రులకే కానీ అధికారులకు కాదుగా.. మీరేమైనా ఐదేళ్లే పదవుల్లో ఉంటారా అని నిలదీసింది. న్యాయవాది సమాధానమిస్తూ.. రెండు పడకల గదుల ఇళ్ల కేటాయింపు దరఖాస్తుల పరిశీలన, ఎన్నికల కోడ్, ఎన్నికల కార్యక్రమాలు చేపట్టడం వంటి వాటిలో అధికారులున్నారని చెప్పారు. దీనిపై ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. ఇలాగైతే మరింత ఇబ్బందికరమైన ప్రశ్నలు అడగాల్సి వస్తుందని వ్యాఖ్యానించింది. కేవలం ఇదే కారణమైతే అప్పీలు జాప్యమైనందుకే తిరస్కరించాల్సి ఉంటుందని, ఎన్నికల్లో ఏయే సిబ్బంది పాల్గొన్నారో వివరాలు కూడా కోరాల్సి వస్తుందని పేర్కొంది. దీనిపై న్యాయవాది సమాధానమిస్తూ.. సరైన కారణాలతో అఫిడవిట్ దాఖలు చేస్తామనడంతో ధర్మాసనం విచారణను వాయిదా వేసింది.

ఉత్సాహంగా తెలంగాణ పోలీస్ డ్యూటీమీట్

- నేటి ముగింపు కార్యక్రమానికి సీఎం హాజరు



సమీక్ష నిర్వహిస్తున్న డీజీపీ డా.జితేందర్. చిత్రంలో బెటాలియన్స్ అదనపు డీజీపీ సంజయ్‌కుమార్ జైన్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ పోలీస్ అకాడమీలో పోలీస్ డ్యూటీమీట్ రెండో రోజు కూడా ఉత్సాహభరితంగా సాగింది. శుక్రవారం 244 మంది పోలీసు అధికారులు పాల్గొన్న 6 ఈవెంట్లలో సైబరాబాద్ పోలీసులు ప్రతిభకనబరిచారు. ఈ కమిషనరేట్‌కు చెందిన ఏడుగురు ఆయా విభాగాల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచారు. రాచకొండ కమిషనరేట్ నుంచి నలుగురు, హైదరాబాద్ కమిషనరేట్ నుంచి ముగ్గురు, సైబర్ సెక్యూరిటీ బ్యూరో, భద్రాద్రి జోన్, సీఐడీ నుంచి ఇద్దరు చొప్పున, యాదాద్రి జోన్, యాంటీ నార్కోటిక్స్ బ్యూరో, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్స్, అంతర్గత భద్రతా విభాగాల నుంచి ఒక్కొక్కరు చొప్పున వివిధ ఈవెంట్లలో మొదటి మూడు స్థానాల్లో నిలిచి సత్తాచాటారు. మరోవైపు శనివారం డ్యూటీమీట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరు కానున్నట్లు డీజీపీ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

బెటాలియన్ల కార్యకలాపాలపై డీజీపీ సమీక్ష

తెలంగాణ స్పెషల్ పోలీస్ కార్యకలాపాలపై డీజీపీ డా. జితేందర్ సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ శౌర్యభవన్‌లోని బెటాలియన్స్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన ఆయన రాష్ట్రంలోని అన్ని బెటాలియన్ల కమాండెంట్లతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో కొత్త బెటాలియన్ల ఆవిష్కరణ, సిబ్బందికి ఇవ్వనున్న జాతీయ విపత్తు నిర్వహణ బృందం(ఎన్డీఆర్ఎఫ్) శిక్షణ గురించి చర్చించారు. ఈ సందర్భంగా బెటాలియన్ల అదనపు డీజీపీ సంజయ్‌కుమార్ జైన్‌తో కలిసి ఆర్మర్ అప్‌గ్రేడ్ కోర్సు గ్రేడ్-2 పుస్తకాన్ని ఆవిష్కరించారు.

ముగ్గురు యువకులకు ఠాణాలో శిరోముండనం?

- ఓ యువకుడి ఆత్మహత్యాయత్నంతో ఆలస్యంగా వెలుగులోకి
- నాగర్‌కర్నూల్ జిల్లా లింగాలలో ఘటన

ఈనాడు, మహబూబ్‌నగర్: పెట్రోల్ బంకులో జరిగిన గొడవ విషయంలో ముగ్గురు యువకులను పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి శిరోముండనం చేయించిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా లింగాలలో జరిగింది. గత ఆదివారం ఈ ఘటన జరగ్గా వీరిలో ఓ యువకుడు మనస్తాపంతో శుక్రవారం ఉదయం ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో విషయం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. ముగ్గురు యువకులు గత ఆదివారం రాత్రి లింగాలలోని ఓ పెట్రోల్ బంకు వద్దకు వచ్చి రూ.20కు పెట్రోల్ పోయాలని నిర్వాహకుల్ని కోరారు. అందుకు వారు తిరస్కరించడంతో యువకులకు, బంకు నిర్వాహకులకు మధ్య గొడవ జరిగింది. బంకు నిర్వాహకులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ముగ్గురు యువకుల్ని ఠాణాకు తరలించారు. వారిలో ఒక యువకుడు పోలీసుస్టేషన్‌లో తల దువ్వడంతో ఆగ్రహించి ఠాణాలో ముగ్గురు యువకులకూ శిరోముండనం చేయించినట్టు సమాచారం. ఈ ఘటన నేపథ్యంలో వారిలో ఓ యువకుడు మనస్తాపంతో శుక్రవారం ఇంట్లోనే ఉరేసుకోగా, గమనించిన కుటుంబ సభ్యులు నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే, యువకుడి కుటుంబ సభ్యులు వివరాలు వెల్లడించడానికి నిరాకరించారు. 'యువకుల మధ్య గొడవతో మనస్తాపం చెంది తమ బిడ్డ ఆత్మహత్యకు యత్నించాడని' చెప్పి కుటుంబ సభ్యులు బాధితుడిని ఆస్పత్రిలో చేర్పించినట్లు వైద్యులు వెల్లడించారు. ఈ వ్యవహారంపై నాగర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌ను 'ఈనాడు' వివరణ కోరగా కొందరు యువకుల మధ్య గొడవ జరిగినట్లు సమాచారం ఉందని, స్థానిక ఎస్సై నాలుగు రోజుల నుంచి సెలవులో ఉన్నారని తెలిపారు. శిరోముండనం జరిగి ఉంటే విచారణ చేయిస్తామన్నారు. ఈ ఘటనకు కారకులైన వారు, విషయం బయటికి చెప్పొద్దంటూ బాధిత కుటుంబ సభ్యులపై ఒత్తిడి తెస్తున్నట్టు తెలిసింది.

వసుంధర

vasundhara@eenadu.in



భిన్నంగా ప్రయత్నించాలన్న తపన, వీక్షకుల అభిరుచి పసిగట్టగల నేర్పు ఉంటే చాలు... సామాజిక మాధ్యమాల్లో కంటెంట్ క్రియేటర్‌గా మారిపోవచ్చు. పేరుతో పాటు డబ్బులూ సంపాదించొచ్చు. అలాంటి వందమందిని ఫోర్బ్స్ 'డిజిటల్ స్టార్స్'గా ఎంపిక చేసింది. వారిలో తెలంగాణకు చెందిన కొమ్మిరెడ్డి ఆకాంక్ష ఒకరు. బ్యూటీ, ఫ్యాషన్ విభాగంలో రాణిస్తోన్న ఆమె ఏం చెబుతున్నారంటే..

మేకప్ వీడియోలతో ఫోర్బ్స్ జాబితాలోకి!

ప్రతిభ ఏ ఒక్కరి సొత్తూ కాదు... మనం దాన్ని నిరూపించుకునే ప్రయత్నం చేస్తే చాలు... గుర్తింపు అదే వస్తుందని నా నమ్మకం. మా స్వస్థలం నార్కట్‌పల్లికి దగ్గర్లోని యడవెల్లి. నాన్న కొమ్మిరెడ్డి అనంతరెడ్డి రియల్‌ఎస్టేట్, ఆటోమొబైల్ రంగంలో పనిచేస్తున్నారు. అమ్మ మమత గృహిణి. వారికి మేం ముగ్గురం కూతుళ్లం. మమ్మల్ని బాగా చదివించి స్థిరపడేలా చేయాలని... పాతికేళ్ల క్రితమే హైదరాబాద్ వలసొచ్చేశారు. ఇక్కడే ఇంటర్‌వరకూ చదివా. పుణెలోని సింబయాసిస్‌లో బీటెక్ చేశా. చదువయ్యాక ఓ ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. కానీ, నాకు మాత్రం రొటీన్‌గా ఉండే ఉద్యోగాలు కాకుండా కాస్త భిన్నంగా ఉండేదేదైనా ప్రయత్నించాలనిపించేది. దాంతో 2019లో యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌ల్లో వీడియోలు చేయడం ఆరంభించా.

ఆరునెలలు ఎవరూ చూడలేదు...

ఆ సమయంలోనే కొన్ని విదేశీ బ్యూటీవ్లాగ్స్ నన్ను ఆకర్షించాయి. మనదగ్గర అలాంటివేమైనా ఉన్నాయేమో చూస్తే ఇతర భాషల్లో కొన్ని కనిపించాయి. దాంతో తెలుగులో మేకప్ టిప్స్, ప్రొడక్ట్స్, బ్యూటీ కేర్... వంటి విషయాలు చెబుతూ పలు వీడియోలు చేసి అప్‌లోడ్ చేసేదాన్ని. మొదట ఆరునెలల్లో ఇన్‌స్టా, యూట్యూబ్ రెండింటికీ కలిపి 200 మందిని మించి ఫాలోవర్లు లేరు. ఉన్నవాళ్లు కూడా బంధువులూ, స్నేహితులే. వీడియోలకీ పెద్దగా ఆదరణా దక్కలేదు. అయినా నేనేం నిరాశపడలేదు. నెమ్మదిగా వ్యూయర్‌షిప్‌ని పెంచుకునే టెక్నిక్స్ తెలుసుకున్నా. వీక్షకులకు నచ్చే కంటెంట్‌ని పెంచా. మరో రెండు నెలలకు ఫాలోవర్లు 30,000లకు పెరిగారు. ఇప్పుడా సంఖ్య రెండింట్లోనూ మూడులక్షలకు పైగానే.

జీతం కంటే ఎక్కువే...

నా వీడియోలకు వ్యూయర్‌షిప్ పెరగడంతో అమెజాన్, మింత్రా, నైకా, లారియల్ వంటి... ఫ్యాషన్, బ్యూటీ పరిశ్రమలు, ఈ-కామర్స్ వెబ్‌సైట్లు తమ ఉత్పత్తులకు ప్రచారకర్తగానూ నియమించుకున్నాయి. మరికొన్ని వాణిజ్య సంస్థలతోనూ కొలాబరేషన్ వీడియోలూ చేశా. ఈమధ్య ముంబయిలో గార్నియర్ బ్రాండ్ కోసం బిల్‌బోర్డ్‌లోనూ కనిపించా. ఇలా ప్రకటనలు, ప్రచారాలతో ఉద్యోగం చేసి సంపాదించిన దానికంటే ఎక్కువే అందుకుంటున్నా. హీరోయిన్లతోనూ పనిచేశా. అయితే, ఈ ప్రయాణంలో చాలా రోజులు నేనేం చేస్తున్నానో అమ్మానాన్నలకు తెలియదు. ఆ తరవాత తెలిసినా కాదనకుండా ప్రోత్సహించారు. నా అనుభవాల్ని పంచుకునే అవకాశం టెడెక్స్ ఇచ్చింది. ఆ వీడియో చూసి ఎంతోమంది అమ్మాయిలు మీ నుంచి స్ఫూర్తి పొందాం అంటే గర్వంగా అనిపిస్తోంది. తాజాగా ఫోర్బ్స్ డిజిటల్ స్టార్ జాబితాలో 86వ స్థానంతో చోటు దక్కించుకోవడం ఆశ్చర్యంగానూ, ఆనందంగానూ ఉంది. ఫాలోవర్స్ స్పందన ఆధారంగా ఈ జాబితాను సిద్ధం చేస్తారు.

– సురిగి సంజయ్ కృష్ణ, నార్కట్‌పల్లి



దిండు మారుస్తున్నారా?!

మనలో చాలామందికి తలకింద దిండు వేసుకుంటేనే కానీ నిద్రపట్టదు. అందుకే, తప్పక వాడతాం. అయితే, దాన్ని ఎప్పుడు కొన్నారో గుర్తుందా? ఎందుకంటే, వీటిని ఒకసారి కొన్నాక జీవితకాలం వాడేయొచ్చు అనుకుంటారు చాలామంది. మీరూ అలానే చేస్తుంటే మాత్రం... ఇకనైనా సరిదిద్దుకోమంటున్నారు నిపుణులు. దిండ్లను, వాటి కవర్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోయినా, దీర్ఘకాలం వాడుతున్నా అనారోగ్యాల ముప్పు ముంచుకొస్తుందట. సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ చేసిన ఓ అధ్యయనం... దీర్ఘకాలంలో తలగడపై దుమ్ము, ఇతర అలర్జీ కారకాలు పేరుకుని బ్యాక్టీరియా వృద్ధికి దారితీస్తాయనీ చెబుతోంది. దీంతో చిన్నపిల్లలు, వృద్ధులు ఆస్తమా బారినపడతారట. అంతేకాదు, ఎక్కువకాలం వాడటం వల్ల దిండ్ల ఆకృతి దెబ్బతిని మెడ, తలనొప్పులు వస్తాయి. అందుకే, రెండు మూడేళ్లకోసారైనా వాటిని మార్చేయాల్సిందే అంటున్నారు. తరచూ ఎండలో పెట్టడం, ఎప్పటికప్పుడు దుమ్ము దులపడం, కొత్త కవర్లు తొడగడం వంటివీ చేయాలి. అప్పుడే హాయిగా నిద్రపడుతుంది.

నా జీతమే ఖర్చయిపోతోంది!

మా పెళ్లై రెండేళ్లు. ఇద్దరం సాఫ్ట్‌వేర్ ఉద్యోగులం. మొదట్లో ఆర్థిక అంశాల గురించి నన్నూ సంప్రదించి నిర్ణయం తీసుకునేవారు. ఈమధ్య నాకేమీ తెలియదన్నట్లుగా ప్రవర్తిస్తున్నారు. తన జీతం ఏమవుతుందో కూడా తెలియడం లేదు. నాది మాత్రం అంతా ఇంటి అవసరాలకు ఖర్చయిపోతోంది. ఏదైనా అంటే మనకోసమే కదా అంటున్నారు. నాకైతే కరెక్ట్‌గా అనిపించడం లేదు. నేనేం చేయాలి? – కె. సంధ్య



పెళ్లై రెండేళ్లు... అంటున్నారు. ఈపాటికే అభిప్రాయాల్ని పంచుకునే స్వేచ్ఛ, అనుబంధం, నమ్మకం ఏర్పడి ఉండాలి. కానీ మీమధ్య అవి కనిపించడంలేదు. ముందు దంపతుల మధ్య ఎలాంటి దాపరికాలూ ఉండకూడదు. డబ్బు విషయంలో రహస్యాలు క్రమంగా దాంపత్యంపైనా ప్రభావం చూపుతాయి. మొదట్లో చెప్పేవాడంటున్నారు... ఇప్పుడలా చేయడం లేదంటే... అతన్ని ఎవరో ప్రభావితం చేస్తుండవచ్చు. ముందు వాళ్లెవరో తెలుసుకోండి. అలాంటివాళ్లకు దూరంగా ఉంచే ప్రయత్నం చేయండి. కొంతమంది అబ్బాయిలు... తమ స్నేహితుల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని... భార్యకు చెప్పేదేంటిలే అనుకోవచ్చు. కాబట్టి 'అన్నీ నాకు చెప్పి తీరాలి' అని డిమాండ్ చేయకుండా... 'ఈ ఫండ్‌లో పెడదామా లేదా ఆ స్థలం కొందామా' అని మాటల్లో అడుగుతూ ఉండండి. 'మొన్న రమ్య కాల్ చేసింది... వాళ్ల ఊళ్లోనే స్థలం తీసుకున్నామని...' ఇలా మీ స్నేహితుల గురించి చెబుతూ ఉండండి. ఏదోక సందర్భంలో తన మనసులోని మాట బయటపెట్టకపోడు. కొందరు మగవాళ్లకి... ఆడవాళ్లకేం తెలుసులే అన్న చులకనభావన... బహుశా తను అలాంటి పురుషాధిక్య వాతావరణంలో పెరిగి ఉంటాడు. కాబట్టి ఈ విషయంలో కాస్త ఓపికగా ఉండండి... క్రమేణా మార్పు వస్తుంది.

పోతే, మీ జీతం మొత్తం ఇంటికి ఖర్చుపెట్టడం కరెక్టు కాదు. దీనికోసం ఇద్దరూ కూర్చొని మాట్లాడుకోవాల్సిందే. అందుకు అతన్ని ఒప్పించండి. ఆదాయ వ్యయాలూ, పొదుపూ, మదుపూ, అప్పుల గురించి కూలంకషంగా చర్చించుకోండి. ఆపైన ఇంటి బడ్జెట్‌ను రూపొందించుకోండి. జాయింట్ అకౌంట్ తెరిచి దాన్నుంచి ఈఎమ్‌ఐలూ, ఇంటి ఖర్చులకు డబ్బు కేటాయించుకోండి. మిగిలిన మొత్తంతో వ్యక్తిగత అకౌంట్ల ద్వారా మీ ఆర్థిక లక్ష్యాల కోసం పొదుపు, మదుపు చేయడం ఉత్తమం. ఆర్థిక అంశాలకు సంబంధించి వాదనలూ, గొడవలు పెట్టుకోకుండా జాగ్రత్తపడండి. సమస్యను పరిష్కరించడంపైనే దృష్టి పెట్టండి, పెద్దది చేసుకోవద్దు.

- డా. జయంతి సుందరరాజన్, సైకాలజిస్ట్

మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే... అన్నారు కార్ల్ మార్క్స్. డబ్బు కొన్నిసార్లు భార్యాభర్తల మధ్యనా పేచీ తెస్తుంది. ఫలితంగా మూడుముళ్ల బంధం మూణ్నాళ్ల ముచ్చటే అవుతుంది. అయితే ఏ సమస్యా పరిష్కరించుకోలేనిది కాదు. అందుకు కావాల్సింది కాస్త చొరవ. అది మీరే ఎందుకు తీసుకోకూడదు. మీ మధ్య ఆర్థిక అంశాల్లో అభిప్రాయ భేదాలుంటే.. వాట్సాప్(9154091911) లేదా ఈ-మెయిల్ (vasundhara@eenadu.in) చేయండి. నిపుణుల సలహాతో ప్రచురిస్తాం.



స్మార్ట్ 'జాంబీ'లు వచ్చేస్తున్నారు!

ఇప్పటి పిల్లలు ఆకలేసి అన్నం తినరు. 'ఫోన్ ఇస్తే తింటాం' అంటారు. ఆ సమయంలో ఏది? ఎంత తింటున్నాం అన్న స్పృహ కూడా ఉండదు. చుట్టూ ఏం జరుగుతున్నా పట్టదు. అంతలా మొబైల్‌లో నిమగ్నమవుతారు. చేతిలో ఫోన్ తీసుకుంటే గిలగిలా కొట్టుకుంటారు. ఇదే పిల్లలు 'స్మార్ట్‌ఫోన్ జాంబీ'లుగా మారే దశ అని చెబుతున్నారు నిపుణులు. ప్రస్తుత టెక్నాలజీ పిల్లలపై ఎంతలా ప్రభావం చూపిస్తుందనే దానికి ఇదే ఉదాహరణ. ప్రశాంత వాతావరణంలో శారీరక వ్యాయామాన్ని ఇచ్చే ఆటలు ఆడుకోవాల్సిన బాల్యం... కళ్లను ఫోన్‌కు అతికించి గదిలో ఓ మూలన కూర్చొని చూడటంలో గడిచిపోతోంది. ఫలితంగా స్థితప్రజ్ఞత, సహకరించుకోవడం, సవాళ్లను ఎదుర్కోవడం... లాంటి కీలక నైపుణ్యాలు నేర్చుకోవడంలో వెనకబడుతున్నారట. ఒక్క గంట మొబైళ్లతో గడిపినా పిల్లల్లో ప్రవర్తనా లోపాలు, ఏకాగ్రత తగ్గడం లాంటి సమస్యలు వస్తున్నాయని జపాన్‌లో ఫస్ట్ గ్రేడ్ పిల్లలపై చేసిన పరిశోధనలో తేలింది. టీనేజీ పిల్లలైతే నిద్రలేమి సమస్యలూ ఎదుర్కొంటున్నారట. అంతేకాదు, ఫోన్ అతిగా వాడడం వల్ల వాళ్ల మెదడు పనితీరుపైనా ప్రతికూల ప్రభావం చూపిస్తుందట. మిగతావారితో పోలిస్తే ఇలాంటి పిల్లలు కుంగుబాటుకు గురయ్యే అవకాశం రెండున్నర రెట్లు అధికంగా ఉందని పరిశోధనలు చెబుతున్నాయి. అందుకే, ప్రస్తుత తరాన్ని ఆటలు ఆడేలా ప్రోత్సహించడం అత్యవసరం అని చెబుతున్నారు నిపుణులు. సాధ్యమైనంత వరకూ తల్లిదండ్రులూ ఫోన్ వాడకాన్ని తగ్గించి పిల్లలకూ ఆ అలవాటు తప్పించాలంటున్నారు. అదే వారికి మనమిచ్చే విలువైన బహుమతి కూడా.

భుజ బలానికి... పూర్వోత్తాసనం!

పూర్వోత్తాసనం వేసేందుకు ముందుగా దండాసనం (కాళ్లు ముందుకు చాచి కూర్చొనే భంగిమ)లో ఉండాలి. రెండు చేతులు తుంటి వెనక ఉంచండి. వేళ్లు శరీరంవైపు వచ్చేలా చేతుల్ని సరిచేసుకోండి. నెమ్మదిగా మోకాళ్లను మడిచి పాదాలను పూర్తిగా నేలపై ఆనించండి. ఛాతీ నిండుగా శ్వాస తీసుకుంటూ తుంటిని భుజాలకు సమాంతరంగా ఉండేలా పైకి ఎత్తండి. చేతుల్నీ, పాదాల్నీ నేలపై బలంగా నొక్కి ఉంచండి. అదే విధంగా మోకాళ్ల దగ్గర ఒంపు లేకుండా కాళ్లను నిటారుగా ఉంచాలి. పాదాల్ని పూర్తిగా నేలపై



ఆనించాలి. తల భాగాన్ని వీలైనంత జాగ్రత్తగా వెనక్కు వంచి, వెన్నెముక నిటారుగా ఉండేలా, శరీరాన్ని ఉంచండి. తుంటి భాగాన్ని వీలైనంత పైకి లేపే ప్రయత్నం చేయండి. శ్వాస తీసుకుంటూ 10-15 సెకన్లు ఆసనంలో ఉండే ప్రయత్నం చేసి, తర్వాత యథాస్థానానికి వచ్చి విశ్రాంతి పొందండి. ఈ ఆసనం వాతం నొప్పులను హరిస్తుంది. కాళ్లు, కాలి వేళ్లు కొంకర్లు పోయే సమస్యను పరిష్కరిస్తుంది. కండరాలు బలంగా తయారవుతాయి. శ్వాసకోశ వ్యవస్థను మెరుగుపరుస్తుంది. చేతులు, భుజాలకు బలాన్ని చేకూరుస్తుంది. మణికట్టు, వెన్ను, మెడ సర్జరీలు అయినవాళ్లు చేయకూడదు. ఆసనంతోపాటు కొన్ని ఆహార నియమాలు పాటించాలి. చల్లని పానీయాలూ, పదార్థాలకు దూరంగా ఉండాలి. అల్లం, పసుపు, దాల్చిన చెక్క, అవిసెగింజలు, నెయ్యి.. వీటిని ఆహారంలో జోడించాలి.

- శిరీష, యోగ గురు



బంగారం-వెండి

18న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ.లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	7,240	7,160
వెండి (గ్రా)	105.00	103.00

	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం (24క్యా)	79,910	79,210	77,500	76,630	79,400	78,000	79,600	78,900	78,700	77,830
ఆర్నమెంట్	73,200	72,400	72,400	71,600	73,520	72,230	73,230	72,580	72,400	71,600
వెండి (కిలో)	96,020	94,680	94,800	93,800	93,400	93,000	94,000	93,500	95,000	95,000

అమ్మవారే పుట్టింది!

వైరల్

అప్పుడే ప్రసవమైంది. స్పృహలోకి వచ్చిన తల్లికి బిడ్డ ముఖం చూడాలని ఆతృత. ఇక వార్డు బయటేమో ఎప్పుడెప్పుడు చిన్నారి గురించిన కబురు చెబుతారా అని కుటుంబం మొత్తం ఎదురు చూపులు. ఇంతలో డాక్టర్ పాపాయిని తీసుకొని మొదట తల్లి దగ్గరికొచ్చింది. ఆ చిన్నారిని చూసి మురిసిపోయిన తల్లి ముద్దులు పెడుతూ డాక్టర్‌కి థాంక్స్ చెప్పింది. తరవాత పాపని తీసుకుని కుటుంబసభ్యుల దగ్గరికి వెళితే వాళ్లు ఆశ్చర్యపోవడమే కాదు... ఆ పసి పాదాలకు నమస్కరించడం మొదలుపెట్టారు. అమ్మవారే ఇంటికొచ్చిందంటూ మురిసిపోయారు. అసలు సంగతేంటంటే ఆ పాప పుట్టింది విజయదశమి నాడు. అందుకని మహిళా వైద్యురాలు ఆ చిన్నారిని ఎరుపు రంగు వస్త్రంలో చుట్టి, తలకు అమ్మవారిలా కిరీటాన్నీ పెట్టారు. ఆపై ఆమె తల్లికీ, బంధువులకీ చూపించారు. చూడటానికి అమ్మవారే పసిపాప రూపంలో వచ్చినట్లుగా ఉంది. అందుకే చిన్నారి పాదాలకు నమస్కరించారామె కుటుంబీకులు. మామూలుగా అమ్మాయి పుట్టిందనగానే



'లక్ష్మీదేవి ఇంటికొచ్చింది' అంటారంతా. పాపేమో దసరానాడు పుట్టింది. లక్ష్మీ, దుర్గ.. రూపమేదైతేనేం కొలిచేది ఆ జగన్మాతనే! ఇంట్లో ఆనందాన్ని నింపుతూ... ప్రేమనందిస్తూ... అందరి బాగోగులు చూసే ప్రతి అమ్మాయి అమ్మవారి రూపమే. ఆ మెసేజే ఇవ్వాలనుకున్నారేమో ఆ వైద్యురాలు. అందుకే నవరాత్రుల్లో పూజలందుకున్న అమ్మవారిలా పాపాయిని తీర్చిదిద్దారు. ఈ వీడియోని 'ఎక్స్'లో పోస్ట్ చేయగా వైరలైంది. గంటల వ్యవధిలోనే లక్షలమంది వీక్షించారు. 'క్యూట్ వీడియో', 'ఇంటర్నెట్‌లో ఈరోజు నేను చూసిన గొప్ప వీడియో', 'అమ్మవారి రూపమే అమ్మాయి అని చెప్పినట్టుంది' అంటూ మెసేజ్‌లూ వస్తున్నాయి.

22 నుంచి రష్యా పర్యటనకు మోదీ



దిల్లీ, బీజింగ్: భారత ప్రధాని మోదీ రష్యా పర్యటన ఖరారైంది. మాస్కో అధ్యక్షతన వచ్చే వారంలో జరగనున్న బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా) సదస్సులో మోదీ పాల్గొనున్నారు. ఈ మేరకు భారత విదేశీ వ్యవహారాల శాఖ శుక్రవారం ప్రకటించింది. రష్యాలోని కజన్ వేదికగా ఈ నెల 22 నుంచి 24 వరకు 16వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు హాజరవ్వాలని రష్యా అధ్యక్షుడు పుతిన్ స్వయంగా మోదీని ఆహ్వానించారు. అందులో భాగంగానే ఈనెల 22 నుంచి 23 వరకు మోదీ రష్యాలో పర్యటించనున్నారని విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది. ఈ సందర్భంగా బ్రిక్స్ సభ్య దేశాల అధినేతలతో మోదీ ద్వైపాక్షిక చర్చలు నిర్వహిస్తారని వెల్లడించింది. ఈ సదస్సుకు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ హాజరవుతారని ఆ దేశ విదేశీ వ్యవహారాల అధికార ప్రతినిధి హువా చున్యింగ్ తెలిపారు.

పాశ్చాత్య దేశాలకు బ్రిక్స్ వ్యతిరేకం కాదు : పుతిన్

మాస్కో: బ్రిక్స్ కూటమి పాశ్చాత్య దేశాలకు వ్యతిరేకం కాదని, కేవలం పశ్చిమయేతర కూటమి అని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్పష్టం చేశారు. బ్రిక్స్ సభ్యదేశమైన భారత్ వైఖరి కూడా ఇదేనని గుర్తు చేసుకున్నారు. మరోవైపు ఇజ్రాయెల్-ఇరాన్‌ల మధ్య సయోధ్య కుదిర్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఇది కష్టమైనప్పటికీ సాధ్యమేనన్నారు. ఆ రెండు దేశాలతో తాము సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు.



మీరు ఏ కష్టాన్ని ఎంచుకుంటారు?

ఊబకాయంతో జీవించడమూ కష్టమే, శరీరాన్ని ఫిట్‌గా ఉంచడానికి కఠిన కసరత్తులు చేయడమూ కష్టమే. మీరు ఏ కష్టాన్ని ఎంచుకుంటారు? రుణభారంతో ఒత్తిళ్లు ఎదుర్కోవడమూ కష్టమే, ఖర్చులు తగ్గించుకుని ఆర్థిక క్రమశిక్షణను పాటించడమూ కష్టమే. మీరు ఏ కష్టాన్ని ఇష్టంగా మార్చుకుంటారు? మీ జీవితం ఎలా కొనసాగాలన్నది మీ నిర్ణయాలను బట్టే ఉంటుంది.

– జానీ బ్రౌన్, పర్‌ఫార్మెన్స్ కోచ్

సిన్వర్ చివరి క్షణాల్లో..

- కదల్లేని స్థితిలో డ్రోన్‌పై దాడికి యత్నం
- వీడియో విడుదల చేసిన ఇజ్రాయెల్ సైన్యం
- బందీలను విడిచిపెడితే యుద్ధం ఆపేస్తాం: నెతన్యాహు

జెరూసలెం: ఒళ్లంతా దుమ్ము.. రక్తమోడుతున్న గాయాలు.. లేచి నిలబడలేని నిస్సహాయత.. అలాంటి స్థితిలోనూ డ్రోన్‌పై దాడికి యత్నం.. ఇదీ మరణానికి కొన్ని క్షణాల ముందు హమాస్ అధినేత యాహ్యా సిన్వర్ పరిస్థితి! గాజాలో ఇజ్రాయెల్ సైన్యం బుధవారం జరిపిన దాడిలో అతడు హతమైన సంగతి తెలిసిందే. చనిపోవడానికి ముందు అతడు ఉన్న పరిస్థితిని ఇజ్రాయెల్ సైన్యం ఓ డ్రోన్ ద్వారా రికార్డు చేసింది. సంబంధిత ఫుటేజీని తాజాగా విడుదల చేసింది. ఆ వీడియోలో కనిపిస్తున్న దృశ్యాల ప్రకారం.. మరణానికి ముందు సిన్వర్ ఓ శిథిల భవనంలో సోఫా కుర్చీలో కూర్చొని ఉన్నాడు. అప్పటికే అతడు తీవ్రంగా గాయపడ్డాడు. గాయాల నుంచి రక్తం కారుతోంది. కూర్చున్న చోటు నుంచి లేవలేని నిస్సహాయత స్పష్టంగా కనిపిస్తోంది. శరీరమంతా దుమ్ము కప్పేసి ఉంది. అలాంటి పరిస్థితిలో.. తనవైపుగా వస్తున్న డ్రోన్‌పైకి కర్రలాంటి



గాయాలతో సోఫాలో కూర్చున్న సిన్వర్

ఓ వస్తువును విసిరాడు. సంబంధిత వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

సైనిక దుస్తులు.. గ్రెనేడ్లు..

సిన్వర్ చివరి క్షణాలను వీడియో తీసిన పరిస్థితుల గురించి ఇజ్రాయెల్ సైన్యం అధికార ప్రతినిధి డేనియల్ హగారీ తాజాగా వివరించారు. 'అప్పటికే మా సైన్యం దాడిలో ఆ భవనం శిథిలమైంది. అందులో హమాస్ మిలిటెంట్లు ఎవరైనా ఉన్నారో తెలుసుకునేందుకు డ్రోన్‌ను పంపించాం. లోపల ఓ వ్యక్తి కనిపించాడు. అతడు సిన్వర్ అని తొలుత మేం అనుకోలేదు. కేవలం ఓ ముష్కరుడిగా భావించాం. తర్వాత భవనంపై మరోసారి బాంబు దాడి చేశాం. దీంతో భవనం కుప్పకూలి అతడు మరణించాడు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న తర్వాతే హతుడు సిన్వర్ అని తెలిసింది. అతడి శరీరంపై సైనిక దుస్తులు, గ్రెనేడ్లు ఉన్నాయి'' అని పేర్కొన్నారు.

వెంటాడిమరీ హతమారుస్తాం: నెతన్యాహు

సిన్వర్ మృతి నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు కీలక వ్యాఖ్యలు చేశారు. హమాస్ ముష్కరులు ఆయుధాలను వదిలి.. బందీలను విడుదల చేస్తే వెంటనే యుద్ధం ముగిస్తామని ప్రకటించారు. ఆపై హమాస్ తీవ్రవాదులు జనజీవన స్రవంతిలో కలిసి సాధారణ జీవితం గడిపే అవకాశం కల్పిస్తామన్నారు. లేదంటే వెంటాడి మరీ వారిని హతమరుస్తామని హెచ్చరించారు.


వీరుడిలా మరణించాడు: హమాస్

సిన్వర్ మృతిని హమాస్ శుక్రవారం ధ్రువీకరించింది. అతడు వీరుడిలా మరణించాడని పేర్కొంది. శత్రువులకు తల వంచకుండా.. ఆక్రమణకు వచ్చిన సైన్యాన్ని ఎదుర్కొంటూ.. ఆయుధాన్ని ఝళిపిస్తూ అతడు కన్నుమూశాడంటూ ఓ ప్రకటనలో కీర్తించింది. కాల్పుల విరమణ పాటిస్తూ గాజా నుంచి ఇజ్రాయెల్ బలగాలు వెనుదిరిగేదాకా బందీలను తాము విడుదల చేయబోమని హమాస్ సీనియర్ నేత ఖలీల్ అల్-హయ్యా స్పష్టం చేశారు. పాలస్తీనా విముక్తి పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లే యువతకు సిన్వర్ ఆదర్శంగా నిలుస్తాడంటూ ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ మిషన్ ఒక ప్రకటన విడుదల చేసింది. ఇరాక్ నేత సద్దాం హుస్సేన్‌లా ప్రాణాల కోసం పాకులాడకుండా అతడు యోధుడిలా మరణించాడని పేర్కొంది.

బాల్య వివాహాల నిరోధానికి జిల్లాకో ప్రత్యేక అధికారి

- బహుముఖ కార్యాచరణతోనే సామాజిక రుగ్మత కట్టడి
- స్పష్టం చేసిన సుప్రీంకోర్టు

దిల్లీ: బాల్యవివాహాలు...చిన్నారుల విద్య, జీవన అవకాశాలను, ఆశలను చిదిమివేసి వారి ఆరోగ్యాన్ని, హక్కులను దెబ్బతీస్తాయంటూ సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సామాజిక రుగ్మతను రూపుమాపేందుకు బహుముఖ కార్యాచరణ అవసరమని స్పష్టం చేసింది. బాల్య వివాహాల నిషేధ చట్టాన్ని అమలు చేయాల్సిందేనని పేర్కొనడంతో పాటు ఈ లక్ష్య సాధనకు అనుసరించాల్సిన పలు మార్గదర్శకాలను కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలకు జారీ చేసింది. బాల్య వివాహం జరగక ముందే దానిని అడ్డుకోవాల్సిన ఆవశ్యకతను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం 141 పేజీల తీర్పులో నొక్కి చెప్పింది. బాల్య వివాహాలు మైనర్లకు తమ జీవిత భాగస్వామిని ఎంచుకునే స్వేచ్ఛను హరిస్తాయని పేర్కొంది. ఈ



రుగ్మత వేళ్లూనుకోవడానికి గల కారణాలను గుర్తించడంతో పాటు బాల్య వివాహాల సమర్థ కట్టడికి వ్యూహాలను రచించుకుని అమలు చేయాలని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రలతో కూడిన ధర్మాసనం తెలిపింది. దేశంలో బాల్య వివాహాలపై దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై విచారణ జరిపి ఈ తీర్పు వెలువరించింది.

ఇవీ ధర్మాసనం మార్గదర్శకాలు...


- దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలోనూ బాల్య వివాహాల నిషేధ అధికారుల (సీఎంపీవో)ను ప్రత్యేకంగా నియమించాలి. వారికి ఈ ఒక్క బాధ్యతనే అప్పగించాలి. ఇతర విధులకు వినియోగించరాదు. ప్రత్యేక పోలీస్ విభాగం కూడా ఉండాలి.
- బాల్య వివాహాల నిషేధం కచ్చితంగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత సీఎంపీవోలదే. ప్రతి మూడు నెలలకోసారి వీరి పనితీరును సమీక్షించాలని స్త్రీ,శిశు అభివృద్ధి, హోంశాఖలను ధర్మాసనం ఆదేశించింది.
- బాల్య వివాహాల నిషేధం అమలు క్రతువులో కలెక్టర్లు, ఎస్పీలనూ భాగస్వాములను చేయాలి. ఈ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోవాలి.

పూర్తి వివరాలు www.eenadu.net లో..

రిజర్వేషన్ ఉన్న విద్యార్థులకు ఐఐటీల్లో ఫీజు రాయితీలు

దిల్లీ: సమానమైన, నాణ్యమైన విద్యను అందించడంలో భాగంగా దేశంలోని ఐఐటీల్లో రిజర్వేషన్ విభాగపు విద్యార్థులకు ఇప్పటికే ఫీజుల్లో రాయితీలు, సడలింపులు ఇస్తున్నట్లు ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ వి.కామకోటి వెల్లడించారు. "జేఈఈ ఆధారిత ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తు దశ నుంచే ఈ వెసులుబాటును అమలుపరుస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ విద్యార్థులు పరీక్ష ఫీజులో సగం మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ విద్యార్థులతోపాటు ఓబీసీ కేటగిరీ విద్యార్థుల ప్రవేశాలను పెంచడానికి కట్ ఆఫ్‌లో కూడా మినహాయింపును ఇస్తున్నాం'' అని కామకోటి వివరించారు. ఈ విద్యాసంవత్సరం ఐఐటీల్లో ప్రవేశాలకు ఐఐటీ మద్రాస్ జేఈఈ అడ్వాన్స్‌డ్‌ను నిర్వహించింది. దేశవ్యాప్తంగా 23 ఐఐటీలు ఉన్నాయని, సమాజంలోని అణగారిన విద్యార్థులను ప్రోత్సహించడానికి విద్యా మంత్రిత్వశాఖ దృష్టి సారించిన నేపథ్యంలో పలు కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. దీంతోపాటు కొన్ని ఐఐటీలు అదనంగా మరిన్ని కార్యక్రమాలు అమలుచేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

ఆప్ నేత సత్యేందర్ జైన్‌కు బెయిల్ మంజూరు



దిల్లీ: ఆప్ సీనియర్ నేత, మాజీ మంత్రి సత్యేందర్ జైన్‌కు దిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు బెయిల్‌ను మంజూరు చేసింది. దీంతో శుక్రవారం సాయంత్రం ఆయన దాదాపు 18నెలల తర్వాత తిహాడ్ జైలునుంచి బయటకు వచ్చారు. తిహాడ్ జైలు వద్దకు చేరుకున్న దిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ, ఇతర ఆప్ నాయకులు మనీశ్ సిసోదియా, సంజయ్ సింగ్, వందల మంది ఆప్ కార్యకర్తలు జైన్‌కు ఘన స్వాగతం పలికారు. అంతకుముందు విచారణలో జాప్యం, సుదీర్ఘ జైలు నిర్బంధం కారణంగా జైన్‌కు బెయిల్‌ను మంజూరు చేస్తున్నట్లు ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగనే వెల్లడించారు. జైలు నుంచి విడుదలకు వారెంట్‌ను జారీ చేశారు. వ్యక్తిగత బాండుపై రూ.50 వేల పూచీకత్తుతో జైన్‌కు ఉపశమనం కల్పించారు. తనకు సంబంధాలు ఉన్న నాలుగు కంపెనీల ద్వారా జైన్ హవాలాకు పాల్పడ్డారన్న ఆరోపణలతో 2022 మే 30న ఈడీ ఆయన్ను అరెస్టు చేసింది.

భారత్‌లోనే ఎక్కువమంది పేదలు

ఐక్యరాజ్యసమితి: ప్రపంచంలో అత్యధిక పేదలు ఉన్న అయిదు దేశాలలో భారత్ ఒకటని ఐక్యరాజ్య సమితి నివేదిక వెల్లడించింది. ప్రపంచమంతటా కడు పేదరికం అనుభవిస్తున్న 110 కోట్ల మందిలో సగానికి పైగా మైనర్లేనని తెలిపింది. ఐక్యరాజ్యసమితి అభివృద్ధి సంస్థ (యు.ఎన్.డి.పి), ఆక్స్‌ఫర్డ్ పేదరిక-మానవాభివృద్ధి అధ్యయన సంస్థ సంయుక్తంగా గురువారం విడుదల చేసిన అంతర్జాతీయ బహుముఖ పేదరిక సూచీలో ఈ వివరాలు ఉన్నాయి. ప్రపంచంలో అత్యధికంగా భారత్‌లోనే 23.4 కోట్ల మంది నిరుపేదలు ఉన్నారు. 9.3 కోట్ల మంది పేదలతో పాకిస్థాన్, 8.6 కోట్ల మందితో ఇథియోపియా, 7.4 కోట్ల మందితో నైజీరియా, 6.6 కోట్లమందితో కాంగో పేదలు అధికంగా గల దేశాలుగా నిలుస్తున్నాయి. ప్రపంచ పేదలలో 48.1 శాతం మంది ఈ అయిదు దేశాల్లోనే నివసిస్తున్నారు. 45.5 కోట్ల మంది పేదలు నిత్య సంఘర్షణలతో అల్లాడుతున్న దేశాల్లో నివసిస్తున్నారు. పేదరిక నిర్మూలనకు సత్వర కార్యాచరణ అవసరమని యు.ఎన్.డి.పి ప్రతినిధి అకిం స్టైనర్ అన్నారు.

సుప్రీంకోర్టులో అన్ని ధర్మాసనాల విచారణలు ప్రత్యక్ష ప్రసారం

ఈనాడు, దిల్లీ: దేశ సర్వోన్నత న్యాయస్థానంలోని అన్ని ధర్మాసనాల్లో జరిగే విచారణ కార్యకలాపాలు త్వరలో ప్రత్యక్ష ప్రసారం కానున్నాయి. దీనికి సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను పరీక్షించే క్రమంలో భాగంగా శుక్రవారం వివిధ కోర్టుల కార్యకలాపాలను ప్రత్యక్ష ప్రసారం చేశారు. సాంకేతిక పరీక్షలన్నీ పూర్తయిన తర్వాత మొత్తం 16 ధర్మాసనాల కార్యకలాపాలను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం ప్రజలకు దక్కనుంది. ఇప్పటి వరకు రాజ్యాంగ ధర్మాసనాల విచారణలను మాత్రమే యూట్యూబ్ ద్వారా సర్వోన్నత న్యాయస్థానం ప్రత్యక్ష ప్రసారం చేసింది. ఇకపై సొంత యాప్ సాయంతో సుప్రీంకోర్టు వెబ్‌సైటు ద్వారా సాధారణ విచారణల ప్రసారాలు కూడా ప్రారంభించడానికి సిద్ధమవుతోంది. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ పదవీ విరమణ చేయనున్న నవంబరు 10వ తేదీలోపు ఈ వ్యవస్థను అధికారికంగా అందుబాటులోకి తెచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే కొన్ని హైకోర్టులు తమ కార్యకలాపాలను ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నాయి. గుజరాత్ హైకోర్టు తొలుత ఈ సదుపాయానికి శ్రీకారం చుట్టింది. న్యాయ ప్రక్రియలో మరింత పారదర్శకత తీసుకురావడం దీని వెనుకున్న ప్రధాన ఉద్దేశంగా న్యాయమూర్తులు చెబుతున్నారు.

పూర్తి వివరాలు www.eenadu.net లో..


సుప్రీంకోర్టులో ఈశా ఫౌండేషన్‌కు ఉపశమనం

- యువతులను బంధించారన్న పిటిషన్ కొట్టివేత

దిల్లీ: మహిళలు సన్యాసం తీసుకునేలా ప్రేరేపిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొన్న కేసులో ఈశా ఫౌండేషన్‌కు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఈ వ్యవహారంపై ఇద్దరు యువతుల తండ్రి దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం కొట్టివేస్తూ విచారణను ముగించింది. తమిళనాడు పోలీసుల నివేదికను పరిశీలించిన అత్యున్నత న్యాయస్థానం. "వారిద్దరు మేజర్లు. వారి ఆచూకీ ఎక్కడుందో తెలిసింది. స్వచ్ఛందంగానే ఆశ్రమంలో ఉన్నట్లు చెప్పారు. అందువల్ల పిటిషన్‌ను కొట్టేస్తున్నాం. ఇక, ఈ కేసులో హైకోర్టు నుంచి తదుపరి ఆదేశాలు అవసరం లేదు" అని సీజేఐ జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్ర సభ్యులుగా ఉన్నారు.

ఝార్ఖండ్‌లో 68 స్థానాల్లో భాజపా పోటీ

- ఎన్డీయేలో ప్రాథమికంగా కుదిరిన సీట్ల సర్దుబాటు
- అస్సాం సీఎం బిశ్వశర్మ వెల్లడి



రాంచీ : ఝార్ఖండ్ శాసనసభ ఎన్నికల వేళ ఎన్డీయే భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల సర్దుబాటు చర్చలు తుది దశకు చేరుకున్నాయి. మొత్తం 81 స్థానాల్లో ఏజేఎస్‌యూకు 10, జేడీయూకు 2, ఎల్జేపీకి ఒక స్థానాన్ని కేటాయించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల భాజపా ఇన్‌ఛార్జ్, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ తెలిపారు. సీట్ల సర్దుబాటు ఒప్పందం ప్రకారం భాజపా 68 చోట్ల పోటీ చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు వివరించారు. అయితే, అధికార జార్ఖండ్ ముక్తి మోర్చా సహా ప్రత్యర్థి పార్టీలు ఇంకా తమ ప్రణాళికలను వెల్లడించనందున ప్రస్తుతానికి భాజపా వేచి చూసే ధోరణి ప్రదర్శిస్తోంది. ఈ క్రమంలో సీట్ల సర్దుబాటు చర్చలు ఇంకా కొనసాగుతున్నాయని, త్వరలోనే ఇవి పూర్తవుతాయని హిమంత బిశ్వశర్మ అన్నారు.

మొదలైన నామినేషన్ల ఘట్టం

ఇదిలా ఉండగా, ఝార్ఖండ్‌లో తొలివిడత పోలింగ్ జరిగే 43 స్థానాలకు ఎన్నికల సంఘం శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. శుక్రవారం నుంచి ఈ నెల 25 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఈ నెల 28న నామినేషన్ల పరిశీలన, 30వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. రెండో దశలో నామినేషన్ల పరిశీలనకు అక్టోబరు 30, నామినేషన్ల ఉపసంహరణకు నవంబరు 1 వరకు తుది గడువు ఉంది. రెండో దశ పోలింగ్ నవంబరు 20న జరగనుంది. నవంబరు 23న ఫలితాలు వెలువడనున్నాయి.

ఎంవీఏ సీట్ల పంపకాల్లో జాప్యంపై శివసేన అసంతృప్తి


- ఇప్పటి వరకూ 200 స్థానాలపైనే ఏకాభిప్రాయం: సంజయ్ రౌత్

ముంబయి: మహా వికాశ్ అఘాడీ(ఎంవీఏ) పక్షాల మధ్య సీట్ల పంపకాల్లో జరుగుతున్న జాప్యంపై శివసేన(యూబీటీ) అసంతృప్తి వ్యక్తం చేసింది. నిర్ణయాలు తీసుకోవడంలో మహారాష్ట్ర కాంగ్రెస్ నేతలు అసమర్థులని విమర్శించింది. పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ ఎంపీ సంజయ్ రౌత్ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. ''మహావికాస్ అఘాడీ పక్షాలైన కాంగ్రెస్, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పీ)ల మధ్య 288 శాసనసభ స్థానాలకు గాను ఇప్పటి వరకూ 200 సీట్లపైనే ఏకాభిప్రాయం కుదిరింది'' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు కె.సి.వేణుగోపాల్, ముకుల్ వాస్నిక్; మహారాష్ట్ర ఇంఛార్జి రమేశ్ చెన్నితాలతో సీట్ల పంపకాలపై మాట్లాడినట్లు వెల్లడించారు. రాహుల్ గాంధీతో కూడా మాట్లాడతానని చెప్పారు.

పన్నూ హత్యకు కుట్ర కేసు.. మరో భారతీయుడిపై అమెరికా అభియోగాలు

- నిందితుడు 'రా' మాజీ అధికారి!

వాషింగ్టన్, న్యూయార్క్: సిక్కు వేర్పాటువాది గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు కుట్ర పన్నారంటూ భారత నిఘా విభాగం మాజీ అధికారిపై అమెరికా తాజాగా అభియోగాలు మోపింది. నిందితుడిని వికాస్ యాదవ్ (39)గా పేర్కొంది. భారత నిఘా విభాగం 'రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్ (రా)' కార్యాలయం ఉండే కేబినెట్ సచివాలయమే ఆయన్ను ఉద్యోగంలోకి తీసుకుందని తెలిపింది. న్యూయార్క్‌లోని ఓ కోర్టులో ఫెడరల్ ప్రాసిక్యూటర్లు గురువారం ఈ మేరకు అభియోగపత్రం దాఖలు చేశారు. పన్నూ హత్య కోసం పన్నిన కుట్రకు వికాస్ మార్గదర్శకత్వం వహించినట్లు అందులో పేర్కొన్నారు. ఆయన పరారీలో ఉన్నారని తెలిపారు. వికాస్‌పై నగదు అక్రమ చలామణి అభియోగాలనూ మోపారు.



వికాస్ యాదవ్

తమ దేశంలో పన్నూ హత్యకు కుట్ర జరిగిందని, దాన్ని తాము భగ్నం చేశామని అమెరికా నిరుడు ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే భారత్‌కు చెందిన నిఖిల్ గుప్తాను అరెస్టు చేశారు. 2023 వేసవిలో పన్నూను చంపేందుకు నిఖిల్‌తో కలిసి వికాస్ కుట్ర పన్నారని తాజా అభియోగపత్రంలో వారు పేర్కొన్నారు.

ఉక్రెయిన్‌పై పోరుకు ఉత్తర కొరియా సైనికులు

- రష్యాకు మద్దతుగా రంగంలోకి దిగుతున్నారు
- జెలెన్‌స్కీ, దక్షిణ కొరియా సంస్థల ఆరోపణ

బ్రసెల్స్/ సియోల్: రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలోకి ప్రత్యక్షంగా మూడోదేశం ప్రవేశిస్తోందా? ఈ పోరులో రష్యాకు మద్దతుగా ఉత్తర కొరియా తన సైన్యాన్ని రంగంలోకి దించుతోందా? ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, దక్షిణ కొరియా నిఘా అధికారులు ఈ మేరకు వేర్వేరుగా సంచలన ఆరోపణలు చేశారు. ఈ పోరులోకి మూడో దేశం ప్రవేశిస్తే అది మూడో ప్రపంచ యుద్ధానికి దారితీయవచ్చని జెలెన్‌స్కీ హెచ్చరించారు. "ఉక్రెయిన్‌పై యుద్ధానికి ఉత్తర కొరియా సైనిక సిబ్బంది, అధికారులను రష్యాకు పంపినట్లు మా నిఘా వర్గాల నుంచి సమాచారం వచ్చింది. ఉత్తర కొరియాకు చెందిన మరో 10 వేల మంది సైనికులు వారి స్వదేశంలో శిక్షణ పొందుతున్నారు'' అని బ్రసెల్స్‌లో నాటో ప్రధాన కార్యాలయంలో విలేకరులతో పేర్కొన్నారు. ఈ ఆరోపణలను అమెరికా నిర్ధారించలేదు. యుద్ధంలో ఉత్తర కొరియా సైనికులు నేరుగా పాల్గొంటున్నట్లు ఎటువంటి ఆధారాలు లేవని నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రూట్టే పేర్కొన్నారు.



ఉక్రెయిన్‌లోని ఓ ప్రాంతంలో మోహరించిన రష్యా సైనికులు

రష్యాతో యుద్ధం ముగించడానికి తన విజయ ప్రణాళికను చర్చించేందుకు యూరోపియన్ యూనియన్ (ఈయూ) నాయకులు, నాటో రక్షణ మంత్రులతో చర్చించేందుకు జెలెన్‌స్కీ తాజాగా బ్రసెల్స్‌లో సమావేశమయ్యారు. తన విజయ ప్రణాళికను అమలుచేస్తే.. వచ్చే ఏడాదిలోగా ఈ యుద్ధం ముగుస్తుందని వెల్లడించారు. నాటో సభ్య దేశాల్లో సభ్యత్వానికి ఉక్రెయిన్‌కు అర్హత ఉందన్నారు. జెలెన్‌స్కీతో భేటీ అనంతరం ఈయూ నేతలు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉక్రెయిన్‌కు సైనిక తోడ్పాటును బాగా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా గగనతల రక్షణ వ్యవస్థ, మందుగుండు సామగ్రి, క్షిపణులను అందించాలని చెప్పారు.

ఉత్తర కొరియా ప్రత్యేక బలగాల పయనం

రష్యా యుద్ధ నౌకల ద్వారా 1500 మందితో కూడిన ఉత్తరకొరియా ప్రత్యేక బలగాలు రష్యాలోని వ్లాదివోస్తోక్ రేవు నగరాన్ని చేరుకున్నాయని దక్షిణ కొరియా నిఘా సంస్థ (ఎన్ఐఎస్) పేర్కొంది. త్వరలో మరిన్ని బలగాలు అక్కడికి వెళతాయని తెలిపింది. రష్యాలో మోహరించిన ఉత్తర కొరియా సైనికులకు రష్యా సైనిక యూనిఫామ్‌లు, ఆయుధాలు, నకిలీ గుర్తింపు పత్రాలు అందించినట్లు పేర్కొంది. ప్రస్తుత యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా శిక్షణ పూర్తిచేసుకున్నాక వారిని పోరులోకి దించే అవకాశం ఉందని తెలిపింది. ఉత్తర కొరియా రేవు వద్ద రష్యా యుద్ధనౌకల కదలికలకు సంబంధించిన ఉపగ్రహ చిత్రాలనూ ఎన్ఐఎస్ వెలువరించింది. మొత్తంమీద 12వేల బలగాలను రష్యా పంపాలని ఉత్తర కొరియా నిర్ణయించినట్లు తెలిపింది. ఉత్తర కొరియా బలగాలను తాము వినియోగించుకుంటున్నట్లు వచ్చిన వార్తలను రష్యా అధ్యక్ష భవన అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ ఖండించారు.

ఓటీటీల సెన్సారుపై పిటిషన్ కొట్టివేత

దిల్లీ: సినిమా ప్రదర్శనల నియంత్రణకు సెన్సార్‌బోర్డు ఉన్నట్లే ఓటీటీ తదితర ప్లాట్‌ఫాంలలో ప్రదర్శించే వీడియోలు, ఇతర కంటెంటు నియంత్రణకు కూడా స్వయంప్రతిపత్తి గల సంస్థను నియమించేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలన్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం తోసిపుచ్చింది. ఇది ప్రభుత్వ పరిధిలోని విధానపరమైన అంశమనీ, సంబంధిత పక్షాలతో సంప్రదించి నిర్ణయం తీసుకోవలసిన వ్యవహారమని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. శశాంక్ శేఖర్ ఝా అనే న్యాయవాది ఈ పిటిషను దాఖలు చేశారు. నలభైకు పైగా ఓటీటీ, వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాంలు ప్రజలకు కంటెంటు, వీడియోలు అందిస్తున్నాయనీ.. 19వ రాజ్యాంగ అధికరణం ఇచ్చిన వాక్‌స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తున్నాయనీ ఆయన ఆరోపించారు. ప్రభుత్వ విధానాల్లో కోర్టు జోక్యాన్ని కోరుతూ ఇలాంటి ప్రజాహిత వ్యాజ్యాలు (పిల్స్) వేయడం ఎక్కువైపోయిందనీ, దీంతో అసలుసిసలు పిల్‌లను విచారించడానికి వ్యవధి లేకుండాపోతోందని ధర్మాసనం పేర్కొంది.



ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో కూలిపోయిన ఓ మసీదులోనే ప్రార్థనలు చేస్తున్న పాలస్తీనియులు

రాజస్థాన్‌లో నరభక్షక చిరుత హతం

జైపుర్: రాజస్థాన్‌లోని ఉదయ్‌పుర్‌వాసులకు కంటిమీద కునుకులేకుండా చేసిన చిరుతను అధికారులు మట్టుబెట్టారు. అటవీశాఖ అధికారులు, పోలీసులు శుక్రవారం చేపట్టిన ఆపరేషన్‌లో ఆ చిరుతను కాల్చిచంపినట్లు డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ అజయ్ చిత్తోరా వెల్లడించారు. అది మనుషుల రక్తం రుచి మరిగిన చిరుతేనా అనే విషయం నివేదికలు వచ్చిన అనంతరం నిర్ధారణ అవుతుందని వెల్లడించారు. కాగా, సెప్టెంబరు 18 నుంచి ఇప్పటి వరకు ఛలీ, బగ్దుండా, మజావద్, మదర్ ప్రాంతాల్లో జరిగిన చిరుత దాడుల్లో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. బుధవారం సైతం చిరుత ఇద్దరు మహిళలపై దాడి చేయడంతో ఓ మహిళ ప్రాణాలను కోల్పోయింది. దీంతో చిరుతను పట్టుకోవడానికి బోన్లు, కెమెరా ట్రాప్‌లను అమర్చారు.

పుతిన్‌కు అనారోగ్యమంటూ ఊహాగానాలు..

ఖండించిన క్రెమ్లిన్

మాస్కో: రష్యా అధ్యక్షుడు పుతిన్ అనారోగ్యంతో బాధపడుతున్నట్లు స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఫ్లూ టీకాలపై అవగాహన కార్యక్రమంలో భాగంగా పుతిన్ ఇటీవల ఓ వార్తాసంస్థతో మాట్లాడారు. "సెంట్రల్ క్లినికల్ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నా. దేశీయ టీకాలు వేయించుకోవాలని అక్కడి వైద్యులు సిఫారసు చేశారు'' అని ఆయన అప్పట్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో కథనాలు వచ్చాయి. వీటిని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ ఖండించారు. పుతిన్ సాధారణ వైద్య పరీక్షలు మాత్రమే చేయించుకున్నారని, ఆయన ఆరోగ్యంగా ఉన్నారని పేర్కొన్నారు.

అణు క్షిపణి విభాగ సన్నద్ధతను పరీక్షించనున్న రష్యా

మాస్కో: రష్యా తన అణు క్షిపణి విభాగ పోరాట సన్నద్ధతను పరీక్షించనున్నట్లు కథనాలు వచ్చాయి. మాస్కోకు వాయవ్య ప్రాంతంలో ఈ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నాయి. ఈ కసరత్తులో భాగంగానే ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను సైతం మోహరించనున్నట్లు సమాచారం. ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో పశ్చిమదేశాలు జోక్యం చేసుకోకుండా నివారించడానికి రష్యా ఈ విన్యాసాలు నిర్వహిస్తున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు.

501 మంది ఉక్రెయిన్ సైనికుల మృతదేహాల అప్పగింత

కీవ్: యుద్ధంలో మరణించిన 501 మంది ఉక్రెయిన్ సైనికుల మృతదేహాలను.. రష్యా శుక్రవారం ఉక్రెయిన్ అధికారులకు అప్పగించింది. 2022లో రెండు దేశాల నడుం పోరు మొదలయ్యాక ఇంత ఎక్కువ సంఖ్యలో మృతదేహాల అప్పగింత జరగడం ఇదే మొదటిసారి. వీరిలో ఎక్కువ మంది ఉక్రెయిన్‌లోని తూర్పు దొనెట్స్క్ ప్రాంతంలో జరిగిన యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారు. మృతదేహాలను ఫోరెన్సిక్ నిపుణుల సాయంతో గుర్తించి, బాధిత కుటుంబాలకు అప్పగిస్తామని అధికారులు తెలిపారు.

బిహార్‌లో 35కు చేరిన కల్తీ మద్యం మరణాలు

పట్నా: బిహార్ కల్తీ మద్యం ఘటనలో శుక్రవారం మరో 10మంది మృతిచెందారు. దీంతో మొత్తం మృతుల సంఖ్య 35కు చేరుకుంది. వీరిలో 28మంది సివాన్ జిల్లాకు చెందిన వారు కాగా, మరో ఏడుగురు సారణ్ జిల్లా వాసులు. మరో 25మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు డీజీ నీలేశ్ కుమార్ వెల్లడించారు. మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించామని, నివేదిక వచ్చిన తర్వాతే మరణాలకు కచ్చితమైన కారణాలు తెలపగలమన్నారు.

28 నుంచి బీసీ కమిషన్ బహిరంగ విచారణ

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని స్థానిక సంస్థల వారీగా జనాభా దామాషా ప్రకారం కల్పించాల్సిన రిజర్వేషన్లను ఖరారు చేసేందుకు ఈ నెల 28 నుంచి నవంబరు 13 వరకు బీసీ కమిషన్ బహిరంగ విచారణ నిర్వహించనుంది. ఈ మేరకు బీసీ కమిషన్ కార్యదర్శి బాలమాయా దేవి నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రజలు తమ అభ్యంతరాలను ఆయా బహిరంగ విచారణల్లో కమిషన్‌కు చెప్పవచ్చని బీసీ కమిషన్ తెలిపింది. అభ్యంతరాలు తెలపని ప్రజలు ప్రత్యామ్నాయంగా నవంబరు 13 వరకు వ్యక్తిగతంగా లేదా పోస్టు ద్వారా అభ్యర్థనలను కమిషన్ కార్యాలయంలో ప్రత్యేక అధికారికి సమర్పించాలని కోరింది. ఈ నెల 28న ఆదిలాబాద్, 29న నిజామాబాద్, 30న సంగారెడ్డి, నవంబరు 1న కరీంనగర్, 2న వరంగల్, 4న నల్గొండ, 5న ఖమ్మం, 7న రంగారెడ్డి, 8న మహబూబ్‌నగర్, 11న హైదరాబాద్ జిల్లాల్లోని కలెక్టరు కార్యాలయాల్లో ఈ బహిరంగ విచారణ ఉంటుంది. 12న కమిషన్ కార్యాలయంలో స్వచ్ఛంద సంస్థలు, కుల సంఘాలు, సంక్షేమ సంఘాలు, 13న రాష్ట్ర ప్రజలందరూ తమ అభిప్రాయాలు తెలిపేందుకు విచారణ నిర్వహించనుంది.

‘విదేశీ విద్య’ పథకానికి నిధులు విడుదల చేయాలి

సీఎం రేవంత్‌రెడ్డికి ఆర్.కృష్ణయ్య లేఖ

కాచిగూడ, న్యూస్‌టుడే: విదేశీ విద్య పథకానికి వెంటనే నిధులు విడుదల చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య శుక్రవారం లేఖ రాశారు. ఆ పథకానికి ఎంపికై విదేశాలకు వెళ్లిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు.. మూడేళ్లుగా నిధులను మంజూరు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విదేశీ యూనివర్సిటీలలో ఫీజులు కట్టే ఆర్థిక స్తోమత లేక చదువులను మధ్యలోనే మానేసి రాష్ట్రానికి తిరిగి వస్తున్నారని పేర్కొన్నారు. వారం రోజుల్లోగా పెండింగ్ బకాయిలను చెల్లించకుంటే ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు.

‘మూసీ పునరుజ్జీవంపై ప్రభుత్వ ప్రతిపాదనను పార్టీలకు ఇవ్వాలి’

హైదరాబాద్, న్యూస్‌టుడే: మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై ప్రభుత్వ ప్రతిపాదనలను రాజకీయ పార్టీలకు అందజేసి, అధ్యయనానికి తగిన సమయమిచ్చిన తర్వాతే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శుక్రవారం ఓ ప్రకటనలో రాష్ట్ర సర్కారును కోరారు. మూసీ ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన సమంజసంగా లేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికే మూసీపై ఒక నిర్ణయానికి వచ్చినట్టు, దాని అమలుకు సంబంధించి సూచనలు మాత్రమే అడుగుతున్నట్లుగా కన్పిస్తోందన్నారు. మూసీ పునరుజ్జీవంపై ఎవరికీ భిన్నాభిప్రాయం ఉండదని, ఆ పేరుతో ప్రభుత్వం ఏం చేయతలపెట్టిందన్నదే అసలు విషయమని పేర్కొన్నారు.

రాజమహేంద్రవరంలో ప్రపంచ తెలుగు మహాసభలు

జనవరి 8, 9, 10 తేదీల్లో..

రాజానగరం, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ(జీజీయూ)లో జనవరి 8, 9, 10 తేదీల్లో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించనున్నట్లు జీజీయూ ఛాన్సలర్ కె.వి.వి.సత్యనారాయణరాజు తెలిపారు. సభలను నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఛాన్సలర్ మాట్లాడుతూ.. “మూడు రోజులు నిర్వహించే ప్రపంచ తెలుగు మహాసభలలో తెలుగు వారసత్వ సంపదను చాటి చెప్పే సాంస్కృతిక ప్రదర్శనలు, తెలుగు సాహిత్యం, సంస్కృతిపై చర్చలు, హస్తకళలు, జానపద నృత్యాలు ఉంటాయి. సభలకు రెండు తెలుగు రాష్ట్రాల సీఎంలు, ఉప ముఖ్యమంత్రులు, మంత్రులు, 5 రాష్ట్రాల గవర్నర్లు, హైకోర్టు న్యాయమూర్తులు, సినీ తారలు, కేంద్ర మంత్రులను ఆహ్వానించనున్నాం. సంక్రాంతి పురస్కారాలు, విశిష్ట సేవా పురస్కారాలు అందజేస్తాం. తెలుగును కాపాడేందుకు కృషి చేస్తున్న విదేశీ తెలుగు వారినీ సత్కరిస్తాం” అని వివరించారు. జీజీయూ వీసీ డా.చంద్రశేఖర్, విశ్వనాథ గోపాలకృష్ణ, ప్రముఖ సాహితీ వేత్త యర్రాప్రగడ రామకృష్ణ, డా.తరపట్ల సత్యనారాయణ, డా.పీవీవీ సంజీవరావు, గ్రంధి గణేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు అప్పగించకుండానే ఉన్నత విద్యామండలి కార్యదర్శి రిలీవ్

ఈనాడు, అమరావతి: ఏపీ ఉన్నత విద్యామండలి కార్యదర్శిగా ఇప్పటి వరకు పని చేసిన నజీర్ అహ్మద్.. ఇన్‌ఛార్జి కార్యదర్శి కృష్ణమూర్తికి పూర్తిగా ఛార్జ్ అప్పగించకుండానే రిలీవ్ అయి వెళ్లిపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దస్త్రాలు, ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన వాటిని అప్పగించకపోయినా నజీర్ అహ్మద్‌ను బాధ్యతల నుంచి రిలీవ్ చేయడంతో ఆయన యోగి వేమన విశ్వవిద్యాలయానికి వెళ్లిపోయారు. నిబంధనల ప్రకారం వెళ్లిపోయే కార్యదర్శి ఇన్‌ఛార్జికి అన్నీ అప్పగించాలి. ఉన్నత విద్యామండలిలో ఆర్థిక వ్యవహారాలను ఒక ఎయిడెడ్ కళాశాలలో పని చేసి, పదవీవిరమణ పొందిన ఉద్యోగికి అప్పగించారు. దీనిపైనా అనేక ఆరోపణలున్నాయి. కొన్ని నెలలుగా ఆర్థిక లావాదేవీలకు సంబంధించి సరైన రికార్డులు నిర్వహించడం లేదనే విమర్శలున్నాయి. గతంలో ఈ విభాగం చూసిన వారు సైతం ఆర్థిక వ్యవహారాల రికార్డులు అప్పగించకుండా వెళ్లిపోయినా నజీర్ పట్టించుకోలేదని, దీంతో రికార్డులు సరిగా లేవనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.



526 మంది విద్యార్థులకు.. ముగ్గురే ప్రభుత్వ ఉపాధ్యాయులు!

ఈ చిత్రంలో కనిపిస్తున్నది కార్పొరేట్ పాఠశాల అనుకుంటే పొరపాటే.. అది హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల. అందులో 526 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కాగా గతంలో పాఠశాలలో నలుగురు ఉపాధ్యాయులు ఉండగా, ఒకరు ఉద్యోగ విరమణ చేశారు. ప్రస్తుతం ముగ్గురు ప్రభుత్వ ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. 2016లో కేవలం 40 మంది విద్యార్థులతో మూతపడే దశలో ఉన్న ఈ పాఠశాలను ఆ గ్రామానికి చెందిన కావేరి విత్తన సంస్థ ఎండీ భాస్కర్‌రావు దత్తత తీసుకొని రూ.4 కోట్లతో శాశ్వత భవనం నిర్మించి, మౌలిక వసతులు కల్పించారు. అయినా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు లేరు. చివరికి భాస్కర్‌రావే 18 మంది ప్రైవేటు ఉపాధ్యాయులను నియమించి నెలకు రూ.3 లక్షలు వేతనాలుగా చెల్లిస్తూ విద్యా బోధన చేయిస్తున్నారు. ప్రభుత్వం సత్వరమే స్పందించి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్లను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరుతున్నారు.

– ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే భీమదేవరపల్లి

మూసీ ప్రక్షాళన అభినందనీయం: గుత్తా



నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: మూసీ ప్రక్షాళనపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నల్గొండలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూసీ ప్రక్షాళనకు మొదటిసారి 1998-99 వాజ్‌పేయీ ప్రభుత్వంలోనే నిధులు కేటాయించారని, ఇది కొత్తగా వచ్చిన ప్రతిపాదన కాదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వంలోనూ నిధుల కేటాయింపు, మూసీ రివర్ ఫ్రంట్ బోర్డు ఏర్పాటు చేసి రూ.16,553 కోట్లతో ప్రణాళికలు కూడా రూపొందించారని గుర్తుచేశారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న మూసీ ప్రక్షాళనపై ప్రతిపక్షాలు దుర్మార్గంగా మాట్లాడటం సరైంది కాదన్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం అంతా మూసీ నీళ్లతో వ్యవసాయం చేస్తూ పంటలు తినలేని పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. కేటీఆర్ తెలివైనవారే కానీ ఆయన వైఖరి సరికాదన్నారు. భారాస అధికారంలో ఉన్నప్పుడే 50 అంతస్తుల కట్టడాలతోపాటు అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారని విమర్శించారు. ఎంపీ ఈటల రాజేందర్ కూడా గతాన్ని గుర్తు చేసుకోవాలని సూచించారు. ఉమ్మడి నల్గొండ జిల్లా వాసులు అవసరమైతే ఉద్యమాలు చేయడానికి సిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో బునాదిగాని కాలువ, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాలువల నిర్మాణానికి నిధులు కేటాయించడంపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

మూసీ ప్రక్షాళనను వ్యతిరేకించే నాయకులను రోడ్లపై తిరగనివ్వం: ఎంపీ చామల

హైదరాబాద్, న్యూస్‌టుడే: మూసీ ప్రక్షాళనను వ్యతిరేకించే నాయకులను రోడ్ల మీద తిరగనివ్వబోమని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో కలిసి గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ హైదరాబాద్‌ను ఇస్తాంబుల్ చేస్తానని, మూసీని ప్రక్షాళన చేస్తానని ప్రకటించి.. ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ ప్రక్షాళనకు శ్రీకారం చుడితే, సీఎం రేవంత్‌రెడ్డికి మంచి పేరొస్తుందనే అక్కసుతో దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఎంపీ ఈటల రాజేందర్ తన పాత బాస్‌లు కేసీఆర్, కేటీఆర్‌లను అనుసరిస్తున్నారని విమర్శించారు.

మూసీ పునరుజ్జీవ కార్యక్రమం పవిత్రమైంది: మల్లు రవి

మూసీ నది పునరుజ్జీవం పవిత్రమైన కార్యక్రమమని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యజ్ఞంలా ఈ కార్యక్రమాన్ని చేపడితే భారాస నేతలు మూర్ఖంగా ప్రవర్తిస్తున్నారని శుక్రవారం ఆయనొక ప్రకటనలో మండిపడ్డారు. మూసీ నది అభివృద్ధికి భారాస ప్రభుత్వం కృషి చేస్తే.. మూసీ పరిస్థితి ఇలా ఎందుకు ఉండేది? అని ప్రశ్నించారు.

ఎమ్మెల్యేకు అర్ధరాత్రి నగ్నంగా వీడియోకాల్!

పోలీసులకు ఫిర్యాదు ● సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో కేసు నమోదు

ఈనాడు, హైదరాబాద్: న్యూడ్ వీడియోకాల్స్ బెడద ఎవరినీ వదలడంలేదు. తాజాగా తెలంగాణలోని ఓ ఎమ్మెల్యే సైతం దీని బారినపడ్డారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఆ ఎమ్మెల్యేకు ఈ నెల 14న అర్ధరాత్రి దాటిన తర్వాత వీడియో కాల్ వచ్చింది. గుర్తుతెలియని నంబర్ నుంచి వచ్చిన ఆ వీడియోకాల్‌ను ఎమ్మెల్యే ఆన్సర్ చేశారు. దీంతో వెంటనే ఫోన్ తెరపై మహిళ నగ్నంగా కనిపించింది. ఆందోళనకు గురైన ఎమ్మెల్యే వెంటనే కాల్‌ను కట్ చేశారు. అయితే, తనపై కుట్ర పన్నేందుకు ఎవరైనా అలా వీడియోకాల్ చేశారా? లేక నిజంగానే గుర్తుతెలియని వ్యక్తులే చేసి ఉంటారా? అనే అనుమానం ఎమ్మెల్యేకు కలిగింది. తన ప్రతిష్ఠను దిగజార్చడంతోపాటు బ్లాక్‌మెయిల్ చేసే ఉద్దేశంతో ఎవరైనా ఈ పనికి పాల్పడి ఉంటారనే సందేహంతో ఆయన వెంటనే నేషనల్ సైబర్‌క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే గురువారం తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ)లో సైతం లిఖితపూర్వకంగా ఫిర్యాదు ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఎమ్మెల్యే ఫిర్యాదులో పేర్కొన్న ఫోన్‌నంబర్ ఎవరిదని కనుక్కునే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.



తిరుమల శ్రీవారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.శ్రీసుధ శుక్రవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో కుటుంబసభ్యులతో కలిసి ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం అందించారు.

– న్యూస్‌టుడే, తిరుమల

పాఠశాల విద్యలో జీఓ 117 రద్దు

- ఏపీలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు
- ప్రతి శుక్రవారం ఒక్కోసమస్యపై సమావేశం
- ఉపాధ్యాయ సంఘాల నాయకులతో డైరెక్టర్ విజయరామరాజు చర్చలు



ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో పాఠశాల విద్యలో అల్లకల్లోలం సృష్టించిన జీఓ-117ను వచ్చే విద్యా సంవత్సరం నుంచి రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. తరగతుల విలీనం, ఉపాధ్యాయుల సర్దుబాటు, టీచర్లకు వారానికి 42 పీరియడ్ల బోధన, ప్రాథమిక స్థాయిలో 20 మందికి ఒక టీచర్ లాంటి వాటిని అమలు చేసేందుకు తీసుకొచ్చిన ఈ జీఓతో పాఠశాల విద్య సర్వనాశనమైంది. గత ఎన్నికల సమయంలో ఈ జీఓను రద్దు చేస్తామని ఎన్డీయే కూటమి హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి దీన్ని రద్దు చేసి, ఎలాంటి చర్యలు తీసుకోవాలో తెలుసుకునేందుకు ఉపాధ్యాయ సంఘాల నాయకులతో డైరెక్టర్ విజయరామరాజు శుక్రవారం ప్రత్యేకంగా చర్చలు జరిపారు. ముఖ్యంగా గత ప్రభుత్వంలో విలీనం చేసిన 3, 4, 5 తరగతులను వెనక్కి తీసుకుంటే విద్యార్థులు, ఉపాధ్యాయులకు కలిగే ఇబ్బందులు, తల్లిదండ్రుల నుంచి వచ్చే అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించారు. ప్రతి మేజర్ పంచాయతీలోనూ ఒక మోడల్ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు డైరెక్టర్ వెల్లడించారు. యాప్‌లను వీలైనంత వరకు సరళీకరించి ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. నవంబరు 11న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల దినోత్సవం, నవంబరు 14న ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల మెగా సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సహా మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని వెల్లడించారు.

పదోన్నతులు, బదిలీలపై వచ్చే వారం చర్చ

ఇక నుంచి రెండు నెలలపాటు ప్రతి శుక్రవారం ఉపాధ్యాయ సంఘాలతో ఒక్కో అంశంపై చర్చించి, అభిప్రాయాలు తీసుకోనున్నట్లు విజయరామరాజు తెలిపారు. వచ్చే వారం పదోన్నతులు, బదిలీలపై చర్చించాలని నిర్ణయించారు. ఉపాధ్యాయులకు ఆరు రోజులపాటు నిర్వహించాలని నిర్ణయించిన రెసిడెన్షియల్ శిక్షణను మార్చాలని నాయకులు కోరారు. ఉపాధ్యాయులకు వారానికి 32 పీరియడ్లకు మించి బోధన విధులు ఉండకూడదని విన్నవించారు. 2017లో తెదేపా ప్రభుత్వం తీసుకొచ్చిన ఉత్తర్వులు-29, 42, 53 అమలు చేయాలని కోరారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా సబ్జెక్టు టీచర్లతోనే బోధించాలని విన్నవించారు. ఆంగ్ల మాధ్యమంతోపాటు తెలుగు మాధ్యమాన్ని అమలు చేయాలని కోరారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 20 మించి ఉంటే ఇద్దరు ఎస్జీటీలను ఇవ్వాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ కోరింది.

విశాఖలో వంద రోజుల్లో టీసీఎస్ కార్యకలాపాలు

- ఏపీ మంత్రి నారా లోకేశ్ వెల్లడి

ఈనాడు, విశాఖపట్నం: వంద రోజుల్లో విశాఖలో టీసీఎస్ డెవలప్‌మెంట్ సెంటర్ కార్యకలాపాలు ప్రారంభించేలా కార్యాచరణ ఉంటుందని ఏపీ ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ‘విశాఖ ఐటీ ప్రగతిలో టీసీఎస్ కీలక భూమిక పోషించనుంది. త్వరలోనే పలు కొత్త కంపెనీలు రానున్నాయి. పెట్టుబడుల ప్రోత్సాహకం, సమస్యల పరిష్కారానికి ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేస్తున్నాం. దీనికి చురుకైన ఐఏఎస్ అధికారిని నియమించి అన్ని శాఖలను ఏకగవాక్ష విధానంలోకి తెచ్చి పెట్టుబడులను ఆకర్షిస్తాం’ అని మంత్రి చెప్పారు. గతంలో సాక్షి పత్రిక రాసిన ఓ కథనంపై లోకేశ్ విశాఖలోని 12వ జిల్లా అదనపు న్యాయస్థానంలో పరువు నష్టం దావా వేశారు. ఆ కేసు విచారణలో భాగంగా శుక్రవారం మంత్రి లోకేశ్ న్యాయస్థానానికి హాజరయ్యారు. ఈ కేసును నవంబర్ 15కి న్యాయమూర్తి వాయిదా వేశారు. అనంతరం విశాఖ బార్ అసోసియేషన్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని కొందరు న్యాయవాదులు కోరగా సీఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు. తర్వాత విలేకరులతో మాట్లాడుతూ ‘దుష్ప్రచారం చేసి తప్పుడు వార్తలు రాస్తే తెదేపా, కూటమి ప్రభుత్వం ఊరుకోదు. సాక్షి పత్రిక మీద న్యాయపోరాటం కొనసాగుతుంది. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు కొత్త వీసీల నియామకం అనంతరం వాటిలో అక్రమాలను గుర్తిస్తాం. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం’ అని లోకేశ్ పేర్కొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి లోకేశ్. చిత్రంలో ఎంపీ శ్రీభరత్, తెదేపా నేతలు

గత ప్రభుత్వంలో చట్టాలు ఉల్లంఘించిన వారిపై చర్యలు

‘గత ప్రభుత్వంలో చట్టాలు ఉల్లంఘించిన వారందరిపై చర్యలు ఉంటాయి. రెడ్‌బుక్ ఎప్పుడో తెరిచాం. ఇప్పటికే కొందరి మీద చర్యలు ప్రారంభమయ్యాయి’ అని రెడ్‌బుక్ గురించి విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. విశాఖ జిల్లాలో నేతల మధ్య సమన్వయ లోపం ఉందనే ప్రశ్నకు బదులిస్తూ ‘జిల్లా నేతలందరితో మాట్లాడా. ఎవరూ ఎవరిపై ఫిర్యాదు చేయలేదు. అవన్నీ ఊహాగానాలే’ అని కొట్టిపారేశారు. జిల్లాలో ఇసుక సమస్య తన దృష్టికి వచ్చిందని నెల రోజుల్లోగా పరిష్కరిస్తామన్నారు. అంతకుముందు విశాఖ జిల్లా తెదేపా కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి ఫిర్యాదులు స్వీకరించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి బాధితులు తరలి వచ్చి సమస్యలు విన్నవించుకోగా వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి వెంట ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, నేతలు ఉన్నారు.

పాత సమస్యలు పరిష్కరిస్తేనే పోలవరం

- నిపుణుల కమిటీ సిఫార్సుల అమలుపై దృష్టి పెట్టాల్సిందే
- స్వతంత్ర డిజైన్ యూనిట్, పనులపై పక్కా పర్యవేక్షక వ్యవస్థ తప్పనిసరి
- పాండ్యా కమిటీ, విదేశీ నిపుణుల బృందం చెప్పింది ఇదే



ఈనాడు – అమరావతి

పోలవరం ప్రాజెక్టులో పనులు ఊపందుకోనున్నాయి. ఈ పరిస్థితుల్లో గతంలో నిపుణుల కమిటీలు ఇచ్చిన నివేదికలు, వారి సిఫార్సుల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకుంటేనే పనులు ప్రణాళికాబద్ధంగా ముందుకెళతాయి. వివిధ కారణాల వల్ల ధ్వంసమైన డయాఫ్రం వాల్ స్థానంలో నవంబరు నుంచి కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణ పనులు ప్రారంభం కాబోతున్నాయి. గైడ్‌బండ్ నిర్మాణ, నాణ్యత లోపాలతో కుంగిపోయింది. ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల అధిక సీపేజీ సమస్యను ఎదుర్కొంటూనే కొత్త పనులు చేసుకోవాల్సి వస్తోంది. గైడ్‌బండ్ కుంగిన నేపథ్యంలో కేంద్ర జల సంఘం విశ్రాంత ఛైర్మన్ పాండ్యా నేతృత్వంలో కేంద్రం నియమించిన కమిటీ.. ఒక నివేదికను సమర్పించింది. ఆ తర్వాత కేంద్ర జలశక్తి శాఖ మొత్తం పోలవరం ప్రాజెక్టును అధ్యయనం చేసి కీలక సిఫార్సులు చేసింది. ఆ రెండింటిలోనూ పేర్కొన్న కీలకాంశాలను ఇప్పుడు గమనంలోకి తీసుకోవాలి.

విదేశీ నిపుణుల బృందం సిఫార్సుల్లో కొన్ని..

పోలవరం ప్రాజెక్టులో గుత్తేదారు చేస్తున్న పనులను అక్కడే ఉండి పర్యవేక్షించే వ్యవస్థ అవసరం. ఇలాంటి భారీ ప్రాజెక్టుల్లో నిర్మాణ నాణ్యతకు, నిర్దేశించిన పని సక్రమంగా చేస్తున్నారో లేదో ఎప్పటికప్పుడు తెలుసుకునేలా యజమాని (ప్రభుత్వం) దృష్టి సారించాలి. పోలవరంలో గుత్తేదారు కార్యకలాపాలను పరిశీలించేందుకు అవసరమైన నిర్మాణ, నిర్వహణ ఆర్గనైజేషన్ ఏదీ కనిపించడం లేదు.

■ పోలవరం ప్రాజెక్టు అథారిటీ, కేంద్ర జలసంఘం ఇలాంటి పర్యవేక్షణ వ్యవస్థ కోసం ఏం ప్రణాళిక రూపొందించారో స్పష్టత లేదు.

■ విదేశాల్లో ఇంజినీర్స్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ ఆఫీస్ ఉంటుంది. ప్రభుత్వం తరఫున పనులను ఆ సంస్థ పక్కాగా పర్యవేక్షిస్తుంది. నిర్దేశిత ప్రమాణాల ప్రకారమే పనులు జరుగుతున్నాయని ధ్రువీకరిస్తుంది.

పాండ్యా కమిటీ పేర్కొన్న అంశాలు

■ ఈ ప్రాజెక్టులో డిజైన్లను గుత్తేదారు తరఫు ఇంజినీర్లే రూపొందిస్తున్నారు. నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నదీ ఆ సంస్థ ఇంజినీర్లే. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున సమగ్ర డిజైన్, డ్రాయింగ్ యూనిట్ లేదు.

■ గుత్తేదారు సంస్థ (మేఘా) డిజైన్ల రూపకల్పనకు, ఆకృతులు సిద్ధం చేసేందుకు ఇతర సంస్థల నిపుణుల సహకారం తీసుకుంటున్నా వాటిని సరైన ఫలితాలుగా మార్చే సమన్వయ వ్యవస్థ కరవైంది.

■ ప్రాజెక్టులో వివిధ పనులు ఈ సంస్థ చేస్తుండగా అనుబంధ ఒప్పందాల వల్ల నిర్మాణ పనులు ఒకదానితో మరొకటి అనుసంధానం కావడం లేదు.

■ గుత్తేదారు వివిధ సంస్థల సేవలు పొందుతున్నా వారు అప్పుడప్పుడు ప్రాజెక్టు వద్దకు వచ్చి వెళ్తుంటారు. ఆ నిపుణులు తరచూ మారుతుండటంతో సమస్యలు తలెత్తుతున్నాయి.

ఆఫ్రి డిజైన్ యూనిట్‌ను నియమించినా..

పోలవరం ప్రాజెక్టు అథారిటీ విదేశీ నిపుణుల బృందాన్ని నియమించింది. ఆఫ్రి డిజైన్ యూనిట్‌ను ఆమోదించింది. ఇది కూడా గుత్తేదారు సంస్థ తరఫున ఏర్పాటు చేసిందే తప్ప ప్రభుత్వం తరఫుది కాదు. ఆఫ్రి ప్రతినిధులు కూడా ప్రాజెక్టు వద్ద అందుబాటులో ఉండటం లేదు. తాజాగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు పోలవరం ప్రాజెక్టుపై నిర్వహించిన సమీక్షలో ఆఫ్రి డిజైన్ యూనిట్‌పై చర్చ జరిగింది. అసలు ఏ డిజైన్లు రూపొందిస్తున్నారో, అవి ఎంత వరకు వచ్చాయో కూడా సమాచారం ఉండటం లేదని ప్రశ్నించినట్లు తెలిసింది. ఉన్నతాధికారులు ఆ ఆకృతులు రూపొందించే వారితో మాట్లాడే పరిస్థితి కూడా లేదు. మరోవైపు విదేశీ నిపుణుల బృందం ప్రతిపాదించిన వర్క్‌షాపును నవంబరు ప్రారంభంలో ఏర్పాటు చేయనున్నారు. అప్పటికల్లా అధికారులకు డిజైన్లపై ఒక అవగాహన ఉంటే తప్ప సమస్యలు పరిష్కారం కావు.

సీఎం దృష్టి సారిస్తేనే..

నిపుణుల కమిటీల సిఫార్సులు అమలు కావాలంటే ముఖ్యమంత్రి గట్టిగా దృష్టి సారించాల్సి ఉంది. పైగా కీలక ప్రాజెక్టుల్లో అధికారుల నియామకానికి సంబంధించి గుత్తేదారుల జోక్యం ఎక్కువవుతోంది. కొందరు గుత్తేదారులు ఆయా ప్రాజెక్టుల్లో ఫలానా అధికారి కావాలని కోరుకుంటున్నారు. పోలవరం ప్రాజెక్టులోనూ ఇలాంటి పరిస్థితి ఎదురవుతోంది. ఇంత పెద్ద ప్రాజెక్టులో పర్యవేక్షక అధికారుల విషయంలో గుత్తేదార్ల జోక్యానికి తెరదించేలానూ చర్యలు చేపట్టాలి.

సీమలో మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుచేయాలి: ఏపీ మంత్రి సత్యకుమార్

ఈనాడు, అమరావతి: రాయలసీమలో మహిళలకు ప్రత్యేకంగా ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుచేసే విషయాన్ని పరిశీలించాలని ఏపీ రాష్ట్ర మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్‌కు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు లోకేశ్‌కు ఆయన లేఖ రాశారు. ‘జనాభాలో సగం ఉన్న మహిళలకు స్థిరమైన అభివృద్ధి అవకాశాలు కల్పించడంపై సీఎం చంద్రబాబు స్ఫూర్తితో దృష్టి సారించాల్సిన అవసరముంది. ముఖ్యంగా రాయలసీమ సామాజిక ఆర్థిక పరిస్థితులు, విభిన్నమైన పాలనను అందించాలన్న ఎన్డీయే కూటమి సంకల్పాన్ని దృష్టిలో ఉంచుకొని తగిన నిర్ణయం తీసుకోవాల్సిన సమయమిదే. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో ప్రత్యేకంగా మహిళల కోసం ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటుచేయాలని అనంతపురం జేఎన్‌టీయూ ప్రతిపాదించింది’ అని పేర్కొన్నారు. కళాశాల ఏర్పాటుకు సంబంధించి జేఎన్‌టీయూ రూపొందించిన సమగ్ర నివేదికను లేఖకు జత చేశారు. సమర్పించిన డీపీఆర్‌ను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేశ్‌ను కోరారు.

ఏపీ సీఎం సహాయ నిధికి విరాళాల అందజేత

వన్‌టౌన్, న్యూస్‌టుడే: రెండు రోజుల పర్యటనలో భాగంగా విశాఖ వచ్చిన ఏపీ మంత్రి నారా లోకేశ్‌కు శుక్రవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఇ.ఎన్.ధనుంజయరావు రూ.79,95,116ల చెక్కును అందజేశారు. వరద బాధితుల సహాయార్థం ఏయూ బోధన, బోధనేతర ఉద్యోగులు, పింఛనుదారులు ఈ మొత్తాన్ని స్వచ్ఛందంగా సమకూర్చారని వీసీ తెలిపారు.



ఏపీ మంత్రి లోకేశ్‌కు చెక్కును అందజేస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు, రిజిస్ట్రార్ ధనుంజయరావు

ట్రాక్టర్లలోనూ ఉచితంగా ఇసుక తీసుకెళ్లొచ్చు

ఈనాడు, అమరావతి: ఏపీలోని గ్రామాల్లో స్థానిక అవసరాల కోసం వాగులు, వంకల నుంచి ఇసుకను ఎడ్ల బండ్లతోపాటు, ట్రాక్టర్లలో కూడా ఉచితంగా తీసుకెళ్లేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీచేసింది. ఉచిత ఇసుక విధానం అమలులో భాగంగా గత నెల 2న ప్రభుత్వం పలు మార్గదర్శకాలు జారీచేయగా. . అందులో వాగులు, వంకల నుంచి స్థానిక గ్రామాలకు చెందిన వారు ఎడ్ల బండ్లలో ఇసుకను ఉచితంగా తీసుకెళ్లేందుకు వీలు కల్పించారు. అయితే అందులో ట్రాక్టర్లలో తరలించే అంశాన్ని ప్రస్తావించలేదు. దీంతో అనేక చోట్ల ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా అధికారులు అడ్డగించి, కేసులు నమోదు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే గతంలో ఇచ్చిన ఉత్తర్వులో సవరణ చేసి, ట్రాక్టర్లలో కూడా ఉచితంగా ఇసుక తీసుకెళ్లేందుకు వీలు కల్పిస్తూ గనులశాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా శుక్రవారం ఉత్తర్వు జారీచేశారు.

ఓయూ వీసీగా కుమార్.. కేయూకు ప్రతాప్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

ఈ తొమ్మిదిలో ఏడు ఉన్నత విద్యాశాఖ పరిధిలోవి కాగా... రెండు వ్యవసాయ మంత్రిత్వ శాఖ పరిధిలో ఉన్నాయి. ఉన్నత విద్యాశాఖ పరిధిలోని విశ్వవిద్యాలయాల్లో గత ఉపకులపతుల పదవీకాలం మే 21వ తేదీతో ముగిసిన విషయం తెలిసిందే. ఉప కులపతుల నియామకం కోసం ఏర్పాటైన సెర్చ్ కమిటీలు ఒక్కో విశ్వవిద్యాలయానికి ముగ్గురు చొప్పున పేర్లను సిఫార్సు చేశాయి. ఆ జాబితాల నుంచి ప్రభుత్వం ఎంపిక చేసిన వీసీలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శుక్రవారం ఆమోదం తెలిపారు. వీరందరూ మూడేళ్లపాటు ఉప కులపతులుగా పదవుల్లో కొనసాగుతారు.

మరో 4 వర్సిటీలకు పెండింగ్

ఉన్నత విద్యాశాఖ పరిధిలోని జేఎన్‌టీయూహెచ్, అంబేడ్కర్, ఆర్కిటెక్చర్ వర్సిటీలకు వీసీలను నియమించాల్సి ఉంది. వాటిల్లో జేఎన్‌టీయూహెచ్‌కు సెర్చ్ కమిటీ సమావేశం పూర్తయినా వీసీని నియమించలేదు. మిగిలిన రెండు వర్సిటీలకు సెర్చ్ కమిటీ సమావేశాలు నిర్వహించలేదు. పీవీ నరసింహారావు పశు వైద్య విశ్వవిద్యాలయం వీసీ పోస్టు గత జనవరి నుంచి ఖాళీగా ఉంది. దీనికి సెర్చ్ కమిటీ సైతం నియామకం జరగలేదు.

ప్రత్యేకతలు.. ముఖ్యాంశాలు...

- ఓయూ 107 సంవత్సరాల చరిత్రలో తొలి సారి ఎస్సీ సామాజికవర్గానికి చెందిన కుమార్ వీసీగా నియమితులయ్యారు. వ్యవసాయ వర్సిటీ వీసీ పదవి (ఉమ్మడి రాష్ట్రం నుంచి) సైతం తొలిసారి బీసీ సామాజికవర్గానికి దక్కింది.
- ఈ తొమ్మిది మంది వీసీల్లో ఆరుగురు విశ్రాంత ఆచార్యులు. ఓయూ, పాలమూరు, తెలంగాణ వర్సిటీలకు నియమితులైన కుమార్, శ్రీనివాస్, యాదగిరిరావు మాత్రమే ఆచార్యులుగా ప్రస్తుతం కొనసాగుతున్నారు.
- మహాత్మా గాంధీ వర్సిటీకి వీసీగా రెండోసారి అల్తాఫ్ హుస్సేన్ నియమితులయ్యారు. కాకతీయ వర్సిటీ విశ్రాంత ఆచార్యులైన ఆయన 2016-2019 వరకు మహాత్మాగాంధీ వర్సిటీకి వీసీగా పనిచేశారు. మిగిలిన వారందరూ మొదటిసారి ఉపకులపతులుగా నియమితులైన వారే.



- వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాలకు తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఇప్పుడు రెండోసారి వీసీల నియామకం జరిగింది. వ్యవసాయ వర్సిటీ వీసీ పోస్టు 2022 జులై నుంచి ఖాళీగా ఉంది. ఉద్యాన వర్సిటీ గత వీసీ పదవీకాలం జనవరిలో ముగిసింది
- గత నియామకాల్లో ఎస్సీ మాదిగ సామాజికవర్గానికి చెందిన వారికి వీసీలు లేదా ఉన్నత విద్యామండలిలో ఒక్కరికి కూడా పదవులు దక్కలేదు. ఈసారి ఓయూ, బాసర ఆర్‌జీయూకేటీ (ఇన్‌ఛార్జి) వీసీలతోపాటు ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ పోస్టును ఆ సామాజిక వర్గానికి ఇచ్చారు.

ఉస్మానియా వీసీ.. ఎం.కుమార్



విద్యార్హతలు: బీఈ సివిల్- ఓయూ, ఎంటెక్- జేఎన్‌టీయూహెచ్, పీహెచ్‌డీ- ఐఐటీ బొంబాయి

సొంతూరు: కొండాపూర్, ఘట్‌కేసర్ మండలం, మేడ్చల్ జిల్లా

పదవులు: పరీక్షల విభాగం కంట్రోలర్, ఓయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, అర్బన్ ఎన్విరాన్‌మెంట్ డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్

కాకతీయ వీసీ.. కె.ప్రతాప్‌రెడ్డి



విద్యార్హతలు: బీఎస్సీ, ఎంఎస్సీ, పీహెచ్‌డీ- ఓయూ

సొంతూరు: యాచారం, రంగారెడ్డి జిల్లా

పదవులు: ఓయూ రిజిస్ట్రార్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్, ఎడ్‌సెట్ కో కన్వీనర్, ప్రవేశాల విభాగం జాయింట్ డైరెక్టర్

పాలమూరు.. జీఎన్ శ్రీనివాస్



విద్యార్హతలు: బీటెక్- జేఎన్‌టీయూ, ఎంఈ- ఓయూ, పీహెచ్‌డీ-జేఎన్‌టీయూహెచ్

సొంతూరు: కొత్తపల్లి, గంభీరావుపేట మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా

పదవులు: జేఎన్‌టీయూహెచ్ సిరిసిల్ల, సుల్తాన్‌పూర్ ఇంజినీరింగ్ కళాశాలల ప్రిన్సిపాల్, ఈసెట్ కో కన్వీనర్, పరీక్షల విభాగం అదనపు కంట్రోలర్

తెలుగు వర్సిటీ.. వి.నిత్యానందరావు



విద్యార్హతలు: ఎంఏ, పీహెచ్‌డీ- ఓయూ

సొంతూరు: మంగనూర్, నాగర్‌కర్నూల్ జిల్లా

పదవులు: ఓయూ తెలుగు విభాగం అధిపతి, బోర్డు ఆఫ్ స్టడీస్ ఛైర్మన్...

మహాత్మాగాంధీ.. అల్తాఫ్ హుస్సేన్



విద్యార్హతలు: ఎంఎస్సీ, పీహెచ్‌డీ-కాకతీయ

సొంతూరు: వరంగల్

పదవులు: 2016-19 మహాత్మాగాంధీ వర్సిటీ ఉపకులపతి

శాతవాహన.. ఉమేష్‌కుమార్




సొంతూరు: నారాయణపేట జిల్లా

పదవులు: మహాత్మా గాంధీ, శాతవాహన వర్సిటీ రిజిస్ట్రార్

గుర్తింపు: 2015లో అప్పటి రాష్ట్రపతి నుంచి ఇందిరాగాంధీ నేషనల్ లెవెల్ ఎన్ఎస్ఎస్ ట్రోఫీ స్వీకరణ

తెలంగాణ.. యాదగిరిరావు



విద్యార్హతలు: డిగ్రీ జనగామ, పీజీ, పీహెచ్‌డీ- కాకతీయ

సొంతూరు: నల్లబెల్లి, వర్ధన్నపేట మండలం, వరంగల్ జిల్లా

పదవులు: సోషల్ సైన్సెస్ డీన్, యూజీసీ యూనిట్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్, ప్రస్తుతం కాకతీయ వర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి

వ్యవసాయ వర్సిటీ.. అల్దాస్ జానయ్య



విద్యార్హతలు: రాజేంద్రనగర్ వ్యవసాయ వర్సిటీలో బీఎస్సీ, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ (బెనారస్ హిందూ వర్సిటీ), 4 డాక్టరేట్లు. **సొంతూరు:** మామిడాల, నల్గొండ జిల్లా

పదవులు: జాతీయ వ్యవసాయ పరిశోధన మండలిలో, అంతర్జాతీయ వరి పరిశోధనసంస్థలో విధులు, వ్యవసాయ కళాశాలలో ఆచార్యునిగా పదవీవిరమణ. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళిక కమిటీలో సభ్యునిగా బాధ్యతలు.

ఉద్యాన వర్సిటీ దండా రాజిరెడ్డి



విద్యార్హతలు: బీఎస్సీ, ఎమ్మెస్సీ; గుజరాత్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ

సొంతూరు: జయశంకర్ జిల్లా కాటారం

పదవులు: రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రిన్సిపల్ సైంటిస్టు. వర్సిటీలో వివిధ విభాగాల డైరెక్టర్‌గా సేవలు. ప్రపంచ బ్యాంకు సలహాదారుగా బాధ్యతలు. 130కి పైగా పరిశోధన పత్రాలు సమర్పించారు.

కేంద్ర సర్వీసులకు ఇద్దరు ఐపీఎస్‌లు

ఈనాడు, నిజామాబాద్: తెలంగాణ క్యాడర్‌లో కొనసాగుతున్న ఇద్దరు 2012 బ్యాచ్ ఐపీఎస్‌లు డిప్యుటేషన్‌పై కేంద్ర సర్వీసు విధులకు వెళ్లానున్నారు. నిజామాబాద్ సీపీగా ఉన్న కల్మేశ్వర్ శింగెనవార్, ఆయన సతీమణి, డిచ్‌పల్లిలోని ఏడో బెటాలియన్ కమాండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రోహిణి ప్రియదర్శినిలు కేంద్ర సర్వీసుల కోసం పెట్టుకున్న దరఖాస్తులకు హోంశాఖ ఆమోదం తెలిపింది. వీరిని హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీసు అకాడమీకి అసిస్టెంట్ డైరెక్టర్లుగా నియమిస్తూ ఉత్తర్వులిచ్చింది.

కొడంగల్‌కు రూ.43 కోట్ల విడుదల

ఈనాడు, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు రూ.43.75 కోట్లు విడుదల చేస్తూ ప్రణాళికా శాఖ శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో చేపట్టనున్న పనులకు ఈ నిధులు విడుదల చేస్తున్నట్లు జీవోలో పేర్కొంది.

స్కిల్ యూనివర్సిటీతో 'లెన్స్‌కార్ట్' ఒప్పందం

ప్రముఖ ఆప్టోమెట్రిక్ కంపెనీ 'లెన్స్‌కార్ట్' శుక్రవారం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ మేరకు ఆప్టోమెట్రిక్ స్టోర్ అసోసియేట్స్‌కు అవసరమైన శిక్షణను ఈ సంస్థ అందించనుంది. 30 మంది విద్యార్థులను ఎంపిక చేస్తామని స్కిల్ వర్సిటీ వీసీ వీఎల్‌వీఎస్ఎస్ సుబ్బారావు తెలిపారు. శిక్షణ అనంతరం లెన్స్‌కార్ట్ స్టోర్స్‌లో ఉద్యోగాలు లభిస్తాయని వివరించారు.

విద్యా కమిషన్ సభ్యుల నియామకం

తెలంగాణ విద్యా కమిషన్ సభ్యులుగా ముగ్గురిని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉస్మానియా యూనివర్సిటీ(ఓయూ) జర్నలిజం విభాగం విశ్రాంత ఆచార్యుడు పీఎల్ విశ్వేశ్వర్‌రావుతోపాటు పీసీసీ జనరల్ సెక్రెటరీ చరగొండ వెంకటేశ్, కొంపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి కె.జ్యోత్స్నశివారెడ్డి నియమితులయ్యారు.

జేఎన్‌టీయూహెచ్ వీసీ నియామకానికి బ్రేక్!

- సెర్చ్ కమిటీ సిఫార్సు చేసిన ముగ్గురిపై పునరాలోచనలో సర్కారు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో అత్యంత కీలకమైన జేఎన్‌టీయూహెచ్‌కు ఉపకులపతి నియామకం పెండింగ్‌లో పడింది. ఈ పదవికి రాష్ట్రంలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ ఆచార్యులతోపాటు దేశవ్యాప్తంగా ఎన్ఐటీలు, ప్రైవేట్, డీమ్డ్ వర్సిటీల్లో పనిచేస్తున్న వారు పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేశారు. ఈ వర్సిటీ కింద 140కి పైగా ఇంజినీరింగ్ కళాశాలలు, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ కళాశాలలు ఉన్నాయి. దేశంలోనే పెద్ద సాంకేతిక వర్సిటీల్లో ఒకటిగా ఉండటంతో.. ఇక్కడి వీసీ పదవికి పోటీసైతం అలానే ఉంది. ఈ నెల మొదటి వారంలోనే సమావేశం నిర్వహించిన సెర్చ్ కమిటీ.. ఒకే సామాజికవర్గానికి చెందిన ముగ్గురి పేర్లను సిఫార్సు చేసినట్లు సమాచారం. ఆ ముగ్గురి వయసు 66 నుంచి 74 వరకు ఉంది. ప్రభుత్వం 65 సంవత్సరాల లోపు వయసు వారికి ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తునట్లు తెలుస్తోంది. ఇలా ఒకే సామాజికవర్గం వారి పేర్లు, వయసు ఎక్కువగా ఉన్న వారి పేర్లను కమిటీ సిఫార్సు చేయడంపై ప్రభుత్వం అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో ఓ విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా పనిచేసి అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తి పేరు సైతం ఈ జాబితాలో ఉండటంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఆ వర్సిటీకి సిఫార్సు చేసిన పేర్లను గవర్నర్‌కు పంపకుండా ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచినట్లు తెలిసింది. సెర్చ్ కమిటీలోని ఓ సభ్యుడు మాజీ వీసీ పేరు కోసం పట్టుపట్టినట్లు సమాచారం. 65 సంవత్సరాల లోపు ఉన్న వారేనన్న నిబంధన నోటిఫికేషన్‌లో లేదు కదా? అని ఆయన ప్రశ్నించినట్లు తెలిసింది.

మరో సెర్చ్ కమిటీని వేస్తారా?

ఈ అంశాల నేపథ్యంలో ప్రస్తుత సెర్చ్ కమిటీని రద్దు చేసి మరో కమిటీని నియమించే ఆలోచనలో సర్కారు ఉన్నట్లు సమాచారం. అది జరగాలంటే మళ్లీ వర్సిటీ పాలకమండలి సమావేశమై విశ్వవిద్యాలయం నామినీ పేరును సూచించాలి. వర్సిటీకి ప్రస్తుతం పూర్తిస్థాయి పాలకమండలి లేదు. దీంతో తొలుత పాలక మండలి నియామకం దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది.

- అంబేడ్కర్, ఆర్కిటెక్చర్ వర్సిటీలకు సెర్చ్ కమిటీ సమావేశాలు జరగలేదు. అంబేడ్కర్ వర్సిటీ సమావేశం ఈ నెల 22 నిర్వహించాలని భావిస్తున్నారు. ఇక ఆర్కిటెక్చర్ వర్సిటీకి సెర్చ్ కమిటీని వేస్తారా? లేక ఇన్‌ఛార్జి వీసీగా ఎవరినైనా నియమిస్తారా? అన్నది తేలాల్సి ఉంది.

మందారం.. రంగులు మారి సింగారం!

ఒకే రోజులో మూడు విధాలుగా కనిపిస్తున్న పూలు



ఉదయం తెలుపు రంగులో పూలు | మధ్యాహ్నం ఇలా గులాబీ రంగులో | సాయంత్రానికి ఎరుపు రంగులోకి మారి ఇలా..

సహజంగా పూలు రోజంతా ఒకేలా కనిపిస్తాయి.. కానీ శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలం గొర్రిబంద గ్రామానికి చెందిన ఎస్.కృష్ణమూర్తి పెరటిలోని మందారం జాతి మొక్కకు చెందిన పుష్పాలు ఒకే రోజులో మూడు రంగుల్లోకి మారుతున్నాయి. ఉదయం తెలుపు రంగులో, మధ్యాహ్నం గులాబీ రంగు, సాయంత్రం ఎరుపు రంగులో కనిపించి ఆకర్షిస్తున్నాయి. ఈ మొక్కను ఒడిశా రాష్ట్రం గుణుపురం నుంచి ఏడాదిన్నర కిందట తెచ్చుకున్నానని కృష్ణమూర్తి తెలిపారు. హైబిస్కస్ మ్యూటాబిలిస్ జాతికి చెందిన పత్తి మందారం మొక్కలు రంగులు మారుస్తాయని ఉద్యానశాఖ అధికారిణి మంగమ్మ వివరించారు. ఇవి దక్షిణ చైనాలో మాత్రమే ఉండేవని, ప్రస్తుతం అన్ని దేశాల్లోనూ పెరుగుతున్నాయని, మన ప్రాంతంలో అరుదేనని వెల్లడించారు. ఈ మొక్కలను కాన్ఫెడరేట్ రోజ్, డిక్సీ రోజ్‌మల్లో, కాటన్‌రోజ్, కాటన్ రోజ్ మల్లో పేర్లతోనూ పిలుస్తారని పేర్కొన్నారు.

–సారవకోట, న్యూస్‌టుడే



అదుపులేని భావోద్వేగాలూ ఓ బలహీనతే..

భావోద్వేగాలపై నియంత్రణ లేకపోవడమూ ఓ బలహీనతే. పనిచేసే చోట సహచరులు, పరిస్థితుల కారణంగా మీకు కోపం రావొచ్చు. కానీ దాన్ని ప్రదర్శిస్తే పని వాతావరణం చెడిపోవడమే కాదు.. మీ మీద ప్రతికూల అభిప్రాయం ఏర్పడుతుంది. ఆవేశంలో తీసుకొనే నిర్ణయాలూ చేటు చేస్తాయి. కోపం చల్లారిన తర్వాత క్షమాపణలు చెప్పే పరిస్థితి తెచ్చుకోకుండా ముందే దాన్ని అదుపులో ఉంచుకోండి.

– జోకో విల్లింక్, రచయిత

ఏఐ సాయంతో 'సెబీ' నిబంధనల విశ్లేషణ

- సాఫ్ట్‌వేర్‌ను రూపొందించిన హైదరాబాద్ ట్రిపుల్‌ఐటీ ప్రొఫెసర్
- కార్పొరేట్ కంపెనీలు, బహుళజాతి సంస్థలకు ఉపయుక్తం



ప్రొఫెసర్ కమల్

ఈనాడు, హైదరాబాద్: కృత్రిమమేధ (ఏఐ) సాయంతో సెబీ (సెక్యూరిటీస్, ఎక్స్ఛేంజి బోర్డ్ ఆఫ్ ఇండియా) నిబంధనలను విశ్లేషించే సాఫ్ట్‌వేర్‌ను హైదరాబాద్ ట్రిపుల్‌ఐటీ డేటా సైన్స్, అనలిటిక్స్ విభాగం ప్రొఫెసర్ కమల్ కర్లపాలెం అభివృద్ధి చేశారు. సెబీ నిబంధనలను బహుళజాతి సంస్థలు, కార్పొరేట్ కంపెనీలు సులభంగా అర్థం చేసుకునేందుకు ఈ సాఫ్ట్‌వేర్ ఉపకరిస్తుందని ఆయన వెల్లడించారు. 'విదేశీ పెట్టుబడులతో కొనసాగుతున్న కంపెనీలు, బహుళజాతి సంస్థలు సెబీ నిబంధనలకు లోబడి వ్యవహరించాల్సి ఉంటుంది. వీటిని అర్థం చేసుకునేందుకు ఆయా సంస్థలు, కంపెనీలు నిపుణులను నియమించుకుంటున్నాయి. కృత్రిమమేధ సాయంతో రూపొందించిన ఈ సాఫ్ట్‌వేర్ సెబీ నిబంధనలను విశ్లేషించడంతోపాటు మార్గదర్శకాలను ఎలా పాటించాలో వివరిస్తుంది'' అని కమల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

వేర్వేరు అంశాలు... వర్గీకరణలు

'సెబీ నిబంధనలకు అనుగుణంగా కొత్తగా కంపెనీలు ప్రారంభించేవారు, బహుళజాతి సంస్థలు, మార్గదర్శకాలను సులువుగా అర్థం చేసుకునేందుకు వీలుగా ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ డేటా సైన్స్, అనలిటిక్స్ విభాగం వేర్వేరు అంశాలను కృత్రిమమేధతో విశ్లేషిస్తోంది. వాటిని వర్గీకరించి విశదీకరిస్తోంది. ఇందుకోసం వందల సంఖ్యలో మిషన్ లెర్నింగ్ పద్ధతులను వినియోగిస్తోంది. సెబీ మార్గదర్శకాల విశ్లేషణలపై తమ విభాగం అవలంబించిన పద్ధతులు సరైనవా? కావా? అని తెలుసుకునేందుకు ఇటీవల వాటిని జేపీ మోర్గాన్ ఏఐ ఫ్యాకల్టీ రీసెర్చ్ విభాగానికి పంపించాం. వాటికి ఉత్తమ విశ్లేషణ పురస్కారం లభించింది.

ఉల్లంఘనలపై హెచ్చరికలు..

మెట్రో నగరాలు సహా దేశంలో ఎక్కడైనా కంపెనీలు, సంస్థలను స్థాపించిన వ్యక్తులు, సంస్థల ప్రతినిధులు సెబీకి దరఖాస్తు చేసే పత్రాలను తాము రూపొందించిన సాఫ్ట్‌వేర్ క్షుణ్నంగా పరిశీలిస్తుంది. న్యాయపరంగా, శాస్త్రీయంగా పత్రాల్లో ఉన్న సమాచారాన్ని విశ్లేషిస్తుంది. ఆయా వాక్యాలు, పదాలు సక్రమంగా లేనిపక్షంలో సెబీ నిబంధనల ఉల్లంఘనలపై హెచ్చరికలు జారీ చేస్తుంది' అని సాఫ్ట్‌వేర్ రూపకర్త కమల్ వివరించారు. కంపెనీలు, కార్పొరేట్ సంస్థలు పబ్లిక్ ఇష్యూలకు వెళ్లినప్పుడు ఎలాంటి ప్రకటనలు చేయాలో కూడా సాఫ్ట్‌వేర్ వివరిస్తుందన్నారు. ఈ సాఫ్ట్‌వేర్‌ను మరింతగా అభివృద్ధి చేయాల్సి ఉందని, సెబీ పత్రాలను మరింత సూక్ష్మంగా విశ్లేషించేందుకు వేర్వేరు మార్గాలను అన్వేషిస్తున్నామని ఆయన వివరించారు.

'హిందీ మాసం' వేడుకలు నిర్వహించొద్దు

- ప్రధాని మోదీకి తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ లేఖ

చెన్నై, న్యూస్‌టుడే: హిందీ మాట్లాడని రాష్ట్రాల్లో 'హిందీ మాసం' వేడుకలను భవిష్యత్తులో నిర్వహించొద్దని ప్రధాని మోదీని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కోరారు. ఈ మేరకు ఆయన ప్రధానికి లేఖ రాశారు. చెన్నై దూరదర్శన్ కేంద్రం స్వర్ణోత్సవాల సంబరాలతో కలిపి 'హిందీ మాసం' వేడుకలను శుక్రవారం గవర్నర్ అధ్యక్షతన నిర్వహించారని తెలిపారు. భారత రాజ్యాంగం ఏ భాషకూ జాతీయ హోదా ఇవ్వలేదని గుర్తుచేశారు. చట్టాలు చేయడం, న్యాయశాఖ, సమాచార సంబంధాలు వంటి అధికారిక ఉద్దేశాల కోసం మాత్రమే హిందీ, ఆంగ్ల భాషలను వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. హిందీ మాట్లాడని రాష్ట్రాల్లో హిందీ మాసం వేడుకలు నిర్వహించడం ఇతర భాషలను తక్కువచేసే ప్రయత్నంగానే తాము భావిస్తున్నట్లు వెల్లడించారు. ఇలాంటివి కొనసాగించాలని అనుకుంటే, ప్రాంతీయ భాషలకూ మాస వేడుకలు చేయాలని డిమాండ్ చేశారు.

నిరుద్యోగులతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం

- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్



బండి సంజయ్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రూప్-I అభ్యర్థులు

తెలంగాణచౌక్ (కరీంనగర్), న్యూస్‌టుడే: గ్రూప్-1 అభ్యర్థులపై లాఠీఛార్జి చేయడం హేయమైన చర్య అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. జీవో 29తో జరుగుతున్న అన్యాయంపై పలువురు గ్రూప్-1 అభ్యర్థులు శుక్రవారం కరీంనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో సంజయ్‌కు వినతిపత్రం అందజేశారు. పరీక్షకు అర్హులైన వారికి, మెయిన్స్ పరీక్షకు జారీ చేసిన హాల్‌టికెట్లకు మధ్య వ్యత్యాసం ఉందని, 4 వేల మందికి పైగా అదనంగా హాల్‌టికెట్లు ఇచ్చారని మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా బండి సంజయ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిరుద్యోగులతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతోందన్నారు. జీవో 29 నిరుద్యోగుల పాలిట శాపంగా మారిందని, ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. దానిని సవరించి న్యాయం చేయాలని అడిగితే కొట్టిస్తారా? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌కు వెళ్లి అభ్యర్థులకు సంఘీభావం ప్రకటించనున్నట్లు చెప్పారు. "ముఖ్యమంత్రి సీటు కోసం కొందరు కాంగ్రెస్ నేతలు ఎదురుచూస్తున్నారు. గ్రూప్-1 అభ్యర్థుల ఆందోళన ఉద్ధృతమై ప్రభుత్వం పడిపోవాలని వారు కోరుకుంటున్నారు'' అని సంజయ్ వ్యాఖ్యానించారు.

నిరుద్యోగుల గురించి మాట్లాడే అర్హత భారాసకు లేదు

"నిరుద్యోగులకు బ్రాండ్ అంబాసిడర్‌లా కేటీఆర్ మాట్లాడుతున్నారు. తప్పుడు నోటిఫికేషన్లు ఇచ్చి నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్న చరిత్ర భారాసది. ఆ పార్టీకి నిరుద్యోగుల గురించి మాట్లాడే నైతిక అర్హత లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అలాగే చేస్తోంది. పరీక్ష పత్రాల్లో తప్పులు, తప్పుడు జీవోలతో నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతోంది. నిరుద్యోగుల మధ్య చిచ్చుపెట్టి కొట్టుకునేలా చేసి లబ్ధి పొందేందుకే జీవో 29 జారీ చేశారు'' అని విమర్శించారు.

హైడ్రాను పక్కదారి పట్టించేందుకే మూసీ ప్రక్షాళన

"మూసీపై కేటీఆర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వడం ఓ జోకు. మూసీ నదిపై కేసీఆర్ హామీలను భారాస నేతలు మరచిపోయినట్లున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీపై రోజుకో మాట మారుస్తున్నారు. మూసీ సుందరీకరణకు రూ.లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తామని చెప్పింది కూడా ఆయనే. కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతనైతే ముందుగా 11 వేల మూసీ నిర్వాసిత కుటుంబాలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి. హైడ్రాపై చర్చను పక్కదారి పట్టించేందుకే మూసీ ప్రక్షాళనను కాంగ్రెస్ తెరపైకి తెచ్చింది'' అని సంజయ్ ఆరోపించారు.

భారాస ప్రభుత్వ హయాంలోనే
మూసీ ప్రాజెక్టు జీవో

- నాడు అన్ని ప్రయత్నాలూ చేసి.. ఇప్పుడు రాజకీయమా?
- ఏ పేదవాడికీ అన్యాయం జరగదు.. ఇది సీఎం గ్యారంటీ
- మంత్రి దామోదర్ రాజనర్సింహ



ఈనాడు, హైదరాబాద్: మూసీ ప్రాజెక్టును ప్రతిపక్షం రాజకీయం చేస్తోందని.. చెరువులు, నదులను కాపాడే బాధ్యత రాజకీయాలకు అతీతంగా అందరిపైనా ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. మూసీ పక్కన జీవించే ఏ పేదవాడికీ అన్యాయం జరగనివ్వబోమని.. ఇది తమ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి గ్యారంటీ అని మంత్రి స్పష్టం చేశారు. గతంలో భారాస ప్రభుత్వం మూసీకి సంబంధించి తీసుకున్న నిర్ణయాలను విస్మరించి.. ఇప్పుడు వ్యతిరేకంగా మాట్లాడటం సరికాదన్నారు. సచివాలయంలో మంత్రి శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. '2016లో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం మూసీ రివర్ డెవలప్‌మెంట్ బోర్డు జీవో 7ను తీసుకువచ్చింది. మూసీ నది సరిహద్దులను గత ప్రభుత్వమే నిర్ణయించింది. మూసీ ప్రాజెక్టులో బాధిత కుటుంబాలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని భారాస హయాంలో పట్టణాభివృద్ధి శాఖ నిర్ణయించింది. ఆనాడు ఒక కార్పొరేషన్ కూడా ఏర్పాటు చేసి.. దానికి డైరెక్షన్ మినిట్స్ కూడా ఇచ్చి ఇప్పుడు దాన్నే రాజకీయం చేస్తున్నారు. పునరావాసం కల్పించడం ప్రభుత్వ బాధ్యత.. ఆ దిశగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారు. భారాస పాలనలో మల్లన్నసాగర్‌లో 14 గ్రామాలు మునిగిపోతే భూ నిర్వాసితులకు ఏం న్యాయం చేశారు? అక్కడ పోలీసుల జులుం, లాఠీఛార్జీలు, 144 సెక్షన్ వంటివి ప్రజలకు మిగిలాయి. 2013లో కేంద్రంలోని యూపీఏ సర్కార్ తెచ్చిన సమగ్ర భూసేకరణ చట్టాన్ని అమలు చేయకుండా.. భారాస హయాంలో జీవో 123 తెచ్చారు. ప్రజలు ప్రతిఘటించి కోర్టులో సవాల్ చేస్తే.. ఆ జీవో రద్దయ్యింది. మూసీ నిర్వాసితులకు కచ్చితంగా పునరావాసం కల్పిస్తాం. అందరినీ ఆదుకుంటూ.. ప్రకృతిని కాపాడుకుంటాం. రాజకీయం అంటే గాలి మాటలు, అబద్ధపు ఆరోపణలు కాదని గుర్తించాలి. రాష్ట్రంలో గత పదేళ్లలో రియల్ ఎస్టేట్ ఎలా సాగిందో? కార్పొరేషన్‌లు ఎలా ఏర్పాటు చేసి రుణాలెలా తెచ్చారో అందరికీ తెలుసు' అంటూ మంత్రి దామోదర్ రాజనర్సింహ ధ్వజమెత్తారు.


మల్లూరు గుట్ట.. ఔషధ మొక్కల పుట్ట

200 హెక్టార్లలో.. 500కు పైగా రకాలు

ములుగు జిల్లా మంగపేట మండలంలోని మల్లూరు గుట్ట.. అరుదైన జాతుల ఔషధ మొక్కల నెలవు. దీనిపై 500కు పైగా రకాల జాతుల ఔషధ మొక్కలున్నట్లు వృక్ష శాస్త్రవేత్తలు గుర్తించారు. యూఎన్‌డీపీ(యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం), ఎంవోఈఎఫ్(మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్, ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్) సంయుక్తంగా చేపట్టిన ర్యాపిడ్ అసెస్‌మెంట్ సర్వేలో సుమారు 200 హెక్టార్లలో ఇవి విస్తరించి ఉన్నట్లు గుర్తించారు. 2000లోనే గుట్టను ఔషధ మొక్కల పరిరక్షణ ప్రాంతంగా ప్రకటించారు. నేలతాటి, నేలగుమ్మడి, సరస్వతి, పిల్లడుగు తీగె, కాకిజంగా, ఈశ్వరి, దేవపత్రం, అడవి ఉసిరి, అడవి తులసి, కొండ పసుపు, అతుకుడు తీగె, మారేడు, శతావరి, తెల్లగురిజ, నేల ఉసిరి, నరమామిడి, సర్పగంధ- గుట్టపై ఉన్న ఔషధ మొక్కల్లో కొన్ని. వీటిని మూలికా, ఆయుర్వేద వైద్యంలో వినియోగిస్తుంటారు. గుట్టపై హెర్బల్ పార్కు ఏర్పాటు చేయాలని 2000, 2018లలో ప్రభుత్వానికి అటవీ శాఖ ప్రతిపాదించింది. ఇటీవలి కాలంలో అరుదైన మొక్కలు కనుమరుగవుతుండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. మల్లూరు గుట్టను పరిశోధనలకు వేదికగా చేసుకోవాలని హనుమకొండకు చెందిన పర్యావరణవేత్త సుతారి సతీశ్ కోరుతున్నారు. వృక్ష శాస్త్రవేత్తలు, బోటనీ ప్రొఫెసర్లు, ఇతర నిపుణులతో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి.. సమగ్ర సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని ములుగు డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్ తెలిపారు. ఉన్నతాధికారుల సూచన మేరకు ఔషధ మొక్కల పరిరక్షణకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

– ఈనాడు, జయశంకర్ భూపాలపల్లి,
– న్యూస్‌టుడే, మంగపేట


JOS ALUKKAS
A TRADITION OF FINE JEWELLERY
బంగారు
ఆభరణాల
కొనుగోలుపై
వెండి
ఉచితం
ఆహా...
దీపావళి
రూ.60,000 విలువగల
వజ్రాభరణాల
కొనుగోలుపై
బంగారు నాణెం
ఉచితం
T&C apply. Offer valid till 21st Oct. 2024
20% తగ్గింపు
వజ్రాలపై
7% తగ్గింపు
ప్లాటినం ఆభరణాలపై
చైన్‌లకు తరుగు 4.99% నుంచి ప్రారంభం
DEVIKA
వజ్రాలలో ప్రత్యేకమైన దీపావళి కలెక్షన్
రూ.1,86,000 నుంచి ప్రారంభం
రూ.2,45,000 నుంచి ప్రారంభం
రూ.3,52,000 నుంచి ప్రారంభం
బంగారం ఎక్స్చేంజ్
మీ పాత బంగారు ఆభరణాలను సరికొత్త BIS HUID హాల్‌మార్క్ బంగారు ఆభరణాలతో ఎక్స్చేంజ్ చేసుకోండి అధిక లాభాలతో
0% తరుగు
వెండి ఆభరణాలకు
కారు గెలుచుకోండి
లక్కీ డ్రా ద్వారా
An initiative by
GJC
ALL INDIA GEM AND JEWELLERY DOMESTIC COUNCIL
IGI INTERNATIONAL GEMOLOGICAL INSTITUTE
Global Authority in Diamond Jewelry & Gemstone Certification
Presents
బంపర్ డ్రాలు
మీరు గెలుచుకోవచ్చు
25 గ్రాములు, 250 గ్రాములు
లేదా 1 కిలో బంగారాన్ని
ఒక బంగారు నాణెం
రూ.1 లక్ష కొనుగోలుపై పొందవచ్చు
మా పుష్య నక్షత్ర-దీపావళి బొనాంజా సందర్భంగా
(2024 అక్టోబర్ 23 నుంచి 26 వరకు)
శ్రీ
शुभ लाभ
LUCKY LAKSHMI
WORLD'S LARGEST JEWELLERY FESTIVAL
अब चमकेगी सबकी किस्मत
Powered by DIVINE SOLITAIRES
22 అక్టోబర్ నుంచి 9 డిసెంబర్ 2024 వరకు
అదృష్టం ఆహ్వానిస్తోంది బహుమతులతో
రూ.10 కోట్ల
వరకు
59 డ్రాలు 7 వారాలపాటు ప్రతివారం
మీరు గెలుచుకోవచ్చు వజ్రాల నెక్లెస్‌లు, ఇటాలియన్-డిజైన్ల బంగారు చైన్‌లు లేదా వజ్రాలు పొదిగిన బంగారు నాణేలు
డివైన్ సోలిటరీస్ నుంచి
నియమితకాల డ్రాలు
మీరు గెలుచుకోవచ్చు
"శ్రీ రిద్ధి సిద్ధి సమృద్ధి
పాదుక" ను
HYDERABAD: Greenlands Road, BEGUMPET, Ph: 040-23404567 | Madinaguda, CHANDANAGAR, Ph: 040-29802916 | Chaitanyapuri Main Road, DILSUKHNAGAR, Ph: 040-24045916 | Kukatpally Main Road, KPHB COLONY, Ph: 040 - 23053916. Shop online at www.josalukkasonline.com
జోస్ ఆలుక్కాస్
ANDHRA PRADESH | TELANGANA | KARNATAKA | TAMIL NADU | PUDUCHERRY | KERALA
Push360

EENADU Vol: 51, Iss: 69 | Printed and Published by D N Prasad on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt. Ltd. Printed at Ushodaya Publications, Eenadu Press, Plot No. A-1/1, Block No. 3, Industrial Development Area, Uppal, Hyderabad, Medchal District - 500 039, Telangana State. Published at Eenadu Corporate Office, Ramoji Film City, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy District - 501 512, Telangana State. Editor: D N Prasad. Phone: 040-22232223. RNI No. 27656/75. Regd. No. HSE/1009/2024-26, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

హమాస్ పీఠాన్ని అధిష్ఠించేదెవరు?

● నాయకత్వ రేసులో ఎవరెవరున్నారంటే..

ఇంటర్నెట్ డెస్క్: అధినేత యాహ్యా సిన్వర్ హతమవడంతో ప్రస్తుతం హమాస్‌ను ముందుండి నడిపించేదెవరనే అంశంపై చర్చ మొదలైంది. ఈ క్రమంలో పలువురి పేర్లు వినిపిస్తున్నాయి. హమాస్ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన మహమ్మద్ అల్ జహర్, యాహ్యా సిన్వర్ సోదరుడు మహమ్మద్ సిన్వర్, హమాస్ పొలిటికల్ బ్యూరో సీనియర్ సభ్యుడు మౌసా అబు మార్జౌక్, ఖలీల్ అల్-హయ్యా, ఖలేద్ మషాల్ హమాస్ నాయకత్వ పీఠం రేసులో ముందున్నట్లు తెలుస్తోంది. వారి గురించి సంక్షిప్త వివరాలివీ..

మహమ్మద్ అల్ జహర్:

ఇతడు హమాస్ వ్యవస్థాపక సభ్యుడు. హమాస్‌ను సైద్ధాంతికంగా తీర్చిదిద్దడంలో, 2006లో పాలస్తీనియన్ లెజిస్లేటివ్ ఎన్నికల తర్వాత గాజాలో హమాస్ అధికారంలోకి రావడంలో కీలక పాత్ర పోషించాడు. తర్వాత తమ గ్రూపులో విదేశాంగ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించాడు.

మహమ్మద్ సిన్వర్:

తన సోదరుడిలాగే మహమ్మద్ సిన్వర్ కూడా హమాస్ సైనిక విభాగంలో దీర్ఘకాలంగా పనిచేస్తున్నాడు. ఇతడు నాయకత్వ బాధ్యతలు చేపడితే.. గ్రూప్ వ్యూహాలు యథావిధిగా కొనసాగుతాయని చాలామంది భావిస్తున్నారు. బాహ్య ప్రపంచంలో ఎక్కువగా కనిపించని ఇతడు.. ఇజ్రాయెల్ నిర్వహించిన పలు ఆపరేషన్లలో త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డాడు.

మౌసా అబు మార్జౌక్:

హమాస్ స్థాపనలో ఇతడు కీలకంగా వ్యవహరించాడు. ప్రస్తుతం తమ గ్రూపు పొలిటికల్ బ్యూరోలో సీనియర్ సభ్యుడిగా ఉన్నాడు. గతంలో గ్రూప్ పొలిటికల్ హెడ్‌గానూ పనిచేశాడు. సంస్థాగత, ఆర్థిక, మిలిటెంట్ కార్యకలాపాల్లో ఇతడిది చురుకైన పాత్ర.

ఖలీల్ అల్-హయ్యా:

ఇతడు ప్రస్తుతం ఖతర్‌లో ఉన్నాడు. హమాస్ రాజకీయ విభాగంలో కీలకంగా వ్యవహరిస్తున్నాడు. గతంలో పలుమార్లు కాల్పుల విరమణ చర్చల్లో చురుగ్గా వ్యవహరించాడు. అంతర్జాతీయ మధ్యవర్తులతో మంచి సంబంధాలు కలిగిఉన్నాడు. గతంలో ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో ప్రాణాలతో బయటపడ్డాడు.

ఖలేద్ మషాల్:

ఇతడు 2006 నుంచి 2017 వరకు హమాస్‌ను నడిపించాడు. సిరియా అంతర్యుద్ధ సమయంలో ఆ దేశాధ్యక్షుడు బషర్ అల్-అస్సద్‌ను బహిరంగంగా వ్యతిరేకించడంతో ఇరాన్ మద్దతు కోల్పోయాడు. అయితే గ్రూప్‌పై ఇప్పటికీ ఇతడికి పట్టు ఉంది.

సిన్వర్ మరణంతో న్యాయం జరిగింది..

● కమలా హారిస్ వ్యాఖ్య

హమాస్ అధినేత సిన్వర్ మృతిపై అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ స్పందించారు. సిన్వర్ మరణంతో న్యాయం జరిగిందని పేర్కొన్నారు. గాజాతో ఇజ్రాయెల్ యుద్ధానికి ముగింపు పలికేందుకు ఇదొక మంచి అవకాశంగా భావిస్తున్నామన్నారు. "ఇజ్రాయెల్ సురక్షితంగా ఉంటుంది. బందీలు విడుదలవడంతోపాటు గాజాలో బాధలు తొలగిపోతాయి" అని హారిస్ పేర్కొన్నారు.

చంపింది ట్రైనీ సైనికులే

సిన్వర్‌ను చంపింది ట్రైనీ సైనికులే. హమాస్‌తో నిరుడు యుద్ధం ప్రారంభమైనప్పుడు వారు ఇజ్రాయెల్ సైన్యంలోనే లేరు. ప్రభుత్వ పిలుపు మేరకు 9 నెలల కిందటే దేశం కోసం ఆర్మీలో చేరారు. వారి వయసు 19-21 ఏళ్ల మధ్యే ఉంది. దక్షిణ గాజాలో గస్తీ తిరుగుతుండగా.. ఓ భవనం నుంచి ముగ్గురు ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో వారు బాంబులతో దాడి చేశారు. ఈ దాడిలోనే సిన్వర్ హతమయ్యాడు.

లెబనాన్‌కు భారత్ సాయం

ఇజ్రాయెల్-హెజ్‌బొల్లాల మధ్య భీకర దాడులతో అల్లాడుతున్న లెబనాన్‌కు మానవతా సాయం అందించాలని భారత్ నిర్ణయించింది. సంక్షోభ పరిస్థితుల్లో ఆ దేశ ప్రజలను ఆదుకునేందుకు వైద్య సామగ్రి, ఔషధాలు పంపాలని నిర్ణయించింది. మొత్తం 33 టన్నుల వైద్య సామగ్రిని పంపుతున్నట్లు విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది. ఇందులో భాగంగా తొలి విడతలో 11 టన్నుల వైద్య సామగ్రిని శుక్రవారం ప్రత్యేక విమానంలో పంపినట్లు వెల్లడించింది.

దక్షిణ లెబనాన్‌లో కొనసాగనున్న ఐరాస శాంతి పరిరక్షకులు

దక్షిణ లెబనాన్‌లో సరిహద్దు ప్రాంతాలను వీడి వెళ్లాలంటూ ఇజ్రాయెల్ హెచ్చరించినప్పటికీ.. ఐక్యరాజ్య సమితి శాంతిపరిరక్షకులు ఆయా స్థావరాల్లోనే యథావిధిగా కొనసాగనున్నారు. భాగస్వామ్య దేశాలన్నీ ఈ మేరకు ఏకగ్రీవంగా కీలక నిర్ణయం తీసుకున్నాయని అక్కడి మిషన్ అధికార ప్రతినిధి శుక్రవారం వెల్లడించారు.



యెమెన్ రాజధాని సనాలో పాలస్తీనియులకు మద్దతుగా శుక్రవారం హమాస్ అధినేత యాహ్యా సిన్వర్ చిత్రపటంతో స్థానికుల ప్రదర్శన



మలావీ రాజధాని లిలోంగ్వేలో జాతీయ స్మారక చిహ్నం వద్ద రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నివాళులు

మలావీ అధ్యక్షుడితో ద్రౌపదీ ముర్ము భేటీ

● ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చ

లిలోంగ్వే: తూర్పు ఆఫ్రికా దేశమైన మలావీ అధ్యక్షుడు లాజరస్ మెక్‌కార్థీ చక్వేరాతో భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శుక్రవారం లిలోంగ్వే నగరంలో భేటీ అయ్యారు. వ్యవసాయం, గనుల తవ్వకం, పర్యాటకం, ఇంధనం సహా పలు రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడంపై చర్చించారు. సంస్కృతి, క్రీడలు, ఔషధ రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకునేందుకు ఉద్దేశించిన కీలక ఒప్పందాలపై ఈ సందర్భంగా ఇరు దేశాల ప్రతినిధులు వారి సమక్షంలో సంతకాలు చేశారు. మలావీకి మానవతా సాయం కింద భారత్ తాజాగా వెయ్యి మెట్రిక్ టన్నుల బియ్యంతోపాటు ఓ క్యాన్సర్ చికిత్సా యంత్రాన్ని అందజేసింది. మలావీలో పర్యటించిన తొలి భారత రాష్ట్రపతి ముర్మునే.


అనవసర పిటిషన్లతో విసిగిపోయాం: సుప్రీం

● వివిధ రాష్ట్రాలు, ప్రభుత్వరంగ సంస్థలపై అసహనం

దిల్లీ: పదే పదే హెచ్చరిస్తున్నా వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వరంగ సంస్థలు (పీఎస్‌యూలు) దాఖలుచేస్తున్న అనవసర పిటిషన్లు విసుగు పుట్టిస్తున్నాయని సుప్రీంకోర్టు శుక్రవారం అసహనం వ్యక్తం చేసింది. ఇటువంటి పిటిషన్ల ఖర్చును అధికారులు వ్యక్తిగతంగా భరించాల్సిన అవసరం లేనందున కోర్టులపై అనవసర భారం పెరుగుతోందని జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌ల ధర్మాసనం వ్యాఖ్యానించింది. క్రమశిక్షణ చర్యల కింద తనను సర్వీసు నుంచి తొలగించడాన్ని సవాలు చేసిన ఝార్ఖండ్ ఉద్యోగికి అనుకూలంగా ఆ రాష్ట్ర హైకోర్టు తీర్పు చెప్పింది. ఆ తీర్పును సవాలు చేస్తూ ఝార్ఖండ్ సర్కారు చేసిన అప్పీలుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. "ఇటువంటి స్పెషల్ లీవ్ పిటిషన్ల గురించి గత ఆరు నెలలుగా చెబుతూనే ఉన్నాం. అయినా మార్పు లేదు. ఇక చాలు" అని ధర్మాసనం పేర్కొంది. ఝార్ఖండ్ ప్రభుత్వ అప్పీలును తోసిపుచ్చిన సుప్రీంకోర్టు నాలుగు వారాల్లోపు రూ.లక్ష కట్టాలని ఆదేశాలు జారీ చేసింది. "ఇందులో రూ.50 వేలు సుప్రీంకోర్టు న్యాయవాదుల గ్రంథాలయానికి జమ చేయాలి. మిగతా రూ.50 వేలు సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ సంక్షేమనిధికి ఇవ్వాలి" అని తెలిపింది. ఇటువంటి అనవసర పిటిషన్లకు బాధ్యులైన అధికారులను విచారణ ద్వారా గుర్తించి, వారి నుంచి ఈ ఖర్చుల రికవరీ పెట్టే స్వేచ్ఛ రాష్ట్ర ప్రభుత్వాలకు, పీఎస్‌యూలకు ఉందని న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు.

ప్రాణాలతో ఉండాలంటే రూ.5 కోట్లు ఇవ్వు

● సల్మాన్ ఖాన్‌కు మళ్లీ బెదిరింపులు



ముంబయి: బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్‌కు మరోసారి బెదిరింపులు వచ్చాయి. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో ఉన్న వైరానికి ముగింపు పలకాలంటే రూ.5 కోట్లు ఇవ్వాలంటూ అగంతకులు బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ మేరకు ముంబయి ట్రాఫిక్ పోలీసుల వాట్సప్ నంబర్‌కు గురువారం మధ్యాహ్నం మెసేజ్ పెట్టారు. 'ఈ బెదిరింపులను తేలిగ్గా తీసుకోవద్దు. సల్మాన్ ఖాన్ ప్రాణాలతో ఉండాలన్నా.. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో శత్రుత్వాన్ని ముగించుకోవాలన్నా ఆయన రూ.5 కోట్లు చెల్లించాలి" అని బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు.. బెదిరింపులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు శుక్రవారం వెల్లడించారు. ఈ నేపథ్యంలో బాంద్రాలోని ఆయన నివాసం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు.

✦ మరోవైపు జూన్‌లో సల్మాన్ హత్యకు యత్నించిన కేసులో నవీ ముంబయి పోలీసులు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన ఓ షూటర్‌ను అరెస్టు చేశారు. అతనిని హరియాణాలో పానీపత్‌కు చెందిన సుఖ్‌బీర్‌సింగ్‌గా గుర్తించారు.

ముంబయిలో తైవాన్ ఆఫీసు తెరవడంపై చైనా నిరసన

బీజింగ్: ముంబయిలో తైవాన్‌కు చెందిన తైపెయ్ ఆర్థిక, సాంస్కృతిక మండలి (టీఈసీసీ) కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంపై చైనా.. భారత్‌కు దౌత్యపరమైన నిరసనను తెలియజేసింది. "ప్రపంచంలో ఒకే చైనా ఉంది. తైవాన్.. మా దేశంలో విడదీయరాని భాగం" అని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ తెలిపారు. తమతో దౌత్య సంబంధాలున్న దేశాలు తైవాన్‌తో అధికారికంగా సంబంధాలు నెరపడాన్ని, సంప్రదింపులు జరపడాన్ని గట్టిగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. దీనిపై భారత్‌కు నిరసన తెలిపినట్లు పేర్కొన్నారు. 'ఒకే చైనా' సూత్రానికి గట్టిగా కట్టుబడతామని భారత్ రాజకీయ హామీ ఇచ్చిందన్నారు. రెండు దేశాల సంబంధాలకు ఇది పునాది అని తెలిపారు. ఇచ్చిన హామీని భారత్ నిలబెట్టుకోవాలని కోరారు. ముంబయిలో టీఈసీసీ కార్యాలయం బుధవారం ప్రారంభమైంది. ఇప్పటికే దిల్లీ, చెన్నైల్లో ఈ ఆఫీసులు ఉన్నాయి.

నిర్ణీత గడువులో కేసుల పరిష్కారానికి ఇది అమెరికన్ సుప్రీంకోర్టు కాదు

● సీజేఐ ధర్మాసనం వ్యాఖ్య



దిల్లీ: దేశంలోని న్యాయస్థానాలు అన్నింటి ముందు పెండింగులో ఉన్న కేసులను నిర్ణీత కాలవ్యవధిలోపు పరిష్కరించేలా మార్గదర్శకాలు జారీ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. "దేశ అత్యున్నత న్యాయస్థానంలో అన్ని కేసుల విచారణ ఏడాది వ్యవధిలోపు పూర్తికావాలని మీరు కోరుకొంటున్నారా? ఇదేం అమెరికన్ సుప్రీంకోర్టు కాదు" అని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని జస్టిస్ జె.బి.పర్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రలతో కూడిన ధర్మాసనం శుక్రవారం వ్యాఖ్యానించింది. ఇతర దేశాల్లో కేసుల పరిష్కారానికి కాలవ్యవధి ఉంటుందని పేర్కొన్న పిటిషనరు భారత్‌లోనూ సుప్రీంకోర్టు సహా అన్ని కోర్టుల్లో కేసుల పరిష్కారం ఏడాది నుంచి మూడేళ్ల గడువులోపు పూర్తికావాలని కోరారు. "అలా జరగడం మంచిదే. కానీ, ఇక్కడ సాధ్యం కాదు. ఆ ప్రక్రియ కార్యరూపం దాల్చాలంటే చాలా కసరత్తు అవసరం. మౌలిక సదుపాయాలు మెరుగుపడాలి. న్యాయమూర్తుల సంఖ్య పెంచాలి" అని సీజేఐ అభిప్రాయపడ్డారు. అమెరికా వంటి దేశాల్లో సుప్రీంకోర్టులు ఏడాదికి ఎన్ని కేసులు పరిష్కరిస్తాయో మీకు తెలుసా? అని ధర్మాసనం పిటిషనరును ప్రశ్నించింది. భారత సుప్రీంకోర్టులోని ధర్మాసనాలు ఒకరోజులో విచారించే, పరిష్కరించే కేసుల సంఖ్య పలు పాశ్చాత్య దేశాల్లోని సుప్రీంకోర్టుల్లో ఏడాది మొత్తం విచారించే కేసులకన్నా ఎక్కువేనని పేర్కొంది. "కోర్టుకు వచ్చే వారిని మేము నియంత్రించలేము. భారత న్యాయ వ్యవస్థ న్యాయం అందరికీ అందుబాటులో ఉండాలని కోరుకొంటుంది" అని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రజలు కోర్టును ఆశ్రయించకుండా నియంత్రించాలన్నది తన ఉద్దేశమూ కాదని పిటిషనరు తెలిపారు.

బినామీ చట్ట నిబంధనలపై సమీక్ష..

బినామీ ఆస్తుల లావాదేవీలకు సంబంధించి 2022 ఆగస్టులో నాటి సీజేఐ జస్టిస్ ఎన్.వి.రమణ సారథ్యంలోని త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును శుక్రవారం సుప్రీంకోర్టు గుర్తుచేసుకొంది. ఈ తీర్పుపై కేంద్రం తరఫున రివ్యూ పిటిషన్‌కు సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం అనుమతి ఇచ్చింది. నాటి తీర్పులో బినామీ ఆస్తుల లావాదేవీల చట్టం 1988లోని 3 (2), 5 సెక్షన్లు ఏకపక్షంగా ఉండటం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు పేర్కొంది. ఇందులో సెక్షన్ 3 సన్నిహితుల ద్వారా ఒక వ్యక్తి కలిగి ఉన్న బినామీ ఆస్తుల లావాదేవీల నిషేధానికి సంబంధించినది. సెక్షన్ 5 బినామీ ఆస్తుల స్వాధీనం బాధ్యతలకు వర్తిస్తుంది. కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలతో కోర్టు ఏకీభవించింది.



దిల్లీలో జరిగిన శక్తి అభియాన్ జాతీయ కార్యవర్గ సమావేశంలో మహిళలతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ

అలంకారప్రాయమైన పదవులను అంగీకరించొద్దు

● సాధికార హక్కుల సాధనకు పోరాడండి

● మహిళలకు రాహుల్‌గాంధీ పిలుపు

దిల్లీ: నిజమైన సాధికారత కోసం మహిళలు పోరాడాలని, అలంకారప్రాయమైన పదవులను అంగీకరించవద్దని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ సూచించారు. అర్హతలకు తగిన పదవులను హక్కుగా సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం దిల్లీలో నిర్వహించిన 'శక్తి అభియాన్' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రాజకీయ పార్టీల మధ్య నేడు జరుగుతున్న పోరాటం అధికారం కోసమో, రాజకీయాల కోసమే కాదని అదొక విస్తృతమైన సిద్ధాంతపరమైన రణమని రాహుల్ గాంధీ తెలిపారు. శక్తి అభియాన్ కార్యక్రమానికి 21 రాష్ట్రాల నుంచి వచ్చిన మహిళా ప్రతినిధులు హాజరయ్యారు. రాజకీయాల్లో మహిళలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించే లక్ష్యంతో వివిధ వర్గాల వారికి క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమం ద్వారా శిక్షణ అందిస్తున్నారు. వారిలో ఉత్తమ పనితీరు కనబరిచిన వారితో దిల్లీలో సమావేశం నిర్వహించారు.

కమలా హారిస్ ప్రచారంలో బాలీవుడ్ వీడియోలు



వాషింగ్టన్: నవంబరులో జరగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో జయాపజయాలను శాసించే సత్తా ఉన్న కీలక రాష్ట్రాల్లో దక్షిణాసియా సంతతి ఓటర్ల మద్దతును కూడగట్టడానికి కమలా హారిస్ ప్రచార కమిటీలోని ముఖ్య సభ్యుడు అజయ్ భుటోరియా బాలీవుడ్ సినీసంగీతాన్ని ప్రయోగిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు ఎ.ఆర్.రెహమాన్ స్వరపరచిన 'చిన్నిచిన్ని ఆశ' పాటతోపాటు 'యానిమల్' చిత్ర సంగీతం కలగలిపిన ప్రచారగీతాన్ని సభల్లో వినిపిస్తున్నారు. ఇందులో తెలుగు, తమిళ, మలయాళ, హిందీ, పంజాబీ, గుజరాతీ, బెంగాలీ, ఉర్దూ భాషల్లో సందేశాలున్నాయి. డెమోక్రటిక్ పార్టీ అధ్యక్ష, ఉపాధ్యక్ష అభ్యర్థులైన కమలా హారిస్, టిమ్‌వాల్జ్‌ల కోసం బాలీవుడ్ ఆధారంగా మరిన్ని వీడియోలను విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు. కమలా హారిస్ 50 లక్షలమంది భారతీయ అమెరికన్లకు ఆశాకిరణమని అన్నారు. పెన్సిల్వేనియా, మిషిగన్, విస్కాన్సిన్, జార్జియా, అరిజోనా, నెవాడా, ఉత్తర కెరొలైనా రాష్ట్రాల్లోని దక్షిణాసియా ఓటర్లను ఆకట్టుకోడానికి ఈ వీడియోలను సాధనంగా ఉపయోగిస్తున్నారు.

ట్రంప్‌నకు మద్దతుగా ఎలాన్ మస్క్

ప్రపంచంలో అతి సంపన్నుడు.. టెస్లా, ఎక్స్ (ట్విటర్), స్పేస్‌ఎక్స్ సంస్థల యజమాని అయిన ఎలాన్ మస్క్ రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ఎన్నిక కోసం ప్రచారం చేపట్టారు. పెన్సిల్వేనియా రాష్ట్రంలోని ఫిలడెల్ఫియా నగర శివార్లలో స్వయంగా ఎన్నికల ప్రచారసభ నిర్వహించారు. ఈ కార్యక్రమం 'ఎక్స్'లో ప్రసారమైంది. ట్రంప్ కోసం త్వరగా, తపాలా బ్యాలెట్ ద్వారా ఓట్లు వేయాలని సభికులకు పిలుపునిచ్చారు. ఓటు వేయడానికి బద్ధకించేవారిని వెంటబడి పోలింగు కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. తాను ఇంతకు ముందెన్నడూ రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించలేదనీ, ఇప్పుడు అమెరికా భవిష్యత్తు కోసం ఆ పని చేస్తున్నానని మస్క్ వివరించారు.

మనీలాండరింగ్ కేసులో అబ్బాస్ అన్సారీకి ఊరట

● బెయిల్ మంజూరుచేసిన సుప్రీం

దిల్లీ: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నమోదు చేసిన మనీలాండరింగ్ కేసులో ఎమ్మెల్యే అబ్బాస్ అన్సారీకి సుప్రీంకోర్టు శుక్రవారం బెయిల్ మంజూరుచేసింది. జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ పంకజ్ మిత్తల్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. మాఫియా డాన్ నుంచి రాజకీయ నేతగా ఎదిగిన ముఖ్తార్ అన్సారీ కుమారుడు అబ్బాస్ అన్సారీ. అనారోగ్యం కారణంగా ముఖ్తార్ కొన్ని నెలల క్రితం జైల్లోనే మృతిచెందిన విషయం తెలిసిందే. ఉత్తర్‌ప్రదేశ్‌లోని మవూ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తోన్న అబ్బాస్‌కు మరో కేసులోనూ బెయిల్ మంజూరైంది. జైల్లో తనను కలిసేందుకు వచ్చిన తన భార్య మొబైల్ నుంచి కాల్స్ చేసి ఈ కేసు విచారణలో ప్రత్యక్షసాక్షులుగా ఉన్న వ్యక్తులను బెదిరిస్తున్నాడన్న ఆరోపణలతో నమోదైన కేసులో ఆయనకు ఊరట లభించింది. ఈమేరకు జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ ఉజ్జల్‌భూయాన్‌లతో కూడిన మరో ధర్మాసనం తీర్పునిచ్చింది. అన్సారీ ప్రస్తుతం ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాస్‌గంజ్ జైల్లో శిక్ష అనుభవిస్తున్నారు.

ఔరా.. మినీ 'థార్' భళా!

ఆజంగఢ్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆజంగఢ్‌కు చెందిన ప్రవేశ్ మౌర్య అనే మోటార్ మెకానిక్‌కు మహీంద్రా థార్ వాహనమంటే చాలా ఇష్టం. కొనాలని కలలు కన్నా.. ఆర్థికపరమైన కారణాలతో నెరవేరలేదు. అలాగని నిరుత్సాహపడకుండా తన ప్రతిభతో ఏకంగా మినీ థార్‌నే తయారుచేసి మౌర్య ఔరా అనిపించాడు. ఎనిమిది నెలల్లో కేవలం రూ.2.5 లక్షల వ్యయంతో బ్యాటరీతో నడిచే ఓ మినీ కారును తయారుచేశాడు. నలుగురు వ్యక్తులు కూర్చొని ప్రయాణించేలా దీన్ని రూపొందించాడు. ఈ కారుకు ఒకసారి ఛార్జింగు చేస్తే గంటకు 40 కిలోమీటర్ల గరిష్ఠవేగంతో 100 కిలోమీటర్ల వరకు ప్రయాణం చేయవచ్చు.



దిల్లీలో అగ్నిప్రమాదం.. తల్లి, కుమారుడి మృతి

● మరో నలుగురికి గాయాలు

దిల్లీ: దేశరాజధాని దిల్లీలోని షాహ్‌దరా ప్రాంతంలో ఉన్న ఓ నివాస భవనంలో శుక్రవారం అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 16 ఏళ్ల బాలుడితో పాటు అతడి తల్లీ ప్రాణాలు కోల్పోగా.. వారి కుటుంబ సభ్యులు నలుగురు గాయపడినట్లు అధికారులు తెలిపారు. భోళానాథ్ నగర్‌లో ఉన్న నాలుగు అంతస్తుల నివాసభవనంలో ఈ ప్రమాదం జరిగినట్లు దిల్లీ అగ్నిమాపక సేవల (డీఎఫ్‌ఎస్) అధికారులు వివరించారు. ప్రమాదం గురించి ఉదయం 5.25 గంటలకు సమాచారం అందిందని, ఆరు అగ్నిమాపక యంత్రాలు రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చాయని వెల్లడించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

కోల్‌కతాలోని ఆసుపత్రిలో

పశ్చిమబెంగాల్‌లోని సియాల్‌దాహ్ ఈఎస్‌ఐ ఆస్పత్రిలోనూ శుక్రవారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం జరిగింది. కాగా, ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు. ఆస్పత్రిలో ఉన్న దాదాపు 50 మంది రోగులను మరో ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.



అగ్ని ప్రమాదం కారణంగా కోల్‌కతాలోని ఈఎస్‌ఐ ఆసుపత్రి రెండో అంతస్తులో చెలరేగిన మంటలు

ఆయుష్మాన్ భారత్ పీఎం-జేఏవైతో ఈఎస్‌ఐ సమ్మిళితం

● లబ్ధిదారులకు మరింత ప్రయోజనం

దిల్లీ: ఉద్యోగ రాజ్య బీమా (ఈఎస్‌ఐ) పథకాన్ని ఆయుష్మాన్ భారత్ పీఎం-జేఏవైతో కలిపేయాలని ఈఎస్‌ఐసీకి సంబంధించిన వైద్య ప్రయోజన మండలి నిర్ణయించింది. దీనివల్ల లబ్ధిదారులకు వైద్యపరిరక్షణ సేవల లభ్యత పెరుగుతుంది. శుక్రవారం ఇక్కడ జరిగిన 86వ వైద్య ప్రయోజన మండలి సమావేశం ఈ మేరకు నిర్ణయం జరిగింది. ఆయుష్మాన్ భారత్ పీఎం-జేఏవై.. ప్రపంచంలోనే అతిపెద్ద వైద్య బీమా పథకం. దీనికింద కుటుంబానికి 5 లక్షల వరకూ వైద్య బీమా అందుతుంది. 12 కోట్ల పేద కుటుంబాలకు దీనివల్ల ప్రయోజనం కలుగుతోంది. మొత్తంమీద 55 కోట్ల మంది లబ్ధిదారులు ఇందులో ఉన్నారు. రాష్ట్రాల కోసం కామన్ సపోర్ట్ మిషన్ (సీఎస్‌ఎం)ను అమలు చేయాలని కూడా మండలి తాజాగా నిర్ణయించింది. ఈఎస్‌ఐ వైద్య సేవల వ్యవస్థను బలోపేతం చేయడం దీని ఉద్దేశం. లబ్ధిదారుల కోసం వార్షిక వైద్య పరీక్షలు, అవగాహన శిబిరాలను నిర్వహించాలని కూడా మండలి నిర్ణయించింది. జీవనశైలికి సంబంధించిన రుగ్మతలు, క్యాన్సర్ ఆరంభ సంకేతాలు, పోషకాహార లోపాలను ఆరంభంలోనే గుర్తించడం దీని ఉద్దేశం.

డేరా బాబా కేసులో స్టే ఎత్తివేత



దిల్లీ: డేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ రామ్ రహీమ్ సిక్కుల పవిత్ర గ్రంథమైన గురు గ్రంథ్ సాహిబ్ పట్ల అపచారం చేశారని 2015లో దాఖలైన కేసుల విచారణపై పంజాబ్, హరియాణా హైకోర్టు ఇచ్చిన స్టే ఉత్తర్వును సుప్రీంకోర్టు శుక్రవారం ఎత్తివేసింది. ఆరోపణలకు నాలుగు వారాల్లోపు సమాధానం ఇవ్వాలని డేరా బాబాను ఆదేశించింది. హైకోర్టు స్టేను పంజాబ్ ప్రభుత్వం సవాలు చేసిన మీదట సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం పైవిధంగా తీర్మానించింది. 2015 జూన్ - అక్టోబరు మధ్య ఫరీద్‌కోట్‌లో గురుగ్రంథ్ సాహిబ్‌ను అపవిత్రం చేసిన ఘటనలు మూడు జరిగాయని ఎఫ్‌ఐఆర్ దాఖలు చేశారు. సిక్కుల పవిత్రగ్రంథాన్ని దూషించారనీ, ఆ గ్రంథంతోపాటు సిక్కు మత నాయకులపై అవమానకర వ్యాఖ్యలతో పోస్టర్లు అతికించారనీ, బర్గాన్ గ్రామంలోని గురుద్వారా వద్ద ఈ గ్రంథంలోని 112 పేజీలను చించి చెల్లాచెదురుగా పడేశారనీ కేసులు దాఖలయ్యాయి. 2015 అక్టోబరులో ఈ దురాగతాలపై నిరసనగా అల్లర్లకు దిగిన సిక్కులపై రెండుచోట్ల పోలీసులు కాల్పులు జరిపారు. మొత్తం అయిదు కేసులపై పంజాబ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. గురుగ్రంథ్ సాహిబ్ నుంచి చించిన 112 పేజీలను మతపరమైన అతివాదులు తమ గుప్పిట్లోకి తీసుకొని, వాటిపై నిందితుల వేలిముద్రలను పోలీసులు తీసుకోకుండా నిరోధించారని పంజాబ్ హరియాణా హైకోర్టు వ్యాఖ్యానించింది. మూడు అపచారం కేసులను సీబీఐకి అప్పగించాలని 2015లో పంజాబ్ ప్రభుత్వం నిశ్చయించినా, 2018లో అధికారంలో ఉన్న సర్కారు సీబీఐకి ఇచ్చిన అనుమతిని ఉపసంహరించుకొంది. ఇపుడు మొత్తం వ్యవహారాన్ని విస్తృత ధర్మాసనానికి నివేదించ దలిచినందున రామ్ రహీంపై దిగువ కోర్టులో జరుగుతున్న విచారణపై స్టే ఇస్తున్నట్లు హైకోర్టు గత మార్చిలో ప్రకటించింది. ఈ స్టే ఉత్తర్వును కొట్టివేయాలని పంజాబ్ అడ్వొకేట్ జనరల్ చేసిన విజ్ఞాపనను సుప్రీంకోర్టు మన్నించింది.

యూఏఈలో భారతీయులకు వీసా ఆన్ అరైవల్

ఇంటర్నెట్ డెస్క్: యూఏఈలో దిగిన వెంటనే వీసా పొందే అవకాశం భారతీయులకు అందుబాటులోకి వచ్చింది. ఇందుకోసం 'వీసా ఆన్ అరైవల్' సదుపాయాన్ని యూఏఈ ప్రారంభించినట్లు అక్కడి రాయబార కార్యాలయం వెల్లడించింది. అర్హత కలిగిన భారతీయ పౌరులు 14 రోజుల వ్యవధితో కూడిన వీసాను యూఏఈ విమానాశ్రయంలోనే పొందవచ్చని తెలిపింది. అమెరికా జారీచేసిన గ్రీన్‌కార్డు లేదా చెల్లుబాటయ్యే వీసా, యూరోపియన్ యూనియన్ దేశాలు, బ్రిటన్ ఇచ్చిన రెసిడెన్స్, వీసాలు కలిగి ఉన్నవారు వీటిని పొందవచ్చు. పాస్‌పోర్టు కనీసం ఆరు నెలల క్రితం జారీ చేసినదై ఉండాలి. 14 రోజుల వ్యవధితో కూడిన వీసా పొంది, మరో 14 రోజులు పొడిగించుకొనే అవకాశం ఉంటుంది. పొడిగింపునకు వీలుకాని 60 రోజుల వ్యవధితో కూడిన వీసాను కూడా తీసుకునే వెసులుబాటు ఉంది.

నిషేధం ఉన్న గర్భగుడిలోకి శ్రీకాంత్ శిందే ప్రవేశం

● సీఎం ఏక్‌నాథ్ శిందే కుమారుడి తీరుపై విమర్శలు

ఉజ్జయిని; ముంబయి: మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలు హడావుడి మొదలైన తరుణంలో ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే కుమారుడు శ్రీకాంత్ శిందే చర్య వివాదాస్పదమైంది. ఠాణే జిల్లాలోని కల్యాణ్ లోక్‌సభ నియోజకవర్గ ఎంపీ శ్రీకాంత్ శిందే గురువారం సాయంత్రం ఉజ్జయినిలోని మహాకాళేశ్వర్ ఆలయానికి వెళ్లారు. భార్యతో కలిసి గర్భగుడిలోకి వెళ్లి పూజలు చేశారని ఆలయ వర్గాలు వెల్లడించాయి. దీనికి సంబంధించిన వీడియో వైరల్ అయింది. సుమారు ఏడాది కాలంగా ఆ ఆలయ గర్భగుడిలోకి ప్రవేశంపై నిషేధం ఉండటంతో ఇది కాస్తా విమర్శలకు దారితీసింది. "సామాన్యులు దైవ దర్శనం కోసం గంటల కొద్దీ క్యూలో నిలబడి వేచిచూస్తుంటే.. నిషేధం ఉన్నా వీఐపీలను మాత్రం అనుమతిస్తున్నారు. ఈ వ్యవహారం నిబంధనలకు విరుద్ధం" అని కాంగ్రెస్ ఆక్షేపించింది. ఉజ్జయిని జిల్లా కలెక్టర్, ఆలయ కమిటీ ఛైర్మన్ నీరజ్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.."మేం ఎవరినీ గర్భగుడిలోకి అనుమతించలేదు. దీనిపై వెంటనే చర్యలకు ఆదేశించాను" అని వెల్లడించారు.



నాల్గవ సిక్కు గురువు రామ్‌దాస్ జయంతి సందర్భంగా అమృత్‌సర్ స్వర్ణదేవాలయం వద్ద నిర్వహించిన ఊరేగింపులో యువకుడి విన్యాసం



ఇస్రోకు అనంత్ టెక్నాలజీస్ సేవలు


ఉపగ్రహాల రూపకల్పన ప్రాజెక్టులు విజయవంతంగా పూర్తి

ఈనాడు, హైదరాబాద్: ఇస్రో (భారత అంతరిక్ష పరిశోధనా మండలి) కోసం రెండు ఉపగ్రహా రూపకల్పన ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేసినట్లు అనంత్ టెక్నాలజీస్ వెల్లడించింది. ఇవి 400 కిలోల తరగతికి చెందిన ఉపగ్రహాలు కావడం ప్రత్యేకత. తొలిసారిగా ఈ ప్రాజెక్టును ఇస్రో ఒక ప్రైవేటు సంస్థకు అప్పగించింది. అనంత్ టెక్నాలజీస్ తన బెంగళూరు ఏరోస్పేస్ పార్క్‌లో, ఈ ఉపగ్రహాల అసెంబ్లీ, ఇంటిగ్రేషన్, టెస్టింగ్ (ఏఐటీ) కార్యకలాపాలను పూర్తి చేసింది. వీటిని ఇస్రోకు శుక్రవారం లాంఛనంగా అప్పగించారు. ఇస్రోకు చెందిన యూఆర్ రావు శాటిలైట్ సెంటర్ (యూఆర్ఎస్‌సీ) డైరెక్టర్ శంకరన్ ఈ కార్యక్రమంలో పాల్గొని, అనంత్ టెక్నాలజీస్ ఎంతో అనుభవం, అంకితభావంతో ఈ ప్రాజెక్టును పూర్తి చేసిందని కొనియాడారు. అనంత్ టెక్నాలజీస్ ఛైర్మన్ డాక్టర్ సుబ్బారావు పావులూరి స్పందిస్తూ, ఇస్రో కోసం రెండు దశాబ్దాలకు పైగా ఎలక్ట్రానిక్ సబ్‌సిస్టమ్స్ అందిస్తున్నామని, ఇస్రో చేపట్టిన ఎన్నో ప్రాజెక్టుల్లో భాగం పంచుకున్నట్లు వివరించారు. ఇప్పుడు అన్ని పనుల్లోనూ డ్రోన్లను వాడుతున్నట్లుగానే, సమీప భవిష్యత్తులో ఎన్నో అవసరాలకు ఉపగ్రహాలను వాడే పరిస్థితి వస్తుందని చెప్పారు.

సాఫ్ట్‌వేర్ సేవల ఎగుమతులు 205.2 బి.డాలర్లకు

దిల్లీ: దేశీయ సాఫ్ట్‌వేర్ కంపెనీలు, విదేశాల్లోని వాటి అనుబంధ సంస్థలు అందించిన సాఫ్ట్‌వేర్ సేవల విలువ గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో 205.20 బిలియన్ డాలర్లుగా నమోదైంది. 2022-23లో ఇవి 200.60 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు రిజర్వ్ బ్యాంక్ తెలిపింది. విదేశీ అనుబంధ సంస్థల ఎగుమతులను మినహాయిస్తే 2023-24లో భారత సాఫ్ట్‌వేర్ సేవల ఎగుమతులు, అంతకుముందు ఏడాది కంటే 2.8% పెరిగి 190.7 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. మన కంపెనీల సాఫ్ట్‌వేర్ సేవల ఎగుమతులు అధికంగా జరిగేది అమెరికాకే. మొత్తం ఎగుమతుల్లో అమెరికా వాటా 53% కాగా.. ఐరోపా వాటా 31%.

ఈ సమయంలో వడ్డీ రేట్ల కోత తగదు: దాస్




దిల్లీ: రిటైల్ ద్రవ్యోల్బణం అధికంగా ఉన్న ప్రస్తుత సమయంలో వడ్డీ రేట్లను తగ్గిస్తే, అది పొరపాటే అవుతుందని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ పేర్కొన్నారు. అలా చేస్తే చాలా నష్టభయాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. రాబోయే గణాంకాలు, అంచనాలను బట్టి భవిష్యత్ రేట్ల నిర్ణయం ఉంటుందని శుక్రవారమిక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో స్పష్టం చేశారు. సెప్టెంబరు ద్రవ్యోల్బణం అధికంగానే నమోదైందని.. ఇది 4% లోపునకు పరిమితం కావడానికి ముందు, అధికంగానే కొనసాగొచ్చనీ ఆయన అంచనా వేశారు. ఈ దశలో రేట్ల కోత అంత తెలివైన నిర్ణయం అనిపించుకోదని అన్నారు. 'పోలీసు తరహాలో ఆర్‌బీఐ పనిచేయదు. అయితే ఆర్థిక మార్కెట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూనే ఉంటాం. అవసరమైనప్పుడు నియంత్రణపరమైన చర్యలు ఉంటాయ'ని స్పష్టం చేశారు.

జులై- సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2024-25	2023-24	2024-25	2023-24
టాటా కన్జ్యూమర్ (ప్రోడక్ట్స్)	367.21	363.92	4214.45	3733.78
హిందుస్థాన్ జింక్	2327	1729	8522	7014
జీ ఎంటర్‌టైన్‌మెంట్	209.4	123	2034.4	2509.6
ఐసీఐసీఐ లాంబార్డ్1	694	577	5850	5049
ఏథర్ ఇండస్ట్రీస్	34.79	36.67	209.77	157.91
జియోజిత్ ఫైనాన్షియల్	57.42	37.48	218.55	145.51
జియో ఫైనాన్షియల్ సర్వీసెస్	689	668	693.50	----

1) మధ్యంతర డివిడెండ్ రూ.5.50

మోసపూరిత ఆఫర్లకు చెక్



- సరికొత్త విధానాన్ని ఆవిష్కరించిన ఇన్ఫోసిస్
- ఉద్యోగ నియామకాల వివరాలు తెలుసుకోవడానికి కొత్త వెబ్‌సైట్
- ఇతర ఐటీ కంపెనీలు సైతం అనుసరించే అవకాశం

ఈనాడు, హైదరాబాద్: ఐటీ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఆశ చూపి నిరుద్యోగుల నుంచి భారీగా సొమ్ము గుంజుతున్న మోసగాళ్లు కోకొల్లలుగా ఉన్నారు. అగ్రగామి ఐటీ కంపెనీల్లో తాము/తమ వారు ఉన్నత స్థానంలో ఉన్నారని.. 'బ్యాక్‌డోర్'లో తాము ఉద్యోగావకాశం కల్పించగలమని ఉద్యోగార్థులను నమ్మించి, రూ. లక్షల్లో డబ్బులు తీసుకుంటున్నారు. వారి పేర్లతో 'ఫేక్ ఆఫర్ లెటర్లు' తయారు చేసి, చేతిలో పెట్టి చల్లగా జారుకుంటారు. ఆ లెటర్ తీసుకుని సంబంధిత కంపెనీకి వెళ్తే గానీ, తాను మోసపోయిన విషయం అభ్యర్థికి తెలియదు. సొమ్ము పోగొట్టుకుని, ఉద్యోగం లేక.. అటువంటి అభ్యర్థుల బాధలు వర్ణనాతీతం. ఈ పరిణామాల్లో నిరుద్యోగులకు అన్యాయం జరగడమే కాకుండా, ప్రతిష్ఠాత్మక ఐటీ కంపెనీలకూ చెడ్డపేరు వస్తోంది.

ఇదీ చేస్తున్న మార్పు

ఈ మోసాలకు అడ్డుకట్ట వేయడానికి అగ్రశ్రేణి ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్ సరికొత్త విధానాన్ని ఆవిష్కరించింది. దీనివల్ల ఇన్ఫోసిస్ పేరుతో నకిలీ ఆఫర్ లెటర్లు ఇవ్వడం ఇకపై సాధ్యం కాదు. ఎందుకంటే.. తమ సంస్థలో ఉద్యోగాలకు ఎంపిక చేసిన అభ్యర్థులకు, ఆఫర్ లెటర్లు జారీ చేసే విధానాన్నే ఇన్ఫోసిస్ తొలగించింది. దీనికి బదులుగా ఒక 'కెరీర్ వెబ్‌సైట్'ను ఆవిష్కరించింది. 'హెచ్‌టీటీపీఎస్:// కెరీర్.ఇన్ఫోసిస్.కామ్/ఆఫర్‌వ్యాలిడేషన్' అనే ఈ వెబ్‌సైట్లో అభ్యర్థులు తమ ఎంపిక వివరాలు, జాయినింగ్ తేదీ.. వంటి సమాచారాన్ని తెలుసుకోవచ్చు. ఇన్ఫోసిస్ నిర్వహించే నియామక పరీక్షలు, ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులకు 'క్యాండిడేట్ ఐడీ నంబరు' కేటాయిస్తారు. ఈ నంబరుతో పాటు, అభ్యర్థి తన పుట్టిన తేదీ, ఇతర వివరాలను https://career.infosys.com/offerValidation వెబ్‌సైట్లో ఎంటర్ చేస్తే ఆ అభ్యర్థికి సంబంధించిన వివరాలు కనిపిస్తాయి.

ఇకపై ఇ-మెయిల్ రాదు

క్యాంపస్ నియామకాల్లో లేదా 'లేటరల్ హైరింగ్' ప్రక్రియలో ఎంపిక చేసిన అభ్యర్థులకు ఇన్ఫోసిస్ ఆఫర్ లెటర్లను ఇమెయిల్‌లో 'అటాచ్‌మెంట్' రూపంలో జారీ చేస్తూ వచ్చింది. ఈ ఆఫర్ లెటర్ ప్రింట్ తీసుకుని, అందులో నిర్దేశించిన గడువు లోపు, నిర్దేశించిన ఇన్ఫోసిస్ క్యాంపస్‌కు వెళ్లి జాయినింగ్ రిపోర్టు ఇవ్వడం ఇప్పటి వరకూ అమల్లో ఉన్న విధానం. ఇకపై ఇ-మెయిల్‌లో ఆఫర్ లెటర్లు రావు. పైన తెలిపిన వెబ్‌సైట్లో చెక్ చేసుకుని, దాని ప్రకారం ఉద్యోగానికి రిపోర్టు చేస్తే సరిపోతుంది. ఈ కొత్త విధానాన్ని ఇతర కంపెనీలూ పాటిస్తే, ఐటీ ఉద్యోగ నియామకాల్లో చోటుచేసుకుంటున్న మోసాలకు అడ్డుకట్ట పడుతుందని పరిశ్రమ వర్గాలు ఆశిస్తున్నాయి.

బేరమాడే అవకాశం ఉండదు

కొంతమంది అభ్యర్థులు ఒక కంపెనీ నుంచి ఆఫర్ లెటర్ తీసుకుని, అందులోని జీత భత్యాల వివరాలను వేరే కంపెనీకి చూపిస్తున్నారు. ముందు కంపెనీ ఇచ్చిన ఆఫర్ కంటే అధిక జీతభత్యాలతో కూడిన ప్యాకేజీ కోసం డిమాండ్ చేస్తున్నారు కూడా. ఇన్ఫోసిస్ చేపట్టిన నూతన విధానంలో 'ఆఫర్ లెటర్' అనేది ఉండదు కాబట్టి, ఇకపై ఇటువంటి విధానాలకు కూడా అడ్డుకట్ట వేసినట్లు అవుతుంది. ఈ వినూత్న విధానాన్ని సమీప భవిష్యత్తులో ఇతర ఐటీ కంపెనీలు అనుసరించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఐటీ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలకు అడ్డుకట్ట వేసి.. ఉద్యోగార్థులకు మేలు చేయడమే కాకుండా, తమ పేరుప్రతిష్ఠలకు భంగం కలగకుండా చూసుకోవడానికి ఐటీ సంస్థలు ప్రాధాన్యం ఇస్తున్నాయని, ఆ క్రమంలో ఈ తరహా కొత్త విధానాలు అమల్లోకి వస్తున్నాయని పరిశ్రమ నిపుణులు వివరిస్తున్నారు.

విప్రో జీఈ హెల్త్‌కేర్‌తో కిమ్స్ హాస్పిటల్స్ రూ.700 కోట్ల ఒప్పందం



ఈనాడు, హైదరాబాద్: కిమ్స్ హాస్పిటల్స్ (కృష్ణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్), మెడికల్ టెక్నాలజీ సేవల సంస్థ అయిన విప్రో జీఈ హెల్త్‌కేర్‌తో రూ. 700 కోట్ల విలువైన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం విప్రో జీఈ హెల్త్‌కేర్, కిమ్స్‌కు పూర్తి స్థాయి మెడికల్ టెక్నాలజీ భాగస్వామిగా వ్యవహరిస్తుంది. వచ్చే మూడేళ్ల పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న 12 కిమ్స్ హాస్పిటల్స్‌తో పాటు కొత్తగా ఏర్పాటయ్యే 4 కిమ్స్ హాస్పిటల్స్‌కు అవసరమైన వైద్య పరికరాలు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, ఇతర సామగ్రిని విప్రో జీఈ హెల్త్‌కేర్ సరఫరా చేస్తుంది. పెట్ సీటీ, స్పెక్ సీటీ, క్యాథ్ ల్యాబ్స్, ఎంఆర్ఐ మెషీన్లు, సీటీ స్కానర్లు, అల్ట్రాసౌండ్ ఉపకరణాలు, ఇతర క్రిటికల్ కేర్ ఎక్విప్‌మెంట్ ఇందులో ఉంటాయి. నాణ్యమైన వైద్య సేవలకు ఈ ఒప్పందం వీలు కల్పిస్తుందని కిమ్స్ హాస్పిటల్స్ సీఎండీ డాక్టర్ భాస్కరరావు వివరించారు. నాణ్యమైన వైద్యసేవలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకే కిమ్స్ హాస్పిటల్స్‌తో జతకలిసినట్లు విప్రో జీఈ హెల్త్‌కేర్ ఎండీ చైతన్య సరవతే తెలిపారు.

టెలికాం సంస్థల ఆదాయం 2 ఏళ్లలో రూ.5 లక్షల కోట్లకు: డాట్

దిల్లీ: వచ్చే రెండేళ్లలో దేశీయ టెలికాం కంపెనీల వార్షికాదాయాలు రూ.5 లక్షల కోట్లకు చేరొచ్చని టెలికాం విభాగానికి (డాట్) చెందిన డిజిటల్ కమ్యూనికేషన్ కమిషన్ సభ్యుడు మనీశ్ సిన్హా అంచనా వేశారు. గత 2-3 ఏళ్లలో కేంద్రం తీసుకొచ్చిన సులభతర వ్యాపార చర్యల వల్ల, లభిస్తున్న వృద్ధి ధోరణి కొనసాగితే ఇది సాధ్యమేనని అన్నారు. స్పెక్ట్రమ్ కేటాయింపు విషయంలో ప్రస్తుత పద్ధతులను సమీక్షించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. స్పెక్ట్రమ్‌ను ప్రస్తుతం 10/20 ఏళ్లకు కేటాయిస్తుండగా, తక్కువ గడువుకు మంజూరు చేయాలని సూచించారు. స్పెక్ట్రమ్ వినియోగం, సామర్థ్యం, ఆర్థిక విలువల విషయంలో సమస్యలున్నాయన్నారు. టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ నివేదిక ప్రకారం.. 2023-24లో టెలికాం నెట్‌వర్క్ కంపెనీలు రూ.3.36 లక్షల కోట్ల స్థూల ఆదాయాన్ని నమోదు చేశాయి. ఈ ఏడాది ఆదాయం రూ.4 లక్షల కోట్లకు చేరొచ్చని సిన్హా అంచనా వేశారు.

పబ్లిక్ ఇష్యూ దరఖాస్తులకు 3 ఇన్ 1 ఖాతాలను వినియోగించొచ్చు

దిల్లీ: డెట్ సెక్యూరిటీలు, నాన్ కన్వర్టబుల్ రిడీమబుల్ ప్రిఫరెన్స్ షేర్లు, మున్సిపల్ డెట్ సెక్యూరిటీలు, సెక్యూరిటైజ్డ్ డెట్ ఇన్‌స్ట్రుమెంట్లకు చెందిన పబ్లిక్ ఇష్యూలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడానికి 3-ఇన్-1 ఖాతాలను మదుపర్లు వినియోగించుకోవచ్చని మార్కెట్ నియంత్రణాధికార సంస్థ సెబీ స్పష్టం చేసింది. ప్రస్తుత దరఖాస్తు విధానాలకు ఇది అదనమని వివరించింది. ఒక సేవింగ్స్ ఖాతా, ఒక డీమ్యాట్ ఖాతా, ఒక ట్రేడింగ్ ఖాతా ను కలిపి 3 ఇన్ 1 ట్రేడింగ్ ఖాతాగా ఏకీకృతం చేసి తీసుకొస్తున్నారు. ఇందులో క్లయింట్లు తమ బ్యాంక్ ఖాతాలో నిధులు ఉంచుకుని, నగదు నిల్వలపై వడ్డీ పొందొచ్చు. 2025 ఫిబ్రవరి 1 కల్లా స్టాక్ బ్రోకర్లు 3 ఇన్ 1 ఖాతాను లేదంటే. . యూపీఐ బ్లాక్ మెకానిజం ద్వారా సెకండరీ మార్కెట్ (క్యాష్ విభాగం)లో ట్రేడింగ్‌కు వీలు కల్పించాలన్న ప్రతిపాదనకు గత నెలలో సెబీ బోర్డు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. స్టాక్ బ్రోకర్‌కు నిధులను బదిలీ చేయడానికి బదులు.. తమ బ్యాంక్ ఖాతాల్లోనే నిధులు బ్లాక్ చేయడం ద్వారా సెకండరీ మార్కెట్లో ట్రేడింగ్‌కు యూపీఐ బ్లాక్ మెకానిజం వీలు కల్పిస్తుంది.

ఎన్ఎస్‌డీఎల్ @ రూ.500 లక్షల కోట్లు

దిల్లీ: నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్) ఆధీనంలో, డి-మ్యాట్ రూపంలో ఉన్న సెక్యూరిటీల మొత్తం విలువ ఈ ఏడాది సెప్టెంబరు ఆఖరుకు రూ.500 లక్షల కోట్ల (6 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. ఎన్ఎస్‌డీఎల్ వద్ద మొత్తం సెక్యూరిటీల విలువ 2014 జూన్‌లో రూ.100 లక్షల కోట్ల మైలురాయిని తాకింది. ఇందుకు 18 ఏళ్ల సమయం పట్టింది. ఆ తర్వాత 6 ఏళ్లకు అంటే 2020 నవంబరులో సెక్యూరిటీల విలువ రూ.200 లక్షల కోట్లుగా నమోదైంది. తదుపరి 4 ఏళ్లకు ఈ విలువ రూ.500 లక్షల కోట్లకు చేరింది. ఈ సంస్థ త్వరలోనే పబ్లిక్ ఇష్యూకు రానుంది.

తెలుగు రాష్ట్రాల్లోని ఎంఎస్‌ఎంఈలకు మరిన్ని రుణాలు: గోద్రెజ్ క్యాపిటల్


ఈనాడు, హైదరాబాద్: గోద్రెజ్ ఇండస్ట్రీస్ ఆర్థిక సేవల విభాగం గోద్రెజ్ క్యాపిటల్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల (ఎంఎస్‌ఎంఈ)కు రుణ వితరణను పెంచనుంది. తయారీ, ఫార్మా, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, సేవల రంగ సంస్థలపై దృష్టి సారిస్తున్నామని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ మనీశ్ షా తెలిపారు. ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల్లో రూ.500 కోట్ల మేరకు రుణాలను ఇచ్చామని, ఈ ఆర్థిక సంవత్సరం చివరికి ఈ మొత్తం రూ.800 కోట్లకు చేరుకుంటుందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా రూ.13,650 కోట్ల రుణాలిచ్చామని, మార్చికి రూ.17,000 కోట్లకు చేర్చాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలిపారు. రెండు - మూడేళ్లలో తెలుగు రాష్ట్రాల్లో గృహరుణాలు ఇవ్వడం ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం ఇక్కడ 6 కార్యాలయాలుండగా, త్వరలో ద్వితీయ శ్రేణి నగరాలకూ విస్తరిస్తామన్నారు. పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం క్రీమ్‌లైన్ డెయిరీతో కలిసి డెయిరీ ఫారాలకు రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. రూ. 20లక్షల లోపు హామీ లేని రుణాన్ని ఒక రోజులో ఇస్తామని, హామీ ఉంటే కనీసం రూ. 40 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకు రుణాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

కోడి గుడ్లు

19న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	490
వరంగల్	492
విజయవాడ	510
గోదావరి	505
విశాఖపట్నం	505
చిత్తూరు	538

గ్లాండ్ ఫార్మా సీఈఓ శ్యామకాంత్ గిరి



ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న గ్లాండ్ ఫార్మాకు నూతన సీఈఓగా శ్యామకాంత్ గిరిని నియమిస్తూ గ్లాండ్ ఫార్మా డైరెక్టర్ల బోర్డు నిర్ణయం తీసుకుంది. 2025 జనవరి 15న ఆయన పదవీ బాధ్యతలు చేపడతారు. శ్యామకాంత్ గిరి ప్రస్తుతం అమ్నీల్ ఫార్మాస్యూటికల్స్ అనే సంస్థలో అధ్యక్షుడిగా (ఇండియా బిజినెస్, ఎమర్జింగ్ మార్కెట్స్) పనిచేస్తున్నారు. ప్రస్తుతం గ్లాండ్ ఫార్మా ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఉన్న శ్రీనివాస్ సాదు అదే హోదాలో కొనసాగుతూ, కంపెనీ మలిదశ విస్తరణ ప్రణాళికలను అమలు చేస్తారని గ్లాండ్ ఫార్మా వెల్లడించింది.

వడ్డీ రేట్లు 9% మించితే ఇల్లు కొనడం ఆలస్యం కావచ్చు



ఫిక్కీ- అనరాక్ సర్వేలో 90% మంది వెల్లడి

దిల్లీ: గృహ రుణ వడ్డీ రేట్లు 9 శాతాన్ని మించితే, ఇల్లు కొనుగోలు చేయాలనే నిర్ణయం తీసుకోవడం ఆలస్యమవుతుందని ఓ సర్వేలో దాదాపు 90 శాతం మంది అభిప్రాయపడ్డారు. ఫిక్కీ, స్థిరాస్తి కన్సల్టెంట్ సంస్థ అనరాక్ కలిసి 7,615 మంది నుంచి అభిప్రాయాలు సేకరించాయి '8.5 శాతం దిగువనే వడ్డీ రేట్లు ఉంటే.. ఇంటి కొనుగోలు నిర్ణయంపై ఎలాంటి ప్రభావం ఉండదని సర్వేలో 71% మందికి పైగా చెప్పారు. ఒకవేళ వడ్డీరేటు 9 శాతాన్ని మించితే గృహ కొనుగోలు నిర్ణయంపై గణనీయంగా ప్రభావం చూపుతుందని 87% మంది తెలిపారు. వడ్డీ రేట్లు 8.5- 9% మధ్య ఉంటే తమ నిర్ణయంపై ఓ మోస్తరు ప్రభావమే ఉంటుందని 54% మంది చెప్పార'ని ఆ సర్వేలో తేలిందట. 'హోమ్ బయ్యర్ సెంటిమెంట్ సర్వే' పేరుతో ఈ నివేదికను శుక్రవారం ఫిక్కీ, అనరాక్ విడుదల చేశాయి. దీని ప్రకారం..

- ✦ పెట్టుబడులకు స్థిరాస్తులను అత్యంత ప్రాధాన్య మార్గంగా భావిస్తున్నట్లు 59% మంది వెల్లడించారు. తమ స్వీయ వినియోగం కోసమే స్థిరాస్తులను కొనుగోలు చేస్తున్నట్లు సర్వేలో పాల్గొన్న వారిలో 67% మంది తెలిపారు.
- ✦ గృహ కొనుగోలుకు, రూ.45- 90 లక్షల బడ్జెట్‌కు 35% మంది ప్రాధాన్యమిస్తుండగా.. రూ.90 లక్షలు- రూ.1.5 కోట్ల విలువైనవి కొనుగోలు చేయాలని భావిస్తున్నట్లు 28% మంది తెలిపారు.
- ✦ నిర్దిష్ట సమయంలోగా ప్రాజెక్టు పూర్తి చేయాలన్నది 98% మంది గృహ కొనుగోలుదార్ల డిమాండు కాగా.. నిర్మాణ నాణ్యత మెరుగవ్వాలని 93% మంది, గాలి-వెలుతురు ఇంట్లోకి బాగా రావాలని 72% మంది కోరుకుంటున్నారు.

కోటక్ మహీంద్రా బ్యాంక్ చేతికి స్టాండర్డ్ చార్టర్డ్ భారత రుణ వ్యాపారం!

దిల్లీ: మన దేశంలో స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్‌కు చెందిన వ్యక్తిగత రుణ వ్యాపారాన్ని కొనుగోలు చేయనున్నట్లు కోటక్ మహీంద్రా బ్యాంక్ ప్రకటించింది. మన దేశంలో వెల్త్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ వ్యాపారంపై దృష్టి కేంద్రీకరించాలని బ్రిటన్‌కు చెందిన స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్ భావిస్తుండడం ఇందుకు నేపథ్యం. సెప్టెంబరు 30 నాటికి స్టాండర్డ్ చార్టర్డ్ జారీచేసిన వ్యక్తిగత రుణాల విలువ రూ.4100 కోట్లు (488 మి. డాలర్లు)గా ఉందని కోటక్ మహీంద్రా బ్యాంక్ పేర్కొంది. భారత వ్యక్తిగత రుణ మార్కెట్‌లో పోటీ తీవ్రతరమైంది. వినియోగదారుల నుంచి ఈ రుణాలకు గిరాకీ అధికంగా ఉంటోంది. మంజూరు చేసిన వ్యక్తిగత రుణాల కోసం, బ్యాంకులు అధిక మూలధనం పక్కన పెట్టడం అధిక నష్టభయానికి దారి తీయగలదని ఆర్‌బీఐ గత నవంబరులో హెచ్చరించింది. దీంతో స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్, తమ మొత్తం రుణాల్లో వ్యక్తిగత రుణాల వాటా గతేడాదిలో 18.3% కాగా, ఈ ఏడాది ఆగస్టుకల్లా 17 శాతానికి పరిమితం చేసుకుంది. ఈ వ్యాపార విభాగాన్ని స్వాధీనం చేసుకునే లావాదేవీ మూడు నెలల్లోగా పూర్తి కావొచ్చని కోటక్ పేర్కొంది.

రాణించిన బ్యాంకింగ్, లోహ షేర్లు

సెన్సెక్స్ ▲ 218 **81225** | నిఫ్టీ ▲ 104 **24854**

3 రోజుల తర్వాత లాభాల్లోకి సూచీలు

ఎఫ్ఐఐల అమ్మకాలు: రూ.5,486 కోట్లు

డీఐఐల కొనుగోళ్లు: రూ.5,214 కోట్లు

సమీక్ష



సూచీల మూడు రోజుల వరస నష్టాలకు అడ్డుకట్ట పడింది. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో సెన్సెక్స్, నిఫ్టీ లాభాల్లో ముగిశాయి. తక్కువ స్థాయుల వద్ద బ్యాంకింగ్, లోహ రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడం కలిసొచ్చింది. దేశీయ సంస్థాగత మదుపర్ల కొనుగోళ్లు అండగా నిలిచాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 1 పైసా తగ్గి 84.07 వద్ద స్థిరపడింది. బ్రెంట్ ముడి చమురు ధర 0.39% తగ్గి 74.16 డాలర్ల వద్ద కదలాడుతోంది.

నష్టాలతో మొదలై...: ఉదయం సెన్సెక్స్ 258 పాయింట్ల నష్టంతో (క్రితం రోజు ముగింపు 81,007 పాయింట్లు) 80,749.26 వద్ద ఆరంభమైంది. ఆ తర్వాత కొనుగోళ్ల మద్దతుతో లాభాల్లోకి వచ్చిన సూచీ 81,391.15 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. చివరకు 218.14 పాయింట్ల లాభంతో 81,224.75 వద్ద ముగిసింది. నిఫ్టీ 104.20 పాయింట్లు పెరిగి 24,854.05 వద్ద స్థిరపడింది.

19 కంపెనీల షేర్లు రాణించాయ్: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 11 నష్టపోగా.. 19 షేర్లు లాభపడ్డాయి. ఇన్ఫోసిస్ 4.6%, ఏషియన్ పెయింట్స్ 2.20%, నెస్లే ఇండియా 1.27%, హిందుస్థాన్ యునిలీవర్ 0.78%, టెక్ మహీంద్రా 0.68%, టైటన్ 0.6%, హెచ్‌సీఎల్ టెక్ 0.54%, ఐటీసీ 0.44% షేర్లు డీలాపడిన వాటిల్లో ఉన్నాయి. యాక్సిస్ బ్యాంక్ 5.57%, ఐసీఐసీఐ బ్యాంక్ 2.49%, టాటా మోటార్స్ 2.06%, టాటా స్టీల్ 1.94%, ఎన్‌టీపీసీ 1.75%, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 1.24% లాభపడ్డాయి.

✦ దేశీయంగా ఉత్పత్తి చేసిన గ్యాస్ సరఫరాలో ప్రభుత్వం కోత విధించడంతో ఇంద్రప్రస్థ గ్యాస్, మహానగర్ గ్యాస్ షేర్లు డీలాపడ్డాయి. బీఎస్ఈలో **ఇంద్రప్రస్థ గ్యాస్** 10.40% నష్టపోయి రూ.451.95 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 12.88% కుదేలైంది. **మహానగర్ గ్యాస్** షేరు 10.09% క్షీణించి రూ.1,582.95 వద్ద ముగిసింది. ఒకానొక దశలో ఈ షేరు 14.58% నష్టపోయింది.

సెప్టెంబరు త్రైమాసిక ఫలితాల ప్రభావంతో

- ✦ అంచనాలకు మించి రాణించిన విప్రో షేరు బీఎస్ఈలో 3.76% పెరిగి రూ.548.70 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ షేరు 5.52% రాణించింది.
- ✦ అంచనాలను అందుకోని **ఇన్ఫోసిస్** షేర్లు బీఎస్ఈలో 4.6% నష్టపోయి రూ.1,878.85 వద్ద ముగిశాయి.
- ✦ లాభం పెరిగిన **యాక్సిస్ బ్యాంక్** షేరు బీఎస్ఈలో 5.57 శాతం లాభపడి రూ.1,195.25 వద్ద ముగిసింది.

జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ ఎండీగా పునీత్ గోయెంకా

సెప్టెంబరు త్రైమాసికంలో సంస్థ నికర లాభం 70% పెరగడంతో జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ షేరు బీఎస్ఈలో 5.29% పెరిగి రూ.132.40 వద్ద ముగిసింది. అయిదేళ్ల కాలానికి సంస్థ మేనేజింగ్ డైరెక్టరు, ముఖ్య కార్య నిర్వహణ అధికారిగా పునీత్ గోయెంకా పునర్నియమితులయ్యారు. ఈ పునర్నియామకం 2025 జనవరి 1 నుంచి అమల్లోకి రానుంది.

విదేశీ మారకపు నిల్వలు తగ్గాయ్

మన విదేశీ మారకపు నిల్వలు వరుసగా రెండో వారమూ తగ్గాయి. అక్టోబరు 11తో ముగిసిన వారంలో 10.746 బిలియన్ డాలర్లు తగ్గి 690.43 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వెల్లడించింది. అంతకుముందు వారంలోనూ విదేశీ మారకపు నిల్వలు 3.709 బిలియన్ డాలర్లు తగ్గి 701.176 బిలియన్ డాలర్లుగా నమోదైన సంగతి తెలిసిందే. అక్టోబరు 11తో ముగిసిన వారంలో విదేశీ మారకపు నిల్వల్లో కీలకమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 10.542 బిలియన్ డాలర్లు తగ్గి 602.101 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. పసిడి నిల్వలు 98 మిలియన్ డాలర్లు తగ్గి 65.658 బిలియన్ డాలర్లకు; ప్రత్యేక ఉపసంహరణ హక్కులు (ఎస్‌డీఆర్) 86 మిలియన్ డాలర్లు తగ్గి 18.339 బిలియన్ డాలర్లకు దిగివచ్చాయి. ఐఎంఎఫ్ వద్ద భారత నిల్వల స్థితి 20 మిలియన్ డాలర్లు తగ్గి 4.333 బిలియన్ డాలర్లుగా నమోదైందని ఆర్‌బీఐ వెల్లడించింది.

✦ ఇథనాల్, బయో రసాయనాల తయారీ సంస్థ **గోదావరి బయోరిఫైనరీస్** రూ.555 కోట్ల తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ఈనెల 23న ప్రారంభమై 25న ముగియనుంది. ఐపీఓలో విక్రయించే షేర్లకు ధరల శ్రేణిగా రూ.334- 352ను నిర్ణయించారు.

✦ జులై- సెప్టెంబరు త్రైమాసికంలో **చైనా ఆర్థిక వ్యవస్థ** వృద్ధి రేటు 4.6 శాతంగా నమోదైంది. ఆ దేశ ప్రభుత్వం అంచనా వేసిన 5% వృద్ధి రేటుతో పోలిస్తే ఇది తక్కువే.

✦ కుంగుబాటు (డిప్రెషన్)ను అదుపు చేసేందుకు వినియోగించే బుప్రోపియన్ హైడ్రోక్లోరైడ్ ఇఆర్ ఔషధాన్ని (100ఎంజీ, 150ఎంజీ, 200ఎంజీ డోసుల్లో) అమెరికాలో విక్రయించడానికి గ్రాన్యూల్స్ ఇండియా అనుమతి సంపాదించింది.

నేటి బోర్డు సమావేశాలు: **హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, టెక్ మహీంద్రా, ఆర్‌బీఎల్ బ్యాంక్, డాల్మియా భారత్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, యూకో బ్యాంక్, గుజరాత్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, పీసీ జువెలర్, రొసారి బయోటెక్**

ఈనాడు సినిమా

పండగకి వస్తున్నాం అంటూ అందరి కంటే ముందుగానే ఆయా తేదీలపై నిర్మాతలు రుమాళ్లు వేసి మరొకరు పోటీకి రాకుండా జాగ్రత్త పడతారు. కొన్ని చిత్రాలు ఏళ్లకు ముందే విడుదల ఖరారు చేసుకుంటుంటాయి. తీరా సమయం దగ్గర పడుతుంటే మెల్లగా వెనక్కి జరుగుతూ వాయిదాలు ప్రకటిస్తారు. మరో పక్క అప్పటిదాకా రేసు లోనే లేని సినిమాలు బాక్సాఫీస్ ముందుకొచ్చేందుకు పోటీ పడుతుంటాయి. సంక్రాంతి సినిమాల విడుదల విషయంలో ఏటా జరిగేది ఇదే. ఈ సారి అదే తంతు.

సంక్రాంతి గేమ్ ఛేంజ్


● పండగ సినిమాల విడుదల తారుమారు ● ఖరారుకు మరింత సమయం


చిరంజీవి


బాలకృష్ణ


రామ్‌చరణ్


వెంకటేశ్


నాగచైతన్య

సంక్రాంతి - సినిమా... బ్లాక్‌బస్టర్ కాంబినేషన్ ఇది. ఈ సీజన్‌లో హిట్ సినిమా సూపర్ హిట్ అయ్యేందుకు ఆస్కారం ఉంటుంది. యావరేజ్ సినిమాలు కూడా హిట్ స్థాయి వసూళ్లు సొంతం చేసుకుంటుంటాయి. పండగ పూట వచ్చే ప్రతి సినిమాపైనా ప్రేక్షకుడు ఓ కన్నేస్తుంటాడు. అందుకే ఆ సీజన్‌కి అంత డిమాండ్. పోటాపోటీగా సంక్రాంతి కోసం సినిమాలు సిద్ధమవుతాయంటే కారణం అదే. అయితే ఈ రేసు సాగే విధానమే గమ్మత్తుగా ఉంటుంది. ఏడాది ముందు సంక్రాంతి కోసం విడుదల ఖరారైన సినిమాలు కొన్నయితే, ఆర్నెళ్ల తర్వాత అవేవీ కాకుండా కొత్త సినిమాలు రేసులోకొస్తాయి. ఇక సంక్రాంతి సినిమాలు ఇవే అని అనుకునేలోపే ఆ సినిమాలు రకరకాల కారణాలతో వాయిదాని ప్రకటిస్తుంటాయి. అలా చివరి మూడు నాలుగు నెలల్లోనే సంక్రాంతి విడుదలల ముఖచిత్రం సమూలంగా మారిపోతుంది. అప్పటిదాకా రేసులో లేని, అసలెవ్వరూ ఊహించని సినిమాలు అనూహ్యంగా తెరపైకొస్తుంటాయి. 2025 సంక్రాంతికి సరిగ్గా మూడు నెలల సమయం కూడా లేదు. ఇప్పటికీ విడుదల విషయంలో మార్పులు చేర్పులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇంకో నెల తర్వాత కానీ స్పష్టత వచ్చే అవకాశం కనిపించడం లేదు.


అన్నీ కొత్త కొత్తగా

ఈ ఏడాది ప్రథమార్ధంలో 2025 సంక్రాంతికి వస్తాయనుకున్న సినిమాలు వేరు. ఇప్పుడు ఖరారైన సినిమాలు వేరు. చిరంజీవి 'విశ్వంభర', రవితేజ 75వ చిత్రం, కుదిరితే ప్రభాస్ 'రాజాసాబ్', దిల్‌రాజు నిర్మాణంలో 'శతమానం భవతి 2', వెంకటేశ్ - అనిల్ రావిపూడి 'సంక్రాంతికి వస్తున్నాం'... ఇలా కొన్ని సినిమాల పేర్లు ప్రముఖంగా వినిపించాయి. కొన్నేళ్లుగా నాగార్జున క్రమం తప్పకుండా సంక్రాంతికి సందడి చేస్తుండడంతో, ఆయన్నుంచీ ఓ సినిమా రావొచ్చనుకున్నారు. కానీ వీటిలో ఇప్పుడు 'సంక్రాంతికి వస్తున్నాం' మినహా మరేదీ రేసులో లేదు. రామ్‌చరణ్ కథానాయకుడిగా నటించిన 'గేమ్ ఛేంజర్' డిసెంబరు నుంచి సంక్రాంతికి మారడంతో ముగ్గుల పండగ బరి మొత్తం మారిపోయింది. 'విశ్వంభర' స్థానంలో 'గేమ్ ఛేంజర్', బాలకృష్ణ - బాబీ కలయికలోని సినిమా సంక్రాంతి రేసులోకి వచ్చి అధికారికంగా విడుదల ఖరారు చేయడంతో బరిలోకి కొత్త ఉజ్జీలు చేరినట్లైంది. గత రెండు రోజులుగా 'సంక్రాంతికి వస్తున్నాం' స్థానంలోనూ నాగచైతన్య 'తండేల్' విడుదల కావొచ్చనే ప్రచారం సాగుతోంది. కానీ చిత్రబృందాలు మాత్రం విడుదల తేదీల విషయంలో ఇప్పటికీ గుంభనంగా వ్యవహరిస్తున్నాయి. అదే జరిగితే సంక్రాంతి సినిమాలన్నీ మారిపోయినట్టే.

డిసెం'బరి' కూడా...

పేరుకి తగ్గట్టే వాయిదాతో ఆట మొత్తాన్ని మార్చేసింది రామ్‌చరణ్ 'గేమ్ ఛేంజర్'. క్రిస్మస్ సందర్భంగా వస్తుందనుకున్న ఆ సినిమా సంక్రాంతికి మారడంతో... డిసెంబరు విడుదలల్లోనూ సమూల మార్పులు చోటు చేసుకున్నాయి. పలు చిన్న సినిమాలు 'గేమ్ ఛేంజర్' తేదీని లక్ష్యంగా చేసుకుని విడుదల ఖరారు చేసుకుంటున్నాయి. డిసెంబరు 20న ప్రియదర్శి - ఇంద్రగంటి మోహనకృష్ణ కలయికలోని 'సారంగపాణి జాతకం', 21న గౌతమ్ తిన్ననూరి 'మ్యాజిక్' చిత్రాలు విడుదల ఖరారు చేసుకున్నాయి. నితిన్ - వెంకీ కుడుముల కలయికలోని 'రాబిన్‌హుడ్' చిత్రాన్నీ డిసెంబరు 20న విడుదల చేసే ప్రయత్నాల్లో ఉంది చిత్రబృందం. మంచు విష్ణు ప్రధాన పాత్రధారిగా తెరకెక్కిన 'కన్నప్ప' కూడా విడుదలకు ముస్తాబవుతోంది. అలాగే అనువాద చిత్రాలు వెట్రిమారన్ 'విడుదల పార్ట్ 2', ఉపేంద్ర 'యుఐ' 20న, 'పతంగ్' 27న వస్తున్నాయంటే కారణం 'గేమ్ ఛేంజర్' సంక్రాంతికి మారిపోవడమే. సినిమాల నిర్మాణానంతర పనులు సాగే విధానం, ఓటీటీ వ్యాపారం కొలిక్కి రాకపోవడంతోనే విడుదల తేదీల్లో ఎక్కువగా మార్పులు చోటు చేసుకుంటున్నాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. కారణాలేవైనా ప్రేక్షకులు మాత్రం అభిమాన తారల సినిమాల కోసం ఎదురు చూస్తూ, తరచూ మారుతున్న తేదీలతో గందరగోళానికి గురవుతున్నారు.

కేరళలో ముగించారు



విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోంది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ముగింపు దశలో ఉన్న ఈ సినిమా చిత్రీకరణ కేరళలో జరుగుతున్న సంగతి తెలిసిందే. దాదాపు నెల రోజుల పాటు సాగిన ఈ షెడ్యూల్ ఇప్పుడు పూర్తయింది. ఈ షెడ్యూల్‌లో భాగంగా కొన్ని భారీ యాక్షన్ సీక్వెన్స్‌లతో పాటు కీలక సన్నివేశాలు చిత్రీకరించినట్లు తెలిసింది. దీనితో దాదాపు 90శాతానికి పైగా చిత్రీకరణ పూర్తయినట్లు తెలుస్తోంది. తదుపరి షెడ్యూల్ హైదరాబాద్, వైజాగ్‌లలో ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. దీన్ని వచ్చే నెలలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమాలో విజయ్ శక్తిమంతమైన పోలీసు పాత్రలో కనువిందు చేయనున్నారు. దీనికి అనిరుధ్ స్వరాలందిస్తున్నారు. ఇది వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.

మరో కొత్త కథలో?


సిద్ధు జొన్నలగడ్డ

'డీజే టిల్లు', 'టిల్లు స్క్వేర్' విజయాలతో సిద్ధు జొన్నలగడ్డ క్రేజ్ బాగా పెరిగింది. దీంతో ఆయనతో సినిమా చేసేందుకు కథలు సిద్ధం చేసుకుంటున్న దర్శకుల జాబితా రెట్టింపయ్యింది. సిద్ధు ప్రస్తుతం 'జాక్', 'తెలుసు కదా' చిత్రాలతో సెట్స్‌పై గడుపుతున్న సంగతి తెలిసిందే. ఇవి కాక 'కోహినూర్', 'టిల్లు క్యూబ్' సినిమాల్ని కూడా పూర్తి చేయాల్సి ఉంది. అయితే ఇప్పుడాయన వద్దకు మరో కొత్త ప్రాజెక్ట్ వచ్చినట్లు తెలుస్తోంది. 'గీత గోవిందం', 'సర్కారు వారి పాట' చిత్రాలతో సత్తా చాటారు దర్శకుడు పరశురామ్. ఇప్పుడాయన సిద్ధుతో సినిమా చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ చిత్ర విషయమై చర్చలు జరిగినట్లు తెలిసింది. అన్నీ అనుకున్నట్లు జరిగితే దిల్‌రాజు బ్యానర్‌లో ఇది పట్టాలెక్కే అవకాశమున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరికొద్ది రోజుల్లో దీనిపై స్పష్టత రానున్నట్లు తెలుస్తోంది.


కియారా, సిద్ధార్థ్

పెళ్లయ్యాకా మళ్లీ జంటగా?

వివాహ జీవితంలోకి అడుగుపెట్టిన తర్వాత తొలిసారి కలిసి నటించబోతున్నారట బాలీవుడ్ జంట సిద్ధార్థ్ మల్హోత్రా, కియారా అడ్వాణీ. 'షేర్షా' సినిమాతో ఈ జంట సినీ ప్రియులను ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. తాజాగా వీరిద్దరు మరో ప్రేమకథా చిత్రంలో నటించనున్నట్లు సమాచారం. ఇందుకోసం మడాక్ ఫిల్మ్స్‌తో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. రొమాంటిక్ డ్రామా, ఫాంటసీ నేపథ్యంలో ఈ చిత్రం రూపొందనున్నట్లు, దీనికి సంబంధించిన స్క్రిప్ట్ పనులు పూర్తవుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 'గేమ్ ఛేంజర్', 'టాక్సిక్', 'వార్ 2' చిత్రాలతో బిజీగా ఉంది కియారా.

'పొట్టేల్'.. నిజమైన పాన్ ఇండియా సినిమా


నిశాంక్, యువ చంద్ర, అనన్య, సంయుక్త, సురేశ్, సాహిత్

అనన్య నాగళ్ల, యువ చంద్ర కృష్ణ ప్రధాన పాత్రల్లో సాహిత్ మోత్కూరి తెరకెక్కించిన చిత్రం 'పొట్టేల్'. సురేశ్ కుమార్ సడిగే నిర్మించారు. అజయ్, ప్రియాంక శర్మ, తనస్వి చౌదరి తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్ర ట్రైలర్‌ను నటి సంయుక్తా మేనన్ శుక్రవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. "ట్రైలర్ బాగుంది. దీంట్లోని తొలి షాట్ చూసినప్పుడు ఇదొక నిజమైన పాన్ ఇండియా సినిమాలా అనిపించింది. దర్శకుడు సాహిత్ ఈ కథపై నాలుగేళ్లు పని చేశారు. ఇది మామూలు విషయం కాదు. ఈ చిత్రంతో చాలా మంది కొత్తవాళ్లు తెరకు పరిచయమవుతుండటం ఆనందంగా ఉంది. యువ, అనన్యతో పాటు చిత్ర బృందానికి ఈ సినిమాతో మంచి పేరు రావాలి" అన్నారు. "ట్రైలర్‌లో చూసింది ఒక శాతమే. సినిమాలో ఇంకా చాలా కోణాలున్నాయి" అంది నటి అనన్య. హీరో యువ చంద్ర మాట్లాడుతూ.. "మేమంతా చాలా ప్రేమించి ఈ సినిమా చేశాం. ఒక నిజాయతీతో నిండిన ప్రయత్నాన్ని తెరపై చూడనున్నారు" అన్నారు. ఈ కార్యక్రమంలో సాహిత్, అజయ్, నోయెల్, నిశాంక్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.


'గ్లాడియేటర్ 2'

నన్ను పావుగా వాడితే.. చావే ముగింపు

హాలీవుడ్ నుంచి వచ్చిన విజయవంతమైన పీరియాడిక్ యాక్షన్ డ్రామాల్లో 'గ్లాడియేటర్'కు ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన క్రేజ్ ఉంది. ఇప్పుడీ చిత్రానికి కొనసాగింపుగా 'గ్లాడియేటర్-2' సిద్ధమైంది. పాల్ మెస్కల్, పెడ్రో పాస్కల్, డెంజెల్ వాషింగ్టన్, కొన్నీ నీల్సన్, జోసెఫ్ క్విన్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా ఇంగ్లిష్, హిందీ, తెలుగు, తమిళ భాషల్లో నవంబరు 15న రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల ఈ చిత్ర తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు. "నియంతల నుంచి రోమ్‌ను విడిపించడం కోసమే ఈ సమరం" అంటూ ట్రైలర్‌లో మాక్సిమస్ వారసుడిగా లూసియస్ పాత్రలో పాల్ మెస్కల్ చెప్పిన డైలాగ్ ఈ చిత్ర కథాంశమేంటన్నది తెలియజేస్తోంది. ప్రచార చిత్రంలో చూపించిన గ్లాడియేటర్ కొత్త ప్రపంచం.. అందులోని యుద్ధాలు, మాక్సిమస్ వారసుడిగా పాల్ మెస్కల్ చేసిన వీరోచిత విన్యాసాలు సినిమాపై అంచనాలు పెంచేలా ఉన్నాయి. "నన్ను పావుగా వాడితే చావే ముగింపు. అది ఈ జన్మైనా.. ఏ జన్మైనా" అంటూ ట్రైలర్‌లో వినిపించిన సంభాషణ ఆకర్షణగా నిలిచింది.

గత చిత్రాలకు మూడు రెట్లు వినోదం


విద్యాబాలన్

ఈ దీపావళికి 'భూల్ భులయ్యా 3'తో థియేటర్లలో సందడి చేయనున్నారు కార్తిక్ ఆర్యన్. ఆయన హీరోగా నటించిన ఈ చిత్రాన్ని అనీజ్ బాజ్మీ తెరకెక్కించారు. భూషణ్ కుమార్, క్రిష్ణన్ కుమార్, మురాద్ ఖేతాని సంయుక్తంగా నిర్మించారు. విద్యాబాలన్, మాధురి దీక్షిత్, త్రిప్తి దిమ్రీ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ సినిమా నవంబరు 1న విడుదల కానున్న నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్తిక్ ఆర్యన్ మాట్లాడుతూ.."ఈ చిత్ర కథ చాలా కొత్తగా.. గత రెండు సినిమాలకు పూర్తి భిన్నంగా ఉంటుంది. దీంట్లో నా పాత్ర ఎలా ఉంటుంది? ఈసారి ఏం చేయనుంది? తెలియాలంటే సినిమా చూడాల్సిందే" అన్నారు. "ఈ చిత్రంలోని హారర్, కామెడీ, థ్రిల్.. ప్రతీది గత చిత్రాలకు మూడు రెట్లు ఎక్కువగా ఉంటుంది. దీన్ని థియేటర్లో కుటుంబ సమేతంగా చూస్తే మరింత మజాగా ఉంటుంద"న్నారు నటి విద్యాబాలన్.

తెల్లారుపొద్దుల్లో గోదారి


శేఖర్ మాస్టర్

సదన్, ప్రియాంక ప్రసాద్ జంటగా పి.ఎల్. విఘ్నేశ్ తెరకెక్కించిన చిత్రం 'ప్రణయగోదారి'. పారమళ్ల లింగయ్య నిర్మించారు. సాయికుమార్ కీలక పాత్ర పోషించారు. నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే ఇందులోని "తెల్లారుపొద్దుల్లో" అనే గీతాన్ని నృత్య దర్శకుడు శేఖర్ మాస్టర్ ఇటీవల విడుదల చేశారు. ఈ పాటకు మార్కండేయ స్వరాలు సమకూర్చడంతో పాటు స్వయంగా సాహిత్యమందించారు. ధనుంజయ్, అదితి భావరాజు ఆలపించారు. మోహన్ నృత్యరీతులు అందించారు. "ఆహ్లాదభరితమైన ప్రేమకథతో రూపొందిన చిత్రమిది. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి.

ఆ తల్లి త్యాగమూర్తి


సాత్విక్, రచిత మహాలక్ష్మి

రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రల్లో వి.శ్రీనివాస్ తెరకెక్కించిన చిత్రం 'తల్లి మనసు'. ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ముత్యాల అనంత కిశోర్ నిర్మించారు. శుభలేఖ సుధాకర్, రఘుబాబు తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఇప్పటికే చిత్రీకరణ ముగించుకున్న ఈ సినిమా ఇప్పుడు డబ్బింగ్ పనులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా దర్శకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. "తల్లి త్యాగమూర్తి. ఆమెకు ఎవరూ సాటిరారు. అలాంటి ఓ తల్లి జీవితంలో చోటు చేసుకున్న సంఘర్షణ ఏంటి.. ఆమె మనసు ఎలాంటి భావోద్వేగాలకు గురైంది? అన్నది ఈ చిత్ర కథాంశం. ఇది ఆద్యంతం ప్రేక్షకుల్ని అలరించేలా ఉంటుంది" అన్నారు.

సామ్రాజ్యాలను నాశనం చేసే శక్తి


టబు

'మా ప్రపంచం నుంచి సోదరీమణులకు సంబంధించిన ప్రతీ గుర్తును చెరిపేయాలనుకుంటున్నాం. దాని కోసం ఓ గొప్ప శక్తిని నాకు బహుమతిగా ఇచ్చారు' అంటూ తన రాబోయే హాలీవుడ్ వెబ్ సిరీస్ 'డ్యూన్:ప్రాఫెసీ' ప్రపంచాన్ని పరిచయం చేసింది బాలీవుడ్ నటి టబు. ఇందులో సిస్టర్ ఫ్రాన్సెస్కా అనే ఓ శక్తిమంతమైన పాత్రలో కనిపించనుందామె. డయాన్ అడెముజాన్, అలిసన్ షాప్‌కర్ దీన్ని రూపొందిస్తున్నారు. తాజాగా ఈ సిరీస్ విడుదల తేదీని తెలుపుతూ.. ట్రైలర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది టబు. 'ఆశక్తి సామ్రాజ్యాలను నాశనం చేయగలదు' లాంటి సంభాషణలతో సాగుతున్న ఈ ట్రైలర్ ఆద్యంతం ఆసక్తిగా సాగుతోంది. 'సిస్టర్ హుడ్ ఆఫ్ డ్యూన్' అనే నవల ఆధారంగా తీర్చిదిద్దిన ఈ సిరీస్‌లో..మనిషి మనుగడకు ముప్పు తెచ్చే శక్తులతో హర్కొనెస్ సిస్టర్స్ ఎలా పోరాడారనేది చూపించనున్నారు. ఎమిలీ వాట్సన్, ఒలివియా విలియమ్స్, ట్రావిస్ ఫిమ్మెల్ తదితరులు ఈ సిరీస్‌లో నటిస్తున్నారు. వచ్చే నెల 18న విడుదల కానుందీ సిరీస్.

చెప్పని కథ.. వినని నిజం


అనన్య పాండే

'కాల్ మీ బె', 'కంట్రోల్' లాంటి భిన్నమైన కథలతో ఇటీవల ప్రేక్షకులను పలకరించింది బాలీవుడ్ యువకథానాయిక అనన్యపాండే. ఆమె అగ్ర కథానాయకుడు అక్షయ్ కుమార్‌తో ఓ కోర్టు రూమ్ డ్రామా కోసం జోడీ కట్టిన సంగతి తెలిసిందే. దీన్ని కరణ్ సింగ్ త్యాగి తెరకెక్కిస్తున్నారు. ఆర్. మాధవన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇంకా పేరు పెట్టని ఈ చిత్రాన్ని ప్రముఖ న్యాయవాది సి.శంకరన్ జీవితంలోని కొన్ని సంఘటనల ఆధారంగా తీర్చిదిద్దుతున్నారు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని సామాజిక మాధ్యమాల వేదికగా అధికారికంగా ప్రకటించింది చిత్ర బృందం. 'ఇప్పటి వరకూ చెప్పని కథ.. ఎవరూ వినని నిజం.. వచ్చే ఏడాది మార్చి 14న తెలుసుకోవడానికి సిద్ధంగా ఉండండి' అని వ్యాఖ్యల్ని జోడించింది. రఘు పాలట్, పుష్ప పాలట్ రచించిన 'ది కేస్ దట్ షుక్ ది ఎంపైర్' అనే పుస్తకం ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని కరణ్ జోహార్, అపూర్వ మెహతా, ఆనంద్ తివారీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

కరెంట్ అఫైర్స్

■ మహిళలపై పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టడమే లక్ష్యంగా ఇటీవల ఏ సంస్థ న్యూదిల్లీలో డిజిటల్ శక్తి కేంద్రాన్ని ప్రారంభించింది? (ఈ సంస్థ 2018 నుంచి 'డిజిటల్ శక్తి' ప్రచారం ద్వారా మహిళలపై పెరుగుతున్న సైబర్ నేరాలను ఎదుర్కోవడానికి కృషి చేస్తోంది.)
జ: జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ)



■ గతి శక్తి విశ్వవిద్యాలయం (జీఎస్‌వీ) విమాన

మాదిరి ప్రశ్నలు

యాన రంగానికి సంబంధించి తన మొదటి ఎగ్జిక్యూటివ్ శిక్షణ కార్యక్రమాన్ని 2024, ఆగస్టు 5 నుంచి 7 వరకు ఏ నగరంలోని ఆసియాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాన్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ (ఏఐటీడీ)లో నిర్వహించింది?
జ: న్యూదిల్లీ

■ ప్రపంచ బ్యాంకు సహకారంతో భారత ప్రభుత్వం ఏ నాలుగు రాష్ట్రాల్లో హరిత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి 781 కిలోమీటర్ల మేర పర్యావరణ అనుకూల రహదారులను నిర్మించాలని నిర్ణయించింది? జ: హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్

■ భారతదేశ పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 2014–2024 దశాబ్దంలో ఎంత శాతం మేర పెరిగినట్లు కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ఇటీవల వెల్లడించారు?
జ: 165 శాతం

మరింత సమాచారం

ప్రిపరేషన్ టెక్నిక్

ఒక చిన్న నోట్ పుస్తకంలో సబ్జెక్టుకు సంబంధించిన ముఖ్యమైన సూత్రాలు, తేదీలు, నిర్వచనాలతోపాటు సంక్షిప్త సమాచారాలను రాసి పెట్టుకోవాలి. వాటిని వీలైనంత వరకు రోజూ చదువుకోవాలి.

డీఎస్సీ - 2024
సైకాలజీ

TENTH Q&A

Physical Science

Explained by Magnetic Quantum

2 Marks

Structure of Atom



1) Which colour is exhibited by Cupric chloride on flame test.
A: Green Colour.

2) Which Coloured light is produced by Sodium vapours in street light.
A: Yellow Colour.

3) Which Quantum number can explain the Space orientation of the orbital.
A: Space Orientation of the orbital is explained by magnetic Quantum number.

4) When n = 3, What are the l – Values.
A: n = 3, l = 0, 1, 2

5) If l = 3, what are the M_l – Values.
A: l = 3, m_l = –3, –2, –1, 0, +1, +2, +3

6) Which rule is violated in the electronic configuration $1s^0 2s^2$
A: Aufbau Principle.


Some More Imp Questions

1) What is the use of line spectra? (2 M)
2) Explain how does the Quantum numbers be useful to understand atomic structure. (6 M)
3) Explain the principles used to explain the electronic configuration with one example each. (6 M)

For Answers

4 Marks

7) Draw the figure showing the increasing values of (n + l).
A:



8) What are four Quantum numbers for the differentiating electron of Aluminium.
A: $Al(z = 13) – 1s^2 2s^2 2p^6 3s^2 3p^1$

n	l	m_l	m_s
3	1	–1	$+\frac{1}{2}$

Writer: K. Gagan Kumar

Subscribe Channel

సారూప్యత తెలిస్తే సమాధానం!

ఏదైనా వస్తువును కొనడానికి ఒక షాపులోకి వెళ్లినప్పుడు రకరకాల బ్రాండ్‌లు చూసి నచ్చినదాన్ని ఎంచుకుంటారు. సమస్య ఎదురైనప్పుడు అందుబాటులో ఉన్న పలు పరిష్కార మార్గాల్లో సమర్థమైన దాన్ని అనుసరిస్తారు. వివిధ అంశాలను అధ్యయనం చేసేటప్పుడు వాటి మధ్య సంబంధాలను గ్రహించి భావనలను గుర్తుంచుకుంటారు. పరిశీలిస్తే వీటన్నింటిలోనూ పోల్చి చూడటం అనేది కామన్‌గా కనిపిస్తుంది. ఆ విధంగా సారూప్యతలను గుర్తించగలిగే సామర్థ్యాన్ని అభ్యర్థుల్లో పరీక్షించడానికి రీజనింగ్‌లో భాగంగా 'పోలిక పరీక్ష'పై ప్రశ్నలు అడుగుతారు. నిత్యజీవితంలో జరిగే సంఘటనలు, పరిసరాల్లో వస్తువులు తదితరాల మధ్య పోలికలను గమనిస్తూ, వీలైనన్ని ఎక్కువ ప్రశ్నలు ప్రాక్టీస్ చేస్తే తేలిగ్గా సమాధానాలు కనుక్కోవచ్చు. మంచి మార్కులు సంపాదించుకోవచ్చు.



జనరల్ స్టడీస్ రీజనింగ్

పోలిక పరీక్ష

పోలిక అంటే సాదృశ్యం లేదా సారూప్యత అని అర్థం. ప్రశ్నలో భాగంగా రెండు జతల పదాలు/ఆంగ్ల అక్షరాలు/సంఖ్యలు ఇస్తారు. ఒక జతలోని అంశాల మధ్య సంబంధాన్ని గుర్తించి, అదే సంబంధాన్ని మరొక జతకు అనువర్తింపజేసి, లోపించిన అంశాన్ని ఇచ్చిన ఐచ్ఛికాల నుంచి ఎన్నుకోవాలి.

ఈ అంశాల మధ్య సంబంధాన్ని గుర్తించడానికి సాధారణంగా కింది విషయాలపైన అవగాహన కలిగి ఉండాలి.

★ దేశాలు - రాజధానులు
★ మగ - ఆడ అంశాలు
★ దేశాలు - కరెన్సీ
★ పనివారు - పనిచేసే ప్రదేశం
★ దేశాలు - అధ్యక్షులు/ప్రధానులు
★ పరికరాలు - కొలతలు
★ రాష్ట్రాలు - రాజధానులు
★ వ్యాధులు - కారకాలు
★ పనివారు - పనిముట్లు
★ ఆంగ్ల అక్షరాలు - అనురూప సంఖ్యలు
★ శాస్త్రాలు - అంశాలు
★ సంఖ్యలు - రకాలు

పోలిక పరీక్ష 3 రకాలు:

1) పదాల పోలిక పరీక్ష

ఉదా: మొక్కలు : బోటనీ:: జంతువులు : ?
1) ఆంత్రోపాలజీ 2) మైకాలజీ
3) ఆర్నిథాలజీ 4) జువాలజీ

మొక్కల అధ్యయనాన్ని బోటనీ అంటారు. అలాగే జంతువుల అధ్యయాన్ని జువాలజీ అంటారు. జ: 4

2) అక్షరాల పోలిక పరీక్ష


ఉదా: BG : YT :: EC : ?
1) XV 2) GM 3) VX 4) YT

అక్షరాల ప్రతిబింబ అక్షరాల ఆధారంగా
B → Y | E → V
G → T | C → X
జ: 3

3) సంఖ్యా పోలిక పరీక్ష

ఉదా: 23 : 25 :: 25 : ?
1) 28 2) 36 3) 49 4) 64

23 → 2 + 3 = 5
5 వర్గం = 5^2 = 25 అదేవిధంగా
25 → 2 + 5 = 7
7 వర్గం = 7^2 = 49
జ: 3



మాదిరి ప్రశ్నలు

1. MX : UG :: PR : ?
1) XA 2) AX 3) AA 4) XX

సాధన: $M \xrightarrow{+8} U$ | $P \xrightarrow{+8} X$
$X \xrightarrow{+9} G$ | $R \xrightarrow{+9} A$
అదేవిధంగా
జ: 1

2. BGQ : ZDM :: LMV : ?
1) JJJ 2) RJR 3) JJR 4) JJQ

సాధన: $B \xrightarrow{-2} Z$ | $L \xrightarrow{-2} J$
$G \xrightarrow{-3} D$ | $M \xrightarrow{-3} J$
$Q \xrightarrow{-4} M$ | $V \xrightarrow{-4} R$
అదేవిధంగా
జ: 3

3. SMPS : VRWB :: IQDT : ?
1) LVKC 2) LVCK
3) VLKC 4) LVKK

సాధన: $S \xrightarrow{+3} V$ | $I \xrightarrow{+3} L$
$M \xrightarrow{+5} R$ | $Q \xrightarrow{+5} V$
$P \xrightarrow{+7} W$ | $D \xrightarrow{+7} K$
$S \xrightarrow{+9} B$ | $T \xrightarrow{+9} C$
అదేవిధంగా
జ: 1

4. CLG : 202 :: HOE : ?
1) 413 2) 314 3) 341 4) 431

సాధన: C = 3 → 3^2 = 9
L = 12 → 12^2 = 144
G = 7 → 7^2 = 49
∴ 9 + 144 + 49 = 202
అదేవిధంగా
H = 8 → 8^2 = 64
O = 15 → 15^2 = 225
E = 5 → 5^2 = 25
∴ 64 + 225 + 25 = 314
జ: 2

5. 35 : 134 :: 64 : ?
1) 143 2) 100 3) 125 4) 186

సాధన: 3 → 3^2 = 9 | 6 → 6^2 = 36
5 → 5^3 = 125 | 4 → 4^3 = 64
∴ 9 + 125 = 134 | ∴ 36 + 64 = 100
అదేవిధంగా
జ: 2

6. 786 : 336 :: 253 : ?
1) 21 2) 32 3) 30 4) 38

సాధన: 786 → 7 × 8 × 6 = 336
అదేవిధంగా 253 → 2 × 5 × 3 = 30
జ: 3

7. 5346 : 324 :: 2598 : ?
1) 484 2) 584 3) 585 4) 686

సాధన: $5 \xrightarrow{+5} 10$ | $2 \xrightarrow{+2} 4$
$3 \xrightarrow{-3} 0$ | $5 \xrightarrow{-5} 0$
$4 \xrightarrow{+4} 8$ | $9 \xrightarrow{+9} 18$
$6 \xrightarrow{-6} 0$ | $8 \xrightarrow{-8} 0$

10 + 0 + 8 + 0 = 18 | 4 + 0 + 18 + 0 = 22
18 వర్గం = 18^2 = 324 | 22 వర్గం = 22^2 = 484
జ: 1

8. 780954 : 6611142 :: 351848 : ?
1) 3212066 2) 3212036
3) 2321063 4) 2321036

సాధన: $7 \xrightarrow{-1} 6$ | $3 \xrightarrow{-1} 2$
$8 \xrightarrow{-2} 6$ | $5 \xrightarrow{-2} 3$
$0 \xrightarrow{+1} 1$ | $1 \xrightarrow{+1} 2$
$9 \xrightarrow{+2} 11$ | $8 \xrightarrow{+2} 10$
$5 \xrightarrow{-1} 4$ | $4 \xrightarrow{-1} 3$
$4 \xrightarrow{-2} 2$ | $8 \xrightarrow{-2} 6$
అదేవిధంగా
జ: 4

9. గొడ్డలి : కలప :: కత్తెర : ?
1) వస్త్రం 2) ప్లాస్టిక్
3) ఇనుము 4) పెన్సిల్

వివరణ: గొడ్డలితో కలపను విడదీస్తారు. అదేవిధంగా కత్తెరతో వస్త్రాలను విడదీస్తారు.
జ: 1

10. ఎర్రకోట : దిల్లీ :: రాక్ గార్డెన్ : ?
1) చండీగఢ్ 2) షికాగో
3) బెంగళూరు 4) ఆగ్రా

వివరణ: ఎర్రకోట దిల్లీలో ఉంది. అదేవిధంగా రాక్ గార్డెన్ చండీగఢ్‌లో ఉంది.
జ: 1

11. గజం : అంగుళం :: క్వార్ట్ : ?
1) గ్యాలన్ 2) ఔన్స్ 3) పాలు 4) ద్రవం

వివరణ: 1 గజం = 32 అంగుళాలు
1 క్వార్ట్ = 32 ఔన్స్‌లు జ: 2



రచయిత: గోలి ప్రశాంత్ రెడ్డి

రక్షిత అడవుల్లో పశుపోషకులకు మేత హక్కులు!

నాగరిక సమాజానికి దూరంగా అడవుల్లో జీవించే గిరిజనులు, సంచార జీవితం గడిపే వలసజాతులు అనాదిగా దుర్బల వర్గాలుగానే మనుగడ సాగిస్తున్నాయి. ముఖ్యంగా వలసవాద పాలనలో భారతదేశం సహా ప్రపంచవ్యాప్తంగా అటవీ సమాజం తీవ్రమైన అణచివేతలకు గురైంది. ఫలితంగా అడవిబిడ్డల తిరుగుబాట్లు, విప్లవాలు చోటుచేసుకున్నాయి. స్వతంత్ర భారతంలో మాత్రం వారిపై సహేతుక ఆంక్షలు అమలవుతున్నాయి. హక్కులకు, జీవనోపాధికి భరోసా కల్పించే విధంగా నేటి ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. అయితే అభివృద్ధి పరిణామక్రమంలో ఎప్పుడూ, ఎక్కడో ఒక చోట ఆ అటవీసమాజం జీవనం ముప్పు ఎదుర్కొంటోంది. నిర్వాసితులుగా మారే వారిలో వారు ముందు వరుసగా ఉంటున్నారు. చరిత్రలో సామాజిక సమస్యగా మిగిలిపోయిన ఈ అంశంపై పోటీ పరీక్షలు రాసేవారికి అవగాహన ఉండాలి. వివిధ దేశాల్లో ఉనికి పోరాటాలు చేసిన అటవీ తెగలు, బ్రిటిష్ హయాంలో భారత్‌లో వారు ఎదుర్కొన్న ఇక్కట్లు, ప్రస్తుతం అడవుల రక్షణకు ఉన్న వ్యవస్థాగత ఏర్పాట్లు, రక్షిత అడవుల ఉద్దేశం గురించి తెలుసుకోవాలి.


గండాధుర్

అటవీ సమాజం - వలసవాదం

డీఎస్సీ 2024 - చరిత్ర

1. ఇంపీరియల్ ఫారెస్ట్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఎక్కడ స్థాపించారు?
1) డెహ్రాడూన్ 2) దిల్లీ
3) కోల్‌కతా 4) కాన్పూర్

2. కిందివాటిలో బస్తర్ మీదుగా ప్రవహించే నది?
1) గంగా 2) సింధు
3) ఇంద్రావతి 4) ఏదీకాదు

3. అటవీ చట్టం వల్ల దేశవ్యాప్తంగా గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎందుకంటే..
1) కలపను కోయడం, పశువులను మేపడం, పండ్లు, వేర్లు సేకరించడం; వేటాడటం, చేపలు పట్టడం చట్టవిరుద్ధం.
2) ప్రజలు బలవంతంగా దొంగలుగా మారాల్సిన పరిస్థితి. ఒకవేళ పట్టుబడితే వారు ఫారెస్ట్ గార్డులకు లంచాలు చెల్లించాల్సి ఉంటుంది.
3) కలప సేకరించే మహిళలను గార్డులు వేధించారు.
4) పైవన్నీ

4. పోడు వ్యవసాయాన్ని భారతదేశంలో ప్రభుత్వం నిషేధించింది. ఎందుకంటే..
1) ఈ పద్ధతి అడవులను హానికరమని యూరోపియన్ ఫారెస్టర్లు భావించారు.
2) అడవిని కాల్చినప్పుడు మంటలు వ్యాపించి విలువైన కలప కాలిపోయే ప్రమాదం ఉంది.
3) ఈ విధానంలో పన్నులు లెక్కించడం ప్రభుత్వానికి కష్టతరం.
4) పైవన్నీ

5. అమెరికన్ రచయిత రిచర్డ్ హార్డింగ్ సెంట్రల్ అమెరికాలో హోండురాస్ ఆక్రమణను ఎలా సమర్థించాడు?
1) సెంట్రల్ అమెరికన్లు సెమీ అనాగరికులు. వారు తమ భూమి విలువను అర్థం చేసుకోవడంలో విఫలమయ్యారు.
2) సాగు చేయని భూమిని వలసవాదులు స్వాధీనం చేసుకుని మెరుగుపరచాలి.
3) భూమి దాని అసలు యజమానితో మెరుగుపరచకుండా ఉండటాన్ని అనుమతించరు.
4) పైవన్నీ

6. బస్తర్ అడవులు, ప్రజల కథ 1910 తిరుగుబాటుతో ఎందుకు ముగియలేదు?
1) స్వాతంత్ర్యం వచ్చాక కూడా ప్రజలను అడవుల్లోకి రానీయకుండా, పారిశ్రామిక అవసరాలకు రిజర్వ్ చేసే ఆచారం కొనసాగింది.
2) కాగితపు పరిశ్రమ కోసం 4,600 హెక్టార్ల జాతీయ సాల్ ఫారెస్ట్‌ను ఉష్ణమండలం పైన్‌తో భర్తీ చేయాలని ప్రపంచ బ్యాంకు ప్రతిపాదించింది. ఇది తరువాత రద్దయ్యింది.
3) 1, 2 4) ఏదీకాదు

7. వలస పాలనలో బస్తర్ ప్రజలు కిందివాటిలో ఏ సమస్యలను ఎదుర్కొన్నారు?
1) పరిహారం గురించి ఎలాంటి నోటీసు లేకుండానే గ్రామాల ప్రజలు నిర్వాసితులయ్యారు.
2) గ్రామస్థులకు పెరిగిన అద్దెలు, వలస అధికారులు తరచూ ఉచిత లేబర్, వస్తువుల కోసం డిమాండ్ చేయడం.
3) 1899-1900, 1907, 1908లో భయంకరమైన కరవులు
4) పైవన్నీ

8. మొదటి, రెండో ప్రపంచ యుద్ధాల సమయంలో జావాలో డచ్‌లు అనుసరించిన 'స్కార్చ్‌డ్ ఎర్త్ విధానం' ఏమిటి?
1) జావా భూమిపై డచ్ ఆయుధాలను ధ్వంసం చేశారు.
2) మరిన్ని చెట్లను పెంచడానికి భూమిని మరింత దోపిడీ చేశారు.
3) భారీ టేకు దుంగలు కాలిపోయాయి, సామిల్లులు ధ్వంసమయ్యాయి.
4) పైవన్నీ

9. మొదటి, రెండో ప్రపంచ యుద్ధాల సమయంలో అడవుల పట్ల భారతదేశంలో బ్రిటిషర్లు అనుసరించిన విధానం ఏమిటి?
1) బ్రిటిష్ యుద్ధ అవసరాలను తీర్చడానికి అటవీశాఖ స్వేచ్ఛగా చెట్లను నరికివేసింది.
2) బ్రిటిషర్లతో సహా అందరికీ వర్తించేలా చెట్ల నరికివేతను నిషేధించారు.
3) భారతీయులకు ఉపాధి కల్పించేందుకు మరిన్ని చెట్లు నాటారు.
4) ఆంగ్లేయులు అడవులు నరికివేయకుండా నిషేధం విధించారు.

10. మూడు వర్గాల్లో ఏ అడవులు ఉత్తమమైనవిగా పరిగణనలో ఉన్నాయి?
1) రిజర్వ్ అడవులు 2) రక్షిత అడవులు
3) గ్రామ అడవులు 4) 1, 2

11. కిందివాటిలో దేనికి మార్గం కల్పించేందుకు సహజ అడవుల్లోని పెద్ద ప్రాంతాలనూ తొలగించారు?
1) తేయాకు తోటలు 2) కాఫీ తోటలు
3) రబ్బరు తోటలు 4) పైవన్నీ

12. వలస రాజ్యాల కాలంలో బ్రిటిషర్లు ఏ పంట ఉత్పత్తిని నేరుగా ప్రోత్సహించారు?
1) జనపనార 2) చక్కెర, గోధుమ
3) పత్తి 4) పైవన్నీ

13. వలస పాలనలో భారతదేశంలోని ఈ వాణిజ్య నిబంధనల్లో ఏది పశుపోషణ, సంచార మార్గాలపై తీవ్రమైన ప్రభావాలను చూపింది.
1) అనేక సంఘాల ప్రజలు టీ, కాఫీ తోటల్లో బానిస కార్మికులుగా మారారు.
2) వారిలో కొందరిని క్రిమినల్ తెగలు అంటారు.
3) మేత, వేటను పరిమితం చేయడంతో అనేక సంఘాలు తమ జీవనోపాధి కోల్పోయాయి.
4) పైవన్నీ

14. బస్తర్ ఎక్కడ ఉంది?
1) ఛత్తీస్‌గఢ్‌లోని దక్షిణ భాగంలో
2) మధ్య ఝార్ఖండ్ ప్రాంతంలో
3) ఆంధ్రప్రదేశ్‌లో
4) ఝార్ఖండ్‌లో

15. 'అటవీ గ్రామాలు' అంటే ఏమిటి?
1) రిజర్వ్‌డ్ ఫారెస్ట్‌లు. ఇక్కడ కొంతమంది గ్రామస్థులు ఉండేందుకు అనుమతించారు.
2) కొత్త గ్రామాలను నిర్మించడానికి నరికేసిన అటవీ ప్రాంతం.
3) అడవులను పెంచాల్సిన గ్రామాలు.
4) పైవన్నీ

16. గండాధుర్ ఎవరు?
1) జావా తిరుగుబాటుదారుడు
2) మొదటి ఇన్‌స్పెక్టర్ జనరల్
3) సంతాల్ తిరుగుబాటు నాయకుడు
4) దుర్వ తెగ నాయకుడు

17. ఇండోనేసియాలో వలసవాద శక్తి ఎవరు?
1) బ్రిటిష్ 2) డచ్ 3) ఫ్రెంచ్ 4) పోర్చుగీస్

18. ఇండోనేసియాలో వరి ఉత్పత్తికి ప్రసిద్ధి చెందిన ద్వీపం ఏది?
1) జావా 2) సుమత్రా
3) బోర్నియో 4) కాలిమంటన్

19. డచ్‌వారు ఇండోనేసియాలో అటవీ నిర్వహణను ఎక్కడ నిర్వహించారు?
1) జావా 2) సుమత్రా 3) బాలి 4) శ్రీలంక

20. జావాకు చెందిన 'కలంగ్‌లు' ఎవరు?
1) పాలకుల రాజవంశం
2) నైపుణ్యం ఉన్న అటవీ కట్టర్లు, మారుతున్న సాగుదారులు
3) వడ్డీ వ్యాపారుల సంఘం 4) అందరూ

21. 'మాసాయి' అనే పదానికి అర్థం?
1) అత్యున్నత వలస అధికారం
2) నా ప్రజలు
3) అత్యంత దుర్భర పరిస్థితి
4) ప్రజల పాలన

22. 1923లో 'ది ఫారెస్ట్ ఆఫ్ ఇండియా' పుస్తకాన్ని ఎవరు రాశారు?
1) డేవిడ్ స్పర్ 2) ఇ.పి.స్టెబ్బింగ్
3) వెరియర్ ఎల్విన్ 4) జాన్ మిడిల్టన్

23. కిందివాటిలో స్విడ్ వ్యవసాయంతో సంబంధం లేనిది ఏది?
1) కరాచా 2) ఝుమ్ 3) బెవార్ 4) పెండా

24. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌ను ఎప్పుడు స్థాపించారు?
1) 1865 2) 1864 3) 1854 4) 1884

25. కొన్ని అడవులను 'రక్షిత'గా ఎందుకు వర్గీకరించారు?
1) వీటిలో పశుపోషకులకు మేత హక్కులు ఉంటాయి. కానీ వారి కదలికలను పరిమితం చేశారు.
2) అటవీ నేలపై మొలకెత్తిన మొక్కలు, చెట్ల చిన్న రెమ్మలను మేత నాశనం చేస్తుందని వలస అధికారులు విశ్వసించారు.
3) 1, 2 4) ఏదీకాదు

26. హిమాచల్‌ప్రదేశ్‌లోని గద్దీ గొర్రెల కాపరుల మాదిరిగానే జమ్ము-కశ్మీర్‌లోని గుజ్జర్ బకర్వాల్ జీవితాలు ఏ విధంగా ఉన్నాయి?
1) వారిద్దరికీ ఒకే విధమైన కాలానుగుణ కదలిక చక్రం ఉంటుంది.
2) వారిద్దరూ తమ శీతాకాలాలను శివాలిక్ శ్రేణిలోని తక్కువ కొండలపై గడుపుతారు. పొడి పొదలు, అడవుల్లో తమ మందలను మేపుతారు.
3) ఏప్రిల్‌లో వారు తమ వేసవి మేత కోసం మళ్లీ పైకి ప్రయాణాన్ని ప్రారంభిస్తారు.
4) పైవన్నీ

27. కిందివాటిలో ఏది గిరిజన తెగ కాదు?
1) కరాచా 2) ఘామ్ 3) కొరవ 4) యెరుకుల

28. శాస్త్రీయ అటవీ వ్యవస్థ అంటే....?
1) స్థానిక రైతులు ఒక తోటలో తాత్కాలికంగా సాగు చేయడానికి అనుమతించే విధానం.
2) పాత చెట్లను నరికి కొత్త వాటిని నాటడం.
3) అడవులను మూడు వర్గాలుగా విభజించడం.
4) అడవుల అదృశ్యం

29. బస్తర్ తిరుగుబాటు ఏ సంవత్సరంలో జరిగింది?
1) 1910 2) 1909 3) 1911 4) 1912

30. ఆగ్నేయ ఆసియాలో పోడు వ్యవసాయాన్ని ఎలా పిలుస్తారు?
1) చిటిమెన్ 2) టావీ 3) లాడింగ్ 4) మిల్పా

31. గోండు అటవీ సంఘం కింది ఏ ప్రాంతానికి చెందింది?
1) తమిళనాడు 2) జమ్ము-కశ్మీర్
3) ఛత్తీస్‌గఢ్ 4) గుజరాత్

32. భారతదేశంలో షిఫ్టింగ్ (పోడు) వ్యవసాయాన్ని కింది ఏ పదం సూచించదు?
1) పెండా 2) బెవార్ 3) ఖండాద్ 4) లాడింగ్

33. బ్రిటిష్ కాలంలో అటవీశాఖ ఏ రకమైన చెట్లతో కూడిన అడవులకు ప్రాధాన్యం ఇచ్చింది?
1) ఇంధనం, మేత, ఆకులను అందించే చెట్లున్న అడవులు
2) మెత్తటి కలప ఉన్న అడవులు
3) ఓడలు, రైలు మార్గాలను నిర్మించడానికి అనువైన చెట్లున్న అడవులు 4) పైవన్నీ

34. కింది వాటిలో వలసవాద వాణిజ్యం, వస్తువుల తరలింపునకు అత్యంత అవసరమైంది ఏది?
1) రోడ్డు మార్గాలు 2) రైల్వేలు
3) ఎయిర్‌వేలు 4) నదీ మార్గాలు

35. ఇండోనేసియాలో వలసవాద శక్తి వసరు?
1) బ్రిటిష్ 2) డచ్
3) ఫ్రెంచ్ 4) పోర్చుగల్



రచయిత: కాకులూరు వెంకటేశ్వర్లు

సమాధానాలు

1-1; 2-3; 3-4; 4-4; 5-4; 6-3; 7-4; 8-3; 9-1; 10-1; 11-4; 12-4; 13-4; 14-1; 15-1; 16-4; 17-2; 18-1; 19-1; 20-2; 21-2; 22-2; 23-1; 24-2; 25-3; 26-4,27-2; 28-2; 29-1; 30-3; 31-3; 32-4; 33-3; 34-2; 35-2.

జాతీయోద్యమంలోని రెండో దశను అతివాద యుగంగా పేర్కొంటారు. ఈ దశ 1905 నుంచి 1920 వరకు కొనసాగింది. మితవాదులు బ్రిటిష్ పరిపాలనా వ్యవస్థపై నమ్మకం ఉంచారు. మితవాదుల విధానాలకు భిన్నంగా అతివాదులు బ్రిటిష్ వారి దౌర్జన్యకర పోకడలకు వ్యతిరేకంగా ఉద్యమించారు. పోటీపరీక్షార్థులు జాతీయోద్యమంలోని ఆయా దశలపై దృష్టి సారించాలి.

సమరమే మార్గంగా.. స్వరాజ్య సాధనే లక్ష్యంగా..

టీజీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

భారతదేశ చరిత్ర

భారత స్వాతంత్ర్యోద్యమం

భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రను మూడు దశలుగా విభజించారు. అవి...

1) మితవాద యుగం (1885-1905)
2) అతివాద యుగం (1905-1919)
3) గాంధీ యుగం (1919-1947)

అతివాద యుగం (1905-1920)

భారత స్వాతంత్ర్యోద్యమాన్ని తొలిదశలో నడిపినవారు మితవాదులు. వీరు బ్రిటిష్ వారి న్యాయదృష్టిని నమ్మారు. ప్రార్థన, విజ్ఞప్తి, నిరసన విధానాలను అవలంబించారు. ఉదారవాద పద్ధతుల ద్వారా చట్ట పరిధికి లోబడి, రాజ్యాంగబద్ధ విధానాల ద్వారా ఆంగ్లేయులపై ఒత్తిడి పెంచి, తమ డిమాండ్లను సాధించాలని భావించారు. కానీ మితవాదులు విఫలమయ్యారు.

దీంతో కాంగ్రెస్‌లోని ఒక వర్గం నాయకులు తమ డిమాండ్ల సాధనకు పోరాటమే సరైందని భావించారు. వీరు అతివాద యుగానికి నాంది పలికారు.

జాతీయవాద వికాసం - పెరుగుదల

1890 తర్వాత నుంచి సమరశీల జాతీయతావాదం అభివృద్ధి చెందింది.

- 1905లో బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంతో ఈ అతివాద ధోరణి అధికమైంది.
- భారత జాతీయోద్యమ తొలిదశలోనూ చాలా మంది విదేశాధిపత్యం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి, దేశభక్తిని పెంపొందించుకోవాల్సిన అవసరం గురించి చైతన్యాన్ని పొందారు. అది దేశంలో విద్యావంతులకు అవసరమైన రాజకీయ శిక్షణను అందించింది.
- జాతీయవాద రచయితలు, ఆందోళనకారులు భారత ప్రజల దారిద్ర్యానికి బ్రిటిష్ పాలనే కారణమని నిందించారు.
- భారతదేశాన్ని ఆర్థికంగా కొల్లగొట్టి బ్రిటన్‌ని సంపన్నవంతం చేయడమే ఆంగ్లేయ పరిపాలన ధ్యేయమని రాజకీయంగా చైతన్యవంతులైన భారతీయులకు తెలిసివచ్చింది.
- 1896-1900 మధ్య దేశంలో తీవ్ర కరవు కాటకాలు సంభవించాయి. లార్డ్ కర్జన్ క్షామ నివారణ చర్యలు చేపట్టకుండా రాజదర్బారు నిర్వహించాడు. బ్రిటిష్ వారి పరిపాలనలోని దుష్పరిణామాలను ప్రజలు చవిచూశారు.
- 1892-1905 వరకు జరిగిన రాజకీయ సంఘటనలు ప్రజలను నిరాశపరిచాయి. దీంతో జాతీయవాదుల దృష్టి తీవ్రవాద రాజకీయాల వైపు మళ్లింది.

అతివాద యుగానికి కారణాలు

మితవాదుల విధానాలతో ఎలాంటి ప్రయోజనాలు చేకూరకపోవడం, వారి వైఫల్యాల ఫలితంగా అతివాదుల గళం ఎక్కువైంది.

- బ్రిటిష్ వారి ఆర్థిక దోపిడీ, భారతదేశానికి జరుగుతున్న అన్యాయాలను భారతీయులు గ్రహించారు.
- 1892లో బ్రిటిష్ ప్రభుత్వం చేసిన శాసనసభ చట్టం భారతీయులను తీవ్ర నిరాశకు గురిచేసింది.
- 1897లో నాథ్ సోదరులను విచారణ లేకుండా దేశం నుంచి బహిష్కరించడం
- 1898లో ప్రభుత్వం రాజకీయ అసంతృప్తిని (జాతీయవాదాన్ని) ప్రచారం చేయడం నేరమంటూ చట్టం చేయడం
- 1899లో కోల్‌కతా పురపాలక సంస్థలో భారతీయ సభ్యుల సంఖ్యను తగ్గించడం
- 1904లో పత్రికా స్వాతంత్ర్యం మీద ఆంక్షలు విధిస్తూ బ్రిటిష్ ప్రభుత్వం చట్టం తీసుకురావడం

ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం: భారతీయుల్లో క్రమేణా తమకు తాము పరిపాలించుకోగలమనే నమ్మకం ఏర్పడింది.

- తిలక్, బిపిన్ చంద్రపాల్ ఆత్మగౌరవ సందేశాన్ని ప్రచారం చేశారు. తమ దుస్థితికి నివారణ మార్గం తమ చేతుల్లోనే ఉందని వారు ప్రజలకు బోధించారు.
- వారి బోధనలు ప్రజల్లో విశ్వాసం, జాతీయోద్యమాన్ని విస్తృతం చేయాలన్న ఆకాంక్షని కలిగించాయి.
- జాతి ఆశయం కొద్దిమంది ఉన్నత వర్గాల విద్యావంతుల వరకే పరిమితం కాకుడదు. విశాల ప్రజా సమూహంలో రాజకీయ చైతన్యం కలగాలని పిలుపునిచ్చారు.
- జాతీయ కాంగ్రెస్ సభలో, రాష్ట్ర సభల్లో నాలుగు రోజుల వరకే రాజకీయ కార్యకలాపాలు పరిమితం కావటానికి బదులు అవి నిరంతరాయంగా కొనసాగాలని జాతీయవాదులు భావించారు.

విద్యాభివృద్ధి – నిరుద్యోగం: 19వ శతాబ్దం చివరిలో దేశంలో విద్యావంతుల సంఖ్య గణనీయంగా పెరిగింది. వాళ్లలో చాలామంది అతి తక్కువ వేతనంతో ఉద్యోగాల్లో చేరారు. అనేక మంది నిరుద్యోగులుగా మిగిలిపోయారు.

- ఈ దుస్థితి బ్రిటిష్ పాలన స్వభావాన్ని పరిశీలించేటట్లు చేసింది.
- ఉద్యోగుల్లో చాలా మంది అతివాద జాతీయ రాజకీయాలవైపు ఆకర్షితులైయ్యారు. విద్యావంతుల సంఖ్య పెరగడంతో ప్రజాస్వామ్యం, జాతీయవాదం, సమాజం సమూలంగా మారాలనే రాడికల్ భావాలు, సిద్ధాంతాలు విస్తృతి పొందాయి.

అంతర్జాతీయ ప్రభావం: సమకాలీన ప్రపంచంలో జరుగుతున్న సంఘటనలు భారతదేశంలో సమరశీల జాతీయవాదం వికసించడానికి దోహదపడ్డాయి.

- 1868 తర్వాత జపాన్ సాధించిన అభివృద్ధి పాశ్చాత్యుల పెత్తనం లేకుండా స్వశక్తి మీద ఆధారపడి ఆసియా దేశాలు అభివృద్ధి చెందగలవని నిరూపించింది.
- జపాన్‌లో సార్వత్రిక ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టారు. సమర్థవంతమైన ఆధునిక పరిపాలనా విధానాన్ని రూపొందించారు.
- 1896లో ఇథియోపియా చేతిలో ఇటలీ సైన్యం ఓటమి, 1905లో జపాన్ చేతిలో రష్యా పరాజయం ఐరోపా గొప్పతనపు భ్రమలను చెరిపివేశాయి.
- ప్రజలంతా ఏకమై జాతీయోద్యమంలో పాల్గొంటే శక్తిమంతమైన, నిరంకుశ ప్రభుత్వాలలైనా సవాలు చేయవచ్చనే సత్యం ఐర్లాండ్, రష్యా, ఈజిప్ట్, టర్కీ, చైనాలోని విప్లవోద్యమాలు, దక్షిణాఫ్రికాలోని బోయర్ యుద్ధంతో భారతీయులకు అవగతమైంది.

మితవాద పద్ధతులు – అసంతృప్తి: భారతదేశం బ్రిటిష్ వారి 'ఉదార మార్గదర్శకత్వం'లో ప్రగతి సాధించగలదనే మితవాదుల వాదాన్ని అతివాదులు గర్హించారు. వారంతా పరాయి పాలనని నిరసించారు.

- 'స్వరాజ్య సాధనే జాతీయోద్యమ లక్ష్యం' అని అతివాదులు బలంగా విశ్వసించారు.
- మితవాద పద్ధతులైన ప్రార్థన, విజ్ఞప్తి, నిరసనలను కొట్టిపారేశారు.
- సభలు, సమావేశాలు, శాసనసభల్లో ప్రసంగాల కంటే శక్తిమంతమైన రాజకీయ కార్యాచరణకు, పోరాట పద్ధతులకు పూనుకోవాలనే కాంక్ష చాలా మందిలో బలీయమైంది.

కర్జన్ ప్రజావ్యతిరేక విధానాలు: భారతదేశం ఒక జాతి అని గుర్తించడాన్ని కర్జన్ వ్యతిరేకించాడు. జాతీయ వీరుల చరిత్రను నిరసించాడు. భారతీయ సంస్కృతిని విమర్శించాడు. భారతీయులు స్వపరిపాలనకు అనర్హులని అభిప్రాయపడ్డాడు.

- కర్జన్ పరిపాలనా కాలంలో అమలు చేసిన అధికార రహస్యాల చట్టం, భారతీయ విశ్వవిద్యాలయ చట్టం, కలకత్తా కార్పొరేషన్ చట్టం, ముఖ్యంగా బెంగాల్ విభజన ప్రజల్లో బ్రిటిష్ పాలన పట్ల వ్యతిరేక వైఖరిని కలగజేశాయి.
- కర్జన్ ఏడు సంవత్సరాల పరిపాలనతో బ్రిటిష్ పాలన పట్ల భారతీయుల్లో వ్యతిరేక భావం కలిగింది.

సుశిక్షిత నాయకత్వం: 20వ శతాబ్దం నాటికి భారతదేశంలో సుశిక్షితులైన నాయకులు అనేక మంది తయారయ్యారు. వారంతా అంతకుముందు రాజకీయ పోరాటాలకు నాయకత్వం వహించడంలో ఆరితేరారు.

అతివాదుల్లో ప్రముఖులు: మహారాష్ట్రకు చెందిన బాలగంగాధర్ తిలక్, పంజాబ్‌కు చెందిన లాలా లజపతిరాయ్, బెంగాల్‌కు చెందిన బిపిన్ చంద్రపాల్. ఈ ముగ్గురినే భారతదేశ చరిత్రలో 'లాల్-బాల్-పాల్'గా, విప్లవత్రయంగా, అతివాదత్రయంగా పిలుస్తారు.

బాలగంగాధర్ తిలక్




ప్రజల్లో జాతీయవాద భావాలను రేకెత్తించడంలో మహాత్మాగాంధీ కంటే ముందు అత్యంత సఫలీకృతుడైన నాయకుడు బాలగంగాధర్ తిలక్.

- 1856 జులై 23న మహారాష్ట్రలోని రత్నగిరిలో తిలక్ జన్మించారు.
- 1881లో ఆంగ్ల భాషలో మరాఠా, మరాఠీ భాషలో కేసరి అనే దినపత్రికల ద్వారా జాతీయవాద భావాలను ప్రచారం చేశారు.
- తిలక్ 1889లో మొదటిసారి కాంగ్రెస్ సమావేశాలకు హాజరై, తర్వాతి 30 సంవత్సరాల పాటు కాంగ్రెస్‌లో ప్రముఖ నాయకుడిగా వెలుగొందారు.
- 1893లో గణేశ్ ఉత్సవాలను, 1895లో శివాజీ ఉత్సవాలను ప్రారంభించి ప్రజల్లో దేశభక్తిని పెంపొందించే ప్రయత్నం చేశారు.
- 1906లో తిలక్ 'స్వరాజ్యం నా జన్మహక్కు, స్వరాజ్యం సాధించకపోతే మన జన్మ, మతం వృథా' అనే నినాదాల ద్వారా స్వరాజ్యం కోసం పోరాటం చేయమని ప్రజలకు పిలుపునిచ్చారు.
- 1908లో తిలక్‌ను అరెస్టు చేసి 6 సంవత్సరాలు జైలు శిక్ష విధించారు. జైలులో ఉన్న సమయంలో గీతరహస్య అనే గ్రంథాన్ని రచించారు.
- బ్రిటిష్‌వారు తిలక్‌ను "భారత రాజద్రోహి పితామహుడు", "పెద్ద ద్రోహి"గా అభివర్ణించారు.
- తిలక్‌ను 'భారత అశాంతి పితామహుడి'గా వాలంటైన్ చిరోల్ పేర్కొన్నాడు.

లాలా లజపతిరాయ్

లాలా లజపతిరాయ్ పంజాబ్‌లోని దూడికే గ్రామంలో 1865 జనవరి 28న జన్మించారు.

- నిత్యజీవితంలో హిందీ భాష వాడకాన్ని ప్రోత్సహించిన మొదటి నాయకుడు లాలా లజపతిరాయ్.
- పంజాబ్ కేసరిగా ప్రసిద్ధి చెందారు. ఆర్య సమాజంలో కళాశాల విభాగానికి నాయకుడు.
- రాయ్ హిస్సార్‌లో న్యాయవాదిగా ప్రాక్టీసు ప్రారంభించి, తర్వాతి కాలంలో తన మకాంను లాహోర్‌కు మార్చారు.
- ఈయన 1888లో మొదటిసారిగా కాంగ్రెస్ సమావేశంలో ప్రసంగించారు.
- ద పంజాబీ, ద పీపుల్ అనే పత్రికలను ప్రచురించారు.
- పంజాబ్‌లో రైతు ఉద్యమాల్లో పాల్గొన్నందుకు రాయ్‌ను దేశద్రోహ నేరం కింద అరెస్టు చేసి జైలుకు పంపారు.
- ఈయన 1928లో యూరప్‌ను సందర్శించారు
- సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా జరిపిన పోరాటంలో సాండర్స్ అనే పోలీస్ అధికారి లాఠీ దెబ్బలకు గాయపడిన లాలా లజపతిరాయ్ 1928 నవంబరు 17న మరణించారు.
- లార్డ్ మింటో రాసిన ఒక లేఖలో 'కాంగ్రెస్ విధేయమైనదే కానీ లాలా లజపతిరాయ్ ప్రమాదకరమైన వ్యక్తి' అని రాశాడు.
- లార్డ్ హార్డింజ్ రాయ్‌ను ప్రమాదకరమైన కుట్రదారుగా అభివర్ణించాడు.



బిపిన్ చంద్రపాల్

బిపిన్ చంద్రపాల్ ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఉన్న సిల్హెట్ జిల్లాలోని పియోల్ అనే గ్రామంలో 1858 నవంబరు 7న జన్మించారు.

- ఈయన బ్రహ్మసమాజ్ ప్రతినిధిగా మధ్యయూరప్, అమెరికాలలో పర్యటించారు.
- రాజ్‌నారాయణ్ బసు, నవ్‌గోపాల్ మిత్రుల 'హిందూమేళా' బిపిన్‌పై ప్రభావం చూపింది.
- బంకించంద్ర ఛటోపాధ్యాయ 'బంగదర్శన్' పత్రిక కూడా బిపిన్ చంద్రపాల్‌ను ప్రభావితం చేసింది.
- బంకించంద్ర ఛటోపాధ్యాయను బిపిన్ చంద్రపాల్ 'బెంగాల్ వాల్టర్‌స్కాట్'గా అభివర్ణించారు.
- 1905లో జరిగిన బెంగాల్ విభజన వ్యతిరేక ఉద్యమం, స్వదేశీ ఉద్యమంలో ఈయన చురుగ్గా పాల్గొన్నారు.
- 1906లో వందేమాతరం అనే దినపత్రికను ప్రారంభించారు.
- 1907లో రాజద్రోహ నేరంపై అరెస్టయి జైలుకు వెళ్లారు.





రచయిత
డాక్టర్ వి. రాజ్‌మహ్మద్
అసిస్టెంట్ ప్రొఫెసర్

444 Word of the Day

Synergy

Telugu meaning: సమాహారం, తోడ్పాటు

English meaning: The word synergy is a noun that describes the combined effect of two or more entities working together, which is greater than the sum of their individual effects.

Synonyms: Collaboration, Cooperation

Antonyms: Division, Separation

Usage: **1.** The synergy between the two companies led to groundbreaking innovations in the tech industry.

2. Team synergy is essential to achieving greater productivity and success in any project.

నోటిఫికేషన్స్

ఏఐఏఎస్ఎల్

ఏఐ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఐఏఎస్ఎల్) ఫిక్స్‌డ్ టర్మ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన ముంబయి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో వివిధ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది. మొత్తం ఖాళీల సంఖ్య 1066. అర్హులైన అభ్యర్థులు 2024, అక్టోబరు 22, 23, 24, 25, 26 తేదీల్లో ఇంటర్వ్యూకి హాజరుకావొచ్చు.

ఓవర్సీస్ స్కాలర్‌షిప్

తెలంగాణ ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన విద్యావంతులైన ఎస్సీ విద్యార్థులకు విదేశీ విద్య కోసం 'అంబేడ్కర్ విదేశీ విద్యానిధి' పథకం ద్వారా సాయం అందిస్తోంది. దీంతో యూఎస్ఏ, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ మొదలైన దేశాల్లోని విదేశీ విశ్వవిద్యాలయాల్లో పీజీ, పీహెచ్‌డీ కోర్సులు చదివేందుకు అవకాశం ఉంటుంది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ 29 అక్టోబరు 2024.

అసిస్టెంట్ ఖాళీలు

హైదరాబాద్ కంచన్‌బాగ్‌లోని మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్ (మిధాని) ఫిక్స్‌డ్ టర్మ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో అసిస్టెంట్ ఖాళీల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 31. అర్హులైన అభ్యర్థులు 2024 అక్టోబరు 28, 29; నవంబరు 25, 26, 27 తేదీల్లో ఇంటర్వ్యూలకు హాజరుకావొచ్చు.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలు, ప్రవేశాలకు నేడే (అక్టోబరు 19) ఆఖరు తేదీ

- ఐడీఎఫ్‌సీ బ్యాంక్‌లో టీమ్ లీడర్ పోస్టులు. సంబంధిత విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.
- జెన్‌పాక్ట్‌లో ప్రాసెస్ అసోసియేట్ - కస్టమర్ సర్వీస్ పోస్టులు. ఏదైనా గ్రాడ్యుయేట్ ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.




వివిధ పోటీపరీక్షల్లో జనరల్ స్టడీస్‌లో రసాయనశాస్త్రం ఒక భాగం. విశ్వంలో ఉండే ప్రతి పదార్థం విభజించడానికి వీలుకాని కణాలతో నిర్మితమవుతుంది. వీటినే పరమాణువులు అంటారు. ఇలాంటి పరమాణువులన్నీ కలిసి అణువులను, అణువులన్నీ కలిసి పదార్థాలను ఏర్పరుస్తాయి.

☛ ఈ వీడియోలో పరమాణు నిర్మాణం అంటే ఏమిటి? దీని గురించి పరిశోధనలు చేసిన శాస్త్రవేత్తలు, ఎలక్ట్రాన్ - ప్రోటాన్ - న్యూట్రాన్లకు సంబంధించిన విశ్లేషణ మొదలైన అంశాలు ఉన్నాయి.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. వీడియో పాఠం చూడండి.. మేమందించే వీడియోలు ఎప్పటికప్పుడు మిస్ కాకుండా చూసేందుకు ఈప్రతిభ యూట్యూబ్ ఛానల్ సబ్‌స్క్రైబ్ చేయండి!

కరెంట్ అఫైర్స్



కేంద్రపాలిత ప్రాంతంగా మారిన జమ్మూకశ్మీర్ తొలి ముఖ్యమంత్రిగా నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) నాయకుడు ఒమర్ అబ్దుల్లా (54) ప్రమాణం చేశారు. 2024, అక్టోబరు 16న శ్రీనగర్‌లోని షేర్-ఎ-కశ్మీర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయనతో పాటు మరో అయిదుగురు మంత్రులతోనూ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ప్రమాణం చేయించారు.

- జమ్మూకశ్మీర్ సీఎంగా పగ్గాలు చేపట్టడం అబ్దుల్లాకు ఇది రెండోసారి. జమ్మూకశ్మీర్ పూర్తిస్థాయి రాష్ట్రంగా ఉన్నప్పుడు 2009 నుంచి 2014 వరకు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.



ఆసియా పసిఫిక్ ఆడిట్ బ్యూరోస్ ఆఫ్ సర్టిఫికేషన్ (ఏపీఏబీసీ) అధ్యక్షుడిగా హెచ్‌బీ మసానీ ఏకగ్రీవంగా తిరిగి ఎన్నికయ్యారు. ఆయన ఈ పదవిని చేపట్టడం అయిదోసారి. మసానీ భారత ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ) సెక్రటరీ జనరల్‌గానూ ఉన్నారు. ఇటీవల జరిగిన ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఆడిట్ బ్యూరోస్ ఆఫ్ సర్టిఫికేషన్ (ఐఎఫ్ఏబీసీ) సర్వసభ్య సమావేశంలో మసానీ ఐఎఫ్ఏబీసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు మెంబర్ (గౌరవ కోశాధికారి)గా కూడా వరుసగా తొమ్మిదోసారి ఎన్నికయ్యారు.



హరియాణా ముఖ్యమంత్రిగా నాయబ్ సింగ్ సైనీ (54) 2024, అక్టోబరు 17న ప్రమాణ స్వీకారం చేశారు. సైనీతోపాటు 13 మంది మంత్రులతో గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రమాణం చేయించారు.

- సైనీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఇది రెండోసారి. 2024 మార్చిలో మనోహర్‌లాల్ ఖట్టర్ స్థానంలో భాజపా అధిష్ఠానం సైనీని సీఎంను చేసింది.

కరెంట్ అఫైర్స్ ఈబుక్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Mensuration

1. The sides of the rectangular garden are 36 m × 121 m. What is the perimeter of a square garden with the same area?
A) 280 B) 264 C) 275 D) 244


2. If the radius of a circle is increased by 14%, then the area is increased by:
A) 31.96% B) 25.76%
C) 35.66% D) 29.96%

3. The area and length of a rectangle are $957 m^2$ and 11 m respectively. Its diagonal will be:
A) $\sqrt{7690}$ B) $\sqrt{8560}$
C) $\sqrt{8790}$ D) $\sqrt{9190}$

4. What is the area of the trapezoid with parallel sides having the lengths 32m and 48m, the perpendicular distance between them is 28m?
A) $1120 m^2$ B) $1156 m^2$
C) $1960 m^2$ D) $1080 m^2$

5. Adjacent sides of a square are increased by 46% and 75% respectively. The area of the resulting rectangle exceeds the area of square by ....
A) 155.5% B) 176.5%
C) 145.5% D) 168.5%

6. The perimeter of a rectangular field is 390 m and the ratio between the length and the breadth is 8 : 5. The area (in m^2) is:



A) 10800 B) 9000
C) 8680 D) 7860

7. What is the length of the side of an equilateral triangle, if its area is $196\sqrt{3}$ sq cm?
A) 25 B) 28 C) 33 D) 40

8. Find the cost (in Rs.) of carpeting a rectangular room 18 m long and 16 m broad with a carpet, at the rate of 17 $Rs./m^2$
A) Rs.4676 B) Rs.4788
C) Rs.4968 D) Rs.4896

9. The radius of a wheel is 112 cm. What is the distance(m) covered by the wheel in making 600 resolutions?
A) 4200 B) 4000
C) 4224 D) 4422

SSC Exams
Quantitative Aptitude

10. Two right circular cylinders of equal volume have their radius in the ratio 5 : 8. The ratio of their heights is:
A) 121 : 49 B) 64 : 25
C) 81 : 25 D) 49 : 36

11. If the height of a right circular cone is increased by 300% and the radius of the base is reduced by 70%, the volume of the cone
A) decreases by 60%
B) decreases by 64%
C) decreases by 72%
D) decreases by 70%

12. If the radius of a right circular cylinder is decreased by 80% and its height is increased by 90% its volume will be decreased by :
A) decreases by 92.4%
B) decreases by 98.6%
C) decreases by 88.6%
D) decreases by 86.8%

13. Area of the base of a pyramid is 69 sq. cm. and height is 17 cm. then its volume, is:
A) 361 B) 391 C) 451 D) 471

14. The lateral surface area of a cylinder is $2376 cm^2$ and its height is 21 cm. Find its volume (in cm^3).
A) 25672 B) 24568
C) 23844 D) 21384

15. A cinema hall is 50 m. long and 40 m. wide. What should be the height of the hall to accommodate 500 people if the volume of air required for one person is 80 m^3?
A) 20 B) 15 C) 19 D) 25

16. Three solid iron cubes of edges 3 cm, 6 cm and 8 cm are melted together to make a new cube. 26 cm^3 of the melted material is lost due to improper handling. The area (in cm^2) of the whole surface of the newly formed cube is:
A) 460 B) 425 C) 446 D) 486

17. If the volume of two right circular cones are in the ratio 4 : 7 and their diameter are in the ratio 8 : 5, then the ratio of their heights is:
A) 25 : 49 B) 16: 81
C) 25 :112
D) 35 :114

Scan the QR code for Key

These model questions were prepared by subject experts of QnA Academy, Hyderabad

తొమ్మిది పతకాల ఎంబీబీఎస్



టాపర్ కావడం అంటే మాటలు కాదు. ముందు చదువుపై విపరీతమైన ఇష్టం ఉండాలి. తీవ్రమైన పోటీ ఎదుర్కోవాలి. అయితే కాకినాడ కుర్రాడు అనిరుధ్ మాత్రం దీనికోసం మరీ త్యాగాలేం చేయలేదు. తనకున్న స్నేహితులంతా చదువు, సబ్జెక్టుపై ప్రాణం పెట్టేవాళ్లే. అదీగాక అనిరుధ్ సీనియర్ ప్రొఫెసర్లు, ఆయా సబ్జెక్టుల నిపుణులతో ఎక్కువగా సావాసం చేసేవాడు. ఏ సందేహాలున్నా అడిగిమరీ తీర్చుకునేవాడు. డా.కాకర్ల సుబ్బారావు, డా.కిమ్ రామస్వామిలాంటి దిగ్గజ వైద్యుల సలహాలు తీసుకునేవాడు.

'డబ్బు తీసుకోకుండా వైద్యం చేసి, మా ప్రాణాలు కాపాడారు. మీరు చల్లగా ఉండాలమ్మా' అంటూ వైద్యురాలైన తన తల్లితో ఓ పేద మహిళ చెప్పింది. అది చూసి 'నేనూ డాక్టరు కావాలి' అనుకున్నాడు **అత్తలూరి సాయి అనిరుధ్**. 'ఆ వృత్తికి వేళాపాళలుండవు. ప్రయాస ఎక్కువ' అని, దగ్గరివాళ్లు చెప్పినా వినలేదు. ఏకంగా తొమ్మిది బంగారు పతకాలతో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు.

తల్లిదండ్రులిద్దరూ వైద్యులే. అప్పుడప్పుడు నాన్నతో కలిసి ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్తూ రోగుల ఇక్కట్లు గమనించేవాడు. పైగా తనకి గ్రాహకశక్తి ఎక్కువ. సహాధ్యాయులతోనే కాకుండా ఇతర పాఠశాలలు, కాలేజీలు, ఇతర రాష్ట్రాల్లోని టాపర్లతోనూ పోటీ పడేవాడు. అదే ఊపుతో సీబీఎస్‌ఈలో పదోతరగతిలో పాఠశాల టాపర్‌గా నిలిచాడు. ఇంటర్‌లో తూర్పు గోదావరి జిల్లా ఫస్ట్ వచ్చాడు. ఎంబీబీఎస్‌లో అయితే తన ప్రతిభ శిఖరస్థాయికి చేరింది. జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్‌లలో విశ్వవిద్యాలయ పరిధిలో మేటిగా నిలవడమే కాదు.. తొమ్మిది పసిడి పతకాలతో ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం టాపర్ అయ్యాడు. ప్రస్తుతం హౌస్‌సర్జన్ శిక్షణలో ఉన్న అనిరుధ్ న్యూరో సర్జన్ లేదా గ్యాస్ట్రో ఎంటరాలజిస్టుగా మారి, పేదలకు చేతనైన సాయం చేస్తాను అంటున్నాడు.

- చిరంజీవులు కరిమి, కాకినాడ

- మంగళగిరి అఖిల భారత వైద్య విజ్ఞాన శాస్త్రాల సంస్థ (ఎయిమ్స్)లో కొలక్విమ్-2020 సదస్సులో స్వర్ణం.
- విశాఖపట్నం ఆంధ్ర వైద్య కళాశాల జాతీయస్థాయి అనాటమీ సెమినార్‌లో గోల్డ్ మెడల్.
- ఉస్మానియా వైద్య కళాశాల హైదరాబాద్‌లో నిర్వహించిన దేశవ్యాప్త యూజీ కాన్ఫరెన్స్ ఓస్మికాన్- 2021 పత్ర సమర్పణలో మొదటి బహుమతి.
- వైద్యశాస్త్రంలో చాట్ జీపీటీ, ఇతర ఏఐ వ్యవస్థల ప్రభావం, వాటి సవాళ్లపై రాసిన విశ్లేషణ ప్రఖ్యాత జాన్స్ హాప్కిన్స్ మ్యాగజైన్‌లో సమీక్షించారు. ఫ్రంటియర్స్ ఇన్ ఏఐ జర్నల్‌లో ప్రచురితమైంది.

అయినా.. బరువు తగ్గలేదంటే..!



కొందరుంటారు.. గంటలకొద్దీ వ్యాయామం చేస్తుంటారు.. ఏళ్లకొద్దీ కొనసాగిస్తుంటారు. అయినా అదేంటో గానీ బరువు మాత్రం తగ్గరు. ఎందుకిలా అంటే..

- **ఒత్తిడి:** రకరకాల ఒత్తిళ్లలో ఉన్నప్పుడు మన బాడీ 'సర్వైవల్ మోడ్'లోకి వెళ్లిపోతుంది. ఈ సమయంలో 'కార్టిజాల్' హార్మోను అత్యధికంగా విడుదలవుతుంది. దీని కారణంగా విపరీతమైన ఆకలి వేస్తుంది. ఈ ధ్యాసలో ఎడాపెడా తినేస్తుంటే, ఇక ఎన్ని వ్యాయమాలు చేసి ఏం లాభం? ఒత్తిడితో ఉన్నప్పుడు రక్తంలో చక్కెర స్థాయిలు కూడా పెరుగుతాయి. ఇది దీర్ఘకాలంలో కొవ్వుగా మారుతుంది. బరువు పెరుగుతాం. ఈ సైకిల్‌కి అడ్డుకట్ట వేయాలంటే మనసు, శరీరాన్ని స్వాధీనంలో ఉంచే యోగా లాంటివాటిని దినచర్యలో భాగం చేసుకోవాల్సిందే.
- **నిద్ర:** ప్రతి ఒక్కరికీ కనీసం ఏడు గంటలైనా నాణ్యమైన నిద్ర ఉండాల్సిందే అంటారు నిపుణులు. నిద్రలేమితో ఊబకాయం ముప్పు ఉండటమే కాదు.. మధుమేహం వచ్చే ప్రమాదం ఉంటుంది. ఇది మెటబాలిజమ్‌పై ప్రతికూల ప్రభావం చూపిస్తుంది. అతిగా ఆకలి పెంచేస్తుంది. మొత్తమ్మీద ఇది బరువు తగ్గాలనే లక్ష్యానికి ఎసరు పెడుతుంది.
- **అతి వ్యాయామం:** వ్యాయామం మంచిదేగానీ.. అతి అయితే ముప్పే అంటోంది ప్రపంచ ఆరోగ్య సంస్థ. ఆరోగ్యవంతుడైన ఒక వ్యక్తికి వారానికి 150 నిమిషాలు మోస్తరు ఏరోబిక్ కసరత్తులు, 75 నిమిషాలు కఠిన వ్యాయామాలు చాలంటోంది. అదీ కాకుండా శరీర తీరుని బట్టి ఒక్కొక్కరికి ఒక్కోరకం వ్యాయామం అవసరం. ఈ సూచనలు పాటించకపోయినా ఫలితం ఉండదు.
- **జన్యుపరంగా:** కఠోర కసరత్తులు చేసినా, సరైన ఆహారం తీసుకున్నా, నిపుణులు చెప్పిన కిటుకులన్నీ పాటిస్తున్నా.. కొందరు బరువు తగ్గరు. దీనికి కారణం జన్యుపరమైన లక్షణాలు. ఇలాంటి వాళ్లు ఎంత కష్టపడ్డా తమ పెద్దలలాగ బొద్దుగానే ఉంటారు. వీళ్లు సిక్స్‌ప్యాక్‌లు, టోన్డ్ బాడీల జోలికి వెళ్లకుండా ఫిట్‌నెస్‌పై దృష్టి పెడితే చాలు.

ఐదు కొలువుల విజేత



'అంత చదువూ చదివి టీకొట్టు పెట్టుకొని బతుకుతావా?' అంటూ ఎగతాళి చేశారెందరో. కానీ కాలం కలిసిరానప్పుడు తగ్గి ఉండటంలో తప్పు లేదని భావించాడు **ఉడాన్ శివమహేశ్ కుమార్**. తర్వాత ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. అప్పుడు చులకనగా చూసినవాళ్లే ఇప్పుడు 'శెభాష్' అంటున్నారు.

పెద్దపల్లి జిల్లా ధర్మారంలో శివమహేశ్ కుమార్ పేరు ఆరునెలల నుంచి మార్మోగిపోతోంది. ఒక్క ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే గగనమైన ఈ రోజుల్లో తను వరుసపెట్టి సర్కారీ కొలువులు కొడుతూనే ఉన్నాడు. గతేడాది గురుకుల పాఠశాల ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడంతో అతడి విజయయాత్ర మొదలైంది. టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్.. తాజాగా డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు. టీఎస్‌పీఎస్సీ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించి జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యాడు. మహేశ్‌కి మొదట్నుంచీ హిందీ సబ్జెక్టు అంటే విపరీతమైన ఆసక్తి. దాంతో ఎం.ఎ. హిందీ చదివి, హిందీ పండిత్ శిక్షణ కూడా పూర్తి చేశాడు. మూడేళ్లు ప్రైవేటు పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పని చేశాడు. కానీ అత్తెసరు జీతం కావడంతో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదల మొదలైంది. సాయంత్రం దాకా విధులు నిర్వర్తించి, అర్ధరాత్రి వరకు టీచరు ఉద్యోగానికి సిద్ధమయ్యేవాడు. అలా సన్నద్ధమవుతూనే 2017లో డీఎస్సీ రాశాడు. జిల్లాస్థాయిలో రెండో ర్యాంకుతో హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికైనా, కోర్టు కేసుల కారణంగా ప్రభుత్వం నియామకాలు జరపలేదు. అయినా అధైర్య పడకుండా ఇతర ఉద్యోగాల కోసం సాధన ప్రారంభించాడు.

ఓ మోస్తరుగా గడిచి పోతున్న అతడి జీవితాన్ని కరోనా అతలాకుతలం చేసింది. పని చేస్తున్న స్కూల్ మూతపడటంతో ఉపాధి కరవైంది. దాంతో కుటుంబం గడవడానికి పక్క ఊరిలో చాయ్ దుకాణం తెరిచాడు. అప్పుడు చాలామంది రకరకాలుగా మాట్లాడారు. అయినా అదేమీ పట్టించుకోలేదు. సాయంత్రం వరకు టీపాయింట్ నడిపి, ఆ తర్వాత చదువుకునేవాడు. ఆపై ప్రభుత్వ ఉద్యోగాల ప్రకటన రావడంతో 2023 జనవరిలో కరీంనగర్ వెళ్లాడు. డబ్బులకు ఇబ్బంది ఉండటంతో మిత్రుడి గదిలో ఉంటూ, ఐదు రూపాయల భోజనంతో సరిపెట్టుకుంటూ ప్రిపేర్ అయ్యేవాడు. తర్వాత తను రాసిన ప్రతి పరీక్షలోనూ విజయం సాధించాడు. ప్రస్తుతం జూనియర్ లెక్చరర్ కొలువులో చేరినా, గ్రూప్-1 ఉద్యోగమే తన లక్ష్యమంటున్నాడు.

- సీహెచ్ రామచంద్రారెడ్డి, కరీంనగర్ డెస్క్

మీరు ఏ తరహా?

పనిమంతులు.. పని ఎగ్గొట్టేవారు.. పని పట్టనట్టు ఉండేవారు.. పని చేస్తున్నట్టు నటించేవారు.. అబ్బో ఉద్యోగుల్లో చాలా రకాలే ఉంటారు. వాళ్ల మనస్తత్వం, చేసే పనిని బట్టి ఇదిగో ఇలా వివరంగా, స్పష్టంగా చెప్పుకోవచ్చు. ఇందులో మీరు ఏ కోవకు చెందుతారో తెలుసుకోండి.

- **అచీవర్:** రేపటికల్లా పని పూర్తి చేయాలంటే ఈ పూటకే ముగించే రకం. వేగం ఎక్కువ. సంస్థ ఎదుగుదలలో నా పాత్ర ఉండి తీరాల్సిందే అనుకునే బాపతు. అన్ని పనుల్లో తల దూర్చేసి వాటినీ పూర్తి చేసేస్తారు.
- **ఎక్స్‌పర్ట్:** పని సంగతి పక్కన పెడితే ఆ సబ్జెక్ట్ లేదా ప్రాజెక్టులో గట్టి పట్టున్నవాళ్లు. అందులో ఏమైనా చిక్కుముళ్లు వస్తే విప్పుతీయడం వీళ్లకి మంచి నీళ్లు తాగినంత తేలిక. సహోద్యోగులకు సందేహాలుంటే చిటికెలో తీర్చేస్తారు.
- **టీం ప్లేయర్:** ఈరోజు 'హాయ్' అని పరిచయం చేసుకొని, రేపటికల్లా 'ఏరా' అనేంత చొరవ తీసుకునే రకం. పనిలో బాధ్యతగా ఉంటారు. ఇతరులకు సహకరిస్తారు.. బృందం పరుగులు తీయడంలో ముందుంటారు.
- **ఇన్నోవేటర్:** 'ఎప్పుడొచ్చాం అన్నది ముఖ్యం కాదన్నయ్యా.. బుల్లెట్ దిగిందా, లేదా?' అనే డైలాగ్‌కి బ్రాండ్ అంబాసిడర్లు. పనిలో ప్రతిసారీ కొత్తదనం, సృజనాత్మకత చూపించాలి అనుకుంటారు. కంఫర్ట్ జోన్ నుంచి బయటికొచ్చేందుకు ఏమాత్రం సంకోచించరు.
- **లీడర్:** ఆజ్ఞలు వేస్తూ, తప్పులు వెతికే వాళ్లు బాస్ లేదా మేనేజర్ అయితే చేయి పట్టుకొని నడిపించేవాడు లీడర్. వైఫల్యాలకు తను బాధ్యత వహిస్తూ, విజయంలో అందరికీ భాగం ఇస్తాడు. సహచరుల్లో నిత్యం స్ఫూర్తి నింపుతూ, లక్ష్య సాధనకు నిరంతరం శ్రమిస్తుంటాడు.
- **డిస్‌ఎంగేజ్డ్:** పని చేయాలన్న మూడ్, ఉత్సాహం ఏమాత్రం లేని బద్ధకిస్టులు. అప్పగించిన విధుల్ని ఏదో తూతూమంత్రంగా అయిందనిపిస్తుంటారు. మాటలతో కోటలు కడుతూ పనికి ఎగనామం పెట్టే బాపతు.

– ఎవరెలాంటి వాళ్లు అయినా దీర్ఘకాలంలో పనిమంతులకే పట్టం అని మరవొద్దు.



సొగసరి.. ఈవీహికిల్!

ఇప్పుడిప్పుడే ఈవీ బైక్‌ల హవా మొదలవుతోంది. సరికొత్త ఫీచర్లు, అదిరిపోయే డిజైన్‌తో కుర్రకారును ఆకట్టుకునేలా మోడళ్లను విపణిలోకి దించుతున్నాయి తయారీ కంపెనీలు. ఆ వరుసలోనే వచ్చింది 'టీ 30'.



చెన్నైకి చెందిన రాప్‌టీ.హెచ్‌వీ అనే స్టార్టప్ దీన్ని తయారు చేసింది. పెట్రోల్‌తో నడిచే 250-300 సీసీ బైక్‌లతో పోటీ పడగల సామర్థ్యం దీని సొంతమంటోంది. దీన్ని దేశంలోనే హైవోల్టేజీ ఈవీగా పేర్కొంటోంది.

- ఎలక్ట్రిక్ కార్లలో ఉపయోగించే శక్తిమంతమైన బ్యాటరీని ఈ బైక్‌కి అమర్చారు. కార్ల ఛార్జింగ్ స్టేషన్లలో రీఛార్జ్ చేసుకోవచ్చు. 5.4 కేడబ్ల్యూహెచ్ సామర్థ్యం ఉండే ఈ బ్యాటరీని ఛార్జ్ చేసి, 150 కిలోమీటర్లు ప్రయాణం చేయొచ్చు.
- 3.5 సెకన్లలో బండి 60 కిలోమీటర్ల వేగం అందుకుంటుంది. ఐపీ-67 రేటెడ్ బ్యాటరీ ప్యాక్‌కి ఎనిమిదేళ్లు లేదా 80 వేల కిలోమీటర్ల వరకూ వారంటీని ఇస్తున్నారు.
- ధర రూ.2.39 లక్షలు (ఎక్స్ షోరూం).

టెక్ టాక్

కోటి దాటిన స్నాప్‌చాట్

స్నాప్‌చాట్ పేరు లేకుండా సామాజిక మాధ్యమాల జాబితా పూర్తవదు. ఇండియాతోపాటు ప్రపంచమంతా స్నాప్‌చాట్ యూజర్లున్నారు. తాజాగా తమ పెయిడ్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 1.10కోట్లు దాటినట్టు ఈ మల్టీమీడియా యాప్ యాజమాన్యం చెబుతోంది. ఈ సందర్భంగా మరిన్ని కొత్త ఫీచర్లు తీసుకురానున్నట్టు ప్రకటించింది.

తారల గొంతుతో చాట్‌బోట్!

ఏదైనా సమాచారం అడగ్గానే మనకిష్టమైన హీరోనో, హీరోయినో వచ్చి వివరాలు చెబుతుంటే భలే థ్రిల్లింగ్‌గా ఉంటుంది కదూ! ఆ రోజులు దగ్గర్లోనే ఉన్నాయి. ప్రస్తుతం మనం కోరిన విధంగా ఏఐ చాట్ బోట్‌లు ఎలాంటి సమాచారాన్నైనా క్షణాల్లో మన ముందు ఉంచుతున్నాయి లేదా వాయిస్ మెసేజ్‌లు అందిస్తున్నాయి. ఆ మెసేజ్‌లు ఇక నుంచి సెలెబ్రిటీల గొంతుతో మనకు చేర్చేందుకు మెటా ఓ ఏఐ బాట్‌ని సిద్ధం చేస్తోంది. దీనికోసం జుడీ డెంచ్, అక్వాఫినియాలాంటి కొందరు తారలతో జరిపిన సంప్రదింపులు ఓ కొలిక్కి వచ్చాయి. ఇది కార్యరూపం దాల్చితే హాలీవుడ్ తారలేంటి.. షారుక్‌ఖాన్, ప్రభాస్, దీపికా పదుకొణె, శ్రీలీలలాంటి మన నాయకానాయికల గళంతోనూ మనం కోరిన సమాచారం పొందవచ్చు!

ఇన్‌స్టాగ్రామ్‌కి దీటుగా..

ఇన్‌స్టాగ్రామ్‌కి పోటీగా 'వీ' యాప్ రంగంలోకి దిగుతోంది. టిక్‌టాక్ పేరెంట్ కంపెనీ 'బైట్ డ్యాన్స్' ఈ ఫొటో షేరింగ్ యాప్‌ని ముస్తాబు చేస్తోంది. త్వరలోనే ఆండ్రాయిడ్ యూజర్లకు ఈ యాప్ అందుబాటులోకి రానుందట. తర్వాతే ఐవోఎస్ యూజర్ల వంతు. ఇందులో వాట్సప్‌లా 'ఫ్రెండ్స్', 'ఫ్యామిలీ'లాంటి గ్రూప్‌లు సృష్టించుకొని వ్యక్తిగతంగానూ చాట్ చేసుకోవచ్చు.

ఫోన్లకే రూ.లక్షల కోట్లు!

అక్షరాలా పది కోట్లు.. వచ్చే ఆరునెలల్లో అమ్ముడు కానున్న ఫోన్ల సంఖ్య. టెక్ ఆర్క్ అనే కన్సల్టింగ్ కంపెనీ వేసిన అంచనా ఇది. గతేడాదితో పోలిస్తే సెల్‌ఫోన్ల అమ్మకాలు ఈ ఏడాది తొమ్మిది శాతం అధికమయ్యాయట. మొత్తంమీద 2024లో భారత్‌లో 15.8 కోట్ల మొబైళ్లు అమ్ముడుకానున్నాయి. ఒక్కో ఫోన్‌కి సగటున రూ.20 వేలు వేసుకున్నా ఈ ఏడాదిలో రూ.3 లక్షల కోట్లు మనవాళ్లు కేవలం సెల్‌ఫోన్ల మీదే ఖర్చు పెడుతున్నారన్నమాట.

ఇది 'సిమ్మర్ డేటింగ్' తరం!



చాటింగూ.. డేటింగూ.. నచ్చితేనే వెడ్డింగూ.. లేదంటే రిలేషన్‌షిప్‌కి ఎండింగూ.. ఇప్పుడిదే కదా ట్రెండింగూ! కానీ, జనరేషన్ జెడ్ మాత్రం తాము అలా కాదంటోంది. నేరుగా రొమాన్స్‌లోకి దిగిపోకుండా ఎమోషనల్‌గా కనెక్ట్ కావడమే ముఖ్యమంటోంది. దీన్నే 'సిమ్మర్ డేటింగ్' అంటున్నారు. మెట్రో, ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో ఇటీవల ఓ డేటింగ్ యాప్ చేసిన సర్వేలో దాదాపు 47శాతం మంది ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చారట. పరిచయం కాగానే డిన్నర్లూ, టూర్లూ అనకుండా.. ఒకరినొకరు అర్థం చేసుకునేందుకు, ఓపికగా తగిన సమయం తీసుకుంటున్నారట. అభిరుచులు కలిసి, నమ్మకం కుదిరి, తమకు సరిజోడు అనుకున్నాకే ముందడుగు వేస్తున్నామని సెలవిచ్చారు. కొద్దిరోజుల్లో ముగిసిపోయే బంధం కంటే మనసుతో ముడిపడి, ఎక్కువ కాలం నిలిచే అనుబంధాలకే ప్రాధాన్యమిస్తున్నామన్నారు. తొందరపడి ఏదో ఒక బంధానికి ఓకే చెప్పి.. తర్వాత లేనిపోని తలనొప్పులు తెచ్చుకొని, ఆపై మానసిక ఒత్తిడిలోకి వెళ్లడం కంటే.. కాలంతోపాటు బలపడే బంధాలకే జీవిత కాలం ఎక్కువని ప్రతి అయిదుగురిలో నలుగురు అభిప్రాయపడ్డారు. ఆకర్షణతో వచ్చే ఇన్‌స్టంట్ కెమిస్ట్రీ వద్దనీ.. భాగస్వామిపై నమ్మకం కుదిరాకే డేటింగ్‌కి ఓకే చెబుతున్నారు.

గొడవ పడటమే హీరోయిజమా?

మనలో మనం



నేనొక అమ్మాయిని ప్రేమించా. ఏడాది వరకు బాగానే ఉంది. ఈమధ్యే విచిత్రంగా ప్రవర్తిస్తోంది. బైక్‌పై విన్యాసాలు చేస్తూ రీల్స్ చేద్దాం అంటోంది. కావాలనే వేరే అబ్బాయిలను రెచ్చగొడుతోంది. వాళ్లు తనని ఏమైనా కామెంట్ చేస్తే, నేను వెళ్లి వాళ్లని చితక్కొట్టాలట! అలా చేయకపోతే 'నీకేదీ చేతకాదు.. హీరో లక్షణం ఒక్కటీ లేద'ని దెప్పి పొడుస్తోంది. దుస్సాహసాలు, అనవసర గొడవలకు వెళ్లకుండా ఉంటే చేతకానితనమా? తనకెలా చెప్పాలి?

- రాజ్, ఈమెయిల్

ఏడాది క్రితం వరకు బాగానే ఉన్న అమ్మాయిలో ఒక్కసారిగా మార్పు రావడానికి కారణమేంటో తెలుసుకున్నారా? బైక్‌పై వెళ్తూ రీల్స్ చేయాలనడం, ఇతరులతో గొడవ కోరుకోవడం ఆమెలో మానసిక పరిణతి లేదనే విషయం సూచిస్తోంది. ఆమె ఊహాలోకంలో విహరిస్తోంది. ఇంతకీ తన వయసెంతో చెప్పలేదు. సామాజిక మాధ్యమాల అతి వాడకం, స్నేహితుల ప్రభావం కారణంగా బహుశా తను అలా ప్రవర్తిస్తూ ఉండొచ్చు. తన స్నేహితుల్లో ఈ తరహా మనస్తత్వం ఉన్నవాళ్లకి దూరంగా ఉంచండి. ఇలాంటి పిచ్చి ఆలోచనలు రాకుండా.. తనకి ఎప్పుడూ ఏదో ఒక వ్యాపకం ఉండేలా జాగ్రత్త పడాలి. ప్రమాదకరమైన రీల్స్ చేస్తూ కొంతమంది ప్రాణాలు కోల్పోవడం చూస్తూనే ఉన్నాం. ఇలా చేస్తే చట్టపరంగానూ చిక్కుల్లో పడతారు. ఈ విషయం తనకి అర్థమయ్యేలా చెప్పండి. ఇక ఇతరులతో గొడవ పడటం హీరోయిజం కాదు. దీన్ని ఎవరూ హర్షించరు. ఇవన్నీ చెప్పినా కూడా ఆ అమ్మాయి మారకపోతే తనకి దూరంగా ఉండటమే మంచిది. దుస్సాహసాలు, గొడవలతో అనవసరంగా ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు. ఆల్ ది బెస్ట్.



- డా.అర్చన నండూరి, క్లినికల్ సైకాలజిస్ట్

కొంటె కొటేషన్



ఈ ఫొటోకి మీ సరదా వ్యాఖ్యలు రాసి పంపండి. బాగున్నవి ప్రచురిస్తాం.



- నడిచొస్తున్న ద్రాక్ష తోట.. వేశావు నా గుండెల్లోకి బాట..
  - కె.భువన్‌ప్రకాశ్ రెడ్డి, విజయవాడ
- వేశావు ద్రాక్ష డ్రెస్సు.. సొగసులో నువ్వే గ్రేట్ మిస్సూ!
  - జయశ్రీ వాడేకర్, హైదరాబాద్
- ఒళ్లంతా పండ్ల బజారు... తినేసేలా అమ్మడి ఫిగరు..
  - కొండలరావు, దూసి
- చుట్టావులే ద్రాక్ష పండ్లు... చాలవులే రెండు కండ్లు..
  - కె.సుమన్ కుమార్, ఈమెయిల్
- దాయి దాయి దామ్మా... నీ పేరు ద్రాక్షాయనా గుమ్మా?
  - మాణిక్య దుష్యంత్ కుమార్, హైదరాబాద్
- మేనే ద్రాక్ష పందిరి... తానే సుఫల సుందరి..
  - తంగి సన్యాసిరావు, శ్రీకాకుళం
- దాయి దాయి దామ్మా... నడిచే ద్రాక్ష పండ్ల బొమ్మా!
  - ఇ.వి.ఎస్.దీపక్, బెంగళూరు
- ద్రాక్ష పండ్లతో నీ కాస్ట్యూమ్... చెయ్యాలని ఉంది వాటిని కన్స్యూమ్..
  - రంకిరెడ్డి రాజు, అమలాపురం